వేదాంగాలు

# భాషా కువలయానందము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org  Mobile App: Free Gurukul  email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul  Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఙవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

# భాషా
# కువలయానందము.

## అర్థాలంకార వివరణము
## గద్యపద్యాత్మకము.

ఆంధ్రీకర్త,
మహీధర వేంకటరామశాస్త్రి.
వైయాకరణ-సాహిత్యవిద్యాప్రవీణ-ఆయుర్వేదవిశారద.
Retired Sunskrit Pandit.
అమలాపురం.

# పరిచితీకరణము.

నేఁ దెనిఁగింపఁబూనిన చంద్రాలోక కువలయానందముల నెడు నర్థాలంకారలక్షణ గ్రంథములు సాహితీజగతి సుప్రసిద్ధములు. అభ్యసన సమకాలముననే సుగమముగను మనోహరముగను విషయబోధ మొనరించుటచే నీగ్రంథనామము లన్వర్థములు.

ఇట్టి గ్రంథములు తెనుఁగుభాషలోఁగూడ నుండుట భాషా యోషకు సాటిలేని యలంకారమగునుగాన నెందఱెందఱాంధ్రీకరించి నను జర్వితచర్వణమును బునరుక్తమును గాఁజాలదని నాయూహ. కాన నేనిట్లు భాషాంతరీకరించితిని.

చంద్రాలోకమున లక్షణములును లక్ష్యములును నొక శ్లోకముననే పూర్వార్థపరార్థములఁ బొందుపఱుపఁబడినవి. నేను వానిని దెనుఁగునఁ గందపద్యములఁ బూర్వార్థపరార్థములఁ బొదిగితిని. కొన్నిచోటుల మూలలక్ష్యములఁ దెనిఁగింప వీలుగాకుంటచే స్వతంత్రించి లక్ష్యములఁ జూపితిని.

కువలయానందమందలి లక్ష్యశ్లోకములు కవితాసిద్ధులగు మహాకవుల రచనలు. మిక్కిలి భావగర్భితములు. ప్రౌఢభావములు పాదబద్ధమగు పద్యముల నిమిడ్చినచోఁ బఠించుతఱి నొకవిధమగు గాంభీర్యమును నొయ్యారమును జూపి పఠితల చిత్తముల రసస్ఫూర్తి నుత్తేజితులఁ గావించునని నాయూహ. ఈయూహతో వానిని వివిధ వృత్తములఁ దెనిఁగించితిని,

అచ్చోటఁగూడ మూలభావములను విడువకను వానికి విరుద్ధములు గాకుండఁగను గొంతవఱకు స్వతంత్రించి భావములఁ గూర్చితిని. అట్లుచేయుటకు భావపరతంత్రతయే కారణము.

మఱియు మూలశ్లోకములఁ దెనుఁగు పద్యముల వ్రాయుటకు మఱియొక కారణముగూడ గలదు. అర్థాలంకారముల నేర్వఁదలఁచిన ఛాత్రులు లక్ష్యలక్షణములఁ గంఠస్థములుగఁ జేసికొనుటకు ననుకూలముగనుండున నెడు తలఁపు నన్నట్లు చేయుటకుఁ బురికొల్పినది.

విషయవిచారమంతయును మూలమందువలెఁ దెనుఁగున గద్య సరణినే నడచినది. కాని కొంత విశేషము గలదు. విషయమునంతయుఁ గ్రోడికరించుకొని విషయవిభాగమును నొకవిధముగ స్వేచ్ఛారీతిగఁ గల్పించుకొని పఠితలకు సుఖబోధమగునట్లు వచనరచన సేసితిని. ఇట్లు చేసినను విషయచాలనము మూలానుక్రమణముగ లేకున్నను మూలావిరుద్ధముగనే యుండునని విన్నవించుచున్నాను.

ఈనాయూహ సరియగునో కాదో యనుటలోను చాన నేనెంత వట్టు చరితార్థుఁడ నైతినోయనుటలోను సహృదయ హృదయమే న్యాయస్థానము.

మూలగ్రంథ లక్ష్యములఁ గొన్ని తావుల రాజస్తుతి యుద్వేలముగఁ గన్పట్టుచున్నది. అయినను నాయాలంబనమును విడిచి కల్పనాచాతుర్యములఁ జూచినచో మహాకవుల భావవిశేషసృష్టినైచిత్ర్యముచే నెవ్వని మనమానందమయము గాకుండును ?

తప్పొప్పుల పట్టిక గ్రంథాంతమున నిచ్చియున్నాను. మఱికొన్ని యక్షరచ్యుతులు సులభముగ సరిదిద్దుకొనఁ దగినవి గలవు. వానినిఁ జదువరులు సరిచేసికొనఁ గోరుచున్నాను.

గ్రంథరచన యాత్మానందము కొఱకైనను సహృదయ సంతోషణమును గూడఁ గోరుకొనుట మానవ స్వభావము గాన నేనీరీతిగ నాకోలఁది నెఱింగియు నిట్లు పేరాసతో నుంటిని. ఎట్లును ? నాయీ గ్రంథము :—

తే॥ గీ॥ హృద్యపద్యంబు శర్కరా – ఖాద్యముగను
సరస భావంబు తెలి పంచ – దారముగను ।
శాస్త్రచర్చలు చందన – చర్చలుగను
విందుసేయుచు బుధుల కా – నంద మిడుత ॥

ఇట్లు, **ఆంధ్రీకర్త.**

# ముద్రాపణాధృతి.

ఉ॥ కొందఱుపల్కరింప రికఁ - గొందఱు బెల్లముగాఁగనాల్క వా
కొందుఱు కొందఱయ్యలు ఖ - గోళముఁజూతురు తారెబీదలం
చెందఱొ మెచ్చుచుందు రిక - నెందఱొ మ్రాన్పడియుందు రౌర! మా
కందఫలాదిశాయి రస - కందము సత్కవి యర్థిమై చనన్॥

కం॥ ఇట్టులగుచో సత్కవులకు
నెట్టులగు నావంటివాని - కీల నాదృతి యం।
చెటుపోక పెద్దప్రొద్దు న
కట! యెట్టులో కడపినాఁడఁ - గద! యుమ్మలికన్॥

శా॥ ఐనన్ భూసతి గొడ్డువోవునె? రసా - హ్లాదైకతానాంతరా
నూన ప్రాభవ హానిభాన శతసం - న్దోహాంచితాత్మానుసం।
ధానశ్రీ లలితాత్మజన్ములు కసం - గాలేరె? యందంద గా
నాసన్ మన్ననసేయ రమ్యకవితా - రాజ్యంబు ప్రాజ్యంబుగాన్॥

కం॥ అని మనమున ధృతి నొందుచుఁ
జని నాకృతిఁజూప సంత - సము పెంపెసఁగన్।
చను మొల్లి పెంచి రమ్మం
చనకను దగునర్థమిచ్చి - యాదృతి మెఱయన్॥

కం॥ పనిచిరి నను; ముద్రణమున
కని యీసహృదయుల వితర - ణార్థపు సుకృతం।
బనఘము వటబీజమువలెఁ
గొనిశాఖలు వారికమితఁ - గుంభినిఁ జెలువల్॥

—♦ ఆసహ్యాదయుల నామధేయములు. ♦—

1. శ్రీ నడింపల్లి రామభద్రరాజుగారు, M. L. A.
Member of the Syndicate of the Andhra University, కోడూరుపాడు.

2. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు, M. A.
Retired Reader in Telugu of the Madras University, మదాసు.

3. శ్రీ కూరెళ్ల హరిహరస్వామిగారు, M. B. B. S. A. I. M.,
అమలాపురం.

4. శ్రీ కూచిమంచి వేంకటశాస్త్రిగారు, సరసకవి, అమలాపురం.

5. శ్రీ అప్పొద్వేదుల సీతారామయ్యగారు, B. A. L. T.
Retired Head Master, కొత్తపేట.

# విషయసూచిక


| అలంకారనామము- | పుట. | అలంకారనామము- | పుట. |
|---|---|---|---|
| 1. ఉపమ. | 1 | 28. ప్రస్తుతాంకురము | 99 |
| 2. అనన్వయము. | 7 | 29. పర్యాయోక్తము | 104 |
| 3. ఉపమేయోపమ. | 8 | 30. వ్యాజస్తుతి | 111 |
| 4. ప్రతీపము | 9 | 31. వ్యాజనిన్ద | 115 |
| 5. రూపకము | 13 | 32. ఆక్షేపము | 118 |
| 6. పరిణామము | 18 | 33. విరోధాభాసము | 120 |
| 7. ఉల్లేఖము | 20 | 34. విభావన | 121 |
| 8. భ్రాన్తి | 21 | 35. విశేషోక్తి | 126 |
| 9. స్మృతి | 21 | 36. అసంభవము | 127 |
| 10. సందేహము | 21 | 37. అసంగతి | 128 |
| 11. అపహ్నుతి | 23 | 38. విషమము | 131 |
| 12. ఉత్ప్రేక్ష | 29 | 39. సమము | 137 |
| 13. అతిశయోక్తి | 39 | 40. విచిత్రము | 143 |
| 14. తుల్యయోగిత | 47 | 41. అధికము | 143 |
| 15. దీపకము | 51 | 42. అల్పము | 145 |
| 16. ఆవృత్తిదీపకము | 52 | 43. అన్యోన్యము | 145 |
| 17. ప్రతివస్తూపమ | 53 | 44. విశేషము | 146 |
| 18. దృష్టాన్తము | 56 | 45. వ్యాఘాతము | 148 |
| 19. నిదర్శనము | 58 | 46. కారణమాల | 150 |
| 20. వ్యతిరేకము | 65 | 47. ఏకావళి | 150 |
| 21. సహోక్తి | 66 | 48. మాలాదీపకము | 152 |
| 22. వినోక్తి | 67 | 49. సారము | 153 |
| 23. సమాసోక్తి | 69 | 50. యథాసంఖ్యము | 154 |
| 24. పరికరము | 79 | 51. పర్యాయము | 155 |
| 25. పరికరాంకురము | 83 | 52. పరివృత్తి | 158 |
| 26. శ్లేష | 84 | 53. పరిసంఖ్య | 159 |
| 27. అప్రస్తుతప్రశంస | 91 | 54. వికల్పము | 160 |

| అలంకారనామము- | పుట. | అలఙ్కారనామము- | పుట. |
|---|---|---|---|
| 55. సముచ్చయము | 161 | 83. ఉత్తరము | 219 |
| 56. కారకదీపకము | 162 | 84. సూక్ష్మము | 221 |
| 57. సమాధి | 163 | 85. పిహితము | 221 |
| 58. ప్రత్యనీకము | 164 | 86. వ్యాజోక్తి | 222 |
| 59. కావ్యార్థాపత్తి | 166 | 87. గూఢోక్తి | 224 |
| 60. కావ్యలింగము | 167 | 88. వివృతోక్తి | 225 |
| 61. అర్థాన్తరన్యాసము | 174 | 89. యుక్తి | 228 |
| 62. వికస్వరము | 181 | 90. లోకోక్తి | 229 |
| 63. ప్రౌఢోక్తి | 183 | 91. ఛేకోక్తి | 230 |
| 64. సంభావన | 184 | 92. వక్రోక్తి | 231 |
| 65. మిథ్యాధ్యవసితి | 185 | 93. స్వభావోక్తి | 232 |
| 66. లలితము | 187 | 94. భావికము | 233 |
| 67. ప్రహర్షణము | 193 | 95. ఉదాత్తము | 234 |
| 68. విషాదనము | 195 | 96. అత్యుక్తి | 235 |
| 69. ఉల్లాసము | 195 | 97. నిరుక్తి | 236 |
| 70. అవజ్ఞ | 198 | 98. ప్రతిషేధము | 237 |
| 71. అనుజ్ఞ | 199 | 99. విధి | 237 |
| 72. లేశము | 201 | 100. హేతు | 238 |
| 73. ముద్ర | 205 | రసవదాది ప్రకరణము | 241 |
| 74. రత్నావళి | 206 | ప్రేయోలంకారము | 243 |
| 75. తద్గుణము | 209 | ఊర్జస్విత్తు | 244 |
| 76. పూర్వరూపము | 209 | సమాహితము | 244 |
| 77. అతద్గుణము | 211 | భావోదయము | 245 |
| 78. అనుగుణము | 213 | భావసంధి | 245 |
| 79. మీలనము | 213 | భావశబలత | 246 |
| 80. సామాన్యము | 214 | ప్రత్యక్షము | 246 |
| 81. ఉన్మీలితము | 217 | అనుమానము | 247 |
| 82. విశేషము | 217 | ఉపమానము | 248 |

| అలంకారనామము- | పుట. | అలంకారనామము- | పుట. |
|---|---|---|---|
| శబ్దము | 250 | సంసృష్టి-సంకర | 256 |
| స్మృతి | 251 | శబ్దాలంకారసంసృష్టి | 257 |
| ఆచారము | 251 | అర్థాలంకారసంసృష్టి | 257 |
| ఆత్మతుష్టి | 252 | శబ్దార్థాలంకారసంసృష్టి | 258 |
| శ్రుతి | 252 | సమప్రాధాన్యసంకరము | 261 |
| లింగము | 252 | సందేహసంకరము | 266 |
| అర్థాపత్తి | 254 | ఏకవాచకానుప్రవేశసంకరము | 269 |
| అనుపలబ్ధి | 254 | సంకరసంకరము | 273 |
| సంభవము | 255 | తప్పు-ఒప్పుల పట్టిక | 278 |
| ఐతిహ్యము | 256 | | |

# కలాప్రాశస్త్యము

కం॥ ఆరయ శిల్పియుగాయకుఁ
డారస సామ్రాజ్యనేత - యా సత్కవియున్ ।
నీరసభావమ్మునకును
సారస్యముఁబోసి హాయి - చాటుదురురసన్ ॥

శా॥ ఈజ్యాసీమ విహంగలోమ మిసుమం - తేన్నింతయే కాదు ; ధీ
ప్రాజ్యశ్రీనిధి శిల్పి, శిల్పమును దె - ల్పన్ గోరి సౌందర్యతా ।
మ్రాజ్యప్రాభవభాజనంబుగ నొన - ర్పన్ సర్వసర్వంసహా
రాజ్యాధిష్ఠిత రాజవల్లభుని మూ - ర్ధం బెక్కి నర్తింపదే ? ॥

ఉ॥ కుత్తుకఁగోయు సాధనము - గున్ గదె ! యిద్ధర నుక్కుముక్క సా
డెత్తిన మోటుమానిసికి ; - నిద్దియె జంత్రపు తంత్రియూచు గా
పెత్తగ, వైణికుండు సరి - నెత్తుచు మెత్తని వ్రేళ్లనొత్తి ఆల్
చిత్తడిఁ జిందునట్టు సర - సీకృతనాదము వెల్వరింపఁడే ? ॥

ఉ॥ శుష్కములైన వర్ణముల - సుందరమాలగఁ గూర్చి సద్రసా
విష్కరణంబొనర్చి సుర - భీకృత భావవిశేష సృష్టిచేఁ ।
బుష్కలరూపు వెట్టి యుగ - ముల్ తుదిదాఁకఁ బసందు చిందనా
యుష్కరణంబొనర్చు కవి - యుజ్జ్వలుంగని సల్పకాం[illegible]? ॥

కం॥ ఏదేశంబేరాజ్యం
బాదేశింపకయె వీరి - యాదేశంబున్ ।
వాదోడుగాఁగఁ జేకొను
మోదశ్రీ శాంతిసౌఖ్య - ములునగుపచటన్ ॥

## —♦ సాహితీ సౌకుమార్యము ♦—

చ॥ పలిమొలకెత్తు వెన్నెలల - నందురు మేన్మనుఁజూపు తూపుగా
సిలుగునఁ బెట్టు; లేఁజిగురు - సెజ్జయు నొత్తును; నీలమేఘ సం ।
చలనము మూర్ఛఁగూర్చు రతి - జాడయె జార్చును నీవి సాహితీ
లలితకళావిలాస పటు - లా సుకుమారత నంటి కాదనున్ ॥

మ॥ ఒకకంటన్ గరుణాశ్రువుల్ మఱొకచో - నుద్రిక్తకోపానల
ప్రకటజ్వాలలు చేతనొక్కట సుమ - స్రగ్భార మొండొక్కటన్ ।
గ్రకచాంఘ్రిల కృపాణ మొక్కచెవి వీ - ణానాద మొండింట నా
సక భాంకారము నూనువాఁడె కద! దా - నన్ జేయు సాంగత్యమున్

## — రసజ్ఞ ధన్యత —

చ॥ పదముల నొత్తిగొత్తక ర - వంబెటు సేయక రాజసోద్ధతిన్
జెనకుచు నుం ద్రొక్కులాడక యు - చింతిత వైఖరిఁ బక్షపాత దు ।
ర్వ్యవహారిఁ జేసి నైజమగు - రంగుల మాపక తేఁటివోలె లో
నొదవు రసంబుఁ గ్రోలి ముద - మందు రసజ్ఞుఁడు ధన్యుఁడౌఁగదా! ॥

## —♦ అనువాదన రీతి ♦—

ఉ॥ పూనను గట్టునట్లనయు - మున్ గురుసన్నిధి వేదవాక్యముల
భ్యాసము సేయు బాలకుల - వల్లెల రీతినిఁ గాక గాయకో ।
ద్భాసిత గీతముల్ మురళి - వన్నెల వీణెయుఁ బల్కులీల నా
భాసల తెన్కు బల్కులను - వాదములన్ బచరింపఁగా వలెన్ ॥

తే॥ గీ॥ పఱుఁగు మణిపూసల నుంపఁగఁ - బైడి బరణి
హృద్యభావంబు సొంపుగఁ - బద్యసరణిఁ ।
గాన నేనేర్చినంత శ్లో - కములఁ దెలుఁగు
బాసఁ బెట్టితిఁ బద్యవి - కాస మొసఁగ ॥

# గు రు ను తి

చం॥ గురువొక రక్షరజ్ఞతకుఁ - గోమల సాహితి కొక్కరైరి వ్యా
కరణ మహాబ్ధి నీఁదఁగ నొ - కండొరిక రెంచఁగ గాన మాధురిన్
గఱపఁగ, వైద్యకంబున కొ - కళ్లొక రాత్మ రసానుభూతి కా
గురువుల నెల్లగన్ దలఁతుఁ - గోరి శుభంబుల బాల్యమాది కాన్ ॥

---

— ఒ క స వ ర ణ —

62 పేజీలో 23 పంక్తిలో. బింబప్రతిబింబభావముంటచే నిదర్శనాలంకారము కలదని శంకింపవచ్చును. అని చదువవలెను.

62 పేజీలో 25 పంక్తిలో. వాని విశేషణములకు వేఱుగనైక్యారోపము చేయఁబడుచుండుటచే నిదర్శనాలంకారమనుటకు వీలుకాదు. అని చదువుకొనవలెను.

63 పేజీలో 9 పంక్తిలో. భస్మము మున్నగువానితోఁ గూడుకొనిన యోగినికిని విశిష్టరూపములతో నైక్యారోప రూపమగు రూపకము కాదు. మఱియేమన ? అవయవములగు వెన్నెలకును, భస్మమునకును వేఱుగ రూపకము. అట్లే నక్షత్రములకును నస్థిఖండములకును వేఱుగ రూపకము. ఈరీతిగఁ జదువుకొనఁదగు.

---

# పీఠిక.

ఉ॥ శ్రీలలనామణీ సహజ - చిత్త పరిభ్రమణంబు శంకను
ద్వేల తదీయరూప పరి - వీక్షణమోదవిరామ భీతిఁద
త్త్వాలనయుక్తి నాకమల - బంధు హిమాంశులు కన్నుదోయిగా
మ్రోలన పద్మగేహ మఱ - మోడ్పుగఁజేసిన విష్ణుఁదోముతన్ ॥

చం॥ సరసిజపాళినుచ్చరవ - సంగతిఁబల్కెడు నాథుమోముగ
హ్వారమునఁ గొల్వఁగూర్చుకొని - వన్నెలవీణను గోటమీటి వి
న్న్గతిదుస్సాధకంబునగు - సాహితి సుశ్రుతి సద్రసంపు సొం
పరసపుఁ గొల్లిపల్కులకు - నద్దిన పల్కులరాణిఁ గొల్చెదన్ ॥

ఉ॥ పాలకుఁడైనవానికిఁ గృ - పారసముంట హుళిక్కి మాయలన్
నేలగఁజేసి దీనజన - హింసలొనర్చుట యాటగాన నె
వ్వేళలనాథు చిత్తగతి - వీక్షణసేయుచు న్యాయరీతి భ
క్తాళిఁబ్రోవఁజేయు నుర - మందు వసించెడు శ్రీఁదలంచెదన్ ॥

ఉ॥ నృత్తవిశేషసంభ్రమము - నిండుకొనన్ బతిచిత్తమందు స్వా
యత్తతదప్పఁ దీవ్రచర - ణాహతిఁగుంభిని దద్దరిల్లుచో
న్నత్తినభీతిభూతతతి - కేర్పడు శూన్యతయంచు సత్కృపా
యత్తతసగ్ధదేహమగు - నంబను మ్రొక్కెద సర్వమంగళన్ ॥

కం॥ భూషగ కన్యకకరుణా ను
హేషగ నగజాత్తజన్మ - తవ్యారని ము
క్తాషగ జన్మలునుగ నా
నాషగ పురుషార్థలుగ ధ - రణిఁ జేయదె యిటుల్ ? ॥

కం॥ ఓ వాల్మీకి మహాశయ
నీవాక్కులచవి నెఱుంగ - నింపుగఁ గవితా
హేవాకం బేసరు జ
హ్వావాటిన్ గాణనొంద - దనన్యా! సుకవీ! ॥

కం॥ కాళీదాసుఁడు తన కవి
తాలీలను నభ్యసించు - తఱిసే మనముల్ ।
దేలించుకతనరుచి; రత
లీలయదానందుఁ కవుల - లోకము దొఱఁగన్ ॥

కం॥ పలుపలు మనమును జొన్పియుఁ
దెలియరో ! యేలలితగతులు - దివ్యన్మతులున్ ।
తెలుపుదు వానిని లీలగఁ
గలరే ? నీవంటికవులు - కాళీదాసా ! ॥

కం॥ కాళియను పదము చెవిఁబడి
గాలమువలె మానసమును - గాసిన్ బెట్టున్ ।
కాళీదాసుండను పద
మాలించును వినినయంత - నౌరా ! సుకవీ ! ॥

కం॥ చిత్తంబున గుప్తంబగు
మెత్తందన మింతదనుక - మీఁగడ రచనల్ ।
గుత్తగొని నిన్నువిడిరే
కెత్తించెదు కవియుఁబుట్టు - కెత్తఁడదేమో ? ॥

కం॥ భారతము పద్యమొకటి యు
దారతఁబఱియింప వాక్సు - ధారసధారా ।
పూరము విరియఁగఁగవితా
ధోరణి యెవ్వానికబ్బు - దుర ? యీధరణిన్ ॥

కం॥ నాకవితకు గురువెంచ మ
హాకవి యజనాఢ్య తిక్క - నార్యుని పలుకే ।
నేకతనాతని పద్దెము
వాకొనఁదోడ్తోన నాదవుఁ - బది పద్దెంబుల్ ॥

కం॥ పండితులుగలరు మఱియును
బండితకవు లెల్ల దెసలఁ - బఱఁగుదురు మహిన్ ।

చెందాడు తలఁపు వారికి
నుండిన నాచిన్నికయితే - యుగ్గునుగ్రక్కన్ ॥

కం॥ పెద్దలనామము తలఁచుట
తద్దయుఁ బుణ్యాంబటండ్రు - తద్‌జ్ఞులు ధరలో ।
[illegible]న నాదు పితరుల
నుద్దీపిత పుణ్యమతుల - నొగిఁదలఁతు మదిన్ ॥

కం॥ నాతండ్రి సత్యనిరతుఁడు
పూతాత్ముఁడు క్షుపిత చిత్త - మోహుఁడు శ్రీవి ॥
ద్యాతంత్ర మంత్ర దీక్షో
పేతుండను భావదుర్ని - రీక్షవ్రతుఁడున్ ॥

సీ॥ అనిరీక్ష్య చతురంగ - మాడి విద్వత్సభ
నష్టావధాన వి - శిష్టిఁజూపె
ధారగాఁగవిత సు - ధారస మొలుకంగ
సంస్కృతాంధ్రంబులఁ - జక్కఁజెప్పె
ధారణాపటిమ ను - దాహరణంబుగ
ననువాకములనైన - నట్టెపల్కె
తికమకగాఁగూర్పఁ - దెలియంగరానట్టి
వ్యస్తాక్షరాళిఁ బ్ర - శస్త్రిఁజదివె

తే॥ గీ॥ మంథరాచల మంబుధి - మధ్యమమున
బ్రుంగువడి నేలనంటిన - పోల్కె బుద్ధి ।
విశదభావంబుచే శాస్త్ర - విషమగతులఁ
గెలఁక క్రీడగఁ దెలియరా - వెలువరించె ॥

సీ॥ స్వర్ణమాల్యములవి - కీర్ణమా నురమునఁ
దులసిపూసలదండ - వెలసె నకట !
రత్నహారగమునఁజి - రత్నంబు భాసించు
మణికట్లు రుద్రాక్ష - మాలసమరె

అంగరాగంబుచే - సింగారమా మేను
భస్మచర్చలఁగొల్పె - విస్మయంబు
పట్టు పుట్టంబులఁ - గట్టినను మేన
వల్కలాంబరములఁ - బుల్కలాడమె
తే॥ గీ॥ తరలిపోఁగాక సంపద - దైవగతిని
జ్ఞానదీపికఁగాంచు న - జ్ఞాన తిమిర
మణఁచి యాత్మైకసుఖము తా - నలవరింప
మాన్యు నాతనిఁబట్టెను - మానినిష్ఠ ॥
సీ॥ తన కాళ్లఁబడిన పా - మునుగూడ హింసింప
కదెపోవునంచుఁ దా - మదిఁదలంచు
లేమిచేఁగల్గు పే - దాములనైనను
జారనీక సంతస - మరయునెపుడు
పెఱవాఁడు కిన్కచేఁ - జిఱచిఱలాడుఁబో
చిలిపిచేష్టలటంచుఁ - దలఁచినిలుచు
తన సత్యవాక్య దీ - క్షను బరీక్షించెడు
పట్టులనైనఁ జే - పట్టఁడఘము
తే॥ గీ॥ జన్మశుద్ధినిఁగోరి నా - జ్యమును వేల్చి
భక్తిఁ దేవతాగ్నులర్చించి - భవ్యకర్మ
దీక్షితుండౌచు నాతఁడు - మోక్షపదవి
నొంద నాత్మానుసంధాన - మొందునెపుడు ॥
కం॥ ఈవిధిఁ గృతార్థజన్మునిఁ
బ్రావీణ్యము గల్గువాని - బహు శాస్త్రములన్ ।
భావింతు నాదు జనకుని
శ్రీ వేంకటరామశాస్త్రి - సిద్ధతపస్విన్ ॥
కం॥ కల్లయుఁ గపటము నెఱుఁగక
యెల్లెడఁదన విధుల ధర్మ - హీనతగాఁ ॥

నొల్లక యాముష్మిక శుభ
ముల్లలి సేవింపఁదల్లి - పొద్దుల నెల్లన్ ॥

ఉ॥ వేఁకువ లేచి భర్తృపద - పీఠము నొంద లనంటి గేహకృ
త్యాకలనంబు సేసి శివు - నర్చనకై విధులెల్లఁ గూర్చి మే ।
నూఁకొన వంటకమ్ములను - నోనన వండి భుజింపఁజేసి తా
శ్రీకర గౌరి కంజలులఁ - జెప్పక తల్లి భుజించదెన్నఁడున్ ॥

క॥ అంబను శ్రీవేంకటచల
మాంబను బతిసేవయొకటె - యంచితగతియం ।
చుం బరమాదరలీలఁ ద
పంబుగ నొనరించు వంశ - పావనిఁ గొలుతున్ ॥

ఉ॥ కుంకుమ గంధమున్ విరుల - గుర్వధివాసితవర్తి, దీపమే
ణాంకపుటారతిన్ విడెము - నర్చనొసంగి కృపారసంబునన్ ।
బొంకము మీఱు శ్రీలలిత - మొక్కెడు వేళల సర్వమంగళా
శంకరలీలఁ బొల్చు పితృ - సంహితమూర్తులు నిల్చు నామెడన్ ॥

చ॥ హరితసగోత్రసంభవుఁడ - హర్నిశమున్ రఘురామనామ సం
స్మరణ పవిత్రజన్ముఁడు సు - సర్లకులప్రభవుండు కంటఁదా
నరయుకయుండియున్ మనుమ-లందెదరంచును వృత్తినిల్పె సు
స్థిరముగ నాదు మాతృపిత - శ్రీయుత వేంకటరామశాస్త్రినాన్ ॥

క॥ ఘోషంబున నాజననికి
నావేశించియు నతండు - నాత్మాభిఖ్యన్ ।
గావించుకొంట నేఁడుఁగ
బో! వేంకటరామశాస్త్రి - యననాపేరన్ ॥

క॥ పుట్టిన సుతుఁడును గిట్టఁగ
నెట్టి మనోవేదనమున - నేగెనొ! దివికిన్ ।
నెట్టన నేనాతని చే
రట్టులు సద్భక్తిఁ దలఁప - హితమిర్వురకున్ ॥

కం॥ పుత్రీకరణంబున నేఁ
బుత్రుఁడనాతనికి జ్యేష్ఠ - పుత్రీసుతుఁడన్ ।
ధాత్రిన్ గొలిచెద నతనిని
మాత్రంబను సుబ్బమాంబ - మాన్యచరిత్రన్ ॥

—♦ కృ తి ప తి ప్ర శం స ♦—

ఉ॥ శ్రీపతి రామచంద్రుఁడట - శ్రీయును భూసుత సీతయంట వా
రాపగిదిన్ మనుష్యజను - వందిసుఖంబుల దవ్వవెట్టి లో॥
కాపకృతిన్ జరించు దను - జాళినిద్రుంచి జగమ్ము బాములన్
బాపిరి వారినీడి పెఱ - వారికి నాకృతినీఁగఁ జెల్లునే ? ॥

చం॥ దినమణివంశరత్న ! యతి - దీనజనావన ! దూరసర్జితా
రినివహా ! సద్యశఃసుమ ప - రీమళ భారవిశేషకృష్ట స ।
న్మనిజనచిత్తభృంగ ! తను - మోహితచేతనలోక ! శైవచా
పనమనమాన్యవీర్య సము - పార్జిత భూమిసుతామనోధనా ! ॥

ఉ॥ సత్యపుపల్కుఁదండ్రికిఁ బొ - సంగనెవంచును రాజ్యభోగ సాం
గత్యము దవ్వనెట్టునటె ? - మార్చునె ? దుష్టుల లోకశాంతి సా ।
హిత్యమకోరి ? రాణిఁద్యజి - యించునె ధర్మనిరూఢి ? స్వార్థరా
హిత్యమెకా ? రఘుప్రవర ! - యెట్టులు సేసితి మానుషస్థితిన్ ॥

ఉ॥ కానలనుండుమంచుఁ జిర - కాలవరంబును దల్లికైక గొం
చానృపు చెంతఁబల్కఁ బిత్రు - నానతినొందలఁదాల్చి యోగి దు ।
ర్గానఁజరించు నాదనుజ - రాజు దశాననుబోరఁ గెల్చఁబో
వానరులన్ బనింగొనితి - పట్టఁగఁబోవు పురంబువారలన్ ॥

కం॥ పురుషుఁడవునీవు రామా !
ధరణీసుత ప్రకృతి యూపె - దరిఁజేరంగా ।
ఖరమతి ఘృష్టమునీధరఁ
జెఱఁబాపితి చిత్రకృతులఁ - జెన్నుదలిర్పన్ ॥

కం॥ నీచరితము వల్మీక జు
వాచంయముఁగూడఁజేసె - వాగ్మీశునిఁ గా ।

సోపాఫలరసభరితము
నీ చారిత్రంబు రామ! – నిరుపమధామా! ॥

కం॥ నీకే పట్టముగట్టెద
నాకృతి నీకృపను జూపు – నన్ వెలయుటచే ।
వాకొందగమ్మ నాయెడ
నీ కారుణికతను జూపి – నిల్వుము రామా! ॥

కం॥ నీవాసీతయు లక్ష్మణుఁ
డావిధి భరతుండు చిన్న – యగు శత్రుఘ్నుం ।
డా వాతాత్మజుఁడొయ్యన
నేస్పుగతో వచ్చి నిలుము – హృత్పీఠమునన్ ॥

కం॥ నా మొఱ చెవులం బెట్టితి
నా మానసమందు నిల్వ – నవ్వులమొగమెం ।
తో ముద్దుగ మెఱయన్ నీ
నామంతులతోడ వచ్చి – నాఁకితి రామా! ॥

కం॥ విని చెవఁ గొండొక గ్రంథము
వినచెవలే వేగిరంబు – పఠియింపఁగనే ।
యినకులభూషణ! రామా!
వినుమయ్యా! చిత్తమొక్క – వీనులనుంచన్ ॥

— గ్రం థ ప్రా రం భ ము —

కం॥ తెలుగంటి చెలులతుటుకుల
సొలుపు విరితేఁటి పెంటి – మించినరవళిన్ ।
నులు మోగు గనునకూతుని
నటులెస నాయుడుగుఁదమ్మ – వాపుత బాముల్ ॥

కం॥ అనోన్యస్యతిపము ఫలముగు
నానోన్యాకార మొంది – యుతులంబునకున్ ।
నానాన్యుల మహాత్రగసితకుల
ధనాత్మ్యులఁగాలుతు నాది – దంపతుల నెదన్ ॥

కం॥ వృత్తినిరోధమునన్ దమ
చిత్తము దీపింప ధన్య – చిత్తులు నేది ।
వ్యోత్తముఁదిలకింతురో యా
సత్తముఁడిడుఁగాత శౌరి – సకలార్థంబుల్ ॥

కం॥ కావ్యాలంకృతులన్ సం
భావ్యార్థంబుప్పతిల్ల – భాసురమతి సం ।
సేవ్యంబుగ సమకూర్చెద
భవ్యాత్ములు వానిగతులు – భావింత్రుతగన్ ॥

కం॥ చంద్రాలోకమునన్ రుచి
సాంద్రంబగు లక్ష్యలక్ష్మ – సంబంధము ని ।
స్తంద్రిత సహృదయ హృదయము
లుంద్రుకొద్రుతినొందనిట తె – లుప యత్నింతున్ ॥

కం॥ సంకరసంసృష్ట్యాదు ల
లంకారములన్యములకు – లక్ష్మ ములను ల ।
క్ష్యాంకితముగనొనరింతు వి
శంకితముగ బుధులు వాని – చందము దెలియన్ ॥

## కందవృత్తప్రశస్త్యము.

కం॥ కుందమ్ములోహగణముల
మందారము పాదపముల – మహిసుఖములలో ।
సుందరి యానందంబుల
నందనుఁడౌ మిన్నకవిత – నడఁగందంబౌ ॥

అట్లగుటం జేసి

కం॥ తొలిసామున లక్షణముల
మలిసామున లక్ష్యములను – మాన్యతఁగందం ।
బులఁజంద్రాలోకమునన్
గలకృతులకుఁ గూర్చినాఁడఁ – గాఁగలసరణిన్ ॥

—:0:—

కం. సత్కృతి కొటిక నస్పృశత
లోకంబునుగ తెలియనుపమ-నజలును నిచలుక్
నీకీర్తి హంసివలె నా
నాకాపగలోఁజొచ్చి-యాడెఁగృష్ణా! ॥

ఏ కావ్యమున రెండు వస్తువులకు సాదృశ్యము ప్రాకటమున నెనఁగా స్పష్టముగను సుందరముగను జెప్పఁబడునో యచ్చట నుపమాలంకారమగును. ఉదాహరణము స్పష్టము.

ఉపమానము, ఉపమేయము, సాధారణ ధర్మము, ఉపమా వాచకము నీనాల్గును జెప్పఁబడుచో పూర్ణోపమయగును. ఇట హంసి యుపమానము, కీర్తి యుపమేయము, గంగానదిఁజొచ్చి యాడుట సమాన ధర్మము. వలెనన్నది యుపమావాచకము. కావునిది పూర్ణోపమ.

కం. ఇల గుణదోషములుత్తముఁ
డల శశిగరళముల శంభు - నట్టులుగొనుచున్ ।
తొలిదానిఁ దలఁగొని యా
వలిదానిఁ గళతలమున - బలిమినినిలుపున్ ॥

ఉత్తముఁడు పరుల మంచిచెడ్డలను, శంకరుఁడు శశి గరళముల వలె గ్రహించుచుఁ దొలిదియగు మంచిని శంకరుఁడు చంద్రునివలెఁ దలను దాల్చును. రెండవదియగు చెడ్డను గరళమునువలె గళమున నిలుపును. ఇట నుపమానోపమేయముల రెంట సమానధర్మ మొక్కటి గాదు. ఎట్లన ? ఉపమానమగు నీశ్వరునియందుఁ జంద్రుని గరళమును

గొనుట యనఁగాఁబట్టి చేకొనుట. వాసిలోఁ గొల్లఁటి చంద్రకలను జేకొనుటయన శిరమునఁదాల్చుట. రెండవదియగు గరళమును గళమున బంధించుటయు ననునివి ధర్మములుగాఁ గైకొనఁబడినవి.

ఉపమేయమగు నుత్తమునియందు గుణదోషములఁ గైకొనుట యనఁ దెలిసికొనుట. అనఁగా శిరమునఁ గైకొనుట, యనఁ దలనూఁపి యభినందించుట. పరుల తప్పును గళమున నియమించుట యనఁ గైకి వాకొనకుండుట యనునవి ధర్మములుగా గ్రహింపఁబడినవి. ఈరీతిగ నుపమానోపమేయముల రెంటను ధర్మభేదము గలుగ ధర్మైక్యం బెట్లన నుపమానగతములగు చంద్రగరళములకును నుపమేయగతము లగు గుణదోషములకును బింబ ప్రతిబింబ భావముచే నభేదమును గల్పించుటచేతను నట్లే యుపమానమందలి స్వీకరించుటకును నుపమేయమందలి తెలిసికొనుటయను ధర్మమునకును 'కొనుచున్' అనునొక్క పదముచే గ్రహించి యభేదమునధ్యవసించుటచేతను నుపమానోపమేయముల రెంట నొక్క సమానధర్మము సంభవించునటులు చేసి యుపమాలంకారము పొందుపఱుపఁబడినది.

ఈరీతిగ నభేదభావము నధ్యవసించి సమానధర్మము పొసగునట్లు చేయుటను బింబ ప్రతిబింబ భావమందురు.

బింబ ప్రతిబింబభావమునకును వస్తు ప్రతివస్తు భావమునకును లక్షణ మెట్లన ?

కం. ఒక్కటియె రెండు తెఱవలఁ
జక్కఁగఁ గొనవచ్చు ధర్మ - సామ్యము రెంటన్ ।
లెక్కఁగొను-వాటులందుఁ బ్ర
ధక్కరణం బర్థశబ్ద - తత్పరతనగున్ ॥

కం. గతిఁ దోషయుత ధర్మో
ద్గతియును హారంబు కేల – ఁ దీపన బిం॥
ప్రతిబింబభావ వస్తు
ప్రతివస్తుత్వము లనంగఁ – బఱఁగుచు బరుగున్ ॥

సమాన ధర్మమును నుపమానోపమేయ వాక్యముల రెంటను నొక్కమాఱుగనే గ్రహించుట యొకరీతి. వాక్యద్వయమున రెండు మాఱులు గైకొనుట మఱియొకరీతి. రెండుమాఱులు గైకొనునప్పుడును నర్థభేదముచేతను శబ్దభేదముచేతనుగూడ గ్రహింపవచ్చును. అనఁగా నుపమాన వాక్యమున నొక ధర్మమును నుపమేయ వాక్యమున నొక ధర్మమును జెప్పవచ్చును. అట్లే ధర్మమొక్కటియే యైనను వేఱు వేఱు పదములచే వాక్యద్వయమున గ్రహింపవచ్చును. ఉపమానోపమేయ వాక్యముల రెంటను వేఱు వేఱు ధర్మములను గ్రహించినపుడు పృథగ్ధర్మములకుఁ బరస్పర సాదృశ్యమువలన నభేదమును గ్రహింపవలయును. అనఁగా ధర్మములు వేఱువేఱయ్యును నొక్కధర్మముగానే తలఁచి యుపమానోపమేయ వాక్యముల రెంటను వేఱుగా గ్రహింపవచ్చునని యర్థము. ఇట్లు గ్రహించుటను బింబ ప్రతిబింబ భావమందురు. "ఇల గుణదోషముల" నెడు నుపమాలంకారోదాహరణమున శివునియందును నుత్తమునియందును బైరీతిగఁ బృథగ్ధర్మములను నొక్కటిగాఁ జేసి వేఱువేఱు వాక్యముల వేఱుగా గ్రహించుటవలన బింబ ప్రతిబింబ భావముచే ధర్మ సామ్యము గ్రహింపఁబడినది.

ధర్మమొక్కటియైనను వేఱు వేఱు పదములచే వాక్యద్వయమున గ్రహింపఁబడినచో నది వస్తు ప్రతివస్తుభావము. వస్తు ప్రతివస్తు భావముచే ధర్మసామ్యమును గ్రహించుట ప్రతివస్తూపమాలంకారములోఁ దెలుపవలయును.

కం. ఉపమేయ ధర్మవాచక
ముపమానమునాఁదనాల్గు - నుపమకుఁ బూర్ణన్ ।
బపకలస పుణాపమనుకను
విపరీతంబదియుదచ్చి - విడిలెక్కింపన్ ॥

ఉపమేయమ్ము, సమానధర్మము, ఉపమావాచకము, ఉపమానము నీనాల్గింటిని జెప్పినచో పూర్ణోపమ. వానిలో నొకటిని లేక యే రెంటిని లేక యే మూఁడింటినిగాని విడిచిపుచ్చినచో లుప్తోపమ యగును. అదియు సప్తవిధము. వానిపేర్లెవ్వియన? 1 వాచకలుప్త 2 ధర్మలుప్త 3 ధర్మవాచకలుప్త 4 వాచకోపమేయలుప్త 5 వాచకోపమానలుప్త 6 ఉపమానలుప్త 7 ధర్మోపమానవాచకలుప్త 8 ధర్మోపమానలుప్త. ఎట్లన?

ఉ. కాయజవల్లభాయిత స్వ - కాంతినిఁ బల్లవకోమలన్ స్మరా
ధాయినిఁగుందకుట్మలర - దన్ హిమరశ్మిసమాస్య నొక్కతెన్ ॥
డాయుట శీర్ణచిత్తయగు - టన్ రతిఁదేలుట నాకుఁగాక తా
లీయము పుణ్యసంచయఫ - లీ భవదాత్మవిలాసమొక్కెడన్ ॥

ఒక యువకుఁడు దన రహస్య వృత్తాంతమును జెలికానితోఁ జెప్పుచున్నాఁడు. ఇట్టి కాంత నొక్కతె నొకచోఁగూడికొనుటయు నాపె శిథిలచిత్తకాఁగా నాపెతో రమించుటయును నాకుఁ బూర్వపుణ్యఫలమగు కాకతాళీయమని, కాయజవల్లభాయిత ననఁగాఁ దనను గాంతిచే రతీదేవినిగాఁ బ్రకటించుకొనుచున్నదానినని యర్థము. తనను రతీదేవిని గాననునపుడు కాయజవల్లభ యను నుపమానము కలదు. కాని తనను ననెడు నుపమేయము స్వీకరింపఁబడలేదు. అట్లే వలె మున్నగు వాచకపదముగూడ గ్రహింపఁబడలేదు. కాన కాయజవల్లభాయిత ననుచోట వాచకోపమేయలుప్త. పల్లవకోమలన్ :- చివురువలెఁ గోమలమైన దానిని ఇచ్చటఁ బల్లవ ముపమానము. ఒక్కతె ననునది యుపమేయ

ము. కోమలత్వము సమానధర్మము. కానివలె మున్నగు వాచకపదము చెప్పఁబడలేదు. కాన వాచకలుప్త. కుందకుట్మలరదన్ :- మల్లెమొగ్గలవంటి దంతములుకలవానిని. మల్లెమొగ్గలుపమానము. దంతములుపమేయము. ధావళ్యరూపమగు సమానధర్మము చెప్పఁబడలేదు. వలె మున్నగు వాచకపదముగూడ చెప్పఁబడలేదు. కాన నిచ్చట ధర్మవాచకలుప్త. హిమరశ్మిసమాస్యాం :- చంద్రునితో సరియగు మోముగలది. ముఖముపమేయము. చంద్రుఁడుపమానము. సమపదముపమావాచకము. కాని యానందకరత్వము మున్నగు సమానధర్మము చెప్పఁబడలేదు. కాన నిది ధర్మలుప్త.

కాకతాలీయపదసిద్ధిని గూర్చి కొంత తెలిసికొందము. సమాసాచ్ఛతద్విషయా దనెడు జ్ఞాపకసూత్రము వలన కాకమువలెఁ దాళమువలెనను సాదృశ్యార్థమునఁ గాకతాళశబ్దములు సమసించినవి. అట్టి సమాస పదమగు కాకతాళశబ్దముకంటె "ఇవేప్రతికృతౌ" అను నధికారములోనున్న 'సమాసాచ్ఛతద్విషయాద'ను పాణినిసూత్రముచే నివార్థమున ఛప్రత్యయముగాఁగా దానికి నీయ యని యాదేశము వచ్చి కాకతాళీయశబ్దము సిద్ధించినది. ఈ శబ్దనిష్పత్తివలనఁ గాకతాళమనెడు సమాసపదముచే నొక సాదృశ్యమును ఛప్రత్యయాన్తమగు కాకతాళీయపదముచే నొక సాదృశ్యమును సంభవించుచున్నదని తేలినది.

పై పద్యమున నుపమేయములుగా రెండు విషయములు చెప్పఁబడినవి. పైని వర్ణింపఁబడిన స్త్రీని నొక యువకుఁడు కలిసికొనుట యొక విషయము. ఆమెతో నతనికి రతిగల్గుట మరియొక విషయము. ఈరెంటికిని నుపమానములుగఁ గాకతాళీయశబ్దార్థములు రెండు గ్రహింపఁబడినవి, ఎట్లనఁ గాకతాళీయశబ్దములోనున్న కాకతాళ శబ్దములు రెండును లక్షణావృత్తిచేఁ గాకియొక్కయుఁ దాటిపండు

యొక్కయుఁ గ్రియలను జెప్పెను. ఇట్లనుటచేఁ గాకాగమనమువలెను తాళఫల పతనమువలెను ననునివార్థమున సమర్థోచ్చారితప్రత్యయమాత్రను జ్ఞాపకమువలనఁ గాకతాళశబ్దములకు సమాసము చేయఁబడినది.

ఇట మొదటి యుపమేయమగు కాంతాయువక సమాగమము నకుఁ దగునట్లు కాకతాళశబ్దమునకుఁ గాకాగమన తాళపతనములను నర్థమే కాక కాకతాళసమాగమ రూపార్థము చెప్పవలసియున్నది. ఇట్లే కాకతాళీయమనెడు ప్రత్యయాంత స్థలమునఁగూడఁ గాకతాళ శబ్దమునకుఁగాక కృతతాళఫలోపభోగమని యర్థము చెప్పవలయును. ఇట్టి యర్థములఁబట్టి కాంతాయువక సమాగమము కాకతాళ సమాగమమువంటిదనియును, నాపెతో రతిసుఖము కాకకృతతాళఫలోపభోగ సదృశమనియును నుపమానోపమేయభావ మన్వయింపవలయును. మొదటిది సమానార్థోపమయనియు రెండవది ప్రత్యయార్థోపమయనియు వ్యవహరింపఁబడును.

అలంకారసమన్వయ మెట్లన ? సమానార్థోపమలో నుపమేయము చెప్పఁబడినది. కాకాగమన తాళసమాగమ మనెడు నుపమానార్థము వ్యాకరణసూత్రముచే నుపమేయాన్వయసిద్ధికై తీసికొనిరాఁబడినది. అనఁగా నుపమానమును నుపమావాచకమును లోపించినవి. పుణ్యసంచయఫలమనెడు సమానధర్మము చెప్పఁబడినది. ఇందుచే సమానోపమలో వాచకోపమానలుప్తయని తేలినది.

ప్రత్యయార్థోపమలో రతిఁదేలుట యనెడు నుపమేయముకలదు. ఇవార్థకమగు ప్రత్యయము కలదు. పుణ్యసంచయఫలమనెడు సమాన ధర్మమును గలదు. కాని కాకకృతతాళఫలోపభోగమనెడు నుపమానము ప్రత్యయవిధాయకశాస్త్రముచే వచ్చినదికాని వాచ్యముగఁ జెప్పఁబడలేదు. పతనదళితమగు తాళఫలము కాకిచే నుపభుక్తమగు నట్లు చాటుచోటునఁ గలియుటచే శీర్ణచిత్తయగు నాపె యూతనిచే

ననుభవింపఁబోయెను. ఈయర్థము కాకతాళీయశబ్దమునకు ఫలితార్థము కాని వాచ్యార్థము కాదు. కాన ప్రత్యయార్థోపమలో నుపమానలుప్త యని తెలియఁగను.

పద్యమును 'కాకతాళీయముగాఁ దలంపఁగవలెన్ ప్రియమిత్రమ! నిక్కమొక్కెడన్' అని పూరించినచో సమానధర్మముకూడ లోపించుటచే సమాసార్థోపమలో ధర్మోపమానవాచకలుప్తయనియును ప్రత్యయార్థోపమలో ధర్మోపమానలుప్తయనియు నెఱుఁగవలయును. ఇట్లిపై పద్యమున నెనిమిది లుప్తోపమలును బొందుపఱుపఁబడినవి.

### అనన్వయాలంకారము. 2.

కం. ఒందఁగ వర్ణ్యత నన్యతఁ
బొందుగ నొక్కటి యవస్తు - వు గవుల కృతులం।
దిందుండిందువు వలె నా
నందకరుండిట్టియెడ న - నన్వయమునగన్ ॥

ఒకవస్తువే వర్ణ్యతను నవఁగా నుపమేయభావమును, అన్యతను నుపమానభావము నొందినచో ననన్వయాలంకారము. ఉదాహరణము స్పష్టము. ఒక వస్తువునకు నుపమేయతయు నుపమానతయును సంభవింపవుగాన దానితోఁ బోల్పఁతగిన వస్తువు మఱియొకటిలేదని తాత్పర్యమునఁ బర్యవసించుచున్నది.

తే॥ గీ॥ సాగరమునకుసరి జోడు - సాగరంబు
గగనభాగంబు తుల్యంబు - గగనమునకు
రామరావణ భీకర - రణముపోలు
రామరావణ భీకర - రణమునకును ॥

వెనుకటి పద్యమున నానందకరుఁడని సమానధర్మము చెప్పఁబడినది. ఈపద్యమున మొదటి యుదాహరణమున వైపుల్యరూపమగు

సమానధర్మము చెప్పఁబడియుండలేదు. రెండవ యుదాహరణమున భీకరత్వరూపమగు సమానధర్మము చెప్పఁబడినది.

ఉ ప మే యో ప మా లం కా ర ము. 3

కం. ఉపమింప వస్తుయుగళిని
నుపమేయోపమ, వినిమయ – మొప్పఁగఁ గొనుచున్ ।
నృప! నీయర్థము ధర్మము
నుపమించును ధర్మమర్థ – ముక్తిని విరివిన్ ॥

వినిమయమనఁగా నిట్టటు మార్పుచేయుట, రెండు వస్తువులను బరస్పర ముపమానోపమేయములుగాఁ జేసినచో నుపమేయోపమాలంకారమగును. ఓ రాజా! విరివిలో నీ యర్థము ధర్మమును బోలును, ధర్మమర్థమును బోలును. ధర్మార్థముల రెంటికిని బరస్పర ముపమానోపమేయభావము చెప్పఁబడినది. ఒక వస్తువునకు మఱొక వస్తువుతోఁ బోలిక చెప్పఁబడినపుడు రెండవ వస్తువునకు తొలివస్తువుతోఁ బోలిక సిద్ధించుచుండఁ దిరిగి పోలిక చెప్పుట వ్యర్థమగుచు నావస్తుద్వయికి సదృశమగు తృతీయ వస్తువులేదని బోధయగుచున్నది.

కం. జలమున్ వ్యోమము వ్యోమము
జలమును హంసయును జంద్రుఁ – జంద్రుఁడు హంసన్ ।
తెలికుముదంబులు తారలఁ
దెలి తారలు కుముదములను – దీరుగఁ బోలున్ ॥

శరత్కాల వర్ణనము స్పష్టము. పై యుదాహరణంబుల రెంటను బ్రస్తుతార్థములకే పోలిక చెప్పఁబడినది. ప్రస్తుతాప్రస్తుతములకు నుపమేయోపమ యెట్లన?

కం. కరిని బలెఁ గిరిరాజంబును
గరిరాజము గిరిని బలెన్ బ్రకాశింపన్ ని ।
ర్ఝరిమిథ మదధారను దగఁ
గరిమదధారయును బోలు - గద నిర్ఝరముల్ ॥

కరిమదధారలు ప్రస్తుతములు. గిరినిర్ఝరము లప్రస్తుతములు.

ప్రతీపాలంకారము 4

కం. మధురోపమానమును సుగ
తి ధరణి నుపమేయమునఁ బ్ర - తీపము వెలఁగున్ ।
శశి నువ్వుసరి నీ ముఖంబున
కెన ధనువు నెన నీదుబొమల - కున్ జలజాక్షీ ! ॥

లోకప్రసిద్ధమగుటచే మధురమగు నుపమాన వస్తువును నుపమేయముగాఁ జేసినచోఁ బ్రతీపమగును. చంద్రునకు సరి ముఖమని చెప్పుటకు మాఱుగ ముఖమునకు సరి చంద్రుఁడని చెప్పఁబడెను. అట్లే రెండవ యుదాహరణమునను దెలియనగు. మఱియు

శా. నీటన్ మున్గెఁ ద్వదక్షితుల్యరుచులీ - నీలోత్పలంబుల్ పయో
దాటోపాంతరితుండు నీదుముఖతు - ల్య శ్రీ ప్రియుండిందు, వె ।
చ్చోటన్ డాగెనొ త్వద్గతోపమగతిన్ - శోభిల్లు రాయంచలున్,
బాటింపండినుమంతయున్ విధిభవ - ద్భవ్యోపమామోదమున్ ॥

వర్షర్తువున సీతావియుక్తుఁడగు శ్రీరాముని విలాపము. అక్షి మున్నగువానికిని నీలోత్పలములు మున్నగువానికిని నుపమానోపమేయ భావము విపరీతము చేయఁబడినది.

ప్రతీపాలంకారము. II

కం. అన్యోపమేయలబ్ధి న
నన్యమునకుఁ దెలుపఁగా న - నాదర మదియా ।

మాన్యమొ ? గర్వము వక్త్రమ !
ధన్యంబగు రుచిని విధుఁడు – దగునీకెనగాన్ ॥

అన్యోపమేయలబ్ధిచే ననఁగా నప్రస్తుతమగు చంద్రాదికమును నుపమేయముగాఁజేసి దాని లాభముచే ననన్యమునకు వర్ణ్యమాన మగు ముఖాదికమునకు ననాదరమును దెల్పినచో నది ప్రతీపము. ఉదాహరణము స్పష్టము. ఇట నన్యుఁడగు చంద్రుని నుపమేయముగాఁ జేసి వర్ణ్యమగు ముఖమునకు ననాదరముఁ జూపఁబడినది. ఇట్లు తొలి భేదముకన్నఁ జమత్కృతి చూపఁబడెను. మఱియు,

గీ॥ లేమ ! కను సోయగముసాటి – లేనిదనుచు
గర్వమొందెదవేల ? యు – ఖర్వమతిని ।
లేవె ? నీలోత్పలములు న – ల్దెసల నీదు
కనులఁబోలఁగ సరసులఁ – గాంతిఁదనరి ॥

పతీపము. III

కం. ఉపమేయలాభమునఁ ద
ద్విపరీతానాదరమును – దెల్పగనటు లౌ ।
నపదయుతనుండ దర్పమె ?
చపలాక్షులుగలరు నీకు – సరియనమృత్యూ ! ॥

తానుత్కృష్ట వస్తువగుటచే సరిరాల్లని యుపమానవస్తువునకు నుపమేయ వస్తులాభమును జూపి యనాదరము దెల్పినను బ్రతీప మగును. ఇట స్త్రీల నుపమేయముగాఁజూపి తద్విపరీతమనఁగాఁ బ్రసిద్ధోపమానమగు మృత్యువునకు ననాదరము చూపఁబడెను. ఇది రెండవ ప్రతీపమునకు వ్యతిరేకము.

ఆ. మారకాధిపుఁడను – మానుగాననటంచు
నంతపొంగెదేల ? – హాలహాలమ ! ।

ఎల్లకపిల జగతి - నెల్లకాలములందు
ముండఁగిండ్రి పలుకు - లుండ ధరణి॥

పృతీపము. IV

కం. అన్యమునకు వర్ణ్యముతో
శూన్యము పోలికయుననుట - చొప్పడునట్టుల్ ।
మాన్యము నీమోమునకైన
నన్యము పంకజమటంట - పాటియె ? తరుణీ ! ॥

ఉపమానవస్తువగు పద్మాదికమునకు వర్ణ్యమగు ముఖాదికముతోఁ బోలిక శూన్యమని చెప్పుటయుఁ బ్రతీపము. పాటియె ? యనుటచేఁ బోలికలేదని భావము. ఇది వెనుకటి భేదముకన్నఁ జమత్కారి. మఱియు,

ఆ. వె. అనుపమాంగి ! వింటె - యజ్ఞులు నీమోము
తోడఁ జందురు సరి - చూడఁగనుట ।
అటులు చెప్పఁబోవ్ర - నెటులును సరిగాదు
వేఱె చెప్పనేల - మాఱుగాక ॥

పృతీపము. V

కం. ఉపమేయమె ఫలమును నిడ
నుపమానంబేలయనుట - యొప్పును నట్టుల్ ।
ద్విపయాన ! నీదు మోమును
నిపుణతఁగనఁ జంద్రుఁడేల - నీరజమేలా ! ॥

ఉపమానవస్తుచేఁ గాఁదగినపని యుపమేయవస్తువుచే సిద్ధించినచో నాయుపమాన వస్తువేలయని తెల్పినచో నదియును బ్రతీపాలంకారమగును. ఉదాహరణము స్పష్టము.

తే. గీ. నలుని తేజంబు కీర్తియుఁ - గలుగ జగతి
నేలపిండ్రిని తలపోయు - వేళలందు ।

భానుశీతాంశులకుఁ బద్మ - భవుఁడు పరిధి
నెపమునఁ గాఁ జేయుఁ గుండల - విపుల రేఖ ॥

బ్రహ్మ నలుని తేజమును గీర్తినిఁ జూచి సూర్యచంద్రులేలయని తలఁచునప్పుడు వారికి గుడియనెడు నెపముచే సున్నలను జుట్టుచున్నాఁడు.

దండి మున్నగు నాలంకారికులు, అనన్వయము, ఉపమేయోపమ, ప్రతీపము, ఈ మూఁడలంకారములను నుపమాలంకార భేదములనుగాఁ జెప్పిరి. మఱికొందఱు పంచమ ప్రతీపమును నుపమానవస్తువుయొక్క యాక్షేపమచ్చుటఁ గన్పట్టుటచే నాక్షేపాలంకారమునుగాఁ జెప్పిరి. కాని యట్లనరాదు. ఏలయన ? ప్రతీపాలంకారము భేదములు తొలి మూఁడింటను సామ్యము వర్ణింపఁబడుటచే నవి యుపమాలంకారములో నంతర్భూతములని యనఁదగినను జతుర్థ పంచమ భేదములలో నట్టి సామ్యనిష్పత్తి లేకుంటచే నట్లనఁదగదు. తొల్లిఁటి మూఁడింటఁగూడ సామ్యనిష్పత్తికన్న సామ్యతిరస్కారమే చమత్కృతిహేతువుగాన నుపమకన్న భేదము స్పష్టము. ఉపమాలంకారమున సామ్యనిష్పత్తి ప్రధానము. ప్రతీపాలంకారమున సామ్యతిరస్కృతి ప్రధానము. సామ్యమున్నంతమాత్రమున నుపమానములో నంతర్భావముఁ జెప్పినచో సామ్యసంపర్కములేని యలంకారమే లేదు కాన సర్వాలంకారములును నుపమాలంకారాంతర్భూతములే కావలసివచ్చును. కానఁ బ్రతీప మువమాంతర్భూతము కాదు. అటులే యుపమేయోపమ, అనన్వయములలోఁగూడఁ గేవల సాదృశ్యమునకే ప్రాధాన్యమును జెప్పక సదృశములగు ద్వితీయ తృతీయ వస్తువులు లేవని చెప్పుటయే తాత్పర్యముగాఁ జెప్పఁబడెను. ఇదియే యాయలంకారములఁ జమత్కారము. కాన నివిగూడ నుపమాంతర్భూతములు కావు. వామనాదులు పంచమ ప్రతీప భేదమును నాక్షేపాలంకారమునుగాఁ జెప్పిరి కాని యది యుక్తము కాదు. ఎట్లన ? ఆక్షేపాలంకారమున స్వయముక్తమగు విషయము

నకుఁ బ్రతిషేధము ప్రధానముగను జమత్కార హేతువుగను బరిగణింపఁబడును. మఱియు నచ్చట నుపమానవస్తువునకుఁ గైముత్యముచే నిరర్థకత చెప్పఁబడినను నది స్వయముక్త ప్రతిషేధమును సమర్థించుటకే చెప్పఁబడును గాన నప్రధానమగును. పంచమ ప్రతీపాలంకార భేదమున నో వైయర్థ్యముచే నుపమానవస్తువునకు నిరర్థకత ప్రధానము. కానఁ బంచమ ప్రతీపభేదమును నాక్షేపాలంకారమనరాదు. ఈవిషయ మాక్షేపాలంకారమున ( 32 ) చూడనగు.

## రూపకాలంకారము. 5.

క. స్తుతివిషయమునకును బరి
కృతి నన్యముతో నభేద - తాద్రూప్యములన్ ।
నుతిఁ గాంచు రూపకంబని
త్రితయంబది న్యూనతను న - ధికతోభయతన్ ।

సీ. ఈతేఁడు ధూర్జటి - యేకదా! నొల తాఁ
బురములఁ ద్రుంచెఁ గోసఁ - బూనిసేసె ।
ఈనామిపగవారి - వేసారఁజేయుఁగాఁ
జిచ్చుకన్దొఱఁగిన - జింకతాల్పు ।
ఈదాని విశ్వంబు - నాదరంబుగ నేల
సమదృష్టి రంజిల్లు - శంకరుండు ।
ఈసాధ్వి క్షీరాబ్ధి - నాసాదితయుఁగాని
వేఱొండు లక్ష్మియై - మీఱు జగతి ।

గీ. ఇంతి ముఖచంద్రుఁడానంద - మీఁగఁగనుల
కేలమిన్నంటు చందురుఁ - డీడు దెలియ ।
నెలత ముఖచంద్రుఁడేపారు - నింగి చంద్రు
వంకలెంచుచు నతఁడు గ - ళంకియగుట ॥

స్తుతివిషయమగు నుపమేయవస్తువునకు ననఁగా వర్ణ్యమానమగు ముఖాదికమునకు నన్యముతో నుపమానవస్తువగు చంద్రాదిక

ముతో నభేదతాద్రూప్యములచే నుపరక్తతను ననఁగా నుపరాగమును నుపమానవస్తువుయొక్క రూపమును నుపమేయవస్తువునకుఁ గలుగఁ జేయుటను రూపకమందురు.

అభేదరూపకమున నుపమేయవస్తువునకు నుపమానవస్తువుతో భేదము భాసింపనిరీతిగ నుపమానవస్తురూపమును సంక్రమింపఁజేయుట. తాద్రూప్యరూపకమున నుపమేయవస్తువునకు నుపమానవస్తువుతో భేదము భాసింపఁజేయుచు నుపమానవస్తురూపమును సంక్రమింపఁ జేయుట.

అట్టి రూపకము న్యూనతను, అధికతను, అనుభయత్వముచేతను మూఁడు తెఱంగులగుచున్నది. మూఁడువిధములును సభేదతాద్రూప్యములచే నాఱువిధములగుచున్నవి. వాని నామధేయము లెట్లన ?

1 అనుభయాభేదరూపకము.
2 న్యూనాభేదరూపకము.
3 అధికాభేదరూపకము.
4 న్యూనతాద్రూప్యము.
5 అనుభయతాద్రూప్యము.
6 అధికతాద్రూప్యము,

ఈవరుసనే పై సీసపద్యమున నుదాహరణము లీయఁబడినవి. ఈ ఱేఁడు ధూర్జటియను మొదటిపాదమున వర్ణనీయుఁడగు రాజును నుపమానభూతుఁడగు శంకరునిగా నిరూపించినాఁడు. మఱియు రాజ శంకరులకు నభేదము గాని నెచ్చుతగ్గులు లేకుంటను దెల్పుటచే నిది యనుభయాభేదరూపకము.

ఈస్వామిపగవారినను ద్వితీయపాదమునఁ బ్రభువునకును శంకరునకును నభేదమును దెల్పుచుఁ బ్రభువు చిచ్చుకన్నులేనివాఁడనుటచే రాజభావమున (శంకరునకు) న్యూనత చూపఁబడినదికాన నిచ్చట న్యూనాభేదరూపకము.

మూఁడవపాదమున నుపమానమగు శంకరరూపమున విషమదృష్టి కలదుకాని రాజరూపమున సమదృష్టి యధికముగా వర్ణింపఁబడుటచే నధికాభేదరూపకము.

నాల్గవపాదమున వర్ణనీయంబగు సాధ్వికిని నుపమానమగు లక్ష్మికిని భేదము చూపఁబడినది. అట్లు భేదముచూపుచు లక్ష్మీదేవిగా సాధ్విని నిరూపించుటచే నిది తాద్రూప్యరూపకము. సాధ్వి సముద్రమం దుఁబుట్టని మఱియొక లక్ష్మియనుటచే న్యూనతాద్రూప్యరూపకము.

గీతమున నగభాగములో ముఖచంద్రునకుఁ బ్రసిద్ధ చంద్రుని కన్న నెచ్చుతగ్గులు చూపక తాద్రూప్యమును మాత్రమే చూపుటచే నిది యనుభయతాద్రూప్యరూపకము.

గీతముయొక్క ద్వితీయార్థమున ముఖచంద్రునకుఁ బ్రసిద్ధ చంద్రునికన్న నాధిక్యము చెప్పఁబడినది. కాన నధికతాద్రూప్యరూపకము. ఇట వంకలనఁగా లోపములనియు వంకరలనియు నర్థద్వయము గ్రహించునది. ముఖచంద్రుఁడు సర్వకాలంబుల నేపుకల్గియుండుటయును బ్రసిద్ధ చంద్రుఁడు పున్నమినాఁడుదక్క తక్కిన తిథుల వంకరగ నుండుటయుఁ బ్రత్యక్షము. పై రూపకభేదములకు నుదాహరణాంతరముల నిచ్చుచున్నాఁడు.

శా. శారదచంద్రికా విశద - సారవసైకతపాళి వాద దు
ర్వారత, సిద్ధయోధులు వి - వాదమునొందిరి. తొల్లి కైటభుం
డోరియఁ జచ్చెఁగాదు దురి - తాంకుఁడు కంసుఁడటంచు నెంచ నీ
వారణకర్త వేర్చి చెపు - మా! తొలిఁ జంపితి వెవ్వనిన్ బ్రభూ! ౧౦

శారదచంద్రికవలె స్వచ్ఛమగు సరయూనది పులినమున నిద్దఱు సిద్ధయోధులు కంసకైటభ సంహారముల ముందువెన్కలను వివాదము నొందిరనియు రాజును సంబోధించి నీ వారణకర్తవుకాన నెవ్వని ముందు చంపితివో తెల్పుమని కవి ప్రశ్నించెను. నీ వారణకర్తవనుటచే రాజునకుఁ గంసకైటభుల సంహరించిన మహావిష్ణువుతో నభేదము చెప్పఁబడెను. ఎచ్చుతగ్గులు చెప్పఁబడకుండుటచే నిది యనుభయాభేద రూపకము. ఈభేదము ధూర్జటియను నుదాహరణమునఁ బురములఁ

బూని చేయుటయను సమానధర్మము చెప్పఁబడినది. ఇచ్చట జగత్పాలనము మున్నగు సమానధర్మము చెప్పఁబడలేదు. గమ్యమానమగుచున్నది. ఇదియే భేదము.

ఆ. వె. కాంతలందుఁ గనక - కాంతుల శతధృతి
చొక్కుఁగూర్చు సొగసు - సుడులనుంచె ।
భళిర ! వాని రెంటఁ - బడక నిల్చినవాఁడు
నరుని రూపుఁగొన్న - పరమశివుఁడు ॥

స్త్రీలయందును గనకకాంతులయందును బ్రహ్మ మోహజనకములగు సొగసు సుడులనుంచినాఁడు. ఆ సుడులలోఁ బడనివాఁడు మానవరూపధారియగు శంకరుఁడు. ఇట ధీరునకు శివాభేదము చెప్పఁబడినది. నరుని రూపుఁగొనుట న్యూనము. కాననిది న్యూనాభేదరూపకము.

శా. ఏలా నీపొడగాంచి యీజలధి తా - నీలీలనూఁగాడుఁ గాఁ
బోలుం జా భీతిలి సేతుమంథన విధా - స్ఫూర్జత్ప్రభావుండ వం ।
చే లంకన్ బరికింప నీక-వశుఁడెం - దీనాఁడు లేఁడయ్యె శ్రీ
లీలాసుందరియుం భజించుఁదమిక - ల్మిం జా నిన్నునింటన్ నృపా ! ॥

సముద్రతీరమున విహారార్థమునకై చనిన నరపతినిగూర్చి యొక కవి యిట్లు చమత్కారముగఁ బల్కెను. ఓ ప్రభూ ! నీవు సేతువును గట్టుటను సముద్రమును మథించుటను జేసినాఁడవు. అందుచేఁ బోలు నిన్ను జూచి జలధి యీరీతిగ భీతిగ వడకుచున్నదని. సేతుమథనములను జేయవచ్చినావని భయము. ఆనాడువలెనే లంకను నీకు శత్రువీనాడు లేకుంటను, లక్ష్మి ప్రేమతో నీయింటనే నిలిచి నిన్ను గొల్చుటచేతను సేతుమథనములకు నిప్పుడు శ్రమింప నవసరములేదు. ఇట సేతుమథన విధాస్ఫూర్జత్ప్రభావుఁడనెడు రాజవిశేషణముచే రాజునకు రామాద్య భేదము చెప్పఁబడినది. కాని రాజరూపమున శత్రువులు లేకుంట మున్నగువానిచే రామాద్యవతారములకన్న రాజభావమున నాధిక్యము చెప్పఁబడినది. కాన నిది యధికాభేదరూపకము.

తాద్రూప్యరూపకములకుదాహరణము లెట్లన ?

సీ॥ నాల్గుమోములు పూనని - నలినభవుఁడు
ద్విభుజుఁడైనట్టి యిమ్మడి - వెన్నుఁడరయ।
ఫాలనేత్రముకొఱవడ్డ - నీలగళుఁడు
రమ్య విజ్ఞాననిధి బాద - రాయణుండు ॥

రెండవ పాదమందలి యిమ్మడి పదమును దక్కిన రెండింట నన్వయించుకొననగు. వ్యాసుఁడు మఱియొక బ్రహ్మయనియు, మఱియొక విష్ణువనియు, శంకరుఁడనియు నన్వయము. వ్యాసునికి బ్రహ్మాదులకన్న భేదము స్పష్టముగాఁ జెప్పఁబడినను నతనికి బ్రహ్మాదుల రూపము సంభవింపఁజేయఁబడెను. మఱియు నాల్గుమోములు నాల్గు భుజములును ధరింపకుండుట ఫాలనేత్రము కొఱవడుటచే నిది న్యూనతాద్రూప్యరూపకము.

శా॥ ఘూర్ణించున్ గదె! తమ్మినిగ్గుఁదనుపుల్ - గన్దోయిమన్దేతర
ద్యోతిస్ఫూర్తుల మీనకేతనుని దాఁ - దాగించుఁజూపట్టు చో।
నో తన్వీ! యిటు నీముఖేన్దుఁడలరన్ - యుక్తంబె? మిన్నెక్కుటీ
శీతాంశుండమృతంబటన్న నదియుల్ - సిద్ధంబు నీవాతెఱన్ ॥

పద్మకాంతులను గొట్టుటలోను, గండ్లకుఁ జల్లతనము నిచ్చుటలోను గన్పట్టినంతనే మీనకేతనుని వృద్ధిపఱచుటలోను జంద్రపక్షమున మీనాది జలజంతువులకు స్థానమగు సముద్రమును నుప్పొంగించుటలోను నీముఖమనెడు చంద్రుఁడు విరాజిల్లుచుండ నీచంద్రుఁడేల యిట్లు గర్వించుచున్నాఁడు. అమృతముకలదన్నచో నదియు నీవాతెఱను గలదుకదా! ఇట ముఖచంద్రునకుఁ బ్రసిద్ధచంద్రునికన్న భేదమును జూపి చంద్రధర్మములుగూడఁ జూపఁబడినవి. ఎచ్చుతగ్గులు చూపఁబడకుంటచే నిది యనుభయతాద్రూప్యరూపకము.

మ॥ మడియల్ భీమసుతామనంబురతి సం - భావ్యంబు నీసొత్తుగా
జడచంద్రా! తలపోయుదేమొ యడియా - సల్ మాను మింకేల నా

రొయొడఁ యుండానలుఁడయ్యె మన్మథ బుధుం-డ్రొక్కి-ంతశ్రుత్యర్థమున్
దడవక సుందరనైషధాస్యవిధు తా-త్పర్యంబునన్ దెల్పఁగా ॥

దమయంతీకృతచంద్రోపాలంభనము. ఓ చంద్రుఁడా! నన్నిట్లు పీడించి చంపినచోఁ శ్రేమపూజ్యంబగు నామనము నిన్ను బొందునని తలఁచుచున్నావు కాఁబోలును. అట్టియాశలు పొందవలదు. నా భర్త నలుఁడని నిశ్చయించితిని. నీబాధవలన నేను మరణించినను నామనస్సు నీలోఁ జేరక సుందరమగు నలముఖచంద్రునిలోఁ గలయునుగాని నిన్ను జేరదుసుమీ! మృతుని మనస్సు చంద్రుని బ్రవేశించునని శ్రుతి చెప్పుచున్నది. కాని యాశ్రుతికి నిజమగు నర్థము నీవుకాదనియు రమ్యమగు నలముఖచంద్రుఁడనియు బుధుఁడగు మన్మథుఁడు నాకుఁ దెల్పినాఁడు. 'మృతస్యమనః చంద్రమసంప్రవిశతి' యని శ్రుతి. ఇట ప్రసిద్ధచంద్రునికన్న నలముఖచంద్రునకు భేదమును జెప్పుచు సౌందర్యములో నాధిక్యమును బ్రతిపాదించుటచే నిది యధికతాద్రూప్యరూపకము.

## ప రి ణా మా లం కా ర ము. 6.

కం. పరిణామము ప్రకృతక్రియ
నెరపన్ విషయాత్మ, విషయి - నిండుగఁగొనినన్ ।
చిరము ప్రసన్నంబగు దృ
క్సరసిజమునఁగాంచెఁ బ్రియుని - జవరాలెలమిన్ ॥

ప్రకృతమగు నిరీక్షణాదిక్రియను నెరపుటకై విషయిపదార్థము విషయపదార్థమగు ముఖనయనాదికముయొక్క రూపమును స్వీకరించు నటులు దెల్పినచో నది పరిణామాలంకారము. ప్రసన్నమగు నయనారవిందముచే యువతి తన ప్రియునిఁజూచెను. ఇట దృక్సరసిజమనుచోట దృక్కు సరసిజమువంటిదని విగ్రహవాక్యమును జెప్పిన నుపమిత సమాసమగును. లేక దృక్కే సరసిజమనినచో రూపకసమాసమగును. ఉపమిత సమాసమునఁ బూర్వ పదార్థముగు నుపమానమునకుఁ బ్రాధాన్య

ముండును. రూపకసమాసమున నుత్తరపదార్థమగు పద్మమునకుఁ బ్రాధాన్యముండును. పై పద్యమున జవరాలు ప్రియుని జూచుటకు నయనముపకరించునుగాని పద్మముపకరింపదు. కానఁ బూర్వపదార్థ ప్రధానమగు నుపమిత సమాసము చెప్పవలసియున్నది. కాని యుపమిత సమాసమును విధించు "ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే" అను పాణినీయసూత్రమున సమానధర్మమును గ్రహింపకూడద నెడు నియమముండుటచేఁ బై పద్యమునఁ బ్రసన్నంబగున నెడు విశేషణముచే దృక్సరసిజములనున్న నైర్మల్యరూపమగు సమానధర్మము గ్రహింపఁ బడుటచేత దృక్సరసిజమనుచోట నుపమితసమాసము సంభవింపదు. మఱి యుత్తరపదార్థ ప్రధానమగు రూపకసమాసమే శరణ్యము. అట్లైన సరసిజ ప్రాధాన్యముచే జవరాలు గాంచెనని దర్శనక్రియ సంభవింపదు. కాన పంకజమునకుఁ బూర్వపదార్థమగు నయనము యొక్క రూపమాపాదింపవలెను. ఇట్లారోపింప దీనిని బరిణామాలంకారమందురు. దీనిచే నుపమానవస్తువునకుఁ బ్రకృతకార్యసిద్ధికై యుపమేయవస్తురూప మాపాదించుట పరిణామమని తేలినది. మఱియు.

మ. తనతో మువ్వురుగాఁగ శంకర శిరో - దామంబు మందాకినిన్
దనరన్ దాటి సుమిత్రిపుత్రు చెలిమిన్ - నౌపణ్యముంగాఁగ ని ।
చ్చి నెఱిన్ నావికుఁ బ్రోచి బాహువలయా - సేవ్య స్తనుల్ బోయెతల్
కనుతృష్ణన్ వెత వెంటఁబోరా నతఁడు వీ - క్షన్ బోయెఁ జిత్రాద్రికిన్ ॥

అనర్ఘరాఘవములోనిది. శ్రీరామచంద్రుఁడు శంకర శిరమునఁ బూలదండవోలెనున్న గంగనుదాటి గుహునకు సౌమిత్రి మైత్రిని నావకూలిగానిచ్చి గురుతర కుచములుగల బోయెతలు తన దివ్యసౌందర్యమునుజూచి మురిసి వెంటఁబడినను గలఁతఁజెందక, వారు వెతఁజెందుచుండ సీతాలక్ష్మణులతో వేగముగఁ జిత్రకూటమునకుఁ బోయెను. ఇట సౌమిత్రి మైత్రియందు నావకూలియొక్క రూపమారోపించినాఁడు. గుహునకు శ్రీరామచంద్ర కరుణయే యపేక్షితముకాని నావకూలి

గాదు.. ఇట నారోప్యమానమగు నావకూలి సుమిత్రపుత్రు చెలిమి యొక్క రూపమును స్వీకరించి ప్రకృతమగు గుహుని బ్రోచుటయనెడు కార్యసిద్ధికిఁ దోడ్పడుచున్నది. కానఁ బరిణామాలంకారము.

### ఉల్లేఖాలంకారము. 7.

కం. అరయఁగఁ బలువురు పలువిధి
నొరపడఁగా నొక్క వస్తు - వుల్లేఖమగున్ ।
మరుఁడని చెలులర్థులు స్వ
స్తరువని యముఁడంచు నతనిఁదలఁతురు వైరుల్ ॥

పలువురు పలువిధముగ నొక్కవస్తువును గ్రహించినచో నుల్లేఖమగును. నృపతి నొక్కనినే చెలులు సౌందర్యములో మన్మథుఁడనియు యాచకులు దానగుణముచేఁ గల్పతరువనియు శత్రువులు పరాక్రమముచే యముఁడనియుఁ దలంతురు.

ఆ. వె. వృద్ధవనితలందు - ద్విపరక్షకుండని
ప్రమదలెంత్రు లక్ష్మి - భాగ్యమంచు ।
బాలికాగణంబు - భావించు గోపాలుఁ
డంచు శౌరిఁగాంచి - యాదరమున ॥

శ్రీకృష్ణుఁడు మధురాపురిని బ్రవేశింప వృద్ధవనితలు సంసారభీతిని బాపుకొనఁదలఁచినవారై యతనిని గజరక్షకుఁడగు నాది పురుషుఁడనియు యువతులు కామతత్పరలగుటచే చపలయగు లక్ష్మినిగూడఁ దన కామోపచార వైదగ్ధ్యముచే వశపరచుకొనిన దివ్య యువకుఁడనియు బాలికాగణమును నాటపాటల నాసక్తికలదగుటచేఁ గొంటెకాఁడగు గోపాలుఁడనియును దలంచిరి. మొదటి యుదాహరణమున స్మరాది రూపములను రాజున కారోపించుటచే రూపకసంకీర్ణము. ఇది శుద్ధము.

### ఉల్లేఖాలంకారము. II

కం. వెలయున్ గృహీతయొక్కఁడె
పలు తెఱఁగుల వస్తువొకటి - భావింపనటుల్ ।

పలుకుల గురుఁడితఁ డర్జునుఁ
డలరఁగఁ గిరితుల భీష్ముఁ - డగుఁ జాపమునన్ ॥

ఒక్కఁడే యొకవస్తువునటు భావించినను నుల్లేఖమగును. ఒక వ్యక్తి యొక ప్రభువునే పలుకుల గురుఁడనియు ననఁగా సమర్థుఁడనియు బృహస్పతియనియును, కీర్తుల నర్జునుఁడనఁగా ధవళ్యుఁడనియుఁ గిరీటి యనియును, ధనుస్సున భీష్ముఁడనఁగా భయంకరుఁడనియు గాంగేయుఁ డనియును దలంచెను. ఇది శ్లేషసంకీర్ణము. శ్లేషసంకీర్ణముకాని యుదాహారణ మెట్లన ?

చం. స్తనయుగపాళియందున కృ - శంబవలగ్నమునన్ గృశంబు లో
చనములనాయతంబరయఁ - జందము విస్తృతమున్ నితంబసీ ॥
మను నధరంబునందరుణ - మాన్యముఁగారుణికత్వశాలి భా
వనమున భక్తిఁ గొల్చెదఁ గ - పాలిముదంచిత భాగధేయమున్ ॥

శంకరాచార్యుల పార్వతీస్తవము. స్తనపాళి గురుతరమును నడుమున సన్ననయును గన్నుల విశాలమును నితంబమున వెడఁదయును నధరోష్ఠమున నెఱ్ఱనయును నగు శంకర భాగ్యమగు పార్వతిని గొల్చెదను. ఒక గృహీతయగు శంకరాచార్యులే పార్వతిని వివిధరీతులుగ భావించుటచే నిది యుల్లేఖము. ఇది శ్లేషములేకుంటచే శుద్ధము.

భ్రాన్తి - స్మృతి - సన్దేహాలంకారములు. 8-9-10.

కం. భ్రాంతిస్మృతి సందేహా
క్రాంతి నలంకృతులుగల్గుఁ - గద పైపేర్లన్ ।
కాంతాలలామ ! మధుపము
భ్రాంతింగొను నీదుముఖము - పంకజమంచున్.

కం. వింతగఁదలఁపును జేరును
గాంతామణి ముఖము సఖుఁడ ! - కంజముఁజూడన్ ।

సంతతముఁగన్న నిశ్చయ
మింతయు లేదంబుజంబొ! – హిమకిరణుండో! ॥

భ్రాన్తిస్మరణ సందేహములు చిత్తమునావరించినఁ గ్రమముగ భ్రాన్తిమదలంకారమును స్మృతిమదలంకారమును సందేహాలంకారమును నగును. పై పద్యములఁ గ్రమముగా నుదాహరణములీయఁబడినవి.

ఆ. వె. మోదమలరఁ దేఁటి – మోదుగపూవంచు
బ్రిమసి చిల్కతోఁటి – పైనవ్రాలె।
నౌర! చిల్కగూడ – నేరేడు పండను
భ్రాంతిఁజెంది దానిఁ – బట్టనెంచె ॥

ఇది పరస్పర భ్రాంతి.

ఆ. వె. అచ్చరలకుఁగూడ – నచ్చెరువొసఁగుచు
శ్రీనిబోలి తమ్మిఁ – జేతఁబట్టి।
నీటనుండివచ్చు – బోటినిగని శౌరి
స్మరణమొందె జలధి – మంథనమును ॥

మాఘకృత శిశుపాలవధ కావ్యమున జలక్రీడా వర్ణనము. వెనుకటి స్మృతిమదుదాహరణమునఁ బద్మమునుజూడ సదృశవస్తువగు కాంతా ముఖముయొక్క స్మృతి వర్ణింపఁబడెను. ఈపద్యమునఁ దమ్మిఁ జేతఁబట్టి నీటనుండివచ్చు బోటిని జూచిన శ్రీకృష్ణునకుఁ దొలుత లక్ష్మీస్మృతియును బిదప సముద్రమథన స్మృతియును గల్గినది. ఇదియే భేదము.

ఆ. వె. జీవనంబునొందఁ – జెందు నమ్రత్వంబు
మెల్ల మెల్లఁబట్టి – మీఁది కెగయుఁ।
దలఁప నలవియగునె – తమ్ములొ! యన్నలొ!
తంత్రిదుష్టులు ఘట – యంత్రమునకు ॥

తంత్రిదుష్టులనఁగా నుపాయమును బన్నుటలో చెడ్డవారు. జీవనమనఁగా నీరును జీవనాధారమగు ధనాదికమును, ఘటయంత్రి మనఁగా ఘటములనొక దండఁగఁగట్టి నూతిలో వ్రేలాడదీసి నీటిని దోఁడు యంత్రవిశేషము. ఆయంత్రము నీటిని గ్రహించుటకు నూతిలోఁ బ్రవేశించునపుడు క్రిందకు వంగిదిగును. పిదప తలలనెత్తి పైకివచ్చును. దుండగులుగూడ ధనమును వేడుకొనునపుడు వినయముచేఁ దలను వంచి పిదప గర్వముచే మీఁదికెగయుదురు. ఇట్టి దుండగులు ఘట యంత్రమునకు నన్నలగుదురా! తమ్ములగుదురా! యని సందేహిం చుచుఁ జమత్కరించినాఁడు. మొదటి యుదాహరణమున సందేహ విషయములగు నంబుజ హిమకరులు లోకప్రసిద్ధులు. ఇట ఘటయంత్ర మునకు నన్నలా! తమ్ములా! యను సందేహ విషయములు కవి కల్పితములు. ఇదియే భేదము.

అ ప హ్ను త్య లం కా ర ము. 11.

కం. శుద్ధాపహ్నుతియొండు ని
బద్ధముగా ధర్మ మొకఁడ - పహ్నుతినొందన్ ।
శుద్ధాంశుఁడితఁడు కాఁడిఁక
సిద్ధాంబుజమగును వేల్పు - లేటిని దెలియన్ ॥

స్వతఃసిద్ధమైనట్టిది లేక కవికల్పితమైనట్టిదియగు నొక ధర్మమును నొకవస్తువునఁ గప్పిపుచ్చి వేఱొకధర్మమును సంబంధింపఁజేసినచో నది యపహ్నుతియగును. చంద్రునియందలి స్వతఃసిద్ధమగు చంద్రుఁడగుట యనెడు ధర్మమును గప్పిపుచ్చి యనఁగాఁ దొలంగించి యాకాశగంగ యందలి పద్మమని వర్ణించుటచేఁ బద్మత్వరూపధర్మ మారోపింపఁ బడినది.

మానిని. కాంతురు కొందఱు - కాలకలంకము
గా నొరులంబుధి - కర్దమమం

చెంతురు వేఱొక - రిత్రియటంచు మ
　　హీస్థలి ఛాయగ - నెందఱో మ
న్నింతురు నీలమ - ణీ సమచంద్రి వి
　　నీలిమఁగన్గొన - నిక్కముగా
సంతతపీత ని - శాసమయోత్థిత
　　సాంద్రతమంబని - చాటగనా ॥

చంద్రునిలోనినల్లఁదనము నొక్క కవి యిట్లు వర్ణించెను. దీనిని గొందఱు కళంకముగాను మఱికొందఱు సముద్రములోని బురదను గాను. ఇతరులు దుప్పినిగాను, వేఱొకరు భూఛాయనుగాను వర్ణించిరి. నిజమూరయ నీలమణి సమమగు నీనైల్యమును చంద్రునిచే మ్రింగఁ బడిన రాత్రి చీకటియని నేను చాటి చెప్పెదనని. చంద్రుని నైల్యమున నితరులచే నూహింపఁబడిన కళంకమగుట మున్నగు ధర్మములను గప్పి యతనిచే మ్రింగఁబడి గడ్డకట్టిన రాత్రి చీకటియొక్క ధర్మ మారో పింపఁబడినది. ఇది కవికల్పిత ధర్మము నపహ్నుతిచేయుట కుదా హరణము.

## హే త్వ ప హ్ను తి. II

కం. తగనదియు హేతువును జె
　　ప్పఁగ నొప్పును గృతుల హేత్వ - పహ్నుతియనఁగన్ ।
　　సెగ రేచుట నెలగాదినుఁ
　　డగు నేనిశ నబ్ధిగ్రుక్క - నొర్వంబితఁడో ॥

శుద్ధాపహ్నుతియే హేతువుగూడ వచింపఁబడినచో హేత్వ పహ్నుతియగును. ఇట చంద్రునియందుఁ జంద్రధర్మమును గప్పుటలో వేడిమిని పెడలుటను హేతువునుగాఁజెప్పి యట్లే సూర్యుఁడు కాదను టలో రాత్రియగుటను గారణముగాఁజెప్పి బడబానల ధర్మము నారో పించినాడు. విరహిణీవాక్యమిది.

ఉ. కవ్వపుఁగొండఁజిల్కు-తఱి - గ్రావసహస్ర విఘట్టనంబునన్
దవ్వఁగ వ్యాప్తమౌ వ్రణకి - ణాంబమునన్ హిమరశ్మినుండఁగన్ ।
చవ్వఁగ జింకచాయయుశ - శంబను టెంతయు వెఱ్ఱిసుద్ది కా
కెవ్విధిఁ జంద్రునందు నుద - యించుఁదథావిధ వస్తుజాతముల్ ॥

ఇట చంద్రునందుఁ గన్పడు నైల్యము మంథన సమయంబున మంథాద్రియొక్క రాళ్లదెబ్బచేఁ గల్గిన నల్లని కాయగాని పరులు వెఱ్ఱిగాఁదలఁచినట్లు జింక మున్నగునవి కావని నిషేధింపఁబడెను. అట్టి వస్తువులు చంద్రునందు పుట్ట వీలుకాదని హేతువుగూడఁ జూపఁ బడినది.

## పర్యస్తాపహ్నుతి. III

కం. అగుఁ బర్యస్తాపహ్నుతి
తగనొండున మోపఁదలఁచి - ధర్మముగప్పన్ ।
తగునే యితఁడు సుధాకరుఁ
డగుననుటట్లనుట సెల్లు - నంగన ముఖమున్ ॥

ఒక ధర్మమును వేఱొకచో నారోపింపఁదలఁచి యొకటిఁ గప్పి పుచ్చిన నది పర్యస్తాపహ్నుతియగును. చంద్రునియందుఁ జంద్రత్వ ధర్మము నిషేధింపఁబడి యంగనాముఖమున నారోపింపఁబడినది.

ఆ. వె. హాలహాలము విషమ - దేల ? లక్ష్మి విషంబు
పలుక నెంతురు తడ - బొట్టు మెయిని ।
దానిఁద్రావి శివుఁడు - తద్దయు సుఖముండె
దీనిఁదాకి హరియుఁ దెలివిఁదప్పె ॥

పూర్వోదాహరణములో నపహ్నవమునకు హేతువు దెల్పఁబడలేదు. ఇట హాలహాలము విషముకాదనుటలోను లక్ష్మి విషమనుటలో నుత్తరార్థమున హేతువులు చూపఁబడినవి. హేతువును దెల్పుట తెల్పకుండుటచే నిదియు రెండువిధములు.

## భ్రాంతాపహ్నుతి. IV

కం. చేపను భ్రాంతాపహ్నుతి
వాపంగను భ్రాన్తినొరుఁడు – వడి శంకింపన్ ॥
వేపథుసంతాపములన్
దాపిను, జ్వరమా నె ? కాదు – రతిజాని సఖీ ! ॥

పరుఁడు శంకింప నాతని భ్రాన్తిని బాపినచో భ్రాన్త్యాపహ్నుతి యగు. ఏణాక్షు, వేఁడిమి యీ రెంటిచే బాధించుచుండెనని యొక కాంత పలుక నామెచెలికత్తె వానిని జ్వరకార్యములనుగాఁ దలఁచి జ్వరమా ? యని శంకింప నామె మన్మథుఁడని నిజముపలికి యామె భ్రాన్తిని బోఁగొట్టినది. మఱియు,

ఉత్సాహ ॥ అన్నిపసులకన్న నెత్తు – సందుమిన్న వెన్క ము
న్నెన్నడాఁటెగాఁడ ! తోక – లెట్టిజాతి దున్నయో ? ।
దున్న కాదుగున్న గాదు – తోక కాదదెంతయున్
గన్నువిప్పి చూడుమబ్బ – గారుతొండమానురా ! ॥

ఏనుఁగుగున్నను జూచి దున్నయని భ్రమించిన పల్లెవాఁడు నాగరికుని బ్రశ్నింప నతఁడు దున్న కాదనియు నేనుఁగుగున్నయనియును నొకటి తొండముకాని తోక కాదనియును నతని సంశయమును వారించెను. నాటెగాఁడన నాగరికుఁడనియును బసుల నాటెముచేయువాఁడనియును గూడ నర్థము. పై యుదాహరణముల భ్రాంతిసంభవము. కవి కల్పిత భ్రాంతిలోఁగూడ నపహ్నవము సంభవించును. ఎట్లన ?

ఉ. కాదు జటాభరంబు జడ – గట్టిన కుంతలముల్ గళంబునన్
గాదు విసంబు కస్తురి సి – గన్నెలవంకయుఁగాదు పూవురే ।
కాదిన బూది కాదు విర – హోదిత పాండిమయంగకంబులన్
మోదగనౌ నె నన్నుదల – పోసి హరుండని పుష్పసాయకా ! ॥

ఒక విరహిణి మన్మథుఁడు తనను శంకరుఁడని భ్రమించి శరములచేఁ గొట్టుచున్నట్లు తలంచి యతని భ్రాంతిని బోఁగొట్టుటకై

పై విధముగఁ బల్కినది.' ఇది జటాభరంబు కాదనుటచే మన్మథునికిట్టి భ్రాంతి కలిగినట్లుహింపుకొనవచ్చును. ఈ భ్రాంతి కవికల్పితము. ఆచార్యదండి యిట్టివానిని దత్త్వాఖ్యానోపమగాఁ దలంచెను. ఎట్లన ?

కం. సరసిజముగాదు ముఖమిది
యిరుగడఁ దుమ్మెదలుగా వి - వెంచఁగఁ గన్నుల్ ।
ధరఁ దత్త్వాఖ్యానోపమ
పరఁగును సాదృశ్య మిట్లు - స్పష్టముగాఁగన్ ॥

దండి తలంచినట్లు దీని నుపమయనరాదు. వలె మున్నగు వాచక పదము లేకుంటచే. అట్లుకానిచో రూపకముగూడ నుపమ కావలసి వచ్చును.

ఛే కా ప హ్ను తి. V

కం. ఛేకాపహ్నుతి పరశం
కాకృతిఁగని నేర్పిఁదథ్య - మర్థముగప్పన్ ।
వాకొంచుఁ గాళ్ళఁదగిలెను
మా! కాంతుఁడె ? కాదు చెలియ ! - మణినూపురమే ! ॥

వాకొంచున్ :- ధ్వనిచేయుచు, వదరుచుననియు నర్థము. పరులు సత్యార్థమును శంకింప దానిని నేర్పుతోఁ గప్పిపుచ్చిన ఛేకాపహ్నుతియగును. కాంతుఁడె ? యను ప్రశ్నము సత్యమయ్యు దానిని మణినూపురమని నైపుణ్యముచేఁ గప్పెను.

తే. గీ. నేర్పుసీత్కార శబ్దంబు - నెఱియలుంచుఁ
బెదవియందునఁ దనువునఁ - బేర్చుగగురు ।
ముదిత ! నాగరికుఁడుదమిఁ - గదిసెనేమొ ?
కాదుకాదమ్మ చెలి ! చలి - గాలిసుమ్మ ! ॥

నాగరిక రతికార్యములను శీతవాతకార్యములనుగాఁ దెలిపి తథ్యనిహ్నవము చేయఁబడెను. ఇవి యర్థసామ్యమునఁ దథ్యనిహ్నవమున కుదాహరణములు. శబ్దసామ్యముచేఁ దథ్యనిహ్నవమెట్లన

చ. కొలిచెదఁ బద్మనేత్రములఁ – గూర్కొను భావము నీలకుంతల
మ్ముల వెలఁగొంటి నాదుమన – మున్ మహినీదు విలాససంపదన్ ।
పలవరమొందనిట్లు విని – పైకొని రాధయదల్పఁ దత్కథా
కలితముగాఁగఁ దెల్పె నన – కైతవజారుఁడు కృష్ణుఁడేలుతన్ ॥

శ్రీకృష్ణుఁడు మఱియొక కాంతలను నిద్రలోఁ బలవరింప రాధవిని కినిసి యదల్పఁగా నది సత్యమయ్యు నతఁడు యుక్తిచే నామెకు సంబంధింపఁజేసినాఁడు. నిజముగా నతఁడు పద్మయనగా నోలక్ష్మీ! యని లక్ష్మీదేవిని సంబోధించి పలవరించెను. అట్లే నీల! యని నీలాదేవిని, మహి! యని భూదేవిని దాను విష్ణ్వవతారమగుటచే నట్లు పలవరించెను. కాని రాధ కోపము తీర్చుటకై పైపదముల కర్థాంతరములను జెప్పి యతఁడు సత్యమును గప్పిపుచ్చెను. ఎట్లన? పద్మనేత్రములు నీలకుంతలములనియు సమాసములనుగాఁజేసి పద్మములవంటి నేత్రములనియు నల్లని శిరోజములనియు మహిన్ భూమియందు నామనస్సును వెల గొంటివనియు నర్థాంతరములను జెప్పి యామెకు సంబంధింపఁజేసినాఁడు. పై యుదాహరణముల విషయభేదముకలదు. విషయైక్యమున నుదాహరణ మెట్లన?

ఆ. వె. మాయలాడి యొకతె – మగనిని జెలియంచు
నెంచి విటునిచేత – లెంచఁదొడఁగె ।
నిజము తెలిసి యట్టె – "నెచ్చెలి! యంతలో
మేలుకొంటినంచు" – మేళవించె ॥

ఇట విటవృత్తాంత మొక్కటియే జాగ్రత్స్వప్నావస్థలనెడు భేదముచే గ్రహించి యపహ్నవము నిర్వహింపఁబడెను.

## కైతవాపహ్నుతి. VI

కం. వెలివడనిహ్నుతి వ్యాజా
ద్యలలిత పదములను గైత – వాపహ్నుతియగా ।

పొలఁతుకచూడ్కులను నెపమునఁ

దొలఁకుచునన వింటివాని - తూపులు చెదరెన్ ॥

వ్యాజకపటచ్ఛద్మాది పదములచేతను నెపమున్నగు పదముల చేతను నపహ్నవము వ్యక్తమైనచోఁ గైతవాపహ్నుతి యగును. పొలఁతుకచూడ్కు లనెడు నెపముచే మన్మథబాణములు చెదరుచున్నవి. ఇట నెపమనెడు పదముచే నివి పొలఁతుకచూడ్కులు కావనియు మారుని శరములనియు నపహ్నవము వ్యక్తమగుచున్నది.

తే. గీ. అవివితోదకవార్త వ - నాంతరమున

భీకరాతపతాపితా - నోకహములు।

స్కంధమధ్యాగ్నికీలా మి - షంబువలన

జిహ్వలనుజాచె నీటికై - విహ్వలతను ॥

నీటిసంపర్కమొకింతయును లేని వనమధ్యమున గ్రీష్మకాలమునఁ భయంకరాతపముచేఁ దపింపఁబడినట్టియు నొకటి నొకటి రాచుకొనుటచే నంటుకొనిన చెట్లమొదలులనుండి వెలువడుచున్న యగ్నిజ్వాలలను గవి యిట్లు వర్ణించియున్నాఁడు. ఇట మిషపదముచే నివి యగ్నిజ్వాలలు కావనియు నీటికై చాచఁబడిన చెట్ల నాలుకలవియు నపహ్నవము వ్యక్తముచేయఁబడెను.

ఉ త్ప్రే క్షా లం కా ర ము. 12.

కం. అలవస్తుహేతు ఫలముల

మున్ పొలఁదలఁపుత్ప్రేక్ష కావ్య - ములనిలఁజెలఁగున్ ।

లలినుక్తానుక్తంబు మొ

దలసిద్ధాసిద్ధ మాస్ప - దము తుదిరెంటన్ ॥

వస్తుహేతు ఫలరూపమున నొక విషయమును దలఁచుట యుత్ప్రేక్షయనఁబడును. ఆస్పదమననూహలో ధర్మిరూపమగు విషయము. హేతుఫలరూపముగా విశక్షింపఁబడినదానికన్న భిన్నమైనది

యుటవస్తువని తెలియఁదగు. మొదటి వస్తూత్ప్రేక్షలో నాస్పదము లక్ష్యములఁ జెప్పఁబడుటయుఁ జెప్పఁబడకుండుటయునను భేదములచే నుండును. తుది హేతుఫలోత్ప్రేక్షలు రెండిటను నాస్పదము సిద్ధమనఁగా స్వతస్సిద్ధమనియు నసిద్ధమనఁగా స్వతఃసిద్ధముగాక కవికల్పితమనియు భేదములచేనుండును. రెండింట నొక ధర్మము సంబంధించియున్నపుడు రెండింట నొకదానికి మఱియొకదాని తాదాత్మ్యమునన(ఁగా న భేదమును జమత్కారముగ సంభావన చేయుటయనఁగా నూహచేయుట యుత్ప్రేక్షయనఁబడును.

ఒక వస్తువునందు మఱియొక వస్తుతాదాత్మ్యమును నూహింపనది వస్తూత్ప్రేక్షయనఁబడును. వీనికే స్వరూపోత్ప్రేక్షయనియుమఱియొక నామముకలదు. హేతువుకాని దానిని హేతువుగాను ఫలముగానిదానిని ఫలముగాను నూహఁజేయఁ గ్రమముగ హేతూత్ప్రేక్షయనియును ఫలోత్ప్రేక్షయనియును వ్యవహారము. ఈరీతిగ నుత్ప్రేక్షాలంకార మాఱు తెఱంగులగుచున్నది. వానిపేర్లెవ్వియన ?

1. ఉక్తవిషయస్వరూపోత్ప్రేక్ష 2. అనుక్తవిషయస్వరూపోత్ప్రేక్ష. 3 సిద్ధవిషయహేతూత్ప్రేక్ష. 4 అసిద్ధవిషయహేతూత్ప్రేక్ష. 5. సిద్ధవిషయఫలోత్ప్రేక్ష. 6 అసిద్ధవిషయఫలోత్ప్రేక్ష.

సీ. కోకవియోగాన - లాకీర్ణధూమాఘ
మంచు శంకింతు వ్యా - పించు తమము
అలఁదుచున్నదివో తె - నంధమంగంబులఁ
జల్లుచున్నదివో లెఁ - జదలు మసిని
కాఁబోలు నెట్టన - కమనీయగాత్రి ! నీ
మృదులాంఘ్రియుగము భూ - మిని స్పృశింప
నెలఁత ! నీమోము వ - న్నెలకోర్కెఁ జేవ తె
జింకకందువు తమ్మిఁ - జేయుఁబగను

తే॥ గీ॥ పొలఁతి కుచముల యూతకుం - బోలెనలఁతి
గాను బంగరుతాళ్లను - గట్టఁబడియె ।
రమణి ! నీచరణైక్య సా - మ్రాజ్యమొందఁ
గావలెన్ నీటఁబద్మమ్ము - గాంచుఁదపము ॥

మొదటి పాదమున నుక్తవిషయయగు స్వరూపోత్ప్రేక్ష. సంధ్యా సమయమున దిక్కుల వ్యాపించుచున్న చీకటిని జగమున నెల్లెడ నెడబాటు నొందుచున్న యాడుచక్రవాక పక్షులయొక్క ప్రజ్వలింపఁ బోవు విరహానలధూమముగాఁ గవి యూహించినాఁడు. ఇట చీకటి, ధూమమున నెడు రెండు వస్తువులకు నల్లగనుండుట కండ్లనుగప్పుట యనెడు ధర్మములు సమానములగుటచేఁ జీకటిని ధూమమునుగానూహించినాఁడు. అనఁగా వర్ణ్యమానమగు తమమున నన్యపదార్థమగు నట్టియు నప్పుడే ప్రియులతో వియోగమునొందుచున్న యాడ చక్రవాక పక్షులయొక్క విరహానలధూమముయొక్క తాదాత్మ్యమూహింపఁబడినది. ఇట నల్లగనుండుట కండ్లను గప్పుట యను ధర్మములు పద్యమున వాచ్యముగఁ జెప్పఁబడకున్నను గమ్యమానములగుచున్నవి. పద్యమువ విషయ పదార్థమగు తమస్సు చెప్పఁబడుటచే నిది ఉక్త విషయయగు స్వరూపోత్ప్రేక్ష.

రెండవ పాదమున ననుక్తవిషయయగు వస్తూత్ప్రేక్ష చూపఁబడినది. ఎట్లన ? చీకటి వ్యాపించునవుడు ఆకసము మొదలు నేలవఱకు నన్నివస్తువులు మలినములగును. ఈ మలినములుగాఁ జేయుటయనెడు ధర్మమును నిమిత్తముగాఁ దీసికొని చీకటియొక్క వ్యాప్తిని చీకటిచేఁ జేయఁబడుచున్న పూతగను నభముచేఁ జేయఁబడుచున్న కాటుకయొక్క జల్లులుగను నుత్ప్రేక్షించినాఁడు. అనఁగా విషయమగు చీకటియొక్క వ్యాప్తికినలఁదుచున్నది మసినిజల్లుచున్నదియనెడు పదములచేఁ జెప్పఁబడిన పూయుట జల్లుట యనెడు విషయిపదార్థములయొక్క తాదాత్మ్యమనఁగా నభేదముత్ప్రేక్షింపఁబడినదని భావము. ఇచ్చటఁ

జీకటియొక్క వ్యాప్తియనెడు విషయము పద్యమునఁ జెప్పఁబడకుంటచే నిది యనుక్తవిషయయగు స్వరూపోత్ప్రేక్ష.

కొందఱు వీనినిగూడ ననుక్తవిషయలగు స్వరూపోత్ప్రేక్షలనుగాఁ జెప్పిరి. ఎట్లన ? లింపతి విక్షిపతి మున్నగు సంస్కృత క్రియాపదములందువలె నలఁదుచున్నది చల్లుచున్నది మున్నగు తెనుఁగు క్రియాపదములయందును ధాతుభాగమును ప్రత్యయభాగమును గలవు. వానిలోఁ ధాతుభాగమునకుఁ గ్రియ, యనఁగా వ్యాపారమర్థము. ప్రత్యయమునకుఁ గర్త యర్థము. అలఁదుచున్నది అను క్రియాపదమునకు దానిలో నున్న యలఁదు ధాతువునకుఁ బూయుట యనెడు వ్యాపారమును 'ది' అను ప్రత్యయమునకుఁ బూయుట యనెడు పనినిఁజేయు కర్తయును నర్థము. ఈరీతిగఁ జల్లుచున్నది అనెడు క్రియాపదములోఁగూడ నర్థవిభాగమును దెలియవలెను. ఇట్లుకాఁగాఁ బద్యములోఁ జెప్పఁబడిన తమమునకును, నభమునకును, అలఁదుచున్నది చల్లుచున్నది అనెడు క్రియాపదములలోని ప్రత్యయార్థమగు కర్తతో నభేదమును నూహింపనివి ఉక్తవిషయలగు వస్తూత్ప్రేక్షలే యగును. అనఁగాఁ బద్యములో నుక్తమగు తమమునకు వ్యాపించుటి యనెడు నిమిత్తముచే లేపనకర్తతో నభేదమును అట్లే పద్యములో నుక్తమగు నభమునకు నంజనవర్షణకర్తతో నభేదమును నుత్ప్రేక్షింప రెండవ పాదములోని యుత్ప్రేక్షలు రెండును ఉక్తవిషయలగు వస్తూత్ప్రేక్షలేయగునని వారి యభిప్రాయము.

కాని యిట్లనుటకు వీలుకాదు. ఏలయన ? 'భావప్రధానమ్ ఆఖ్యాతమ్' అను వైయాకరణుల నియమము ననుసరించి ఆఖ్యాతమనఁగాఁ బ్రత్యయార్థమగు కర్త, భావప్రధానమ్ అనగా ధాత్వర్థమగు క్రియయే ప్రధానముగాఁగలదియగుచున్నది. అనఁగాఁ గ్రియాపదములలోని ధాత్వర్థమగు క్రియయనఁగా వ్యాపారము విశేష్యముగను ప్రత్యయార్థమగు కర్తయూవ్యాపారమునకు విశేషణముగను బరిగణిం-

పఁబడును. విశేష్యము ప్రధానముగను విశేషణము అప్రధానముగను బరిగణింపఁబడును. ఇట్లు ధాత్వర్థమగు వ్యాపారములో నప్రధానముగా నన్వయించిన ప్రత్యయార్థమగు కర్త సంభావనా విషయముగా నుత్ప్రేక్షలో నన్వయింపదు.

ఇట్లు ధాత్వర్థవ్యాపారమునకు విశేషణమ్ముగా నన్వయించిన కర్తకు మఱియొకదానిలో నన్వయము సంభవింపదు కాననే దండియను నాలంకారికుఁడుకూడ నిట్టి కర్తకు నుపమలో నుపమానముగ నన్వయము కూడదని నిరాకరించినాఁడు. ఎట్లన ?

కం. అగునుగ్రియాపదమునఁ గ
ర్తృ గుణము తత్కార్యసిద్ధి - తత్పరమగుచున్ ।
తగనొండుదానిఁగోరమిఁ
దగదుపమానముగ నుపమఁ - దానుండంగన్ ॥

క్రియాపదమునఁ గర్తయప్రధానమగును అది ధాత్వర్థక్రియ యొక్క సిద్ధినిగూర్చి ప్రయత్నముకలదై యనఁగా నాపనిని సాధించుటలో నిమగ్నమైనదై మఱియొకదానితో నన్వయమును గోరకుండుటచే ననఁగా మఱియొకదానితో నన్వయింపవలెననెడు నపేక్ష లేకుంటచే నుపమలో నుపమానముగ నుండనేరదని తాత్పర్యము. ఇందుమూలమునఁదేలిన సారాంశమేమనినఁ బద్యమందలి రెండవపాదమున నుత్ప్రేక్షలు అనుక్తవిషయలేకాని ఉక్తవిషయలు కానేరవని.

కొందఱు పద్యములో నుక్తమగు తమమునభములనెడు విషయములఁ దమము కర్తగాఁగల లేపనమును అనఁగాఁ దానిచేఁ జేయఁబడిన పూయుటను, నభము కర్తగాఁగల వర్షణమును అనఁగా దానిచేఁ జేయఁబడిన జల్లుటను అనెడు ధర్మముల నుత్ప్రేక్షించుచున్నారు. వారి మతము ననుసరించి స్వరూపోత్ప్రేక్షలో ధర్మినుత్ప్రేక్షించుట ధర్మము నుత్ప్రేక్షించుటయను భేదద్వయము కలదని తెలియవలెను.

మూడవపాదము సిద్ధవిషయయగు హేతూత్ప్రేక్ష కుదాహరణము. సహజమగు చరణరక్తిమకు భూమిని స్పృశించుట కారణము గాకున్నను గారణముగా నూహింపఁబడినది. విషయమగు భూస్పర్శమునకు సంభవము కలదుకాన నిది సిద్ధవిషయ.

నాల్గవ పాదమునఁ బ్రకృతిచే వచ్చిన పద్మమందలి చంద్ర విరోధమునకుఁ దరుణీముఖకాంతి నొందఁగోరుటను హేతువునుగా నూహించినాఁడు. చంద్రునకట్టి యిచ్ఛస్వతఃసిద్ధముకాదు. కాన నిది యసిద్ధ విషయయగు హేతూత్ప్రేక్ష.

గీతములోఁ బూర్వార్థమున వళులు బంగరుతాళ్లుగా నధ్యవసింపఁబడెను. బంగరు తాళ్లుగట్టుటకుఁ గుచధారణమును ఫలముగా నుత్ప్రేక్షించినాఁడు. కుచభారధారణరూపఫలము సంభవింపఁదగిన విషయముగాన నిది సిద్ధవిషయయగు ఫలోత్ప్రేక్ష.

ఉత్తరార్థమునఁ బద్మమునకుఁ బ్రకృతిసిద్ధమగు జలవాసమును దపమునుగా నధ్యవసించి దానికిఁ దరుణీచరణముతో నైక్యమొందుటను ఫలముగా నుత్ప్రేక్షించినాఁడు. అట్టి ఫలము సంభవము కాదుకాన నిది యసిద్ధవిషయయగు ఫలోత్ప్రేక్ష.

ఈక్రమముననే యితరోదాహరణముల నిచ్చుచున్నాఁడు.

తే॥ గీ॥ కేరినెలవంకరూపును - గెంపువన్నె
నగ్గలించెడు మోదుగ - మొగ్గలమరు।
తటినిఁదోడ్తోన మధువుతోఁ - దమినిఁగూడు
కాన భూములకగునఖ - క్షతములువలె॥

కుమారసంభవమున వసంతావిర్భావవర్ణనము. వంకరగనుండుట యెఱ్ఱగనుండుటయును నఖక్షతములకును మోదుగ మొగ్గలకును సమానధర్మము. ఈధర్మమును నిమిత్తముగాఁ దీసికొని మోదుగ మొగ్గలను దత్కాలముననే వసంతునితోఁ గలిసిన వనభూములకగు

నఖక్షతములుగా నూహించినాఁడు. విషయమగు మోదుగ మొగ్గలు గ్రహింపఁబడుటచే నిది సిద్ధవిషయయగు వస్తూత్ప్రేక్ష. వెనుకటి వస్తూత్ప్రేక్ష యుదాహరణమున సమానధర్మము గమ్యము. ఇచ్చట వాచ్యము. వలెనను పదముపమాలంకారముననే ప్రసిద్ధమగుటచే నిటనుపమయే కాఁదగియున్నదని శంకపొడముచున్నది.

మఱియు వెనుకటి యుదాహరణమున నలఁదును జిమ్మునెడు క్రియాపదములలోని ప్రత్యయార్థమగు కర్త వ్యాపారములో నుపసర్జనమగుటచే దండిచేఁజెప్పఁబడినరీతిగ నుపమానముగ వేఱొకదానితో నన్వయించుటకు వీలులేనట్లిచ్చట వేఱొండు బాధకము లేకుంటచే నుపమాలంకారమునవచ్చును.

దీనికి సమాధానమెట్లన ? ఉపమానవస్తువు ప్రసిద్ధముగ నుండవలెను. ఇట వసంతునితోఁగూడిన వనభూములయొక్క నఖక్షతములప్రసిద్ధములు. కాన మోదుగ మొగ్గలకు లోకప్రసిద్ధములుకాని కానభూముల నఖక్షతములతోఁ బోలిక యెట్లు కుదురును ? కాన మోదుగ మొగ్గలకుఁ దత్కాలాగత వసంతునితోఁగూడిన కానభూముల నఖక్షములతో నభేదము నూహింపవలయు. మఱియు నుపమయందే కవికిఁ దాత్పర్యమున్నచో నెచ్చటనైన మఱియొకచో నున్న నఖములతోడనే సాదృశ్యము చెప్పియుండెడువాఁడు. అట్లు చెప్పక తత్కాలమున వసంతునితోఁగలిసిన వనభూముల సంబంధమును నఖక్షతములకుఁ జెప్పినాఁడు. నఖక్షతములకీ సంబంధకథన ముత్ప్రేక్షయందే కవి తాత్పర్యమును సూచించుటయేకాక చమత్కృతినిఁగూడఁ గలదియగును. కానఁగాన భూములకగు విశేషణము. 'వలె' అను పదమునకుఁ దాదాత్మ్యసంభావనయందే యభిప్రాయమును బోధించుచున్నది. అట్లు బోధించునపుడే యావిశేషణము సార్థకమగును. మఱియు 'వలె' శబ్దము దూరముననున్నవాఁడు గోవిందుఁడువలెనున్నాఁడు మున్నగు తావుల నూహావాచకముగాఁ గన్పట్టుచున్నది. కాన నీపద్యమున నుత్ప్రేక్షయేకాని యుపమ కాదని తేలినది.

అనుక్తవిషయయగు వస్తూత్ప్రేక్ష కుదాహరణము.

తే. గీ. కడలి తన తరంగాగ్రభా - గముల ఫేన
చందనంబును నూరెకు - చందమ మరు ।
దానిఁ దొగ జేఁగు కరములఁ - దాల్చి దెసలు
బోటులకుఁ బూఁతలలఁదెడుఁ - బోలెవజులు ॥

చంద్రోదయవర్ణనము. సముద్రతరంగముల సంచలనముచే బయలుపడుచున్న ఫేనమును గవి తొల్త చందనముగ రూపించినాఁడు ఆఫేనచందనము సముద్రపుటొడ్డున రాశిగాఁగూడును. రాయఁబడుచున్న చందనముగూడ రాశిగఁగూడుచుండునుగదా? ఈ రాశీభవన మనెడు ధర్మమును నిమిత్తముగాఁ దీసికొని ఫేనచందనముయొక్క ప్రేరణమును అనఁగా బయలుపఱచుటను సముద్రుఁడు ఫేనచందనమును రాచుటనుగా నుత్ప్రేక్షించినాఁడు.

అట్లే చంద్రుఁడుదయించునపుడు కిరణములు సముద్రపూరమునఁ బడును. పిమ్మట దిక్కులన్నిట వ్యాపించును. దానిచే దిక్కులు తెల్లఁ బాఱును. చందనము పూయఁబడిన తావును దెల్లఁబాఱునుగదా! ఈధర్మమును నిమిత్తమునుగాఁదీసికొని చంద్రకిరణవ్యాప్తినిఁ జంద్రకృత ఫేనచందనలేపనముగా నుత్ప్రేక్షించినాఁడు.

ఈయుత్ప్రేక్షల రెండింట ఫేనచందన ప్రేరణము అనఁగా ఫేనచందనమును బయటకు వెడలించుటయుఁ గిరణవ్యాప్తియు ననెడు విషయములు పద్యమునఁ జెప్పఁబడకుంటచే నివి యనుక్తవిషయలగు స్వరూపోత్ప్రేక్షలు.

అలంకార సర్వస్వకారుని మతము ననుసరించి యివి యుక్తవిషయలే యగును. ఎట్లన? పద్యమున నుక్తములగునట్టి యనఁగాఁ జెప్పఁబడినట్టి సముద్రుఁడు చంద్రుఁడునున నెడు ధర్మిపదార్థములయందు ఫేనచందనమును దీయుట దానిని దిగంగనలకుఁ బూయుట యనెడు

ధర్మముల నుత్ప్రేక్షించుటచేత. ఇట్లనుటచే వతని మతమున ధర్మియందు మఱియొక ధర్మియొక్క తాదాత్మ్యము నుత్ప్రేక్షించుటయు నట్లే యొక ధర్మియందు మఱియొక ధర్మసంబంధము నుత్ప్రేక్షించుటయునను భేదములచే వస్తూత్ప్రేక్ష రెండు విధములగును. ధర్మియందు ధర్మ్యంతర తాదాత్మ్యము నుత్ప్రేక్షించుట, లోఁగడఁ జూపఁబడినది.

సిద్ధవిషయయగు హేతూత్ప్రేక్ష యెట్లన ?

తే. గీ. దినము శీతాంశుఁడును రేయి – తీక్ష్ణభానుఁ
డరయ లేకుంట చేవలె – నబ్జసూతి।
వీరరుద్రుని యశమును – బృథివి సతత
ద్రుష్టరూపము తేజమున్ – సృష్టిఁ జేసె॥

రేయి సూర్యుఁడు పవలు చంద్రుఁడును లేకుంట సిద్ధము. దానిని హేతువుగాఁ దీసికొని సతతము విరాజిల్లు వీరరుద్రుని ప్రతాపయశస్సులను బ్రహ్మ సృష్టించెనా! యని కవి యుత్ప్రేక్షించినాఁడు. కాన నిది సిద్ధవిషయయగు హేతూత్ప్రేక్ష.

అసిద్ధవిషయయగు హేతూత్ప్రేక్ష యెట్లన ?

తే. గీ. జనుల నేత్రాభిధాన గో – జాతమినుఁడు
తనదు గోసహస్రంబునఁ – దగులఁగొనుచు
నింగివడుటను గాంబోలు – నేత్రములకు
నగును నాంధ్యము చీకటు – లలమఁగాదు॥

సూర్యుఁడు తన గోసహస్రములన్నఁగా కిరణసహస్రంబులతో జనుల కన్నులనెడు గోబృందమును గూడఁ దగిలించుకొని యస్తమించుట చేతను గాంబోలును నాంధ్యమున్ సంభవించెనని యుత్ప్రేక్షించినాఁడు. ఇట నేత్రములకు నాంధ్యము ప్రాప్తించుటకు నుత్ప్రేక్షింపఁబడిన హేతువు కవి కల్పితముకాని స్వతస్సిద్ధముకాదు.

సిద్ధవిషయయగు ఫలోత్ప్రేక్ష యెట్లన ?

తే. గీ. ఉదధి వెల్లువఁ బెంపు సే - యుటకుఁ బోలెఁ
జెక్కు నెలరాల నీటిని - గ్రక్కఁ జేయు।
జంటతప్పిన జక్కవ - పెంటిగముల
కంటినీటిని దొరఁగింపఁ - గడలిపట్టి॥

చంద్రుఁడు చంద్రకాంతముల ద్రవింపఁ జేయుటకును, చక్రవాకీ నయనములనుండి కన్నీటిని స్రవింపఁ జేయుటకును, సముద్రమును బొరలించుటయే ఫలముగాఁ గవి యూహించినాఁడు. చంద్రుఁడు సముద్రమును బెంపుచేయుట సిద్ధము. కాన నిది సిద్ధవిషయయగు ఫలోత్ప్రేక్ష.

అసిద్ధవిషయయగు ఫలోత్ప్రేక్ష యెట్లన ?

ఆ. వె. తొంటి వారువములఁ - దోలఁచి క్రొంగ్రొత్తలఁ
దేరుఁ బూన్పవోలెఁ - దీప మెఱయ।
నినుఁడు దివ్యతురగ - జనన దేశంబగు
నుత్తరాశకుఁ జన - నుద్యమించె॥

ఉత్తరాయణప్రవేశ వర్ణనము. సూర్యుఁడుత్తరాశకుఁ బోవ నెంచుటకు ఫలము రథమునకుఁ గ్రొత్తగుఱ్ఱములను గట్టుటయే ఫలమునుగా నూహించినాఁడు. సూర్యుఁడట్లు రథమునకు గుఱ్ఱములను గట్టుట స్వతఃసిద్ధముగాదు. కాన నిది యసిద్ధవిషయయగు ఫలోత్ప్రేక్ష.

కం. ఇలనుత్ప్రేక్షావ్యంజక
ములు తఱచుగనట్ల నిక్క - మునుగాఁబోలున్।
తలఁతును శంకింతునివి మొ
దలుగలశబ్దములువలె ప - దమువోలెననునా॥

తఱచుగన్, అట్ల, నిక్కము, కాఁబోలున్, తలఁతును, శంకింతును, ఇవి మున్నగు శబ్దములును వలెన్ వోలె ననునవియు నుత్ప్రేక్షావ్యంజకములు. వీనిని బ్రయోగింప నుత్ప్రేక్షవాచ్యమగును. లేకున్న గమ్యము. ఎట్లన ?

కం. భ్రమణాముస శ్శాంతిఁజెందుట
విమలత్వోక్తి గ్రాహ్యా - విన్నోటెన్నఁపా ! ॥
శ్శాంతిఁ జెందుటచేతఁగాఁబోలుఁ వనేజు నుత్ప్రేక్షగమ్య
మానమగుచున్నది.

అతిశయోక్త్యలంకారము. 13 -

కం. భువి పెలయును నిగరణ మ
ధ్యవసానముఁగలుగ రూప - కాతిశయోక్త్య !
ఖ్యానడిగఁగను నల్లనితోఁగ
దువవలనన్ మెఱయువాడి - తూపులు చెదరున్ ॥

విషయపదార్థమును స్వవాచకపదముచే గ్రహింపక విషయి వాచకపదముచే గ్రహించుట విషయనిగరణమనియును, విషయనిగరణముచేసి పిమ్మట నుపమేయవస్తువునకు నుపమానవస్తువుయొక్క రూపమును సంబంధింపఁజేసి యభేదజ్ఞానమును గలుగఁజేయుట యధ్యవసానమనఁబడును. అధ్యవసానమనఁగా భ్రాన్త్యాదులచేఁగాక యిచ్ఛచేతనే కలిగిన జ్ఞానము. ఇట్లు నిగరణము నధ్యవసానమును నాశ్రయింప రూపకాతిశయోక్తియగును. అనఁగా విషయమును గ్రహింపక కేవల విషయినే గ్రహించి విషయిరూపమును విషయమునకు సంబంధింపఁజేయుట రూపకాతిశయోక్తియగునని తాత్పర్యము. ఓ చెలికాఁడా! నల్లకలువదువవలస వాడితూపులు చెదరుచున్నవి కనుము ; ఇట నల్లకలువలనగా నేత్రములనియు వాడితూపులనఁగా దృష్టులనియు తాత్పర్యము. ఇట విషయమగు కండ్లను గ్రహింపక విషయిభూతమగు కలువలు గ్రహింపఁబడి రెంటికిని నభేదము చెప్పఁబడినది. ఇట్లే వాడి తూపులనుచోటను దెలియవలెను.

ఉ॥ వాపియొకండు మింటఁదగ - భాసిలునావయి సన్నకప్పుతోఁ
చాపిన బాటచూడఁగను - లంబడు బంగరుమెట్లమీఁదఁబై ।

బాపురె! చంపకాంచితము - భవ్యమునౌ గిరియుగ్మముండునా
దాపును జేరఁ జేయదు సు - ధారసముంట సుధాంశుఁడాదటన్ ॥

వాపియను పదముచే నాభియును సన్నకప్పుతాల్ దాపిన తోటయనఁగా నిండనీలమణులచే దాపిన తోటయనఁగా నూగారు. బంగరు మెట్లువళులు. గిరియుగ్మము కుచయుగళి. సుధాంశుఁడు ముఖము. ఈరీతిగ విషయనిగరణమును నధ్యవసాయమును నెఱుంగునది. ఈ యతిశయోక్తికి రూపక విశేషణముచే రూపకభేదము లన్నియుఁ గలవని తెలియునది ఎట్లన? అభేదాతిశయోక్తియును తాద్రూప్యాతిశయోక్తియునని రెండు తెఱంగులు. తిరుగ న్యూన-అధిక-అనుభయ భేదములచే నొక్కొక్కటి మూఁడు తెఱంగులగును. ఈరీతిగ రూపకాతిశయోక్తి యాఱువిధములు.

ఉ. వెన్నెల పుల్గుపిండు సుధఁ - బేర్మిని గ్రోలఁగఁగోరి పూలతో
టన్నన వీడి రాదెసల - నచ్చపు వెన్నెలడాలుఁ జిల్కుచున్ ।
కన్నెనఁ గందుఁ ద్రోచి వర - కాంబునఁబై దెసఁదోఁచు నెచ్చెలీ!
వెన్నెలఱేఁ డొకండు కను - విచ్చి కనుంగొనుమద్ది నైపుణిన్ ॥

విద్ధసాలభంజికయను నాటికలో స్ఫటికప్రాకార శిఖరమునందున్న మృగాంకావళియను రాకుమారినిఁ జూచి రాజు విదూషకునితో నిట్లు పలుకుచున్నాఁడు. మృగాంకావళియొక్క ముఖము చంద్రుఁడుగా నధ్యవసింపఁబడినది. కన్నెనఁ గందుఁద్రోచి యనుటచే నా ముఖ చంద్రునకుఁ బ్రసిద్ధచంద్రునికన్న నాధిక్యము చెప్పఁబడినది. కాన నిది యధికాభేదరూపకాతిశయోక్తి. తక్కిన భేదముల నూహించుకొనవచ్చును.

సాపహ్నవాతిశయోక్తి. II

కం. భువినదియ తలఁపఁగ నప
హ్నవగర్భితమైనఁ జెలఁగు - సాపహ్నవమై ।
భువనప! నీసూక్తుల సుధ
యను భ్రమమున నెంతు రిచంద్రునందున దానిన్

పై రూపకాతిశయోక్తియే యపహ్నవగర్భమైనచో సాపహ్నావాతిశయోక్తియగును. రాజసూక్తులయందలి మాధుర్యము సుధగా నధ్యవసింపఁబడినది. మఱియుఁ జంద్రినందునఁగాదని యపహ్నవింపఁ బడినది.

శా. ముక్తావిద్రుమమధ్యమందు మధువౌఁ - బుష్పంబునంగాదు సం
పృక్తంబుల్ విధుబింబమందవియు న-బ్ధిన్ గానఁగావద్దియున్ ।
వ్యక్తంబౌఁగదె! శంఖమూర్ధమునఁ బూ-ర్వాద్రిన్ దగన్ గాదు ధీ
వ్యక్తింబొందక భ్రాంతులెంతురటు లా-భామామణిన్ జూడమిన్ ॥

స్త్రీ వర్ణనము, తేనె పుష్పంబున లేదనియును ముత్తెము పవడముల రెంటిమధ్యమున నున్నదనియు వర్ణింపఁబడెను. ముత్తెమనఁగా దంతమనియును బవడమనఁగా నోష్ఠమనియు నధ్యవసించుటయేకాక తేనె పుష్పమునఁ గాదనియు నిషేధింపఁబడినది. ఇట్లే చంద్రబింబ మన ముఖముగాను, శంఖమన కంఠముగాను నధ్యవసానముగా నెఱుఁగునది.

అలంకారసర్వస్వకారుఁడు, ఉత్ప్రేక్షాలంకారములోఁగూడ సాపహ్నవ భేదముల నుదాహరించెను. ఎట్లన ?

ఆ. వె. మీనఘట్టనమున - మేను కంపితముగాఁ
గాంతలంతఁజెదరి - గట్టుసేర ।
నెరయు నురువుగుంపు - నెపమునటం శిప్ర
చెలఁగెవిఁగినగవు - సేసెవోలె ॥

శిప్రానదిలో స్త్రీలు జలక్రీడ సేయునపుడు మీనము శరీరమును గొట్టి రాచుకొనఁగా వారు భీతిలి గట్టుచేరిరి. అంత నదిలో ఫేనము పుట్టెను. ఆనురువుగుంపు నెపముచే నది నవ్వెనా! యనునట్లు భాసిల్లెను. ఇది శుద్ధాపహ్నుతిగర్భితమగు నుత్ప్రేక్షాలంకారము. నురువునందు నురువుయొక్క ధర్మమునుగప్పి యానురువునందే నగవుయొక్క ధర్మ మారోపింపఁబడినది. పర్యస్తాపహ్నుతిగర్భితయగు నుత్ప్రేక్షగూడఁ గలదు. ఎట్లన ?

తే॥ గీ॥ దీనినే బింబమని రాగ - దీప్తి నెంతొ
బింబమధరము దీన రూ - పించి పోల్ప।
రెంట వైశిష్ట్యబుద్ధి లే - కుంట నరులు
నామమందున భ్రమియింతు - పామరతను ॥

రక్తిమచే దమయన్తియొక్క యధరమును బింబమని యూహింతును. ఈమె యధరముతోఁ బోల్చిచూచిన బింబఫలము దీసిపోవును. ఈ రెంటికిని భేదము తెలియక పామరులు భ్రాన్తినొందుదురు. అనఁగా బింబఫలముకాని దానిని బింబఫలమని భ్రమింతురు. ఇట ప్రసిద్ధ బింబ ఫలముయొక్క ధర్మమునుగప్పి యాధర్మమును దమయన్తియొక్క యధరమున నారోపించుచు నాయధరోష్ఠమును బింబఫలమని యుత్ప్రే క్షించినాఁడు, కాన నీయుత్ప్రేక్ష, పర్యస్తాపహ్నుతిగర్భయగుచున్నది.

హేతూత్ప్రేక్షయందు పర్యస్తాపహ్నుతిగర్భత్వ మెట్లన? "జనుల నేత్రాభిధానగోజాతమినుఁడు" అను హేతూత్ప్రేక్షయొక్క యుదాహరణమునఁ దెలియనగు. అచ్చట నంధకారమున నాంధ్య హేతుత్వమునుగప్పి సూర్యునిచేఁ జేయఁబడిన నేత్రాభిధానగోనయన మున నారోపింపఁబడెను.

ఫలోత్ప్రేక్షయందు పర్యస్తాపహ్నుతిగర్భత్వ మెట్లన?

తే॥ గీ॥ సూర్యసంతప్తమౌ కరి - సొలసి వాని
చుట్టలగు తమ్మిగములను - రట్టుబెట్టఁ।
గావలెన్ జొచ్చుమడుగును - గాదుమున్గ
జలములనన్ మున్క కరికి ని - ష్ఫలముగాదె? ॥

ఇట కరి నీట దిగుటకు ఫలము స్నానము. అయినను, అట్లు కాదని నిషేధించి (ఇదియే యపహ్నవము) పద్మములను బాధించుట ఫలముగా నూహింపఁబడెను.

## భేదకాతిశయోక్తి. III

కం॥ తనర సజాతియు నన్యం
బని మధురతఁజెప్ప భేద - కాతిశయోక్త్యా ।
ఖ్యనృపతి ధైర్యంబన్యమ
మనసున గాంభీర్యమెన్న - మహినన్యంబే॥

ఏకజాతికిఁజెందిన వస్తువులనుగూడ విజాతీయములుగాఁ జెప్పినచో భేదకాతిశయోక్తియగును. వర్ణనీయుఁడగు రాజును సంబంధించిన ధైర్యగాంభీర్యములు లోకసామాన్యములయ్యు విజాతీయములుగా వర్ణింపఁబడినవి. మఱియును,

ఆ॥ వె॥ హావభావగరిమ - లావణ్యసంపద
చతురతయును గొ్రొత్త - చాయనుండు ।
ప్రాతసృష్టియంత - పాటిగాదీతన్విఁ
గొ్రొత్తలెంచి ధాత - గోర్కెఁజేసె ॥

## సంబంధాతిశయోక్తి. IV

కం॥ సంబంధాతిశయోక్తి; య
సంబంధమునందుఁజెప్ప - సంబంధంబున్ ।
డంబగు సీనగరులు విధు
బింబంబును గొనలఁదాకు - వింటన్ వీటన్ ॥

సంబంధము లేకున్నను సంబంధము గల్గినటులు వర్ణించినచో సంబంధాతిశయోక్తియగును. రాజభవనముల యొక్క కొనలు మిన్నంటకున్నను మిన్నంటునటులు వర్ణించుటచే సంబంధాతిశయోక్తి. మఱియును,

తే॥ గీ॥ పగటివేళలకుఁగడఁగూర్చు - పైడికొండ
వేగఁదఱుగొందు నాకింక - వెతలుదీరు ।
ననుచు జక్కవ పెంటిలోఁ - గొనును ముదము
వీర రుద్రుని వితరణ - వేళలందు ॥

వీరరుద్రమహారాజు దానముచేయుచుండఁ బైడికొండనుగూడ బ్రద్దలుకొట్టి దానముచేయఁగలడనియును దానిచే సూర్యప్రకాశమునకు నడ్డుతొలగిపోవునుగాన నింతటినుండి రాత్రిగలుగఁబోదు. నాకు వియోగ దుఃఖము వాటిల్లదని చక్రవాకి తలంచుచున్నట్లు వర్ణింపఁబడెను. ఇట్టి తలఁపు చక్రవాకికి సంబంధింపకున్నను సంబంధించినటులు వర్ణించుటచే నిది సంబంధాతిశయోక్త్యలంకారము.

అ స ం బ ం ధా తి శ యో క్తి. V

కం॥ యుక్తమ సంబంధాతిశ
యోక్తియయోగంబుసెప్ప - యోగము కలుగన్ ।
రక్తిఁగని నీదు దానా
సక్తిని స్వర్ద్రుమలరక్తి - చనుమాకు నృపా! ॥

సంబంధముండినను లేదనునట్లు చెప్పినచో నది యసంబంధాతిశయోక్తి. ఓరాజా! నీ దానాసక్తిని జూచినచో మాకు కల్పవృక్షమందలి యాసక్తి తొలఁగుచున్నది. ఇది యాచకవచనము. యాచకులకుఁ గల్పవృక్షమందు ప్రేమసంబంధమున్నను సంబంధము లేనటులు వర్ణించుటచే నిది యసంబంధాతిశయోక్తి.

ఆ॥ వె॥ అరయు సుందరాంగి! - విరివినొందుచున్న
కొమరుగొల్పు నీదు - గుబ్బలకును ।
బాహులతల నడుమఁ - బరికింపఁబూఁబోఁడి!
చాలినంతచోటు - పాలుపడదు.

సుందరాంగియొక్క బాహులతలమధ్యమునఁ గుచవ్యాప్తికిఁ దగినంత చోటుండినను లేనట్లు వర్ణింపఁబడెను.

అ క్ర మా తి శ యో క్తి. VI

కం॥ కరణము కార్యము సాహితి
నరయఁగ నిల వఱలు నక్ర - మాతిశయోక్త్య ।

ఖ్యా, రణభువిఁ-జిత్రమిది నీ
శరములు నరిగణములొకట - జ్యానంటు నృపా! ॥

హేతుకార్యములకుఁ బౌర్వాపర్యము స్వతఃసిద్ధము. దానిని విడిచి సహభావమును వర్ణింప నక్రమాతిశయోక్తియగును. శరపాతమునకుఁబిమ్మట శత్రువులు నేలఁగూలుదురు. అట్టి పౌర్వాపర్యమును విడిచి రెండుపనులకు నొక్కతఱి సంభవము చూపంబడినది. జ్యా శబ్దమునకు విల్లుయొక్క యల్లెత్రాడనియు నేలయనియు ననెడు నర్థద్వయమును గ్రమముగ నన్వయించుకొనవలయును.

తే॥ గీ॥ విడువఁగోశంబుఁగోశము - విడుచుశత్రు
గణము, కంపింప రణమునఁ - గంపమొందు।
చండహమ్మీర ఖడ్గంబు - క్షమనువీడ
నొక్క తడవనె విడుచుఁదా - సుక్కిక్షమను.

కోశము :- కత్తియొర, ధనాగారమును. కంపము :- కదలుట, వణకుటయును. క్షమ :- ఓరిమి, నేలయును. ఈరెండర్థములును గ్రమముగ హమ్మీరఖడ్గమునకును నతని శత్రుగణమునకు నన్వయించుకొనవలయును.

ఇట నొక్కతడవనె యనుటచే ఖడ్గకార్యములకును శత్రుకార్యములకును గల పౌర్వాపర్యము విడువఁబడి సహభావము చూపఁబడినది.

## చ ప లా తి శ యో క్తి. VII

కం॥ చపలాతిశయోక్తియు హే
తుపరిజ్ఞానమునఁ గార్య - ధురవాడమంగన్ ।
చపలాక్షి యుంగరంబు ద
లఁపఁ గంకణమాయెఁ బతి నె - లఁత! చనెదననన్ ।

హేతుజ్ఞానము మాత్రముననే కార్యోత్పత్తి వర్ణింపఁ జపలాతిశయోక్తియగు. పతి దేశాంతరముఁబోకున్నను వెడలుచున్నానని

పల్కినంతనే సతి యుంగరము చేతి కంకణమాయెను. మిక్కిలి కృశించినదని తాత్పర్యము. మఱియు,

శా॥ కేలన్ బూవునుబట్టనెంచఁగనె రక్తింజెందు హస్తాగ్రి మా
లీలన్ లత్తుక పూతఁ జెల్వనడుగుల్ - చిందించు లౌహిత్యమాం।
దోలించున్ మెయి పూతలన్ దలఁచినన్ - నోవంగఁ జిత్తంబు పె
క్కైలాముంగురులింపు తావియును వే్రఁ - గెంచంగ నాతన్వికిన్ ॥

పూవు ముట్టకున్నను ముట్టఁదలఁచినంతనే చేయికందినట్టును. చెలులు కాళ్లకు లత్తుకను బూయుదుమని తెలిపినంతనే పాదములు కందినట్లును. మెయిపూతలను స్మరించినంతనే చిత్తమాందోళనము చెందు నట్లును, కారణజ్ఞానము మాత్రముననే కార్యములు కలిగినట్లు వర్ణింపఁబడెను. ఇట్లు వర్ణించుటచేతను నాపెకు ముంగురుల సౌరభముకూడ భారముగ నుండెనని చెప్పుటచేతను నాపె మిక్కిలి సుకుమారిగా నుండెనని కవి తాత్పర్యము. మఱియును.

తే॥ గీ॥ వెడలుచున్నాను వెడలనం - చాడయఁ డెడము
గలుగకుండఁగ సతిమ్రోలఁ - బలుక నోలి।
నాపె మున్గాజు లెడఁబడి - యట్టె జాఱె
వెన్కనున్నవి వహ్వారే! - బీటవాఱె ॥

కారణజ్ఞానము మాత్రముననే కార్యము పుట్టినట్లు వర్ణింపఁబడెను.

## అత్యంతాతిశయోక్తి. VIII

కం. అగునత్యంతాతిశయో
క్తిగఁ బౌర్వాపర్యమును వ్య - తిక్రమమొందన్ ।
మగువకు మానము తొలుతఁ దొ
లఁగెనూఱటఁ బెట్టె వెండి - లఘుగతిఁ బ్రియుఁడున్ ॥

హేతుకార్యములకుఁబూర్వా పరభావమును దారుమారుగఁ జేసి చెప్పి నచో నత్యంతాతిశయోక్తియగును. తొలుత నూఱటఁ బెట్టుట పిమ్మట

మానము దొలఁగుట యుక్తమగుచుండ నట్టి హేతుకార్య పౌర్వాపర్యము తారుమారుగఁ జెప్పఁబడినది.

మ॥ తొలుతన్ సత్కవి రాజరాజగృహ సం-దోహాంగణవ్రాతమున్
జలభృంగాకుల గంధవారణ మద-స్రావంబు వాసించునా।
వల క్షీరోదధి మధ్యభాగమరుదు - ద్భ్రాంతోత్తరంగప్రభా
కలితంబుల్ వరవీరరుద్రుని కటా-క్షంబుల్ పయిన్ వ్రాలెడున్ ॥

హేతుభూతమగు వీరరుద్రుని కటాక్ష ప్రసారణమునకుఁ బూర్వమే కవీశ్వరులకు మహైశ్వర్యదానము వర్ణింపఁబడెను.

చివర మూఁడతిశయోక్తులకును గార్యసిద్ధి శీఘ్రముగ నాయె నని తెల్పుటయే ప్రయోజనము.

### తుల్యయోగితాలంకారము. 14.

కం. ప్రకృతములకో యన్యములకో
యొక ధర్మంబబ్బఁదుల్య - యోగిత పఱఁగున్ ।
ముకుళించెడు నూ! పంకజ
నికరము శశిపొడమ స్వైరి - ణీ వదనంబుల్ ॥

ప్రస్తుతములగు నర్థములకుఁగాని యప్రస్తుతములగు నర్థములకుఁగాని గుణక్రియారూపమగు నొకధర్మము సంభవించినటులు వర్ణించినఁ దుల్య యోగితయగును. చంద్రోదయ మగునంతనె పద్మములును స్వైరిణీ వదనములును ముకుళించినవనునొక క్రియారూపధర్మము సంబంధింపఁ జేయఁబడెను. ఇది కేవల ప్రకృతార్థములకు ధర్మాన్వయము. కేవలమ ప్రకృతములకు నేకధర్మాన్వయ మెట్లన ?

కం॥ సుదతీ! నీయంగకముల
మృదుభావముఁగన్న నరుఁడు - మేదిని నెవ్వాఁ
డెడ లోహిమరుచిలేఖా
కదళీమాలతులఁగనఁడు ? - కాఠిన్యంబున్ ॥

నాయికా సౌకుమార్యము ప్రస్తుతము. అప్రస్తుతములగు చంద్రికళ, కదళి, మాలతి, వీనికి కాఠిన్య రూపధర్మము చూపఁబడినది.

తే॥ గీ॥ రమ్యసంజాత నూత్న ప - త్రంబులగుచు
స్ఫుటమనోహరపాటల - స్ఫూర్తిఁగనుచు।
భానుకరసంగమున విక - స్వరములగుచుఁ
బృథివి దినములునబ్జముల్ - పెంపునొందె॥

గ్రీష్మర్తువర్ణనము. దినములును నబ్జములును వృద్ధినొందెను. చెట్లు పాతయాకులును రాలఁ గ్రొత్తయాకులు దొడుగుచుండెను. పద్మములును బాతరేకులు రాలఁ గ్రొత్తరేకులు దొడుగుచున్నవి. దినములఁ బాటలపుష్పములు వికసించుచున్నవి. పద్మములు పాటలవర్ణము కలిగియున్నవి. సూర్యకిరణ ప్రసారముచేఁబద్మములు వికసించుచున్నవి. దానిచేతనే దినములును ప్రకాశించుచున్నవి. ఇచ్చటఁ బ్రస్తుతములగు దినములకును పద్మములకును బెంపునొందుటయనెడు నేకక్రియా రూప ధర్మము సంబంధింపఁజేయఁబడినది.

ఆ॥ వె॥ కఠినతనముగలుగ - గజరాజ కరములు
సతతశైత్యముంట సరసకదళు।
లేపుమీఱియున్న - రూపునుగల్గియు
నుద్దిగావు గౌరి - యూరువులకు॥

అప్రస్తుతములగు గజరాజ కరము కదళీకాండములకుఁ బార్వతీదేవి యొక్క యూరువులతో సామ్యాభావమనెడు నేకధర్మాన్వయము చెప్పఁబడినది. గజకరములకుఁ గఠినుఁదనము గల్గుటయు సరసకదళులకు నెల్లకాలములఁ జల్లఁదనము గల్గుటయు దోషముకాన పోలిక తగదని భావము.

## తుల్యయోగిత. II

కం॥ హితములనహితములను సమ
గతి వర్తింపగను దాని - గణియింతురటుల్॥

సతతమునీ సుహృదసుహృ
త్తతికిత్తువు స్వస్థితియును - దగురా! భూపా! ॥

హితాహితముల సమగతివర్తనమును దుల్యాయోగితయగు. ఇట మిత్రులకును నమిత్రులకును స్వస్థితిదానము చూపఁబడినది. మిత్రులకు స్వస్థితియన సుఖస్థితి, శత్రువులకు స్వస్థితియన స్వర్గస్థితియనియు నర్థము. ఈ రెండర్థములకు నభేదాధ్యవసాయముచే నైక్యమాపాదించి మిత్రామిత్రులకు నేకధర్మాన్వయము చూపఁబడినది.

కం॥ ఎవ్వాఁడు నఱకుగొడ్డట
నెవ్వాఁడాజ్యమునఁ దేనె - హితముగఁదనుపున్ ।
పువ్వులుగంధమునీడుఁ దా
నెవ్వఁడు వెగటుండు వేప యీామువ్వురకున్ ॥

పూర్వోదాహరణము స్తుతియందును, ఈ యుదాహరణము నిందయందును బర్యవసించును. ఇది సరస్వతీ కంఠాభరణమందు చెప్పఁబడిన తుల్యాయోగితాలంకారము.

## తుల్యాయోగిత. III

కం॥ అరయఁగ గుణాధికులతో
సరిపడఁజేయుటయు నటులు - చనునొకదానిన్ ।
సురపతి, నిధిపతి, యముఁడును
వరుణుండును నీవు లోక - పాలురుగారే! ॥

ఒక పదార్థమును గుణాధిక వస్తువులతో సరిపడఁజేయుటయును దుల్యాయోగితాలంకారమగును. మనుజుఁడగు రాజును, ఇంద్రాది దిక్పతులతో సమానముగా వర్ణించినాఁడు.

ద్విపద ॥ సరసిజాక్షులు సూపు - సందడి చెలిమి
మెఱపుఁదీవగొలుపు - మెఱుగాఱు తళుకు ।
తఱిని ఘనారబ్ధ - తను బొందియుండి
మరగించి యంతలో - మటుమాయమౌను ॥

చెలిమి పక్షమున ఘనారబ్ధతయనఁ దొలుత గొప్పగనుండుట; మెఱపుఁ దీవపక్షమున మేఘమున నారంభముకల్గియుండుట. సరసిజాక్షుల చెలిమికి మెఱపుఁదీవతోఁ దుల్యత చూపఁబడెను. మొదటి పద్యమున స్తుతియును, ఈ పద్యమున నిందయును జూపఁబడెను. దండి కృత కావ్యాదర్శములో నీతుల్యయోగిత చెప్పఁబడినది. జయదేవుఁడు సిద్ధి యను కావ్యగుణమని దీనిని నుడివెను. ఎట్లన ?

కం॥ తలకొనుసిద్ధి గుణప్రిధి
తులతోఁగీర్తింప నన్యుఁ - దుల్యత గలుగన్ ।
బలముల నీవును జలముల
జలధియుఁదగ వాసిగొండ్రు - జనపతి ! యుభయుల్ ॥

మతాంతరమున నిది దీపకము. దీపక తుల్యయోగితలకు భేదము దీపకాలంకారములోఁ దెలుపఁబడును.

## దీ ప కా లం కా ర ము. 15.

కం॥ అలవర్ణ్యావర్ణ్యములకుఁ
దెలియఁగ నొక ధర్మమలరఁ - దీపకమదియా ।
కలభము మదజలమున భా
సిలు భూనాయకుఁడు మహిని - శితతేజమునన్ ॥

ప్రస్తుతములకును నప్రస్తుతములకును గలిపి యొక్క ధర్మము నన్వయింపఁ జేసిన దీపకమగును, వర్ణనీయుఁడగుటచే భూనాయకుఁడు ప్రస్తుత పదార్థము. కలభ మప్రస్తుతము. ఈ రెంటికిని గలిపి యేకక్రియా రూపమగు ధర్మమన్వయింపఁబడినది.

చం॥ ఒరఁబడు జాతిరత్నమని - మక్కరియై తుతినొందు జేత దా
నరహిత వృద్ధదన్తిపులి - నంబులఁజూపెడు శారదాపగల్ ।
నెరసుననుండు చందురుఁడు - నెయ్యుని కౌగిటనల్గు బాల దా
నరతినిఁ బేదలైన నర - నాయకులున్ హావణింతుర్రి సూక్ష్మతన్ ॥

ప్రస్తుతార్థములగు నరపతులకును నప్రస్తుతములగు తక్కినవానికిని హావణించుట యేకక్రియారూపధర్మముగా నన్వయింపఁబడినది. ప్రస్తుతముతో నన్వయించిన ధర్మము ప్రసంగవశమున నప్రస్తుతముతోఁ గూడ నన్వయింపవచ్చును. హర్మ్యమును భాసింపనుంచిన దీపము హర్మ్యమునకును వీధికినిగూడ నుపకరించునటులు. ఈరీతిగ దీపసాదృశ్యముచే నీయలంకారమునకు దీపకమనెడు పేరువచ్చినది. దీపశబ్దమునకు సంజ్ఞయందు 'కన్' ప్రత్యయముచేయ దీపకశబ్దము సిద్ధించినది. మఱియును.

కం॥ బంగరు పూచెడు పుడమినిఁ
బొంగుచుఁబోగ్రిడుదు రెంచ - ముప్వురు పురుషుల్ ।
రంగారు శూరుఁడును వా
సింగను బుధుఁడొరులసేవ - సేయన్ గృతియున్ ॥

శూరుఁడును విద్వాంసుఁడును సేవానిపుణుఁడును నీముప్వురు ధనసంగ్రహణముచేయ సమర్థులని భావము. ఇది ప్రాసంగిక పద్యము. ఈముప్వురిలో నెవ్వఁడు ప్రసంగమునఁ బఠింపఁబడిన వానికిఁ బ్రకృతత్వమును దక్కినవారి కప్రకృతత్వమును గలుగును. అట్టులొక వస్తువు ప్రకృతమయ్యుఁ బోగ్రిడుదురను క్రియ బహువచనములో నుండుటచేఁ బ్రకృతమగు నొక్కదానితో నన్వయింపఁజాలక ప్రకృతాప్రకృతములు మూడింటితో నొక్కమాఱే యన్వయింపవలసియున్నదికదా?

'కలభముమదమున' నను నుదాహరణమున ధర్మాన్వయము తొలుత నప్రస్తుతమగు కలభములోను బిదపఁ బ్రస్తుతమగు భూనాయకునితోను గలిసెను. అంతమాత్రమునఁ బ్రస్తుతార్థమునకుఁ బ్రాధాన్యము తగ్గదు. ప్రాసాదమునకు వెలుగునకై యుంపఁబడిన దీపము ప్రాసాదమునకును వీధికిని నొక్కమాఱే కాంతినిచ్చినను ప్రాసాదమునకుఁ బ్రాధాన్యము తగ్గదు. అల్లే యల్లుని విందుకై సిద్ధముచేయఁబడిన మధురపదార్థము తొలుత నతిథులకు వడ్డింపఁబడినను నల్లునకుఁ బ్రాధా

న్యము తగ్గదుకదా? దీని సారాంశమేమనిన దీపకాలంకారమునఁ గ్రియారూపధర్మము ప్రకృతాప్రకృతముల రెంటితో నొక్కమాఱు న్వయించినను నొక్కటి ప్రకృతమును వేఱొక్కటి యప్రకృతము ననెడు విభాగముకలదు.

తుల్యయోగితలో నట్లుకాక ప్రకృతాప్రకృత భేదము లేకుంటచేఁ బ్రాధాన్యాప్రాధాన్య భావము లేదు కాన సర్వవస్తువుల నుద్దేశించియే ధర్మము చెప్పఁబడును. మఱియు దీపకతుల్యయోగితలు రెంటిలోను నుపమాలంకారము గమ్యమానమగుటలో విశేషము లేకున్నను దీపకములోఁ బ్రస్తుత ముపమేయముగను నప్రస్తుత ముపమానముగనుండును. తుల్యయోగితలో నట్టి భేదము లేకుంటచే నుపమానోపమేయ భావమిచ్ఛాధీనము.

### ఆ వృ త్తి దీ ప క ము. 16.

కం॥ ఆవృత్తిదీపకంబగు
నావృత్తిన్ దీపకమున - కది త్రివిధంబౌ।
ఈవిన్నిటు నెలమించును
నే వగవఁగనీ త్రియామ - నెలమించుఁజెలీ! ॥

ఆ॥ వె॥ కడిమిమొగ్గ విచ్చెఁ - గా దంబినినిజూచి
కొండమల్లె విరిసెఁ - గోర్కెదీర।
చాతకంబుకోదమ - చదలమత్తుకొనెను
నేలమత్తుకొనెను - నెమ్మిగమియు॥

దీపమనేకోపకారకమగునట్లు దీపస్థానీయమగు ధర్మవాచకపదముగాని యర్థరూపమగు ధర్మముగాని పదపదార్థములు రెండునుగాని యావృత్తి నొందుచో నది యావృత్తిదీపకమగును. నెలమించుననుచోటఁ గేవల శబ్దములకావృత్తి. విన్ను నెలమించుననఁ జంద్రునిచే విరాజిల్లుచున్న దని యర్థము. రేయి నెలమించునన వియోగభారముచే నెలకాలమును మించినదివలె నున్నదనియు నర్థభేదము కలదు. ఇది విరహిణీ వాక్యము.

రెండవ పద్యమున వర్షాకాల వర్ణనము. విచ్చెన్ విరిసెనను పదములు వేఱువేఱైనను నర్థము రెంటికొక్కటియే యగుటచే నర్థములకే వాక్యద్వయముననావృత్తిచూపఁబడెను. కాననిది యర్థావృత్తిదీపకము. మత్తకోనెననుచోట రెండింట మత్తిల్లెనను నర్థము తుల్యము. కాన నట యుభయావృత్తి.

సీ॥ ఉత్కంఠముగఁజేయు - హరాయలమయూరాళి
మేదురంబగు నీల - మేఘమాల
ఉత్కంఠముగఁజేయు - యువమానసంబుల
మీనమిథునకరుఁడు - సూనశరుఁడు
సమయించు యువచాత - కముల బంధురతృష్ణ
కలితరసాధార - జలదధార
తొలగించుఁగాముక - కులదూరజిగమిష
నారీ శుగాకులము - నయనజలము.

తే॥ గీ॥ నీదు సుందరముఖముచే - నిర్జితంబు
నైన విధుబింబమంబుద - మందునడఁగు।
నట్టి సుకుమారతరమైన - యంబుజంబు
నీటి వెల్లువఁదెలియఁబో - బోటి! యడఁగు॥

వర్షాకాల వర్ణనము. ఉత్కంఠముగ నెత్తఁబడిన కంఠము కలదిగ వేడుకకలదిగనను నర్థభేదముంటచేఁ గేవల పదావృత్తి. అట్లే అర్థావృత్తిని నుభయావృత్తినిఁ దెలియనగు. దీపకమునఁ బ్రస్తుతాప్రస్తుతములకును నావృత్తిదీపకమునఁ గేవల ప్రస్తుతములకుఁగాని కేవల మప్రస్తుతములకుఁగాని యేక ధర్మాన్వయ సామ్యముంటచే నీయలంకారమునకు దీపక సాదృశ్యమున నావృత్తిదీపకమను పేరు సార్థకము.

ప్రతివస్తూపమాలంకారము. 17.

కం॥ చూపడుఁబ్రతివస్తూపమ
ప్రాపుగ నొక ధర్మమొదవఁ - బ్రతివాక్యమునన్।

తాపమునఁ జెలఁగు సూర్యుఁడు
చాపముననే శూరుఁడెంచఁ - జక్కఁగ వఱలున్ ॥

ఉపమానోపమేయపరమగు వాక్యద్వయమున వేఱువేఱుగ నొక్కధర్మము చెప్పఁబడుచో నది ప్రతివస్తూపమ.

ఒక ధర్మమును వాక్యద్వయమున వేఱుగ గ్రహింప నది వస్తుప్రతివస్తుభావము. ప్రతివస్తువునను బ్రతివాక్యార్థమునను ఉపమ యనఁగా సమానధర్మముకలదికాన దీనికీపేరు సార్థకము.

ఒక్క ధర్మమే చెలఁగున్ వఱలుననెడు పదద్వయముచే వాక్యద్వయమున వేఱువేఱుగ గ్రహింపఁబడినది. మఱియు.

ఆ॥ వె॥ సచ్చరిత్రపరుల - సౌశీల్యసంపద
దుష్టమనుజు చెలిమి - నష్టిఁగనదు ।
రమ్యకాంతినీను - రత్నదీపకలిక
తీవ్రవాతహతినిఁ -దీఱుసడదు,

తే॥ గీ॥ అమృతము స్రవించు నీచర - ణాంబుజములఁ
జిత్తముంచిన నరుఁడు వాం - ఛింపఁడొండు ।
కలుగ మకరందనిర్భర - కమలమిక్షు
రకముఁజూడదుగా మధు - వ్రతము భువిని ॥

ఇక్షురకము :- నీటిగొబ్బెపువ్వు. ఇట వాంఛింపఁడు చూడదనెడు ధర్మభేదము కలదుకాన నలంకారమెట్లు పొసఁగుననఁ గనులఁబడినచో నెట్టిపదార్థమునైనను జూడకుండుటకు వీలుకలుగదుకాన మధువ్రతము చూడదనునపుడు ఇచ్ఛాపూర్వకముగఁ జూడదను నర్థము చెప్పవలసియున్నది. వాంఛింపఁడన్నను ఇచ్ఛయింపఁడని యర్థము. కాన వాక్యద్వయమునను నిచ్ఛాపూర్వక దర్శనాభావమే యనిచ్ఛయందుఁ బర్యవసించుటచే ధర్మైక్యము సంభవించును. కాన నలంకారము పొసఁగును.

అర్థావృత్తిదీపకము కేవలము ప్రకృతములకుఁగాని కేవలమప్రకృతములకుఁగాని యేకధర్మాన్వయమును గలిగియుండును. దాని

యుదాహరణమున సీసపద్యమున వర్షాకాలమును సంబంధించినవగుటచే విషయములన్నియును బ్రస్తుతములు. గీతమున ముఖవర్ణనము ప్రస్తుతము. అబ్జచంద్రు లప్రస్తుతములు. ఆరెంటికిని నడఁగున నెడుపదముచే నేకక్రియాన్వయము చూపఁబడినది.

ప్రతివస్తూపమాలంకారము ప్రస్తుతాప్రస్తుత పదార్థములు రెంటికిని గలిపి ధర్మైక్యమును గలిగియుండును. ఇదియే యావృత్తి దీపకమునకును బ్రతివస్తూపమునకును భేదము.

మఱియు నావృత్తిదీపకము వైధర్మ్యమున సంభవింపదు. ప్రతివస్తూపమ సంభవించును. ఎట్లన ?

కం॥ పెనుఁజదువరియే తెలియును
బెనుఁజదువరి చదువునలపు - పెలుచన్ వడిఁ గ్రి
మ్మిన బలుఁగానుపు నొగులుఁ
గన మనమునఁ దెలియఁజనదు - కద ! వంజరసన్ ॥

విద్వాంసుని విద్యాభ్యాసక్లేశమును విద్వాంసుఁడే తెలిసికొనును. ఈ యుపమేయ వాక్యార్థమునకు, గొడ్రాలు కానుపువేదనల నెఱుంగ దనెడు నుపమాన వాక్యార్థము వ్యతిరేకముగ నుంటచే రెంటికి వైధర్మ్యము గలదుకదా ? మఱియును.

కం॥ పుడమిని నరులకు సుగుణము
లడరినఁ దామంత నవియె - యడరును, దెసలన్ ।
బడు కస్తురి సౌరభమే
కడ నెఱుకంబడుచు లేదు - కద ! శపథోక్తిన్ ॥

నరులకు సుగుణములుగలుగ నవి తామంతనే ప్రకటితము లగును. కస్తురితావి శపథోక్తిచేఁ దెలియఁబడుట లేదుకదా ? ఈతావు నఁగస్తురికలదు లేకున్న నీయానయనెడు రీతిగ శపథము చేయనక్కఱ లేకయే సౌరభముచేఁ బ్రకటితమగుచున్నదని భావము. ఇచ్చటను

గూడ నుపమానవాక్యము వైధర్మ్యములోనున్నది. ఇట్టి తావు లనౌపమ్యము గమ్యమగుట యెట్లన ?

చదువరియే తెలియున నెడు నుపమేయవాక్యమందలి 'ఏ' యనెడు నిర్ధారణముచేఁ జదువరికానివాఁడు తెలియఁడనెడు వ్యతిరేకార్థ మాక్షిప్తమగుచున్నది. దానికిఁ బుట్టువంజ తెలియదనెడు వ్యతిరేకార్థముతో నౌపమ్యము పొసఁగును. శపథోక్తిచేతఁగాక స్వాయముగనే కస్తూరికామోదము తెలియఁబడుచున్నది యనెడు నాక్షిప్తార్థముతోఁ బూర్వ వాక్యార్థమునకు సాదృశ్యము పొసఁగును.

దృ ష్టా ం తా ల ం కా ర ము. 18.

కం॥ కృతి దృష్టాంతము బింబ
ప్రతిబింబత్వము చెలంగఁ - బరగున్ రసఁగీ
రితిగలవాఁడవు నీవే
క్షితిపాలక ! ద్యుతికలాఁడు - శీతాంశుండే ॥

ఎచ్చట నుపమానోపమేయ వాక్యద్వయమందలి వేఱువేఱు ధర్మములు బింబ ప్రతిబింబ భావముచేఁ జెప్పఁబడునో యచ్చట దృష్టాంతాలంకారము. ఇట కీరితికిని ద్యుతికిని బింబ ప్రతిబింబ భావముకలదు. బింబప్రతిబింబ భావస్వరూప ముపమాలంకారములో విశదీకరింపఁబడినది. మఱియును.

తే॥ గీ॥ వేలకొలఁదియు రాజులు - వెలయుదురిలఁ
జనును వీనిచేఁబుడమి రా - జన్వతియన ।
రిక్కలుగ్రహంబులొలసినం - బెక్కు లెక్కఁ
దీఱునెఱినెల రేయి జ్యో - తిష్మతియన ॥

రాజన్వతి :- మంచిరాజుకలది. జ్యోతిష్మతి :- మంచి వెలుఁగుకలది. ఇట రాజన్వతి జ్యోతిష్మతియను పదములలోని రాజజ్యోతిస్సులు రెంటికిని బింబప్రతిబింబభావము. వెనుకటి యుదాహరణమునఁ గీర్తి

కాంతులు రెంటికిని బింబ ప్రతిబింబ భావములో మనోహరత్వము ప్రయోజకధర్మము. అది వాచ్యముగాక యర్థసిద్ధము. ఇట బింబ ప్రతిబింబభావములోఁ బ్రయోజకధర్మము ప్రాశస్త్యము. ఈప్రాశస్త్యము రాజన్వతి జ్యోతిష్మతి పదములలోని మతుప్ప్రత్యయముచే వాచ్యమగుచున్నది. ఇట ప్రాశస్త్యార్థమున మతుప్ప్రత్యయము. మఱియును.

శా॥ వాణిన్ గొల్వరె? వేలమంది గురుసే - వాక్లిష్టుఁడొక్కండె త
ద్వాణీ సారమెఱుంగుగాదె! కవితా-ప్రౌఢిన్ మురార్యార్యుఁడు।
శ్రేణీభూతకపుల్ తరింత్రు జలరా - శిన్ దాని గాంభీర్యమున్।
రాణన్ మంథమహీధరంబెఱిఁగెడున్ - ద్రాఙ్మగ్నపీనాత్మమై॥

ఇట నుపమానోపమేయ వాక్యముల రెంటను నెఱుంగుట యనెడు నొక్క ధర్మమే గ్రహింపఁబడుటచేఁ బ్రతివస్తూపమ యనరాదు. మంథర పర్వతమునకు నెఱుంగుట (జ్ఞానము) సంభవింపదు కాన నెఱుంగుటయనఁ బాతాళతలస్పర్శమని యర్థము చెప్పవలయును, కాన వస్తుప్రతివస్తుభావము లేదు. మఱియేమన సారస్వతజ్ఞానమునకును బాతాళతలస్పర్శమునకును దుష్కరత్వరూప సాధర్మ్యముచే బింబ ప్రతిబింబ భావమే కలదుకాన నిట దృష్టాంతాలంకారము స్పష్టము. ఒకటి ప్రస్తుతమును మఱియొకటి యప్రస్తుతమగుటచేఁ బదావృత్తిదీపకమునుగాదు. వైధర్మ్యముచేఁగూడ దృష్టాంతము సంభవించును, ఎట్లన?

తే॥ గీ॥ నీమనమహామింపఁదలఁపఁ - బో మహీశ!
మనయరులు మడిసిరిగద - యని ననిశము।
ఎంతతడ వినుఁడుదయాద్రి - కెగయఁడంత
తడవె చీకట్లు కడఁబడ - కడరిచెలఁగు॥

రాజునుగూర్చి మంత్రి వచనము. ఓరాజా! నీ వహంకారమ్ము పూనినంతనే మన శత్రువులు రణమునఁ జచ్చిరి. సూర్యుఁడుదయింప నంతవఱకే చీకట్లు విజృంభించునుగదా? ఇట మహీశు అహమ్మించుట కును సూర్యుఁడుదయాద్రి కెగయకుండుటకును వైధర్మ్యముచే బింబ

ప్రతిబింబ భావము. శత్రువులు చచ్చుటకును చీకట్లు చెలరేగుటకును వైధర్మ్యముచే బింబ ప్రతిబింబభావమును.

నిదర్శనాలంకారము. 19.

కం॥ తగు సమవాక్యార్థములకుఁ
దగనైక్యారోపమిడని - దర్శనమదియా।
జగతి నెది దాతృ సౌమ్యత
యగునాయది పూర్ణచంద్రు - న కళంకితగాన్ ॥

వాక్యార్థములు రెంటికి నైక్యమారోపించినచో నది నిదర్శనాలంకార మగును. దాతకు సౌమ్యత యేదికలదో యది పూర్ణచంద్రునకుఁ గళంకము లేకుండుటయేయగును. రెండును సంభవింపనివని తాత్పర్యము. ఇట యెదియదియను శబ్దములచే సౌమ్యతకును నకళంకితకును నైక్య మారోపింపఁబడెను. మఱియును,

మ॥ వనివాపోవుటయద్ది పీనుఁగుమెయిన్ - వాసింపనల్లుంచు టా
వనజాంకూరము మెట్టనాటుటదగన్ - వర్షించుటే చౌటఁదో।
కనుసారించుట కుక్కకున్ జెవిటికిన్ - గర్ణాంతికాలాప మం
ధునకద్దంబును జూపుటజ్ఞజను నెం - దున్ గొల్చుటెద్దిద్దరన్ ॥

ప్రస్తుతమగు మూర్ఖాశ్రయమునకును నప్రస్తుతములగు నరణ్యరోద నము మున్నగువానికిని 'ఎద్దీ' 'అద్ది' యను సర్వనామములచే నైక్య మారోపింపఁబడెను.

నిదర్శనాలంకారము. II

కం॥ ఇతరులు పదార్థవృత్తియు
నితరంబు నిదర్శనముగ - నెంతురు జగతిన్ ।
నతగాత్రి! నీదు కనుగవ
సతతము నీలాబ్జలీలఁ - జిక్కఁగఁబూనున్ ॥

వాక్యార్థములకువలెఁ బదార్థములకు నైక్యారోపము నిదర్శనమని కొందఱు తల్లంతురు. ఇట నేత్రద్వయము నీలోత్పలముల నీటును

బూనుట యసంభవము! ఒక వస్తువుయొక్క ధర్మము దానికేయగును గాని మఱియొకదానికిఁగాదుకాన. కనుక నీలోత్పలముల నీటువంటి నీటుపూనెనని చెప్పక తప్పదు. పదార్థవృత్తియనఁగా బదార్థము యొక్క యారోపము. కనుగవయందు నీలాంబుజముల నీటారోపింపఁ బడెను.

తే॥ గీ॥ కాంత విరహానుభవమున - గౌడయువతి
గండపాళినిఁబాండిమ - యుండునెద్ది।
కానఁబడునద్ది ఖర్జూరి - కావ్రిఫుల్ల
మంజరీగర్భగపరాగ - పుంజములను॥

ఇట నుపమానమగు ఖర్జూరమంజరీపరాగమందు నుపమేయమగు గౌడయువతీ గండపాండిమ మారోపింపఁబడెను. తొలి యుదాహరణ మున నుపమానధర్మమగు నీటు ఉపమేయమున నారోపింపఁబడె. అన్య ధర్మ మన్యవస్తువున నారోపింపఁబడినను సంభవము దుర్లభముగాన దానిని బోలిన ధర్మాంతరము కలదని చెప్పవలసియున్నది. కాన నిది యౌపమ్యమునఁ బర్యవసితమగుచున్నది. పదార్థవృత్తి నిదర్శనాలం కారమును జయదేవుఁడు లలితోపమయని నుడివెను.

కాంత విరహానుభవమున గౌడయువతియను పద్యమున నద్ది యెద్దియను సర్వనామములచే గండతలపాండిమకును మంజరీ గర్భరేణు పాండిమకును నైక్యారోపము చెప్పఁడుటచే నిది వాక్యార్థవృత్తి నిదర్శనయని ప్రాచీనులనిరి. కాని వాక్యార్థవృత్తి నిదర్శనయన వర్థ ద్వయమునకుఁగేవల మదియిది యను సర్వనామములచే నైక్యారోపము చెప్పుటయేకాక బింబ ప్రతిబింబభావముగల వస్తుద్వయమునకు సంబం ధించియున్న రెండువస్తువులకు నైక్యారోపము చేయుటయనియును బదార్థవృత్తి నిదర్శనయన నుపమానోపమేయ వస్తువులలో నొకదాని యందు మఱియొకదాని ధర్మమారోపించుట యనియును సిద్ధాంతీకరింప వలెను. ఇట్టి వ్యవస్థనాశ్రయించియే మాచే నుదాహరణములీయఁ బడెను.

'జగతి నెది దాతృసౌమ్యతయుగునాయది పూర్ణచంద్రున కళంకితగాన్' అను నుదాహరణమున నానందకరత్వరూపధర్మ సామ్యముచే బింబ ప్రతిబింబ భావమునొందిన దాతృ చంద్రులనెడు వస్తుద్వయమునకు సంబంధించిన సౌమ్యతయు నకలంకితయు ననెడు వస్తుద్వయమునకు నైక్యారోపము చూపఁబడినదికాన నచట వాక్యార్థవృత్తి నిదర్శనయనియు నట్లే 'వని వాపోవుట యద్ది' యను నుదాహరణమునఁగూడ మూర్ఖజనునకును వని మున్నగువానికిని సేవనానర్హత్వరూపధర్మసామ్యముచే బింబ ప్రతిబింబ భావముచూపి వానికి సంబంధించిన యాశ్రయము వాపోవుట మున్నగువానికిని నైక్యము చెప్పఁబడుటచే నదియును వాక్యార్థవృత్తి నిదర్శనయని యెఱుంగునది.

'కాంత విరహానుభవమున గౌడయువతి' యను పద్యమునఁ బదార్థద్వయమునకు నద్ది యెద్ది యను సర్వనామములచే నైక్యారోపము చెప్పఁబడినను నుపమానవస్తువునందు నుపమేయవస్తుధర్మమారోపింపఁబడుటచేఁ బదార్థవృత్తి నిదర్శనయే కాని వాక్యార్థవృత్తి నిదర్శన కాదని యెఱుఁగునది. వాక్యార్థవృత్తి పదార్థవృత్తి నిదర్శనలకుఁ బైరీతిగ లక్షణవ్యవస్థ చేయఁబడియుండుటచే నీక్రింది పద్యమున వేఱువేఱు వాక్యములు లేకున్నను వాక్యార్థవృత్తి నిదర్శనయే కాని పదార్థవృత్తి నిదర్శన కానేరదు. ఎట్లన?

చం॥ బిరబిర మాదుకోరికలఁ – బెల్లుగఁగూర్పను బేర్మిగన్న నీ
వరయఁగనుండ దీనతను – నంజలిగట్టుచు నన్యుఁజేరు మే ।
మరయక పాలఁదీయ దటి – యన్ బెరకాళ్లను బొమ్ముదన్ను నా
కరభముఁజేరఁజూచెదము – గా! శివ! స్వర్గవిచెంతనుండఁగన్ ॥

ఓశంకరా! కోరికలఁదీర్చునట్టి నీవుండఁగ దైన్యముతో నన్యుని జేరు మేము కామధేనువు దగ్గఱనుండ దానిని విడిచి పాలఁబిదుక దటిఁ జేరఁ దన్నునట్టి లొట్టిపిట్ట పిల్లను జేరఁదలఁచుకొనుచున్నాము. ఈపద్యమంతయు నొక్కవాక్యముగనేయున్నది. కాని రెండు వాక్యములుగా

లేదు. అద్దిమెద్దియను సర్వనామములచే వాక్యద్వయమునకు, నైక్యా రోపములేకున్నను పైనంజెప్పినరీతిగ వాక్యార్థవృత్తి నిదర్శనాలక్షణము ననుసరించి యీపద్యమున వాక్యార్థవృత్తి నిదర్శనాలంకారము కలదు. ఎట్లన ? ఇట సమస్తమైన కోరికలనిచ్చు శంకరుఁడుండ క్షుద్రనృపతి నాశ్రయించు నరునకు, కామధేనువు వశమైయుండఁ బట్టరాని కరభ శిశువు నాశ్రయించు నరునితో నైక్యము చెప్పఁబడినది. ఉపమాన కక్ష్యలోనున్న కామధేను కరభములకు నుపమేయ కక్ష్యలోనున్న శివ క్షుద్రధనికులకు యథాక్రమముగ బింబ ప్రతిబింబ భావము గ్రహిం పఁబడవలెను. అట్లే చేరుటయనెడు క్రియలకు బింబ ప్రతిబింబ భావము కలదు. మఱియు.

తే॥ గీ॥ కడలినీతను దరియింపఁ – గడఁగు వార

లెంచ నీగుణజలధి ను – తించిరయ్య ॥

సముద్రము నీదఁదలఁచిన నరులకును వర్ణనీయప్రభుగుణరాశిని నుతించిన నరులకు నైక్యమారోపింపఁబడెను. కడలికిని గుణరాశికిని బింబ ప్రతి బింబ భావము. ఇట వాక్యద్వయములేకున్నను బిరబిర మాదు కోరిక లనెడు పద్యమందువలె నిచ్చటను వాక్యార్థవృత్తి నిదర్శనాలంకారము నిశ్చయము. ఇట్లే

ఆ॥ ధరణి రాజసేవ – నరులకు నెల్లెడఁ

గత్తివాయినాకు – టొత్తియొత్తి ।

అరయఁ బంచవక్త్ర – పరిరంభణంబటుల్

భుజగతరుణి మోము – ముద్దుగొంట ॥

ఇట ప్రస్తుతమగు రాజసేవయు నప్రస్తుతములగు కత్తివాయి నాకుట మున్నగునవియుఁ బదసముదాయ రూపమగు నేకపదముచే గ్రహింపఁ బడినను బింబ ప్రతిబింబ భావాపన్న వస్తువిశిష్టములగు ధర్మములకు నైక్యారోపము చేయఁబడుటచే వాక్యార్థవృత్తి నిదర్శనయగుచున్నది. ఎట్లన ? కత్తివాయి, రాజు, సింహము, భుజగతరుణి మోము, ఉపదా

ర్థములకు హానికరత్వరూపధర్మసామ్యముచే బింబ ప్రతిబింబభావము. అట్టి బింబ ప్రతిబింబభావముగల రాజు మున్నగువానికి సంబంధించిన సేవ మున్నగు క్రియారూప ధర్మములకు నైక్యము చెప్పఁబడినదికాన: రూపకముకన్న నిదర్శనమునకు భేదమేమనిన రూపకమున నుక్తలక్షణ లక్షితమగు బింబ ప్రతిబింబభావముండదు.

రూపకస్థలమున బింబ ప్రతిబింబభావశంకయును లేదు. ఎట్లన?

తే॥ గీ॥ బలిని నిగ్రహమొనరింపఁ – బైకినిగుడు
చక్రధరు పాదదండమ – వక్రలీల।
నళినభవు విష్టరాంబుజ – నాళదండ
మాయె నదిమాకు మోదసౌ – ఖ్యములనిడుత॥

బలిచక్రవర్తిని నిగ్రహింపఁ బైకినిగిడిన చక్రధరు పాదదండము బ్రహ్మాసనమగు పద్మమునకు నాళదండమయినది. ఇది విశిష్టరూపకము. బలి నిగ్రహమునకై పైకి నిగుడుటయను ధర్మముతోఁ గూడిన చక్రధరు పాదమునకు బ్రహ్మాసనీభూతపద్మ సంబంధము కలుగుటయనెడు ధర్మముతోఁ గూడిన నాళదండముతో రూపకముగాన నిది విశిష్టరూపకము. పైకి నిగిడినయను నుపమేయ విశేషణమునకును నళినభవు విష్టరాంభోజ సంబంధియగునెడు నుపమాన విశేషణమునకును బింబ ప్రతిబింబ భావములేదు. పద్మనాళమునకు బ్రహ్మాసన పద్మసంబంధము కల్గిన రీతిగనే యట్టి పాదదండమునకుఁ గూడ విష్ణునాభీగత పద్మనాళసంసర్గము కలదని సూచించుటకే యావిశేషణములు గ్రహింపఁబడినవి. కాన నిది నిదర్శనకాదు.

ఇక సావయవరూపకస్థలమందు విషయ విషయి విశేషణములకుఁ బరస్పరసాదృశ్యమువలన బింబ ప్రతిబింబభావము శంకింపవచ్చును. అయినను నట్టి తావుల విషయి విషయములకు వేఱుగ నైక్యారోపమును వాని విశేషణములకు వేఱుగ నైక్యారోపముఁ జేయఁబడియుండుటచే నిదర్శనాలంకారమనుటకు వీలుకాదు. సావయ రూపకమున కుదాహరణమెట్లన?

ఉ॥ వెన్నెల బూదిపూతఱను - వెల్లయి, పూసుచు రిక్కలెమ్ములన్
గన్నులఁగప్పు మాయలను - గాంచిన యీనిసిజోగురాలు దాఁ ।
దిన్నన ద్వీపమున్ విడిచి - ద్వీపముపట్టెడుఁ జంద్రుపుత్త్రిలోఁ
జిన్నె నెపంబునన్ వెలయు - సిద్ధవరాంజన మోలిఁబట్టుచున్ ॥

రాత్రియనెడు యోగిని వెన్నెలయనెడు బూదిని బూసికొని రిక్కలనెడు నెముకలను ధరించి చంద్రుఁడనెడు పుత్త్రిలో మచ్చయనెడు నెపముచే సిద్ధాంజనమును దాల్చి ద్వీపమునుండి మఱియొక ద్వీపమునకు సంచరించుచుండెను. ఇచ్చట వెన్నెల మున్నగువానితోఁ గూడిన రాత్రికిని భస్మము మున్నగువానితోఁ గూడుకొనిన యోగికిని రూపకము. కాన నిది సావయవరూపకము. ఇట నవయవములగు వెన్నెలకును భస్మమునకును రూపకము. నక్షత్రములకు నస్థిఖండములకును రూపకము. అవయవి పదార్థమగు రాత్రికిని యోగినికిని రూపకము. ఇట్లు వేఱువేఱుగ నవయవావయవులకు రూపకమగుటచే నవయవ పదార్థములకు బింబ ప్రతిబింబ భావాపేక్ష లేదు. కాన నిదర్శనయనరాదు. నిదర్శనాలంకార లక్షణమందలి వాక్యార్థపదమునకు యథాశ్రుతమగు నర్థమునే చెప్పి వాక్యార్థద్వయమునకు నైక్యారోపమే నిదర్శనయనినచో ధరణి రాజసేవయనుచోట వాక్యద్వయము లేకుంటచేఁ బదార్థవృత్తి నిదర్శనయనియె తెలియవలెను. ఈమతమునఁ బదార్థవృత్తియనఁ బదార్థముయొక్కగాని పదార్థధర్మముయొక్కగాని యారోపణము ద్వివిధము. కన్నుగవ నీలాంభుజములనీటుననుచోట ధర్మారోపమనియు ధరణి రాజసేవ యనుచోటఁ బదార్థారోపమనియు భేదము నెఱుఁగవలయును.

## నిదర్శనాలంకారము. III

కం॥ సదసత్పదార్థ బోధన
మదియు నిదర్శనయటందు - రన్యములక్రియఁ ।
తుదఁబడు రాజవిరోధి య
నిదెసల్ విడి తమముగుందు - నిశవిధుఁడెగయన్ ॥

కం॥ తెలుపుచు ధనచయముల ఫల
మిలసుహృదభిమతములరసి – యిడుటయయనిత।
మ్ములగమికినుఁ డుదయమునను
వెలయుచు వడినలరు సిరుల – వెనుపులనునిడున్ ॥

అన్యుల వ్యాపారములచే మంచిచెడుగులను బోధించుటయు నిదర్శన యని కొందఱనిరి. రాజవిరోధి నశించునని తెల్పుచు చీకటి చంద్రోదయమున నశించుచున్నది. ఇది యసత్పదార్థబోధనము. రెండవ పద్యమున సంపదలకు ఫలము స్నేహితుల కోర్కెలను దీర్చుటయని తెల్పుచు సూర్యుఁడు పద్మములకు నుదయమునఁ గాంతులనిచ్చుచున్నాడు. ఇది సత్పదార్థ బోధనము. మఱియు.

తే॥ గీ॥ సారరహితపదార్థము – చైచ్చఃపదంబు
నొందియును వేగ పతనంబు – నొందుననుచు।
గిరిశిరంబునఁబడిన శీ – కరగణంబు
వాతపోతవిధూతమై – పాతమొందు ॥

ఇట గిరినుండిపడెడు నీటిబిందువులుఽసత్పదార్థమును బోధించుచున్నవి.

తే॥ గీ॥ ఆగతుండగు రవి నుద – యాద్రి తనదు
నుత్తమాంగమునందున – నెత్తుకొనియె।
పూజ్యులే తెంచ వారికిఁ – బూజసల్పు
టుచితమని తెల్పుచు గృహుల – కుచితవిధిని ॥

ఇట యుదయాద్రి దన క్రియచే సత్పదార్థ బోధనముచేయుచున్నట్లు వర్ణింపఁబడెను.

కొందఱీ నిదర్శనాత్రయమున మొదటిదియు రెండవదియు నసంభవద్వస్తుసంబంధము కలవియనియు మూఁడవది సంభవద్వస్తుసంబంధము కలదనియు నుడివిరి. ప్రథమద్వితీయ భేదముల వాక్యార్థపదార్థములకు నైక్యము సంభవింపకున్నను సంభవించునటులు చెప్పఁబడినది. అది ప్రస్తుతాప్రస్తుతములకు సామ్యకథనమునఁ బర్యవసిం

చును. మూడవ నిదర్శనములో నట్టి బోధ సంభవింపవచ్చును. ఉదయభానుని నెత్తిఁగొనిన యుదయాద్రివలె నతిథుల నాదరించుట యుక్తమనెడు బోధ చూచువారికి సంభవింపవచ్చును. కాన నిది సంభవించెడు వస్తుసంబంధము కలదని నుడివిరి.

### వ్య తి రే కా లం కా ర ము. 20.

కం॥ బెరయును వ్యతిరేకమురుచి
భరముపమానోపమేయ - వైశిష్ట్యమునన్ ।
గిరులవలె నున్నతులు స
త్పురుషులు మఱికనఁ బ్రకృతి మృ - దువులిలఁదలఁపన్ ॥

ఉపమానోపమేయములకు నెచ్చుతగ్గులు చూపింప వ్యతిరేకమగును. సత్పురుషులు గిరులవలె నున్నతులని చెప్పి మెత్తని హృదయము కల వారని యాధిక్యము చూపఁబడినది.

తే॥ గీ॥ కల్పశాఖపరివాళంబు - కంటె నీదు
కరమునకు వీర! వైశిష్ట్య - మరయనిదియె ।
తొల్లిటిది కర్ణభూషణ - మల్లఁజేయు
నావలిది కర్ణదూషణ - మడరఁజేయు ॥

రాజకరమునకుఁ బ్రివాళముకన్న నాధిక్యము చెప్పబడినది. కర్ణభూషణము కర్ణాలంకారము. కర్ణదూషణము దానములోఁ గర్ణుని దిరస్కరించుచున్నదియని యర్థము.

ఉపమేయమునకు న్యూనత యెట్లనిన?

శా॥ రక్తింగూర్చును గ్రొన్ననల్ నిను బ్రియా-రాజద్గుణంబుల్ ననున్
సక్తింజేరు శిలీముఖంబులు నినున్ - మారాస్త్రముల్ నన్ను నా ।
రక్తాంఘ్రిన్ సతితాపునీకుముదమా - రా! నాకునున్ సామ్యము
త్సిక్తంబెన్న నశోక! కానివిధిసే - సెన్ గ్గాసశోకున్ ననున్ ॥

అశోకవృక్షమునుగూర్చి విరహివచనము. అశోకవృక్షముతో సామ్యమును జూపి శోకములేని యశోకముకన్నఁదనకు న్యూనత నాపాదించుకొనియున్నాఁడు. ఇది శ్లేషయుక్తము.

ఎచ్చుతగ్గులు తెల్పని వ్యతిరేకముగూడఁగలదు. ఎట్లన ?

కం॥ చిరతరనిబద్ధముష్టితఁ
జరకోశనిషణ్ణత సహ – జమలినతను నీ।
ధరఁ గృపణకృపాణములకు
నరయఁగనగు సమత, భేద – మాకారమునన్ ॥

కృపణకృపాణములకు గుణములలోఁ బోలికగలదు. కేవలము 'ఆ' యను నక్షరముచేతనే భేదముకలదు. గుణములలోఁ బోలికయెట్లన ? లోభి పిడికిలినున్న ధనమును విడువఁడు. కత్తి గట్టిగా నతుకఁబడిన పిడికలది. లోభి నశ్వరమగు ధనాగారమునందే నివసించియుండును. కత్తి యొరయందుండును. లోభి సహజమగు వంచనాబుద్ధి కలవాఁడు. కత్తియు నల్లగనుండును. ఈధర్మములచే సామ్యముకలదు. ఈభేదమునఁగూడ వ్యతిరేకమునఁ జమత్కారముగలదు.

సహోక్తి – యలంకారము. 21.

కం॥ కమనీయంబగు సహభా
వము చెలఁగ సహోక్తియనఁగఁ – బఱఁగున్ గృతులం।
దు, మహీపతి కీర్తి దిగం
తముదాఁకెఁ దదీయ రిపుగ – ణముతోఁగూడన్ ॥

అందమగు సహచరభావము సహోక్తియగును. మహీపతి కీర్తి దిగంతమువఱకు వ్యాపించెననియు నతని శత్రువులంతవఱకుఁ బాఱిరనియు. మఱియును.

చం॥ బడలిన భాతినీడచనెఁ – బాంథులతోడనె చెట్లక్రిందకున్
జడతయుఁ జేరెగ్లానివనె – సారసనీరతలంబు మీలతోన్ ।

వడవలె నీటిఁబీల్చినఁ బ్రి - భాకరరశ్మి జనంబుతోడుతన్ ।
బడలికచేవలెన్నిదుర - భామలతో గృహమధ్య మొందెడున్ ॥

గ్రీష్మవర్ణనము. మధ్యాహ్నసమయమునఁ జెట్లనీడలు చెట్లక్రిందకుఁ జేరును. బాటసారులుగూడ నచ్చటకుఁ జేరుదురు. బాటసారులు బడలికచేఁ జేరునటులు నీడకూడ బడలికచేఁ జేరెనా! యని కవి చమత్కరించినాఁడు. జడతయనఁగాఁ జల్లతనము. అది బడలినదియా! యనునట్లు చేపలతోఁగూడ సరస్సుల నీటి యడుగుభాగమునకుఁ జేరెను. వడగొట్టుటచేతనా! యనునటులు సూర్యరశ్మిగూడ జనంబులతో నీటిని ద్రావెను. నిద్రకూడ బడలికచేతనువలె స్త్రీలతో గృహమధ్యముఁ జేరినటులు కవి చమత్కరించినాఁడు. ఇట పాంథులతోఁగూడ మీలతోఁగూడ నీరీతిగ సహభావముంటచే సహోక్తి. కమనీయమగు సహభావమనుటచే సొగసులేని సహభావమున నలంకారము పొసఁగదు. ఎట్లన?

తే॥ గీ॥ పఱఁగిద్వీపాంతరీయ ల - వంగపుష్ప
సురభివాయువు చెమ్మట - మూఱలాడఁ ।
బొసఁగ శ్రీతాలమర్మరాం - భోధి తీర
భూమి విహరింపుమీతని - తో మృగాక్షి! ॥

ఇందుమతీ స్వయంవరములోని సునందావచనము. ఓ యిందుమతీ! లవంగపుష్ప సురభియగు వాయువు చెమ్మటనార్ప శ్రీతాలవృక్షముల తోఁగూడియున్న సముద్రతీరమున నీరాజుతోఁగూడ విహరింపుము. ఇచ్చట సహభావములో యథార్థకథనమేకాని సొగసులేదు.

## వినోక్తి - యలంకారము. 22.

కం॥ కుందొందఁగ వర్ణ్యమువిడు
పొందుటచే నొకటఁదగ వి - నోక్తిచెలంగున్ ।
సుందరమైననుదుష్టము
చందమునన్ విద్య వినయ - సంపదనొలఁగన్ ॥

ఒక వస్తువుతో వర్ణ్యమాన పదార్థము విడుపొందుటచే సొగసు లేకున్న నది వినోక్తియగును. విద్య వినయ సంపద లేకున్నచో స్వాయముగ హృద్యమయ్యు దుష్టమగును.

కం॥ ఎవ్వాఁడు రాముఁజూడఁడో
యెవ్వానింగనఁడో రాముఁ - డేర్పఱిచి నిజం।
బవ్వాఁడు జనవినిందితుఁ
డవ్వానిని స్వాత్మగూడ - నవమతిసేయున్ ॥

రామదర్శనము లేకున్నచో మానవునకు న్యూనత చెప్పఁబడియె. వినార్థకమగు పదము లేకున్నను వినార్థము స్ఫురించినచో వినోక్తి యగును. ఇట వినాశబ్దము లేదు. వినార్థము తోఁచుచున్నది.

వి నో క్తి - య లం కా ర ము. II

కం. అందముగన వర్ణ్యంబొకఁ
డొందఁగవిడుమరయు నిల వి - నోక్తియయగు రా।
జేందుఁడ! నీ సభసొగసుం
బొందుర! ఖలసంగతంబుఁ - బొందమిఁదగురా! ॥

ఒక వస్తువు తొలఁగుటచే వర్ణ్యవస్తువు సొగసు నొందినను వినోక్తి యగును. ఉదాహరణము స్పష్టము. మఱియును.

మ॥ పొడువంగన్ దొగ ఱేఁడు చీకటి చెఱన్ - బోనాడు రేయిన్ వలెన్
విడువన్ ధూమ్యతగన్ నిశాసమయ వ - హ్నిజ్వాలనున్ బోలె లోఁ
బడఁదీరంబు కలంతఁజెంది యది పో - వన్ దేరుగంగన్ వలెన్
విడ మోహంబు ప్రసన్నయౌనటులు త-న్వీ! యీ పెఁజూతుంగదే!॥

విక్రమోర్వశీయములో రాక్షసునినుండి యూర్వశిని విడిపించి యాపె మూర్ఛనుండి తెలివొందుచున్నటులు చూచి విక్రముఁడాపె చెలితో నిట్లనియె. చంద్రుడుదయింపఁ జీగటిని బాయుచున్న రాత్రినివలెను, పొగనుండి బయలుపడుచున్న వహ్నిజ్వాలను వలెను, గట్టు విఱిగిపడుటచేఁ గలకఁజెంది తేరుచున్న గంగానదినివలె నీపెను జూచుచున్నా

నని. చీకటి మున్నగునవి, లేకుంటచే రాత్రి మున్నగువానికి రమ్యత వర్ణింపఁబడినది.

సమాసోక్తి - అలంకారము. 23

కం॥ స్ఫురణం బప్రస్తుతమున
కరయు సమాసోక్తి ప్రస్తు - తార్థంబెన్నన్ ।
కర మైంద్రీముఖమును హిమ
కరుఁడదె! చుంబించుఁగనుము - కడు రక్తుండై ॥

ప్రస్తుతార్థము వర్ణింపఁబడ విశేషణసామ్య బలమున నప్రస్తుతార్థ స్ఫూర్తియయినచో నది సమాసోక్తియనఁబడును. ప్రస్తుతాప్రస్తుతములగు వృత్తాంతముల రెంటిని సమాసముగ ననఁగా సంక్షేపముగఁ దెల్పుటచే నిది సమాసోక్తియైనది. ఓ చెలికాడా! తూర్పుదిక్కు ముఖభాగమునుఁ జంద్రుఁడు రక్తవర్ణుఁడై స్పృశించుచున్నాఁడు చూడుము. ఇది ప్రస్తుతార్థము. ఇంద్రసంబంధినియగు నొక స్త్రీని రక్తుఁడగు నొక పురుషుఁడు చుంబించుచున్నాఁడు. ఇది యప్రస్తుతార్థము. ఇట రక్తవర్ణము కలిగి తూర్పుదిక్కుయొక్క యారంభభాగమును స్పృశించుచున్న చంద్రుని యుదయము వర్ణింపఁబడుచుండ రక్త-ఐంద్రీ-ముఖశబ్దములచే శ్లేషవశమున ననురాగముకలవాడు, ఇంద్రసంబంధినియగు స్త్రీ, వదనము ననెడు నర్థాంతరములు బోధింపఁబడుటచేతను, చుంబించుననెడు క్రియాపదమునకు వదనస్పర్శమే ముఖ్యార్థమగుట చేతను హిమకరుఁడను పుంలింగము, ఐంద్రీశబ్దగతమగు స్త్రీలింగము చేతను బరవనితాసక్తుఁడగు జారపురుష వృత్తాంత మప్రస్తుతమగునది గోచరించుచున్నది.

శ్లిష్టవిశేషణములచేతఁగాక కేవల సాధారణ విశేషణములచే తనే యప్రస్తుతార్థస్ఫూర్తి యెట్లన ?

శా॥ చిందాడన్ గుచముల్ కురుల్ చెదరి భా-సింపన్ సరుల్ తూఁగ నొ
ప్పందాటంకములాడఁ జెక్కులఁ జెమ-ర్పన్ ముద్దుమోమెంతో ప్రే॥

లందట్టన్ నునుఁగేల నూర్పుల తెరల్ - గ్రాలంగనీతన్వి నీ
యందే కూర్చునాడు కొంతయును బు - న్యాశ్రీగదే! కందుకా! ॥

కందుకక్రీడనున్న యొక యువతినిఁజూచి యొక యువకుఁడిట్లు తలఁచు చున్నాఁడు. ఇట చిందాడన్ మున్నగు క్రియావిశేషణ సామ్యముచేఁ బురుషాయితమున నాసక్తురాలగు నాయికా వృత్తాంతము స్ఫురించు చున్నది. వెనుకటి పద్యమున విశేషణములు శ్లేషించినవి. ఇట శ్లేషింపక ప్రస్తుతా ప్రస్తుతార్థములు రెంటికిని సాధారణముగ సంబంధించి యున్నవి.

శ్లిష్టవిశేషణములయొక్కగాని సాధారణ విశేషణములయొక్క గాని సంబంధములేక కేవల సాదృశ్యమువలననే సమాసోక్తి గలదు. ఎట్లన ?

శా॥ ఏఱుల్ వాఱెడిచోటఁ దిన్నెలివిగో-యిస్సీ! యవేమూపుచాల్
చూఱాడంగల చెట్లగుంపులు బయ-ల్లున్ దాఱుమాఱయ్యెనే।
వేఱంచెంతుననిన్ గడుంగడు నెడన్ - వీక్షింప స్వస్థానమున్
మీఱన్ లేని ధరాధరంబులదిగా - నిండారఁ దోపించెడున్ ॥

ఉత్తర రామచరితమున శంబూకవధానంతరము రాముఁడా తావు దండకయని యెఱిఁగి యిట్లనుకొనుచున్నాఁడు.

ఇట ప్రస్తుతమగు వనవృత్తాంతముచే సాదృశ్యవశమునఁ బూర్వ పరిస్థితులు తారుమారయియున్న గ్రామనగర వృత్తాన్త మప్రస్తుతము స్ఫురించుచున్నది.

పై రీతిగ సమాసోక్తి మూఁడు విధములు. (1) శ్లిష్టవిశేషణ నిబంధన (2) సాధారణవిశేషణ నిబంధన (3) సారూప్య నిబంధన యని. పై మూఁడింటికిని వరుసగ నుదాహరణములీయఁబడెను.

సమాసోక్త్యలంకారమున శ్లిష్టసాధారణ విశేణముల బలముచే తఁగాని సారూప్యబలముచేతఁగాని స్ఫురించిన యప్రస్తుత వృత్తాన్తమును బ్రస్తుత విశేష్యమున నారోపించుట కవి కభిమతమును జమత్కారి

యున్నై యున్నది. ప్రస్తుతముతో సంబంధింపని యప్రస్తుత వృత్తాంత స్ఫూర్తి యసంబద్ధ ప్రలాపమగునుగదా ?

పైయుదాహరణములఁ గ్రమముగాఁ బ్రస్తుతమగు చంద్రుని యందు నప్రస్తుత జారవృత్తాంతమును, ప్రస్తుతమగు కందుకమున నాయికావినోదిత నాయక వృత్తాంతమును, ప్రస్తుత దండకాటవిని నప్రస్తుతమగు గ్రామనగరాది వృత్తాంతమును నారోపింపవలెను.

రూపకాలంకారమునఁ బ్రస్తుతధర్మియందున నప్రస్తుతధర్మి యొక్క రూపమారోపింపఁబడును. సమాసోక్తిలోఁ బ్రస్తుత ధర్మియం దున నప్రస్తుత ధర్మిరూపముగాక యప్రస్తుత వ్యవహార మారోపింపఁ బడును.

రూపకాలంకారమునఁ బ్రస్తుత ధర్మియందున్న నప్రస్తుత ధర్మి యొక్క రూపమారోపింపవలసివచ్చుటకు రెండు హేతువులు గలవు. ఎట్లన ?

మొదటి హేతువు. ముఖచంద్రుఁడనెడు రూపకస్థలమున ముఖ మందుఁ జంద్రరూప మారోపింపవలసివచ్చుటకు ముఖశబ్దమునకు దగ్గ ఱగఁ జంద్ర శబ్దము ప్రయోగింపఁబడుటయే హేతువు.

రెండవ హేతువు. పై రీతిగ నప్రస్తుత ధర్మివాచకపదము ప్రయో గింపఁబడకున్నను నప్రస్తుతమగు నసాధారణ వ్యాపారము చెప్పఁ బడుట. అది యెట్లన ?

తే॥ గీ॥ కాంతిమంతంబు నభిసారి - కా ముఖంబు
నంబుదుఁడునిశఁదన విద్యు - దక్షిఁజూచి ।
దళితకుతలధారానిపా - తములతోడ
నుర్విఁబడెనేమొ ! విధుఁడంచు - నార్వఁదొడఁగె ॥

వర్షాకాలమున రాత్రి నొక యభిసారిక ప్రియుని యింటికేగుచుండఁగా నామె మోమును మేఘుఁడు తన మెఱపనెడు కంటితోఁజూచి భూమిని బ్రద్దలుచేయునట్లు క్రిందఁబడు నుదక ధారలతోఁగలిసి యాకసమందలి చంద్రుఁడు భూమిపైఁబడెనా ! యని యఱచెను. గర్జించెనని యర్థము.

ఈపద్యమున నేకదేశవివర్తిరూపకము. అవయవముల రూపకమును జూపి యవయవిని దానినిఁ జూపకుండుట యేకదేశవివర్తిరూపకము. అచ్చట నవయవియందు రూపకము తోఁపింపఁబడును. పై పద్యమునఁ జూచి యను దర్శనక్రియకు ననుకూలముగ విద్యుదక్షియను చోట నక్షికిప్రాధాన్యము కలుగునటులు 'మయూరవ్యంసకాదయశ్చ' అను పాణిని సూత్రముచే రూపకసమాసము చేయవలయును. ఇట్టి యవయవరూపకముచే నవయవియగు మేఘునియందు ద్రష్టయగు పురుషునియొక్క రూప మారోపింపకతప్పదు.

ఇట ద్రష్టృపదములేకున్నను 'జూచి' యనెడు పదముచేఁ జెప్పఁబడిన దర్శనరూపమగు నసాధారణ వ్యాపారము సిద్ధించుట కొఱకట్లారోపింపక తప్పదుకదా ?

అట్లే "ఏలానీపాడఁగాంచి" యనెడు రూపకోదాహరణమునఁ గూడ నప్రస్తుత ధర్మివాచకమగు విష్ణుపదము పద్యమునఁ బ్రయోగింపఁబడకున్నను సేతుమంథన క్రియాకర్తృత్వరూపమగు నసాధారణ ధర్మము చెప్పఁబడుటచేఁ బ్రస్తుతుఁడగు ప్రభువునందు నప్రస్తుతధర్మియగు విష్ణువుయొక్క రూపమారోపింపఁబడినది.

పై రీతిగ సమాసోక్తియొక్క యుదాహరణముల నప్రస్తుత ధర్మివాచకపదముగాని లేక యప్రస్తుత ధర్మియొక్క యసాధారణ వ్యాపారముగాని చెప్పఁబడకుంటచేఁ బ్రస్తుత ధర్మియందు నప్రస్తుత ధర్మియొక్క రూపమారోపింప నవసరములేదు. కాన నప్రస్తుత వ్యవహారసమారోపమే తగును.

కాని సమాసోక్తిలోఁగూడ నప్రస్తుత ధర్మియొక్క రూపము ప్రస్తుత ధర్మియందారోపింపక తప్పదనుటకు మఱియొకరీతిగ శంకింప వచ్చును. ఎట్లన ?

భిన్నభిన్న పదములచే విశేషణములను గ్రహించినచోట నా విభిన్నవిశేషణములు తమ విశేష్యములతో నన్వయించునటులు

సమాసోక్తిలోఁగూడ శ్లిష్టవిశేషణములచేతఁగాని సాధారణ విశేషణములచేతఁగాని గ్రహింపఁబడిన ప్రస్తుతాప్రస్తుత వ్యాపారములు తమతమ విశేష్యములతో ననఁగా ధర్మిపదార్థములతో నన్వయించును. ఇట్లు ప్రస్తుత వ్యాపారము ప్రస్తుత ధర్మియగు చంద్రునితో నన్వయించునటులు, అప్రస్తుతమగు వ్యాపారము కాముకునితో నన్వయించుటకుఁ గాముకునియొక్క స్ఫురణము తప్పదుకదా? ఇట్లగుచో "కాంతిమంతంబు నభిసారికా ముఖంబు" ననెడు నేకదేశవివర్తిరూపకోదాహరణమందువలె నిచ్చటను గమ్యమానమగు కాముకునకుఁ బ్రస్తుత ధర్మియగు చంద్రునియందు నారోపము తప్పదుకదా? పై యేకదేశవర్తిరూపకమున ద్రష్టృపురుషుఁడు 'చూచి' యనెడు శబ్దముచే గమ్యమానుఁడగుటచే నట ధర్మిస్ఫూర్తి శబ్దతఃప్రాప్తమగుచున్నది. ఈ సమాసోక్తియందు నప్రస్తుత ధర్మిస్ఫూర్తి యర్థతఃప్రాప్తమగుచున్నది. ఇంతయే భేదముకదా? యని.

దీనికి సమాధాన మెట్లన? సమాసోక్తియందుఁ బ్రస్తుత ధర్మితో నన్వయించిన ప్రస్తుత వృత్తాంతమునకువలె నప్రస్తుత ధర్మితో నన్వయించిన యప్రస్తుత వృత్తాంతమునకును బ్రాధాన్యముకలదు. అట్లే యప్రస్తుత వృత్తాంతాన్వయమునకై యప్రస్తుత జారాది ధర్మిస్ఫూర్తియును గలదు. కాని పై యేకదేశవర్తిరూపకోదాహరణమున దర్శనక్రియ సిద్ధించుటకై మేఘునియందు ద్రష్టృపురుషునియొక్క రూపమారోపింపక తప్పదు. ఆరీతిగ సమాసోక్తిలోఁ బ్రస్తుత ధర్మియందు నప్రస్తుత ధర్మియగు కాముకాదులయొక్క రూపమారోపింపఁ దప్పదనుటకుఁ దగినంత యసాధారణ కారణము గన్పట్టదు. ఇదియే సమాధానము.

ఎంతమాత్రమును బ్రస్తుతముతో నన్వయింపని యప్రస్తుత స్ఫూర్తి యనుచితముగాన నా శ్లిష్టసాధారణ విశేషణములచే స్ఫురించిన యప్రస్తుత వృత్తాంతము ప్రస్తుత ధర్మియందారోపింపఁబడుచున్నది.

ఆ యప్రస్తుత వృత్తాంతముఁగూడ నప్రస్తుత ధర్మిని సంబంధించినదిగనే యారోపింపఁబడును.

అదియెట్లన ? ప్రభువును సంబంధించిన యశ్వము కంటఁబడి నంతనే యది ప్రభువును స్ఫురింపఁజేయును. పిమ్మట నీయశ్వము ప్రభువును సంబంధించినదన్న బోధకలుగును. అట్లే సమాసోక్తిలోఁగూడ శ్లిష్టసాధారణ విశేషణములచే నప్రస్తుతమగు పరవనితా ముఖచుంబనాది రూపమగు వృత్తాంతము తొలుత స్ఫురించును. పిమ్మట నప్రస్తుతమగు కాముకాది ధర్మిని స్ఫురింపజేసి తత్సంబంధిగా బోధవిషయమగును. అట్టి యప్రస్తుత వ్యాపారమునకుఁ బ్రస్తుత ధర్మియందు సమారోపమగును. ఇట్లగుటచే కవిసమ్మతమును జమత్కారియునగును. దీనిచే సమాసోక్తియందు వ్యవహార సమారోపమేకాని రూపసమారోపము కాదని తేలినది. ఇట యొక శంకకలదు. ప్రస్తుతాప్రస్తుతములు స్వస్వధర్మిపదార్థములతో నన్వయించునపుడు వానికి సమప్రాధాన్యముండుటచే నప్రస్తుతమగు కాముకవృత్తాంతమునకు ధర్మియగు కాముకునియందే ప్రస్తుతమగు చంద్రవృత్తాంతమేల యారోపింపరాదని. దీనికి సమాధాన మెట్లనిన ?

గమ్యమానమగు జారరూపధర్మియందుకన్న వాచ్యమగు చంద్రరూపధర్మియందు నప్రస్తుతవ్యవహార సమారోపమే యుచితమగునని.

అప్రస్తుత ధర్మిరూప సమారోప మంగీకరించనిచో నప్రస్తుత ధర్మిగమ్యుఁడగుననెడు ప్రాచీనాలంకారికుల లక్షణమెట్లు సంగతమగును? ప్రాచీనుఁడగు విద్యానాథుని సమాసోక్తిలక్షణమెట్లన ?

కం॥ ప్రకృత విశేషణసామ్యం
బకలంకతఁగలుగుకతన – నప్రకృత ధర్మి ।
ప్రకటీభవనము మతి సక
లకృతి సమాసోక్తియన ని – లాస్థలిఁజెలఁగున్ ॥

ప్రస్తుత విశేషణములచే నప్రస్తుతధర్మి స్ఫురింపఁజేయఁబడినచో నది సమాసోక్తియగును. అప్రస్తుత వ్యవహారము గమ్యమగునని చెప్పక యప్రస్తుత ధర్మిగమ్యుఁడని చెప్పిన ప్రాచీనుల లక్షణ మెట్లు సంగత మగును? ఈ ప్రాచీన లక్షణమును జూచినచో ప్రస్తుత ధర్మియందు గమ్యమానమగు నప్రస్తుత ధర్మియొక్క రూపమే సమారోపింపఁబడ వలెనని ప్రాచీనుల యభిప్రాయముగా, దోఁచుచున్నది. లేకున్న నప్రకృతధర్మిగమ్యమానమగునని వారేల స్పష్టముగఁజెప్పెదరు?

సమాధానము. చంద్రుఁడు కమురక్తుండై యనెడు పై యుదాహరణమున శ్లిష్టములగు ముఖరక్తపదములచేతను జుంబించు మున్నగు పదములచే వ్యక్తమగు నప్రస్తుత వృత్తాంతమునకు నప్రస్తుత ధర్మియగు కాముక సంబంధము లేకుండఁగఁ బ్రస్తుత ధర్మియగు చంద్రు నందు నారోపించుట చారుత్వమును గూర్పదు కానఁ దత్సంబంధిగనే యారోపము చేయవలయునని లోఁగడఁ జెప్పియున్నాము. కేవలము శ్లిష్టవిశేషణములచేఁ గాముకుఁడు వాచ్యరీతిగఁ జెప్పఁబడఁడు. కాన నప్రస్తుత ధర్మికి వ్యంగ్యరీతిచే నభివ్యక్తి తప్పదుకానఁ బ్రాచీనులట్లు తమ లక్షణమున నప్రస్తుత ధర్మివ్యంగ్యమగునని చెప్పుట యసంగతము కాదు.

ఇచ్చట నొక సంశయము కలుగుచున్నది. ఎట్లనిన? ప్రకృతార్థముతో సంబంధింపని యర్థాంతరాభివ్యక్తి యసందర్భప్రలాపమగును గాన నట్టి యప్రస్తుత వృత్తాంతమును ధర్మి సంబంధము లేకుండగనే చమత్కారమునకై ప్రస్తుత విశేష్యమున నారోపింపవచ్చును. ఇట్లు చేసినచో నసందర్భార్థాభిధానదోషము తొలంగును. కాన నప్రస్తుత ధర్మియగు కాముకునియొక్క (జారునియొక్క) యభివ్యక్తి లేకుండఁగనే శ్లిష్టపదములచే వచ్చిన పరవనితా ముఖచుంబన రూపమగు నప్రస్తుత వ్యవహారముమాత్రమే ప్రస్తుత ధర్మియగు చంద్రునియందారోపింప వచ్చునుగానఁ బ్రాచీనలక్షణమున నప్రస్తుతధర్మి వ్యంజనమును జెప్పు టెట్లు సంగతమగునని. దీనికి సమాధాన మెట్లన?

శ్లిష్టవిశేషణస్థముల నాదోష నివృత్తికై యారీతిగ నన్వయ మంగీకరింపక తప్పదు. లేకున్న శ్లేషచే వచ్చిన యర్థాంతరస్ఫూర్తి నిరర్థకమగునుగాన. అట్లయ్యు సాధారణ విశేషణస్థలముల విశేషణ పదములకు శ్లేష లేకుంటచేఁ బ్రకృతాప్రకృత వ్యవహారములకు సంబంధించినయర్థ మొక్కరీతిగనే యుండును. అట్టి యర్థము ప్రకృత ధర్మితో నన్వయించినచోఁ జరితార్థమగునుగాన నసంబంధార్థదోషముండదు. కానఁ జమత్కారమునకై కవిచే నభిలషింపఁబడిన యప్రస్తుతమగు నట్టి "చిందాడన్" మున్నగు సాధారణ విశేషణములచే వచ్చిన పురుషాయితా సక్తవనితా వ్యాపారము అప్రకృత ధర్మియగు నాయకుని సంబంధించినదిగనే ప్రకృతి ధర్మియగు కందుకమున నారోపింపక తప్పదు. కానఁ ప్రాచీనుల యప్రస్తుత ధర్మివ్యంజనము సంగతమగుచున్నది.

ఇచ్చట మఱియొకరీతిగ శంకచేయవచ్చును. ఎట్లన? శ్లిష్టవిశేషణస్థలమందువలె సాధారణ విశేషణస్థలమందునను నప్రస్తుతమగు పురుషాయితాసక్త నాయికా వ్యవహారము ప్రస్తుతముతో సంబంధింపకున్నచోఁ బైదోషము తప్పదు కాన నప్రస్తుత ధర్మియగు నాయకుని స్ఫూర్తి లేకుండగనే ప్రస్తుత ధర్మియగు కందుకమున నారోపింపవచ్చును గానఁ బ్రాచీనలక్షణ మెట్లు సంగతమగునవి. దీనికి సమాధాన మెట్లన?

సాధారణ స్థలమందట్లు చెప్పిన చెప్పవచ్చునుగాని సారూప్యనిబంధనయగు సమాసోక్తియొక్క భేదమున శ్లిష్టసాధారణ విశేషణ శబ్దములు లేకుంటచే శబ్దములచేతఁగాక కేవల మర్థసారూప్యముచేతనే యప్రకృత వ్యవహారము వ్యక్తమగుచున్నది. అదియును అప్రస్తుత ధర్మిసంబంధిగనే వ్యక్తము కాకతప్పదు. అట్లగుటచేఁ బ్రకృత ధర్మియగు వనమందు గ్రామనగరాది సంబంధియగు నప్రస్తుత వృత్తాంత మారోపింపఁబడుచున్నది.

దీని ఫలితార్థ మేమనిన? సారూప్య నిబంధనయగు సమాసోక్త్యుదాహరణమునఁ బ్రస్తుతార్థముయొక్క సారూప్యముచే వ్యక్తమగు

నప్రస్తుత వృత్తాంతము వాచ్యమగు ప్రస్తుత ధర్మిసంబంధముకల ప్రస్తుత వృత్తాంతమువలె నప్రస్తుత ధర్మిసంబంధముగనే సారూప్యముచే వ్యక్తమగుననియు నట్టి యప్రస్తుత సంబంధియగు వ్యాపారమునకు నప్రస్తుత సంబంధిగనే ప్రస్తుత ధర్మియందు నారోపము చేయవలయు ననియును దెలియవలయును. కాన సారూప్య నిబంధనయగు సమాసోక్తిలోఁ దప్పక యప్రకృత ధర్మివ్యంగ్యము కాకతప్పదు. ఈ సారూప్య నిబంధనయగు సమాసోక్తినిఁ బ్రాచీనులుకూడ నంగీకరించిరి. "ఏఱుల్ వాఱెడుచోట" అను పద్యము సారూప్య నిబంధనయగు సమాసోక్తి కుదాహరణమీయఁబడెనుగాన నచ్చట నీపై విషయమంతయు సమన్వ యించుకొనఁదగు.

ఈరీతిగ సారూప్యస్థలమున నవశ్య మంగీకరింపవలసిన నప్రస్తుత ధర్మివ్యంజనము శ్లిష్టసాధారణ విశేషణ నిబంధనలగు సమాసోక్త్యుదాహరణములఁగూడ నంగీకరించుట యుక్తముకానఁ బ్రాచీనుల లక్షణము సంగతమగుచున్నది.

ఈరీతిగ నప్రస్తుతధర్మితో సంబంధించిన యప్రస్తుత వ్యవహారమునకుఁ బ్రస్తుత వ్యాపారాశ్రయుండగు ప్రస్తుత ధర్మియందారోపము సిద్ధాంతీకృతమైనది.

ఓయీ!

కం॥ కరమైంద్రీముఖమును హిమ
కరుఁడదె! చుంబించుఁగనుము - కడురక్తుండై ॥

ఈ శ్లిష్టవిశేషణ నిబంధనయగు సమాసోక్త్యుదాహరణమున ముఖపదమాది భాగమునను వదనమునను శ్లేషించుటచేతను, రక్తశబ్దము రక్తవర్ణుఁడు, అనురక్తుఁడు అను నర్థద్వయమునను చుంబనము=సంబంధము వక్త్రసంయోగమను నర్థములను శ్లేషించుటచేతను నప్రస్తుత కాముకవ్యవహారస్ఫూర్తి కలుగుచున్నది. ఈరీతిగనే శ్లేషాలంకారములో నీయఁబడు

కం॥ ఉదయంబున వెలయుచు రతి
మదవతులకునిడుచు ర క్త - మండలుఁడగుచున్ ।
మృదుకరములఁగొనుఁ గువలయ
హృదయమునీరాజుకను మ - హిమ మిలఁబర్వన్ ॥

అను నుదాహరణంబునఁగూడ శ్లిష్టవిశేషణములచే నప్రస్తుత చంద్ర రాజ వ్యవహారము వ్యక్తమగుచుండుటచే నీపద్యమున సమాసోక్తియని యేలయనరాదు ? ఇట్లనినచో దీనికి సమాధాన మెట్లన ?

కేవలము విశేషణములే శ్లేషించి విశేష్యము శ్లేషింపక యప్రస్తుత వృత్తాంతము గమ్యమానమగునపుడు సమాసోక్తియని యెఱుంగ వలయును. ఇట్లనుట్లచేఁ బై శ్లేషోదాహరణమున విశేషణపదము లేకాక విశేష్యమగు చంద్ర నృపతిని దెల్పు రాజపదముగూడ శ్లేషించి యప్రకృత మగు రాజవృత్తాంతమును బోధించుచున్నదికాన నిట సమాసోక్తి లక్షణమునకుఁ బ్రసక్తి లేదు.

పై సమాసోక్త్యుదాహరణమున ర క్త పదమును ముఖపదమును శ్లేషించుటచే నర్థాంతరములు వాచ్యములగుచున్నవి. చుంబించునను పదము శ్లేషింపకున్నను నర్థద్వయమును బోధించునంతమాత్రముననే శ్లిష్టమని వ్యవహరింపఁబడుచున్నది. చంద్రశబ్దగతమగు పుంలింగముచేఁ గాముకాభివ్యక్తియగుచున్నది. ఐంద్రీశబ్దగత స్త్రీలింగముచే నాయి కాభివ్యక్తియగుచున్నది. ఇంద్రసంబంధిత్వ రూపధర్మముచే నాయికకుఁ బరకీయత్వము వ్యజ్యమానమగుచున్నది. ఈరీతిగఁ గాముక కర్తృక పరవనితా ముఖచుంబన రూపమగు నప్రస్తుత వ్యవహారము స్ఫురించు చున్నది. అట్టి యప్రస్తుతవృత్తాంతమునకుఁ బ్రస్తుత విశేష్యమున నారోపముచేయఁబడవలెనని యలంకార సమన్వయము తెలియనగు.

పై పద్యమున వాక్యార్థబోధమెట్లన ? శబ్దశక్తిచే సంప్రాప్త మగు ప్రాచీ ప్రారంభ సంబంధముగల చంద్రునకును వ్యంజనా వ్యాపారముచే వచ్చినట్టియు కాముక సంబంధియగు సానురాగ పరనా

యికా ముఖచుంబన రూపమగు నప్రస్తుత వ్యాపారమునకును నాశ్రియాశ్రయి భావసంబంధముచే నన్వయము. దీనిచేఁ బ్రాచీ ప్రారంభ సంబంధాశ్రయుఁడగు చంద్రుఁడు కాముక సంబంధియగునట్టియు సానురాగ పరనాయికా ముఖచుంబన రూపమగు వ్యాపారమునకాశ్రయుఁడని వాక్యార్థబోధము. ప్రస్తుతవృత్తాంతమునకు నప్రస్తుత వృత్తాంతముతో నభేదాధ్యవసాయము చేయవలయుననియు నట్లే ప్రస్తుత ధర్మియందున నప్రస్తుత ధర్మిరూపమును దాదాత్మ్యముచే నారోపించి యట్టి ప్రస్తుత ధర్మియందే యట్టి ప్రస్తుత వృత్తాంతమునకు నారోపము చేయవలయునను మతము నాశ్రయించినచోఁ గాముకా భిన్నుఁడగు చంద్రుఁడు సానురాగ పరనాయికా ముఖచుంబనాభిన్నమగు ప్రాచీ ప్రారంభ సంయోగరూప వ్యాపారమున కాశ్రయభూతుఁడని వాక్యార్థబోధము.

పరికరాలంకారము. 24.

కం॥ బెరయును విశేషణంబది
ధర సాభిప్రాయమైనఁ - దగఁ బరికరమై।
హరుఁడు హిమాంశూత్తంసుఁడు
కరమాశ్రిత తాపమణఁచి - కాచుతఁగృపతోన్ ॥

విశేషణ మభిప్రాయగర్భితమగుచో పరికరాలంకారమగును. హిమాంశూత్తంసుఁడను హరవిశేషణము తాపమణఁచుటలో హరునకు సామర్థ్యమును బోధించుచున్నది.

ఉ॥ నీకృప నాపయిన్ బరఁగ - నేనొక పూవిలుకాఁడనైననుం
గాక! వసంతునొక్కనినె - గాదిలి దోడుగఁగొంచుఁజూపి నా
టీకుఁబినాకపాణి హరు - డిల్లపడంగనొనర్తు నజ్జరే!
నాకపతీ! కనుంగొనఁద - దన్య ధనుర్ధరులొక్కలెక్కయే? ॥

కుమారసంభవ కావ్యమున మన్మథుఁ డింద్రునిగూర్చి పల్కిన వాక్యము. నేను పూవిలుకాఁడనను విశేషణము మన్మథుఁడు సారహీనమగు

నాయుధము కలవాఁడనియుఁ బినాకపాణియను హరవిశేషణము హరుఁడు సారసహితమగు నాయుధము కలవాఁడనియు నభిప్రాయగర్భితములుగానున్నవి.

తే॥ గీ॥ హేయతరవస్తు నిలయము - నీడ్య సముప
కృతి వినాశమును జీర్ణ - గతియునైన।
తుచ్ఛదేహంబు పోషింప - నిచ్ఛయింతు
దుష్టకర్మము సేసియు భ్రష్టమతులు॥

శరీరమును సంబంధించిన విశేషణములన్నియు శరీరము హేయమగుటచేఁ బోషింపఁదగినది కాదని యభిప్రాయగర్భితములు.

చం॥ శ్రుతులను వేర్పరింపఁగద! - రూపు ధరింపను బుట్టపోట్ట నే
గతి హరిపొక్కిలిన్ దనువు - గాంచను బల్కను భావ్యభాషితం।
బతి రమణీయ సత్కథ బృ - హత్కథనల్లను నోజ్జగాను స్వ
ర్పతికిధరాధినాథ! యెటు - పల్కఁగలాఁడను నీగుణౌఘముల్॥

ప్రభుస్తుతి. శ్రుతులను వేరుపరుప ననఁగా వేదవిభాగము చేయఁజాలనని యర్థము. ఇది మున్నగు విశేషణములు (గుణవిశేషబోధకములు) వ్యాసాదులయందలి యసాధారణ కార్యకరణ సామర్థ్యమును బోధించుచున్నవి. అట్టి సామర్థ్యము కవికి లేకుంటచేఁ దాను వ్యాసుఁడును, వాల్మీకియును, బ్రహ్మయును, గుణాఢ్యుఁడును, బృహస్పతియునుగా ననెడు నభిప్రాయమును బోధించుచున్నవి. మొదట నుదాహరణములుగా నీయబడిన పద్యముల రెంటను నొక్కొక్క విశేషణమును బిమ్మట నీయఁబడిన పద్యముల రెంటను బహు విశేషణములును గలవు. "హేయతరవస్తు నిలయము" అను నుదాహరణమున విశేషణములన్నియు నొక్క యభిప్రాయమునే సూచించునవిగను బదార్థరూపములుగను నున్నవి. "శృతులను వేర్పరింప" నను పద్యమున విశేషణములు భిన్నాభిప్రాయములను సూచించునవిగను వాక్యార్థములుగ నున్నవి.

పరికరాలంకారమున వ్యంగ్యార్థము భాసించుచున్నను ధ్వనియని తలంపరాదు. ఆ వ్యంగ్యార్థము వాచ్యార్థమునకు శోభనుగూర్చుచు గుణీభూతమగుచున్నది. కాన దానికిఁ బ్రాధాన్యములేదు. వాచ్యార్థమునకే ప్రాధాన్యము కలదుకాన. అదెట్లనిన ? మొదటి యుదాహరణమున హిమాంశూత్తంసుఁడనెడు హారవిశేషణము హరునకుఁ దాపహరణసామర్థ్యమును వ్యక్తముచేయుచున్నది. కాని యావ్యంగ్యార్థము హారకర్తృకమగు నాశ్రిత తాపహరణ రూపమగు వాచ్యార్థక్రియకు సాధకమగుచున్నది. కాన నప్రధానము.

రెండవ యుదాహరణమున(నీకృపనాపయిన్ బరఁగ నను పద్యమున) బూవిలుకాఁడు పినాకపాణి యనెడు విశేషణములు మన్మథుఁడు హరుఁడును వరుసగ నసారమగునట్టియు ససారమగునట్టి యాయుధములు కలవారనెడు వ్యంగార్థములను బోధించునవియైనను వానికిఁ బ్రాధాన్యములేదు. మఱియేమనిన ? ఇతర ధన్వన్వులు నాకొక లెక్కయే యను కైముతికన్యాయముచే నితర ధనుర్ధరుల ధైర్యమును బోగొట్టుటకు మన్మథునకు శక్తిగలదనెడు వాచ్యార్థమునకు సాధకములగుచున్నవి కాన నప్రధానములగుచున్నవి.

మూడవ యుదాహరణమునగు హేయతరవస్తునిలయమనెడు పద్యమున విశేషణములు శరీరము పోషింపఁదగినది కాదనెడు వ్యంగ్యార్థమును బోధించుచున్నను నట్టి శరీరమును బోషించుటకై పాపకర్మము నాచరించు జనులు మతిహీనులగుచున్నారనెడు వాచ్యార్థమునకు సాధకమగుచున్నదికాన నప్రధానము.

నాల్గవ యుదాహరణమగు శుభ్రితులను వేర్పరింపననెడు పద్యమున వ్యాసుఁడు వాల్మీకి మున్నగువారికి నసాధారణ కార్యకారణసామర్థ్యమును విశేషణములు వ్యక్తముచేయుచున్నవైనను దానట్టివాఁడు కాకుంటచే రాజగుణములను వర్ణించుటలోఁ గవికి సామర్థ్యము లేదనెడు వాచ్యార్థమును సాధించుచుంటచే వ్యంగ్యార్థమునకుఁ బ్రాధాన్యము లేదు.

పై రీతిగఁ బరికరాలంకారమున వ్యంగ్యార్థము, వాచ్యార్థమునకు శోభనుగూర్చుచుఁదాన ప్రధానమగుటచేనట ధ్వనియనుటకువీలుగాదు.

ఈరీతిగ వ్యంగ్యార్థము వాచ్యార్థమునకుఁ బరికరమగుటచేననఁగా నంగమగుటచేతనే యీ యలంకారమునకుఁ బరికరమనెడు నామము సార్థకమగుచున్నది.

ఈయలంకార విషయమునఁ గొందఱీవిధముగఁబల్కిరి. ఎట్లన ? ఎట్టి ప్రయోజనమును బొందని విశేషణము పద్యమునఁ బ్రయోగింపఁ బడినచో నపుష్టార్థమనెడు కావ్యదోషము సంభవించునుగాన నొక్క సాభిప్రాయ విశేషణముగల పద్యముల నాయపుష్టార్థ దోషములేదని చెప్పవలెనేగాని దానినొక కావ్యాలంకారముగాఁ బరిగణింప వీలుకా దనియు సాభిప్రాయములగు బహు విశేషణములుగల తావుల వానిలో నొక్క విశేషణముచే నాదోషము నివృత్తికాగాఁ దక్కిన విశేషణ ములు కావ్యాలంకారములుగాఁ బరిగణింపఁబడవచ్చుననియుఁ బల్కిరి. కాని యీరీతిగ ననేక సాభిప్రాయ విశేషణములున్న తావులఁ బరికరా లంకారమనియును సాభిప్రాయమగు నొక్క విశేషణమేయున్న తావుల దోషము లేకుంటయే ప్రయోజనముకాన నలంకారము కాదనియును జెప్పవీలుకాదు. ఏలయన ? శ్లేషయమకాదులున్నచోట శబ్దాలంకార నిర్వాహణమే చమత్కృతి హేతువగుటచే నట్టితావుల శ్లేషశబ్దా లంకారాది నిర్వహణమునకై నిరర్థక విశేషణము నొకదానిని జెప్పి నను నపుష్టార్థత్వదోషము కలుగదు, అట్టిచోట నొక్క విశేషణమైనను సాభిప్రాయమగుచోఁ జమత్కృతి కలుగునుగాన నచ్చట నలంకారము సంభవింపవచ్చును. ఎట్లన ?

కం॥ కలతన వేలుపుఁగొలువక .
వెలివేలుపుఁగొలువ నరుల - వెతలలమునిలన్ ।
లలి వనవదనవదగనగ
దలనులఁ దొలిదలరుఁగొలువఁదల్పఁకుడు పరుషీన్ ॥

శిశుపాలవధ కావ్యమున నిందుఁ్రనిఁ బూజింపవలఁచిన నందులఁగూర్చి శ్రీకృష్ణుఁడు పల్కిన వాక్యమిది. మానవులు దమ వేలుపును గొలువక యితరుఁడగు వేలుపును గొలిచినచో వారికిఁ గీడుదప్పదు. కాననో నందులారా! వనవత్ :- సమృద్ధిగ నీరును బచ్చికబైళ్లునుగల యడవులతోఁ గూడియున్న 'అగ' పర్వతమును, అనవత్ :- మనలను రక్షింపనట్టి నగదలనుఁడు :- పర్వతముల రెక్కలను నఱికిన యింద్రుఁడు నీయిరువురిలోఁ దొలిదియగు పర్వతమునే కొల్చుట యుక్తము. పరుఁడగు నిందుఁ్రని గొలువఁదలఁపకుడని కృష్ణుఁడు చెప్పెను. ఈ పద్యమునఁలకారము చాలమారులావృత్తి యగుటచేతను మూడవపాదమున 'నవదనవద' యనుచో 'నవద' యను పదమావృత్తి నొందుటచేతను వృత్త్యనుప్రాస ఛేకానుప్రాసలనెడు శబ్దాలంకారములను గవి కూర్చుటలోఁ బ్రయత్నము సఫలమగుటచేతను నొక్క యభిప్రాయయుక్త విశేషణమున్నను శోభగల్గుటచే నలంకారము పొసగును. అది యెట్లన? వనవత్ :- నీరును నడవులును గలయనెడు నగవిశేషణము సాభిప్రాయముగాఁ బ్రయోగింపఁబడి శోభాధాయకమగుచున్నది. ఈ విశేషణము గోవుల పోషణమునకు నీరును పచ్చికబయళ్లును ఫలపుష్పాదులునుగల యీపర్వతముమనకును మన గోవులకును రక్షకమగుటచే మనకారాధ్యమైనదనెడు నభిప్రాయమును గలిగియున్నది. ఈరీతిగనే యమకశ్లేషాదులులేనిచోటఁగూడ నొక్క విశేషణము సాభిప్రాయమైనను నలంకారము సంభవించునని చెప్పినను జెప్పవచ్చునుగదా?

## పరికరాంకురాలంకారము. 25.

కం॥ ఇల సాభిప్రాయముగా
నలర విశేష్యంబు పరిక - రాంకురమదియౌ।
నలుఁగేల్వేలుపు శ్రితులకుఁ
బొలుపుగనిడుఁగాత నాల్గు - పురుషార్థంబుల్ ॥

విశేష్యము సాభిప్రాయమైనచోఁ బరికరాంకురమగును. చతుర్భుజుఁడగు విష్ణువు భక్తులకు నాల్గు పురుషార్థముల నిడుఁగాత. నలుఁగేల్వేలుప నెడు విశేష్యము నాలుగు పురుషార్థము లను నాల్గు చేతులతో నిడుటకు సమర్థుఁడ నెడు నభిప్రాయమును సూచించుచున్నది.

ఆ॥ వె॥ చయ్యన ఫణిరాజు – శక్తుండు పలుకంగ
రాణహైహయుండు – వ్రాయుటకును ।
అక్షులన్ గనుటకు – నాఖండలుఁడు దగు
నాకుఁదగునె ? నీ గు – ణంబులెన్న ॥

రాజునుగూర్చి కవిస్తుతి. ఫణిరాజు, హైహయుఁడు, ఆఖండలుఁడను విశేష్యములు సహస్రముఖుఁడు సహస్రబాహువు, సహస్రాక్షుఁడను నర్థములను స్ఫురింపఁజేయుచున్నవి.

శ్లే షా లం కా ర ము. 26.

కం॥ ప్రకృతాప్రకృతోభయగతి
నకలుష నానార్థకలన – మగు శ్లేషమునాన్ ।
సకలము మాధవుఁడేవఁడూ
నికగలగంగమలనెత్తి – నెమ్మికఁబూనెన్ ॥

కం॥ సతిమోహమబ్జాకృతిఁగనుఁ
దతరవికిరణావలం బి – తారుణ్యారుచిన్ ।
ధృతిఁబేర్చె వాహినీపతి
కృతఘాతోత్క్షిప్తభూరి – కీలాలములన్ ॥

ప్రకృతము, అప్రకృతము, ప్రకృతాప్రకృతమున నెడు మూడుగతులచే నానార్థములను గూర్చుట శ్లేషాలంకారమనఁబడును. సకలము మాధవుఁడను బద్యార్థము ప్రకృతశ్లేష కుదాహరణము. మాధవుఁడు మాకు సకలమునగుచున్నాఁడు. మాధవుఁడెట్టివాఁడన ? ఊనిక :– గోపాలురధైర్యము, కలఁగంగన్ :– కలఁగిపోగా నింద్రునిచేఁ గురిపింపఁబడిన వర్ష ముచే గోపాలురధైర్యము చెదరిపోగానని యర్థము. మలన్ :– పర్వతము

నుఎత్తి నెమ్మికధరియించినవాఁడు. రెండవ యర్థము. ఉమాధవుఁడు :- శంకరుఁడు మాకు సకలమును నగుచున్నాఁడు. ఉమాధవుఁడెట్టివాఁడన? ఊనికగల :- వేగముగల, గంగను :- గంగానదిని, మలన్ :- హిమవత్పర్వతమున, నెమ్మికతో నెత్తిధరించినవాఁడు. హరియు హరుఁడును స్తుతి విషయ భూతులగుటచేఁ బ్రకృతులగుటచే నిది ప్రకృత శ్లేషము.

రెండవ పద్యమునఁ బూర్వార్ధము, అప్రకృత శ్లేషమున కుదాహరణము. ఎట్లన ? సతిమోము తతరవికిరణావలంబితారుణ్యా రుచిగల యబ్జాకృతినొందుచున్నది. అబ్జపదమునకుఁ బద్మమనియును జంద్రుఁడనియు నర్థము. ముఖవర్ణనము ప్రస్తుతమగుటచే నబ్జపదముచేఁ జెప్పఁబడు పద్మచంద్ర రూపార్థములు రెండును నప్రకృతములు. అందునఁ బద్మము రవికిరణ సంపర్కముచేఁ బొందఁబడిన యారుణ్యా రుచిగలది యనఁగా నెఱ్ఱని రంగుగలది. చంద్రపక్షమున చంద్రాకృతిగూడ రవి కిరణముల నవలంబించుటచే వచ్చిన తారుణ్యారుచికలది యనఁగాఁ బూర్ణ భావముకలదియని యర్థము. చంద్రునకు సకలకలా పరిపూర్ణత సూర్యకిరణ సంపర్కముచేఁ గలుగుచున్నదని జ్యోతిశ్శాస్త్రసిద్ధాన్తము. కిరణావలంబిత + ఆరుణ్యాము. కిరణావలంబి + తారుణ్యాము. అని రెండింటఁ బదవిభాగము.

ఉత్తరార్థము ప్రకృతా ప్రకృతములు రెంటికిని సంబంధించిన శ్లేషకుదాహరణము. ఎట్లన? ఇట సేనాపతి వర్ణనము ప్రస్తుతము. వాహినీపతియన సేనాపతియనియు సముద్రుడనియును నర్థద్వయము. సేనాపతి దనచేఁ జేయఁబడిన ఖడ్గఘాతములచేఁ జిమ్మఁబడిన మిక్కుటమగు కీలాలమనఁగా రక్తముకలవాఁడు, సముద్రార్థమప్రస్తుతము. సముద్రుఁడు తరంగముల పరస్పరాఘాతములచేఁ బైకెగురఁగొట్టఁబడిన కీలాలమనఁగా నీరుకలవాఁడు. అట్టి రక్తముచేతను సేనాపతియు నట్టి నీటిచేసముద్రమును విజృంభించుచున్నారని యర్థము.

కం॥ అపకృతుఁడయ్యును నెవ్వఁడు
 కృపఁగాకోదరవిదళన - ఖేలనముడిగెన్ ।

నృపసుతుఁడు పూతనా మర
ణపటిమ విదితుండతం డ – నర్ఘములడఁచున ॥

ఇది కేవలప్రకృత శ్లేషము. ఇట రామకృష్ణులు స్తుతివిషయములగుటచేఁ బ్రకృతభూతులు. ఏ రాముడు కాకాసురునిచే నప్రకృతుఁడయ్యు నతని యుదరవిదళనమును జేయలేదో. అట్లే కృష్ణుఁడు కాకోదరునియొక్క యనఁగాఁ గాళీయునియొక్క విఘసనకేళిని విడిచినాఁడో యీ యిద్ద ఱును బాపములను బోఁగొట్టుదురు కాత. మఱియు శ్రీరాముఁడు పూతనామ :– పవిత్రమగు పేరుచేతను రణపటిమ :– యుద్ధపాటవము చేతను ప్రసిద్ధికెక్కినవాఁడు. కృష్ణుఁడైనచోఁ బూతన యనెడు రక్కసి యొక్క మరణ :– చంపుట యందలి పటిమచేఁ దెలియఁబడినవాఁడు. ఇట మరణశబ్ద మంతర్భావితణ్యర్థముగాఁ బ్రయోగింపఁబడినది. అప్రకృత శ్లేషకు మఱియొక యుదాహరణము.

తే॥ గీ॥ నీలవనజన్మమునఁ గమ – నీయమగుచుఁ
బరఁగి లుబ్ధశిలీముఖ – పాత చలన ।
భావమొందుచు వఱలెడు – భవ్యకమల
ములను బోలును నీ కన్ను – లెలమిఁజెలియ ! ॥

ఇట తరుణీ నయన వర్ణనము ప్రకృతము. వానికుపమానములగు పద్మములును హరిణములును నప్రకృతములు. అట్టి పద్మ హరిణములకు శ్లేషముంటచే నిది యప్రకృత శ్లేషము. ఓ చెలీ! నీ కన్నులు భవ్యములగు కమలములను బోలును. కమలము లెట్టివన ? నీలవనజన్మమున :– నల్లని నీటిలోఁ బుట్టుటచే మనోహరమైనవి. మఱియు లుబ్ధ శిలీముఖపాతముచే ననఁగా మకరందలోభముగల తుమ్మెదలు వ్రాలుటచేఁ జలనభావముకలవి. రెండవయర్థ మెట్లన ? నీకండ్లు భవ్యకమలములను బోలును. కమలములనఁగా హరిణములు. హరిణము లెట్టివి యన ? నీలవనజన్మమునన్ :– పచ్చికబయళ్లు మున్నగువానిచే నల్లనివి యగు నడవులలోఁ బుట్టుటచే నందమైనవి. మఱియు లుబ్ధ శిలీముఖ

పాతముచే ననఁగాఁ గిఘాతకులయొక్క బాణపాతములచేఁ జలనభావ మొందుచున్నవి యనఁగా బెదరుచున్నవని యర్థము.

ప్రకృతా ప్రకృత శ్లేషకుదాహరణ మెట్లన?

కం॥ ఉదయంబున వెలయుచు రతి
మదవతులకు నిడుచు రక్త - మండలుఁడగుచున్ ।
మృదుకరములఁగొనుఁ గువలయ
హృదయము నీరాజుకను మ - హిమ మిలఁ బర్వన్ ॥

ఇట నవాభిషిక్తుఁడగు ప్రభు వర్ణనము ప్రకృతము. చంద్రవర్ణన మప్రకృతము. ప్రభుపక్షమునఁ గరములనఁగాఁ బన్నులు. కువలయ హృదయము భూవలయమందలి ప్రజల చిత్తము. మహిమము పర్వను గొప్పతనము వ్యాపించునట్లు. రెండవ యర్థము రాజనఁగాఁ జంద్రుఁడు. రక్తమండలుఁడు, ఉదయకాలమున రక్తిమగలవాఁడు. మదవతులకు రత్యుద్దీపనమును జేయుచున్నాఁడు. కరములు కిరణములు. కువలయము, కలువ. హిమము. చల్లదనము. కనుము చూడుము. అర్థద్వయమును సమన్వయించుకొనఁదగు.

ప్రాచీనులు ప్రకృతాప్రకృత శ్లేషోదాహరణముల శబ్దశక్తి మూలధ్వనియని చెప్పుచున్నారు. కాని వారి యభిప్రాయము ప్రకృతా ప్రకృతార్థములచే సిద్ధించిన యుపమాలంకారము వ్యంగముకాని యప్ర కృతార్థము వ్యంగముకాదని నిశ్చయింపవలయును. ఏలయన? ప్రకరణ బలమువలనఁ బ్రకృతార్థము నభిధాశక్తిచేఁ దోఁల్త బుద్ధివిషయమైనను బిమ్మటఁ బరస్పర సంబంధముకల యర్థములను బోధించు రాజకరాది పదముల సాన్నిధ్య బలమువలన నృపతి తద్ప్రాప్త్యాధనము మున్నగు వానిని బోధించుటకై మఱియొక్క యభిధాశక్తి యుద్బుద్ధమై యప్ర కృతార్థమును బోధించును. ఈరీతిగఁ జంద్రుని సంబంధించిన యప్ర స్తుతార్థమును నభిదాశక్తియే బోధింప వీలగుచుండ వ్యంజనావృత్తి వఱకుఁ బోనవసరములేదుకాన. దీని సారాంశమేమనఁ బ్రకరణ బల

మున నభిధాశక్తిచేఁ బ్రకృతార్థము బోధవిషయమగునట్లు అన్యోన్య సన్నిధాన బలమున నుద్బుద్ధమగు మఱియొక యభిధావ్యాపారముచేతనే యప్రకృతార్థము బోధవిషయమగుచున్నదికాన వ్యంజనావ్యాపారము వఱకుఁ బఱుగెత్తవలసిన యవసరములేదు. కానఁ బ్రాచీనులచేఁ జేయబడిన వ్యంజనావ్యాపారకల్పన నిరర్థకమని.

ప్రకృతార్థము బోధవిషయమైనపిమ్మటఁగాని యప్రకృతార్థము బోధవిషయము కాకున్నదనిన-చో విలంబనముగ బోధవిషయమగుటచే నీ ప్రకృతాప్రకృతశ్లేషను గూఢశ్లేషయని పిలిచినను బిలువవచ్చును.

ఈ గూఢశ్లేష యితరస్థలములఁగూడఁ గన్పట్టుచున్నది. ఎట్లన ?

తే॥ గీ॥ గాఢజరఠలు తలఁపని - కామగురులు
దూరలంబి పయోధర - లారయఁగ, న।
గమ్య రూపపరిణత ది - క్కరికలైన
తటులకాకర మీరైవ - తకనగంబు ॥

తే॥ గీ॥ అగ్ని మందంబుగా రేఁచె - నర్యమోప
లంబుశ్వయథువుఁజూపెఁ ద- మంబు మిగుల।
దృష్టి తిమిరజదోష సం - దష్టమాయె
నోషధీశుఁడు దఱిలేని - దోషమునను ॥

మాఘకావ్యమున రైవతకగిరి వర్ణనము. ఈ పర్వతము తటులకాకర మైనది. తటీశబ్దము స్త్రీలింగమగుటచే వాని విశేషణములు స్త్రీలింగముగాఁ బ్రయోగింపఁబడినవి. తటులనఁగాఁ గొండచఱియలు. ఆచఱియ లెట్టివన ? గాఢజరఠలు :- మిక్కిలి కఠినములు. నికామగురులు :- మిక్కిలి విశాలములు. దూరలంబిపయోధరలు:- దూరముగ వ్యాపించిన మేఘములుకలవి. అగమ్యరూప పరిణతదిక్కరికలు :- అగమ్యరూప :- తెలియశక్యముగాని రూపముకలవియును; పరిణతదిక్కరికలు:- తిర్యగ్దంతప్రహారులగు దిగ్గజములుకలవియును. అట్టి తటులకాకరము. ఇది ప్రకృతార్థము.

ఈవిశేషణములన్నియు శ్లిష్టములు. ఎట్లన ?

గాఢజరతలు :- మిక్కిలి ముదుసలివారు. దూరలంబిపయోధరలు :- మిక్కిలి వ్రేలాడు గుచములుకలవారు. అగమ్యరూప పరిణత దిక్కరికలు :- అగమ్యరూప :- సంగమానర్హమగు రూపముకలవారు; పరిణతదిక్కరికలు :- బాగుగఁగన్పట్టు దిక్కులనఁగా దంతక్షతములును, కరికలనఁగా నఖక్షతములును గలవారు. ఈయర్థముచే వృద్ధవేశ్యలు స్ఫురించుచున్నారు.

ఇచ్చటఁ బ్రకరణవశమునఁ బ్రస్తుతార్థము శీఘ్రముగ బోధ విషయముకాఁగాఁ బిమ్మట విశేషణ సామ్యముచే నప్రస్తుతార్థమగు వృద్ధవేశ్యా వృత్తాంతము ప్రతీయమానమగుచున్నది. ఇచ్చట నభంగ శ్లేషయని యాలంకారికులందఱకు నభిమతమే.

ఇట్లే రెండవ పద్యమునఁగూడఁ జంద్రుఁడు లేకుంటచే సూర్యకాంతమణులు మందాగ్ని రేఁగఁజేయుచున్నవి. తమస్సు ప్రబలమై యున్నది. చీకటిపీడదృష్టిని జెందుచున్నది. ఈయర్థము ప్రకృతార్థము. ఇది ప్రసంగవశమున శీఘ్రముగ స్ఫూర్తికిరాఁగాఁ బిమ్మట శ్లేషవశమున రెండవ యర్థము స్ఫురించుచున్నది. ఎట్లన ?

ఓషధీశుఁడనఁగా వైద్యుఁడు, అతఁడు దగ్గఱలేకుంటచే జఠరాగ్ని మందమాయెను. శ్వయథువనఁగా నుబ్బురోగము పొడమెను. దృష్టికిఁ దిమిరవ్యాధి పొడఁజూపెను. ఇటఁగూడ నభంగశ్లేషయగు సమాసోక్తియని సర్వాలంకారిక మతము.

పై రెండు చోటుల నప్రస్తుతార్థము స్ఫురించుటకై వ్యంజనావృత్తినాశ్రయించినచో నిది ధ్వనియగునుగాని శ్లేషకానేరదుకదా ? ఇట్లే గూఢశ్లేషకల తావుల ధ్వనియని చెప్పరాదు. ఎట్లన ?

తే॥ గీ॥ కాంతలాటను ధృతపతా - కలు వివిక్త
లాట వర్ధితరాగలు - నటునమద్వ।
లీకలును వలభులమార - లీల యువకు
లెలమి సేవింతురేవీటఁ - జెలులతోడ ॥

మాఘకావ్యమున ద్వారకావర్ణనము. ఏపీట యువకులు మన్మథలీలచేఁ దమ చెలులతోఁగూడ వలభులను సేవింతురో. వలభులనఁగా మేడల మీఁది గృహములు. వలభీశబ్దము స్త్రీలింగమౌటచే దాని విశేషణములును స్త్రీలింగములుగాఁ బ్రయోగింపఁబడినవి. వలభులెట్టివన ? కాంతలౌటచేననఁగా నందమైనవగుటచే, ధృతపతాకలు :- జండాలను ధరించుచున్నవి. నమద్వలీకలు :- వంగిన చూరులుగలవి. ఇట్టి వలభులను జెలులతోఁగూడ సేవించుచున్నారు. ఈ వలభీ విశేషణములు చెలులకుఁగూడ నన్వయించును, ఎట్లన ? కాంతలౌటన్ :- సౌందర్యము కలవారగుటచే ధృతపతాకలు ;- సౌభాగ్యమును బొందియున్నారు. పతాకాశబ్దమునకు సౌభాగ్యమనియు నర్థము. వివిక్తలౌటన్ :- పతిభక్తి కలవారగుటచే, వర్ధితరాగలు :- పవిత్రలు. నవద్వలీకలు :- వంగియున్న వళులుగలవారు. ఈపదములకీయర్థములున్నను ద్వితీయాంతములగు నీవలభీ విశేషణములు తృతీయాంత పదవాచ్యములగు చెలులతో నెట్లన్వయించును ? కాన శబ్దసామర్థ్యముచే రెండవ యర్థము బోధవిషయముకాదు, కాని యర్థసౌందర్యము ననుసరించి గ్రహింపక తప్పదు. కాన దీనిని గూఢశ్లేషయనవలెను.

విభక్తిభేదమున్నను బ్రస్తుతాప్రస్తుతార్థములకు సాధర్మ్యము చెప్పఁబడినచో శ్లేషమాక్షిప్తమగుచున్నది. అట్టి సాధర్మ్యముగూడ నిచ్చటఁ జెప్పఁబడలేదు. కాననిది యాక్షిప్తశ్లేషమనఁబడదు.

ఆక్షిప్తశ్లేషకుదాహరణ మెట్లన ?

కం॥ అధికాపేయరసములిట
విధుతములనిలజరయమునఁ - బెనుఁగొలఁకులు పో ।
ల్కిధరించుఁబుట్టసుతు సం
కథితములసరామలక్ష్మ - ణలగిరములతోన్ ॥

రైవతగిరి వర్ణనము. సరస్సులకు వాల్మీకి వాక్కులతోఁ బోల్కి చెప్పఁబడినది. ఈ సాధర్మ్య కథనముచే నిట శ్లేషయాక్షిప్తమగుచున్నది.

అధికమైనట్టియు నెక్కిపినగఁ ద్రావఁదగిన నీరుగలవియును వాయువేగ ముచేఁ గంపితములును భర్తలతోఁగూడిన యాడ లక్ష్మణపక్షులు కల వియును సరస్సులు. అధికమగు కపిచేష్టలు వర్ణింపఁబడినవియును హనుమంతుని చేష్టలు వర్ణింపఁబడు తావుల సరభసములును. రామ లక్ష్మణులతో కూడుకొనినవియును వాల్మీకి గిరములని తెలియవలెను. ఈరీతిగ నర్థద్వయమును గ్రహించుటకుఁ బద్యమునఁ బోల్కె ధరించు న నెడు పదమాక్షేపకమగునట్లు కాంతలగుటను న నెడు పద్యమున నెట్టి యాక్షేపకమును లేకుంటచే నట భిన్న విభక్త్యంత పదములచేఁ జెప్పఁ బడెడు నర్థద్వయమును జమత్కృతికై గ్రహింపవలెను. గాన నది యాక్షిప్తశ్లేష కాదనియు గూఢశ్లేషయే యనియుఁ జెప్పకతప్పదు. పై రీతిగ గూఢశ్లేష యొకటి కలదని తేలినది. ఈరీతిగఁ బ్రాచీనుల మతమునఁ బ్రకృతాప్రకృతశ్లేష గూఢశ్లేషయని చెప్పినను చెప్పవచ్చు నుగాని ధ్వనియని మాత్రము చెప్పవీలుగాదు.

ఈ ప్రకృతాప్రకృతోభయశ్లేషలు మూడును సభంగాభంగ భేదములచేఁదిరిగి రెండువిధములగును.

అబ్జ, కీలాల, వాహినీపతిశబ్దములఁ బదముల విఱుపులేదుకాన నిది యభంగశ్లేషము. సకలము మాధవుఁడనుచోట మాధవుఁడనియును, ఉమాధవుఁడనియును బదభంగము కలదుకాన నిది సభంగశ్లేషము. సభంగశ్లేషము శబ్దాలంకారమనియు నభంగశ్లేష మర్థాలంకారమని యును గొందఱిమతము. ఉభయమును శబ్దాలంకారమని మఱికొందఱి మతము. రెండును నర్థాలంకారమని దీక్షితమతము. ఈరీతిగ శ్లేషాలం కారమైదురీతులగుచున్నది.

### అప్రస్తుత ప్రశంసాలంకారము. 27.

కం॥ కృతిఁబ్రస్తుతపరమప్ర
స్తుతప్రశంస చెలఁగ నది - చొప్పడునట్టుల్ ।
కృతియొక్కఁడె పక్షుల గుమి
శతక్రతువుపుడు వీడి యన్యుఁ - జనదెదియడుగన్ ॥

అప్రస్తుతార్థమును బ్రస్తుతార్థపరముగఁజెప్పనది యప్రస్తుత ప్రశంసాలంకారమగును

దప్పికగొన్నను నిందుప్రదక్క పరుని యాచింపని చాతకము పక్షులన్నిటను సుకృతి. ఇది యప్రస్తుతార్థము. దీనిచే క్షుద్రయాచనా విముఖుఁడగు నభిమానియొక్క వృత్తాన్తము ప్రస్తుతము స్ఫురించుచున్నది.

ప్రస్తుతాప్రస్తుత వృత్తాంతములకు నేదియో యొక సంబంధ ముండినగాని యప్రస్తుతముచేఁ బ్రస్తుతము స్ఫురింపనేరదు. ఆ సంబంధము మూఁడు విధములు. 1 సారూప్యసంబంధము. 2 సామాన్య విశేష భావసంబంధము. 3 కార్యకారణ భావసంబంధము. సామాన్యముచే విశేషస్ఫూర్తియును విశేషముచే సామాన్యస్ఫూర్తియునని సామాన్య విశేషభావ సంబంధము రెండు విధములు. కార్యముచేఁ గారణస్ఫూర్తియును గారణముచేఁ గార్యస్ఫూర్తియునని కార్యకారణ భావసంబంధముగూడ రెండు తెఱంగులు. సారూప్యసంబంధ మొక్కవిధము. ఈరీతిగ నప్రస్తుత ప్రశంసాలంకారము పంచవిధము. పై పద్యమున సారూప్య నిబంధనయగు నప్రస్తుత ప్రశంసకుదాహరణమీయఁబడినది. ఇది స్తుతివిషయము. నిందావిషయ మెట్లన ?

ఉ॥ మోహవిశేషబంధమున - మూపున బల్పుగ జూలుమోపి ని
ర్వ్యాహిత గౌరవంబలర - శ్వానము సింగముగాఁ దలంపఁబో ।
సాహసవృత్తిమై సమద - సామజకుంభవిపాటనోద్యమో
త్సాహముసేయు కేసరి వి - ధంబుననుబ్బుచు బొబ్బరించునే ? ॥

అభిమానముచే సింగముయొక్క జూలునుమోపి సింగముగా గౌరవింపఁబడిన కుక్క యేనుఁగుయొక్క కుంభస్థలమును భేదించుట కుత్సాహముసేయు కేసరివలె గర్జింపనేరదు. ఇట శునకనిందచేఁ గృత్రిమ వేషమునుదాల్చి పండితస్థానమును బొందింపఁబడిన పండితమ్మన్యుని నింద స్ఫురించుచున్నది. మఱియును

తే॥ గీ॥ ఎంచలోపల ఛిద్రించు - లెన్నొగలవు
కాంచ వెలుపల బహుకంట - కంబులుండు।
పద్మనాళపు గుణములు - భంగపడక
యేలవర్తిల్లు నీగతి - నెంచిచూడ॥

పద్మనాళములలోపల రంధ్రములుండును. నాళములకు బైట ముండ్లుండును. ఛిద్రములలోనున్న తెల్లని కాడలు విఱుగునట్టి స్వభావము కలవి. ఇది సాభిప్రాయ వచనము. బైట శత్రువులుంటచేఁ గుటుంబములోని రహస్యముల వెలిపుచ్చినఁ గులమర్యాదలడుగంటున నెడు ప్రస్తుత వృత్తాంతమును దెలుపవలయునని యొకఁడొకనితోఁ బై యప్రస్తుత వృత్తాంతమును బల్కెను. ఇట స్తుతినిందలు గోచరింపక కేవల విషయ స్వరూపము మాత్రమే తెలుపఁబడెను. దీనినిబట్టిచూడ నలంకారలక్షణములోని ప్రశంసాశబ్దము స్తుతివాచకము కాదనియును గేవలము కథనమాత్రపరమనియు నెఱుంగవలెను. దీనిచే స్తుతికథనము నిందా కథనము స్వరూపకథనము నీ మూడును బ్రశంసా శబ్దవాచ్యములే యగుచున్నవి.

సామాన్య నిబంధనయగు నప్రస్తుత ప్రశంస యెట్లన ?

ఆ॥ వె॥ పగనుబట్టియున్న - పగవానికెంతయు
నెగ్గొనర్చి యెవ్వఁ - డేమఱిలోనో।
పొదను నిప్పువెట్టి - కదలెడు గాలికి
నెదుటి చక్కివాఁడు - నిదురఁజెందు॥

మాఘకావ్యమున బలరాముఁడు శ్రీకృష్ణునితో నిట్లు పల్కెను.

పద్యములోని విషయము సామాన్యము. దీనిచే లోఁగడనే పగను గల్గియున్న శిశుపాలునకు రుక్మిణీ పరిణయముచేఁ దిరిగి యెగ్గు చేసి వానిని వధింపకుండుట యాత్మవినాశకమగున నెడు ప్రస్తుతార్థము బోధింపఁబడుచున్నది. మఱియును.

తే॥ గీ॥ పలుతెఱంగుల వఱలెడు - చెలిమి యనెడు
పసిడిగీతల రంగుల - పాళ్లుదెలియఁ।
జాటుమాటయనందగు - సహజనైల్య
కలితమా గీటురాయొక - టిలను గలదు॥

స్నేహముయొక్క తారతమ్యమును దెలియవలెనన్నఁ బరోక్ష భాషణమునసే తెలిసికొనవచ్చును. ప్రత్యక్షమునఁ బ్రియముగను బరోక్షమున నప్రియముగను బల్కుట మానవస్వభావము. ఇది సామాన్యవచనము. తన చెలికానితో నొకఁడిట్లనెను. పరోక్షమునఁగూడ నీవిట్లు నావిషయమై ప్రియమును బల్కినచో నీవు నాకు సరియగు చెలికాఁడ వనెడు విశేషార్థము బోధింపఁబడుచున్నది. సహజనైల్య కలితమను పదము గీటురాతికిని జాటుమాటకునుగూడ నన్వయించును.

విశేషనిబంధన యెట్లన?

✓ తే॥ గీ॥ సాఁకిమృగమును నొడిఁజేర్చు - చందురుఁడరయఁ
బృథివి మృగలాంఛనుండని - పిలువఁబడియె।
చెనకి మృగములఁ జెండాడు - సింహమెంచఁ
గాంచెఁగీరితి మృగరాజ - టంచు మిగుల॥

శ్రీకృష్ణునితో బలరామ వాక్యము. మార్దవముపయశస్కరము. కాఠిన్యము యశస్కరము. ఇట్టి సామాన్యమును బోధించుటకై విశేషవిషయము చెప్పఁబడినది. ఈరీతిగ బృహత్కథాదులయందు సామాన్యముగ నొక యర్థమును బ్రస్తావించి దానిని వివరించుటకై యప్రస్తుత కథా విశేషము నుదహరించిన తావుల నీయలంకారమే యగునని తెలియవలయును.

కారణనిబంధన యెట్లన?

తే॥ గీ॥ స్రష్టదమయంతి ముఖమును - రహిని జేయ
నిందుమండలసారంబు - నెంచికొంటఁ।
బోలెఁ బొల్చిన బిలమునఁ - గ్రాలు చదల
నీలిమంబదె కన్పట్టు - నేర్చిచూడ॥

దమయంతీ వదన నిర్మాణమునకై చంద్రమండల మధ్యగతసారమును బ్రహ్మ గ్రహించినాఁడు. దానఁగల్గిన రంధ్రమునఁ గన్పట్టు నాకసము యొక్క నైల్యమే యామచ్చ. ఇట యప్రస్తుతమగు చంద్రమండల మున దమయంతీ ముఖనిర్మాణమునకై యుత్ప్రేక్షింపఁబడిన సారాంశగ్రహణముచేఁ దత్కార్యమైనట్టియుఁ బ్రస్తుతమగు దమయన్తీముఖ మునెయొక్క లోకోత్తర సౌందర్యాతిశయము తోఁపింపఁబడినది.

మఱియు దీక్షితకృత వరదరాజస్తవమందు :-

మ॥ తనరన్ నీపదమాశ్రయించుచు సుధాధాముల్ స్వదేహక్షయో
పనతంబై మహనీయమైన సుగతిన్ – బట్టంగనాయుక్తులై ।
ఘనలావణ్యమయాత్మపుణ్యమును స – ఖ్యంబెంచినుమ్మా! త్వదా
ననమందుంచి భజింతురర్యముహరీ! – నవ్యాత్ములై యేనెలన్ ॥

ఓ హరీ! వరదుఁడా! ప్రతి మాసమునఁ జంద్రులు 'నవోనవో భవతి' మున్నగు శ్రుతి ననుసరించి క్రొంగ్రొత్తలగుదురు. వారు, నీ పదమన విష్ణుపదము(విష్ణుపాదమునకును నాకాశమునకును నభేదాధ్యవసాయము) అట్టి విష్ణుపద మాశ్రయించి తమ దేహావసానమందు ననఁగా నమావాస్యలయందు నుత్తమపదవి నొందఁబోవువారై సఖ్యమెంచి నీ మోమునందుఁ దమ లావణ్య పుణ్యమునుంచి సూర్యునిలోఁ గలియుచున్నారు కాఁబోలు.

అనంతకాలమునుండి చంద్రులీరీతిగఁ దమ లావణ్యమును భగవన్ముఖమున నుంచుచున్నారు కాఁబోలున నెడు నుత్ప్రేక్ష్యమాణమగు నప్రస్తుతకారణముచేఁ బ్రస్తుతమగు భగవంతుని ముఖసౌందర్యాతిశయ రూపమగు కార్యము తెలుపుడు చేయఁబడుచున్నది. భగవంతునిముఖ మనంతకోటి చంద్రప్రకాశమానమని తాత్పర్యము. పుణ్యాత్ములు దేహావసానమున నుత్తమగతి నొందఁబోవువారై తమ పుణ్యమును స్నేహితులయందుంచి సూర్యునిలోఁగలిసి పిమ్మట నుత్తమగతి నొందుదురని శాస్త్రము చెప్పుచున్నది. మిత్రబాహుళ్యములేక యొక్క

భగవన్ముఖముననే లావణ్యాద్రివ్య ముంపఁబడినట్లు చెప్పుటచే భగవన్ముఖమే చంద్రసదృశమైనదనియును దదితర ముఖములు వేనికిని చంద్రసాదృశ్యలేశముకూడ లేదని వ్యతిరేకముగూడఁ దోఁపింపబడుచున్నది.

కార్యనిబంధన యెట్లన ?

తే॥ గీ॥ నీదుకాళ్లనుగడుగ నా - నీటఁదగులు
గోటిడాల్నెరసులు దొలి - యేటఁజేరి ।
దానిఁజిక్కెడుతటిఁ జిక్క - దనముగల్గి
కడలి వెన్నగ రూపును - బడసెనేమొ ? ॥

వరదరాజస్తుతి. మహావిష్ణుపాదథావనతోఁయము గంగానదిగానాయెను. ఇట నుత్ప్రేక్షింపఁబడిన చంద్రరూపకార్యముచే దానికిఁ గారణభూతమగు భగవంతుని గోళ్లయొక్క కాంతి రేణువుల యుత్కర్షము ప్రతీతమగుచున్నది.

శా॥ ఆపూఁబోఁడినడల్ బెడంగుఁగన రా - యంచెంతొ సిగ్గిల్లు సం
లాపంబున్ వినినంతఁ గోయిలగముల్ - మౌనవ్రతంబొందెడున్ ।
చూపట్టన్ మెయిగోము మాలతియుఁబూ-నున్ గ్రావసారూప్యమున్
గైపున్ గొల్పెడు కాంతిఁజూచి రమయుఁ-దాఁగట్టుఁగాపాయమున్

కాంతయొక్క నడలసొంపు మున్నగునవి ప్రస్తుతములు. సంభవింపఁదగినవిగా నూహింపఁబడిన యంచలకుఁగల్గెడు సిగ్గు మున్నగునవి యప్రస్తుతములగు కార్యములుగా వర్ణింపఁబడినవి.

వెనుకటి కార్యనిబంధనోదాహరణమునఁ జంద్రుఁడు వరదరాజస్వామియొక్క పాదనఖకాంతిలేశములకార్యముగాఁ జెప్పఁబడినాఁడు. అనఁగా వస్తుకార్యముగాఁ జెప్పఁబడినాఁడు. ఈపద్యమున నప్రస్తుతములగు నంచలకుఁగల్గెడు సిగ్గు మున్నగునవి కాంతయొక్క నడలసొంపు మున్నగువానియొక్క కార్యములుగా గాక తన్నిరీక్షణ కార్యములుగాఁ జెప్పఁబడినవి. ఇదియే భేదము. ఇట్టి నిరీక్షణకార్యము మఱికొన్నియుదాహరణములఁగూడఁ గన్పడుచున్నది. ఎట్లన ?

తే॥ గీ॥ లజ్జయుండినే పశువుల – కిజ్జగమునఁ
జమరులానగపుత్రికై – శ్యంబుగనుచు ।
నెడలఁదమవాల సంప్రీతి – సడలఁజేయుఁ
గాదె? వేవేగనిద్దాన – లేదువాదు ॥

ఇట చమరీమృగములకుఁ దమవాలసంప్రీతి శిథిలీకరణము గౌరీకేశపాశ నిరీక్షణకార్యముగాఁ వర్ణింపఁబడినది.

మఱియు మూడవపాదమున గ్రావసారూప్యముచే నర్థతఃప్రాప్త మగు మాలతియందలి కాఠిన్యము నాయికయొక్క యంగసౌకుమార్య నిరీక్షణకార్యమునుగాదు. ఏలయన ? ఆయాయివస్తువులయందలి కాఠిన్య సౌకుమార్యములు స్వతస్సిద్ధములుకాని యన్యవస్తు నిరీక్షణములచే సంభవించునవి కాకుంటచే. మఱియేమన ? మాలతి సుకుమారమ య్యును సుకుమారతరమగు నాయికా శరీరమును జూచుటచే దాని యందుఁ గాఠిన్యబుద్ధి పొడముచున్నది. దీనిచే మాలతియందుఁ గాఠిన్య బుద్ధియే నాయికా సౌకుమార్య నిరీక్షణకార్యముకాని కాఠిన్యము కాదని తేలినది. ఈరీతిగ బుద్ధికిఁ గార్యత్వము 'సుదతీ నీయంగకముల'' ననెడు తుల్యయోగితాలంకారముయొక్క యుదాహరణములోఁగూడఁ గన్పట్టుచున్నది.

దీనినిఁబట్టిచూడ నర్థములకు సాక్షాత్తుగఁ గారణతగాని కార్యత గాని లేకున్నను జ్ఞానవిషయములగు నర్థములకు నవి కలుగుచో వాని జ్ఞానములకుఁగూడఁ గార్యతాకారణతలు సంభవింపవచ్చునుగాన 'నా పూఁబోఁడినడల్ బెండంగుఁగన' మున్నగునవిగూడఁ గార్యనిబం ధనయగు నప్రస్తుత ప్రశంసకుదాహరణములు కావచ్చునని తలఁచి ప్రాచీనులిట్టి యుదాహరణముల నిచ్చియుందురని చెప్పవచ్చును.

ఒకవేళ, జ్ఞాయమానమగు గతిసౌందర్యాదికము లజ్జాహేతువు కాదనియును గతిసౌందర్యాదిజ్ఞానమే హేతువనియు పదార్థములేకు న్నను కేవల జ్ఞానమువలననే కార్యోత్పత్తి కలుగుటంజేసి, ఇట్లగుచో

బై యుదాహరణమున నలంకారమెట్లు పొసఁగుననని శంకించినచో దీనికి సమాధానమెట్లనిన ?

అప్రస్తుత ప్రశంసాలంకారమునఁ బ్రస్తుతాప్రస్తుతములకుఁ బైనఁ జెప్పఁబడిన రీతిగ నైదువిధములగు సంబంధములేయని నియమింపఁదగదు. కాన నీ ప్రాచీనోదాహరణము సంబంధాంతర విషయము కావచ్చునని చెప్పవచ్చును. సంబంధాంతరములఁగూడ నప్రస్తుత ప్రశంస కానంబడుటచే. అది యెట్లన ?

మ॥ భవతాపత్రయశామకంబగు భవ - ద్భవ్యస్మితంబెంచ మా
ధవ ! దివ్యౌషధిధాన్యరాశియది మం - దశ్వాస సంపర్క సం ।
భవ వైతుష్యమునొందున త్తఱిదెసల్ - వ్యాపించునాపొల్లువో
లెవదాతద్విజరాజసుందరఘృణుల్ - నిండున్ జగంబంతయున్ ॥

వరదరాజస్తవము. భగవంతునియొక్క స్మితము దివ్యమగు నోషధీ ధాన్యరాశి. అది యతని నిశ్వాససంపర్కముచేఁ బైకి నెగురఁగొట్టఁబడునపుడు పైకెగసిన పొల్లుగా విశ్వవ్యాప్తమగు చంద్రికిరణములను గవి యుత్ప్రేక్షించినాఁడు. దీనిచే భగవత్స్మితము చంద్రికిరణములకు సారభూతమగుటచే మిక్కిలి ధావళ్యము కలదని యుత్కర్షము తోఁచుచున్నది. ఇట చంద్రికిరణము లప్రస్తుతము, స్మితము ప్రస్తుతము. ధాన్యమునకును బొల్లునకును గార్యకారణ భావములేదు. సహోత్పత్తి భావముగలదు. కాననిది సహోత్పత్తి రూపసంబంధ నిబంధనయగు నప్రస్తుత ప్రశంస. ఇట్లే "స్రష్ట దమయంతిముఖమును" అను పద్యమందు చంద్రుఁడు ముఖము ననెడు నుపమానోపమేయ పదార్థముల నాశ్రయించి చంద్ర సారాంశ హరణమును గారణమునుగాఁ దన ప్రౌఢోక్తిచేఁ గవి కల్పించినాఁడు. మఱియొకరీతిగను గన్పట్టుచున్నది :-

స్రగ్ధర ॥ కాళిందీ ! కుంభజాతా ! - కలదె పలుకునేఁ - గంధినావైరినేలా
క్రాలన్ బేర్కొందునే న - ర్మదను సవతి పే-రన్ ననున్ బిల్చుటొప్పె
మాలిన్యంబెట్లునీకున్ - మగువ ! తెలియుమా - మాలవీసాంజనాశ్రూ
త్కాలస్రోతస్సులన్, హే - తు వెది? కినిసెద- త్తుంతలేంద్రుండువీకన్ ॥

నర్మదాసముద్రుల సరివాదము. సముద్రుఁడు భ్రాంతిచే నర్మదను గాళింది! యని పిలిచెను. ఆపె కొంటితనమున నతనిని నగస్త్యునిగా సంబోధించెను. తక్కిన సంభాషణమును భద్యమున నన్వయించుకొన వచ్చును.

ఇట నర్మదానది తనకు నైల్యసంప్రాప్తికి మాలవదేశపు రాజ భార్యల కన్నీరును గారణముగాఁజెప్పి యా కంటినీటికిఁ గారణమును వారి భర్తృ మరణముగాఁ జెప్పక దానికిఁగారణమగు కుంతలేశ్వరుని కోపమును జెప్పెను. కాననిది కారణముచేఁ గారణాంతరము గమ్యమానమగుటయే స్వరూపముగాఁగల కారణనిబంధనయగు నప్రస్తుత ప్రశంసాలంకారము.

లేక కుంతలేశ్వరుఁడు మాలవరాజును జయించెనా? యని యొకఁడొకని ప్రశ్నింప నాతఁడాతనికి నర్మదాసముద్ర సంవాదరూపమగు కార్యము వర్ణించెనని యన్నచో నిది కార్యనిబంధనయును గావచ్చును.

కారణనిబంధన యనినచోఁ బ్రశ్నము 'హేతువేది' యని శబ్దముచేఁ జెప్పఁబడెను. కార్యనిబంధనయన్నచోఁ బ్రశ్నమూహించుకొన వలయును.

### ప్రస్తుతాంకురాలంకారము. 28.

కం॥ కృతిఁబ్రస్తుతాంకురము ప్ర
స్తుతమునఁ బ్రస్తుతము దనర – ద్యోతితమైనన్ ।
రతిభృంగమ! వెలయఁగ మా
లతి, కంటకి కేతకినిఁగ – లయుటెటు తగునే? ॥

ప్రస్తుత వృత్తాంతముచేఁ బ్రస్తుతవృత్తాంతమే స్ఫురింపఁజేయఁబడినచో నది ప్రస్తుతాంకురాలంకారమగును.

ప్రియుఁ డన్యాసక్తుఁడగుచుండఁగా నుద్యానవనమున నతనితో విహరించుచున్న నాయిక యాపని ప్రమాదకరమని యాతనికిఁ బోధింపఁదలఁచి మాలతిని వదలి ముందుగల కేతకీ కుసుమముపై వ్రాలఁబోవు

తుమ్మెద నుద్దేశించి యీరీతిగఁ బల్కుచున్నది. ఇట భృంగ వృత్తాన్తమును గాముకవృత్తాంతమును బస్తుతములు. భృంగవృత్తాంతముచేఁ గాముక వృత్తాంతము స్ఫురింపఁజేయఁబడుచున్నది.

పశుపక్ష్యాదులను సంబోధించుట యసంభవముగాన భృంగ వృత్తాంతము ప్రస్తుతముగాదనియు మఱియొకదానిని బోధించుటకై చెప్పఁబడిన యప్రస్తుతమనియుఁ దలంపరాదు. మౌఢ్యముచేతఁగాని పెంచిన ప్రేమ మున్నగువానిచేతఁగాని భృంగము చిలుక మున్నగు వానిని సంబోధించుట లోకములోఁ జూడఁబడుచున్నది. మఱియును గవితాలోకమున నిట్టి సంబోధనములు చమత్కారావహములు. ఎట్లన ?

ఉ॥ ఎవ్వడవీవు, దైవబల - హీనుఁడనన్ ధవవృక్షమందు ని
కెవ్విధి నీవిరక్తి, తగ - నెంచితి, తెల్పుము, తెల్పెదన్ గడున్ ।
దవ్వదె మత్త్రియధ్వగజ - నంబటు దానినిగొల్చు నెంతయున్
జువ్వె ? పరాద్భుతింగనను - సుంతయు బాటను నీడగల్గియుఁ ॥

ధవవృక్షమునకును బాటసారికిని సంవాదము. ధవవృక్షమందుఁ బిశాచములుండుననెడు భీతిచే బాటసారులు దానినీడనాశ్రయింపరు. దూరముగానున్నను మఱ్ఱినీడ నాశ్రయింతురు. సంవాదానుసారముగఁ బద్యమందలి పదముల నన్వయించుకొనఁదగు. ఈరీతిగఁ జేతనాచేతనములకు వలెఁ బశుపక్ష్యాదులను సంబోధించుటలో దోషములేదు.

మఱియును :-

చం॥ తమివడి యెంతయొ త్తినను - దాలెడు పుష్పసుగంధివల్లరుల్
భ్రమర ! చెలంగుఁగాదె ? యట - వ్రాలి మనంబలరింపుమింపునన్ ।
సమరుచిలేని బాలను న - జాతరజస్కను మూఢమల్లి కా
సుమకలికన్ వితావితగఁ - జొచ్చుచు బల్మిఁగలంచెదేలకో ? ॥

ఉద్యానవనఃకున భృంగమునుగూర్చి చేసిన యుపాలంభనమగుటచే నిట వాచ్యార్థము ప్రస్తుతము. ప్రౌఢవనితలుండ బాలికను బల్మిఁగవియు

కాముకుని మందలించుట యనెడు గమ్యమానార్థముగూడఁ బ్రస్తుత మగుచున్నది.

మ॥ చెలి! యీపద్మిని కోశయుగ్మమునుదా - ల్చెన్ హంసచంచుక్షతం
బులలిన్ జూతకవల్లియున్ జివురదే - పుంస్కోకిలాస్వాదితం,
బలరన్ నెచ్చెలులిట్టు దీర్ఘికదరిన్ - హాసించి పల్కంగఁ దో
య్యలిగప్పెన్ జనుదోయిఁ బైఁటఁ బెదవిన్ - హస్తానత్రీణాత్మయై॥

ఈ పద్మినియనుటచేతను దీర్ఘికదరిననుటచేతను వాచ్యార్థము ప్రస్తుతమని స్పష్టము. గమ్యమానార్థముగూడఁ బ్రస్తుతమేయని యుత్తరార్థమునఁ గవి స్వయముగనే సూచించెను.

ఇట తొలియుదాహరణముల రెండింటను లోచనకారుఁ డన్యాపదేశ ధ్వని యని వక్కాణించెను. అతని యభిప్రాయమేమన? అప్రస్తుతాలంకారమున వాచ్యార్థము ప్రస్తుతము గాకుంటచే వర్ణనీయము కాదు. కాన వాచ్యార్థమున శబ్దములయొక్క యభిధాశక్తి సమాప్తము గాకుంటచేత నావాచ్యార్థముచే నప్రస్తుతార్థస్ఫూర్తి యలంకారము గావచ్చును. కాని ప్రస్తుతాంకురాలంకారమున వాచ్యార్థము ప్రస్తుతమగుటచే నచ్చట నభిధాశక్తి పర్యవసానము నొందును. పిమ్మట నర్థసౌందర్యబలముచే నభిమతమైన మఱియొక యర్థము స్ఫురించుట యనునది ధ్వనియగును గాని యలంకారము కానేరదని.

దీనికి సమాధానమేమనిన? ప్రస్తుతాంకురమున వాచ్యార్థము ప్రస్తుతమే యైనను నదియే ముఖ్యము గాకుంటచేతను నర్థాంతరము గూడఁ బ్రస్తుతమని కవికభిమతమగుటచేతను నభిధావ్యాపారము తొలి యర్థమును దొలుత బోధించినంత మాత్రమునఁ బూర్తినొందక యర్థాంతరమును గూడ బోధించును. కాన నర్థాంతరము ధ్వని కానక్కఱ లేదని.

తృతీయోదాహరణమునఁ గవియే తొయ్యలి గప్పెన్ జనుదోయిఁ బైఁటనని స్వవచనముచేతనే మఱియొక ప్రస్తుతార్థమును

గూడఁ దెలియఁజేసెను గాన నట నలంకారమగుటకు నెవ్వరికిని వివాదము లేదు.

ధ్వనికారుఁడు గూడ నీరీతిగఁ జెప్పినాడు. ఎట్లన ?

కం॥ ఇల శబ్దార్థంబుల శ
క్తుల వ్యంగ్యార్థంబు గృతులఁ - దోఁతెంచెడుఁబో ।
వెలిఁబడఁ గవి నిజ వచనము
ల, లలిన్ గాదద్ది ధ్వని య - లంకృతియ యగున్ ॥

శబ్దార్థ శక్తులచే వ్యంగ్యార్థము స్ఫురించినను నది కవి వచనముచే స్పష్టమైనచో నలంకారమనిపించుకొనును గాని ధ్వని యనిపించు కొనదని యర్థము.

ఇవి సారూప్య నిబంధనములగు నుదాహరణములు. ఇతర సంబంధము గల్గిన వానిని గూడ వాచ్యమగు నర్థమునకును వ్యంగ్యమగు నర్థమునకును నేవిధముగ నైనను బ్రస్తుతత్వము లభించినచో నీయలంకారమునకు నుదాహరణము నీయవచ్చును. ఎట్లన ?

తే॥ గీ॥ నయన యుగ్మమ ! జాగర - ణమును జేయ
నేమరిలకుండు శివరాత్రి - యేగుదెంచె ।
నీకు నీడైన చెలికాఁడు - ప్రాకటముగ
నీదు చెంతనె నెనరున - నిల్వ నబ్బు ॥

శివరాత్రి జాగరణమునకు శివ సారూప్య ప్రాప్తి ఫలము. దానిలో నేకదేశమైన తృతీయ లోచన లాభము పై పద్యమున జాగరణఫలముగ వర్ణింపఁబడినది. దానిచే శివసారూప్యము ద్యోతితమగుచున్నది. ఈరెండును బ్రస్తుతములే. ఇట వాచ్యమగు తృతీయలోచనప్రాప్తికిని గమ్యమగు శివసారూప్యప్రాప్తికిని ఏకదేశి - ఏకదేశ భావ సంబంధము కలదు. మఱియును :-

శా॥ శ్యామంబౌ కచభారము న్తిమిరము - ద్యద్భాను ఘృష్టిన్ నిజ
శ్రీమీఱన్ జెఱఁబట్టెనో యనునటుల్-సిందూరమున్ దాల్చి శో।

భామాన్యానన కాంతిపూరపు పరీ - వాహంబు నాఁజెల్లు నీ
సీమంతంబదె ప్రోచుఁగాత జననీ! - క్షేమంబు సంధించుచున్ ॥

శంకర భగవత్పాదుల భవానీస్తుతి. ఓతల్లీ! నీకచభారమనెడు చీకటి బాలసూర్యుని కిరణమును జెఱఁబట్టెనా? యనునట్లు సిందూరమును దాల్చి ముఖకాంతి పూరమునకు బోదె-కాలువా? యనునట్లు ప్రకాశించు నీపాపట మమ్ములను రక్షించుఁగాత. ఇట పార్వతీ దేవి పాపట తటాకము వలె నిండియున్న వదన సౌందర్యమునకు నీరు పాఱెడు చిన్ని బోదె-కాలువ వలె నున్నదనుటచే వాచ్యమగు పరీవాహంబు నాననెడు నుత్ప్రేక్షచేఁ బరీవాహమునకుఁ గారణ భూతమైనట్టియు స్వస్థానమున నిముడక బైటకుఁ బ్రసరించుచున్న వదనసౌందర్య సమృద్ధి ద్యోతితమగుచున్నది. ఈ వదనసౌందర్య సమృద్ధియును ప్రస్తుతమే.

ఉ॥ అంగములందుఁ జుట్టఁబడు - నంబుజనాళము తేంట్ల బాఱు రూ
పుం గను,నావిచేఁ బఱఁగు - ముక్కఱ ముత్తెము గవ్వఱాయి వో।
లెం,గుచపాళిఁ గప్పురపు - లిబ్బియు నంతన మండు,నీటి చా
లుం గయిదొప్పలందివురుఁ-బ్లుష్టకటాహము నొందు కైవడిన్ ॥

నాయిక విరహ తాపము సహింప నలవి కాదని తెలుపుటకై సంతాప కార్యములగు మృణాల కాండము నల్లబడుట మున్నగు నవి వర్ణ్యములుగాఁ జెప్పఁ బడినవి. దీనిచే సంతాపాతిశయ మనెడు కారణము ద్యోతిత మగుచున్నది. ఈ రెండును ప్రస్తుతములే.

ఎచ్చట కార్యము ద్వారా కారణము పద్యము నందే వాచ్యమగునో యచ్చట ప్రస్తుతాంకుర మనరాదు. అది యనుమానమే యగును. ఎట్లన?

శా॥ పైనన్ గ్రింద నురోజ భార జఘన - స్పర్శంబు చే వాడి యా
కానన్ దాకని తావునందు హరితో - త్కర్షంబునున్ గల్గి బా।

హానూనార్తి విసార వేష్టనములన్ – వ్యత్యస్త విన్యాసమై
తా నీపద్మ పలాశ శయ్య దెలుపున్ – దన్వంగి సంతాపమున్ ॥

రత్నావళి నాటికలో స్వ విరహాతుర యగు సాగరిక యొక్క పాన్పును జూచిన రాజు వాక్యమిది. శయ్యకుఁ బై భాగమున నురోజ భార స్పర్శము చేతను గ్రింది భాగమున జఘన స్పర్శము చేతను వాడి నట్టియు నడుము తాకని చోట నాకు పచ్చగ నున్నట్టియు, సంతాప భారముచే బాహువుల నిటునటు కదల్పుటచేత రేగినట్టి సాగరికయొక్క తామరాకుల పాన్పు సంతాపాతిశయమును సూచించు చున్నది. సంతాపాతిశయ కార్యములును గారణ భూతమగు సంతాపమును గూడఁ బద్యమందు వాచ్యములగుటచే నీ యలంకారమున కుదాహరణము గాదు. మఱి యేమనఁ గార్యముచేఁ గారణానుమానమనియే చెప్పవలెను.

పర్యాయోక్తాలంకారము. 29.

కం॥ అగుఁ బర్యాయోక్తము వే
అగు రహిఁ జెప్పంగ గమ్య – మర్థము, వానిఁ ।
బొగడెద నెవ్వఁడు రాహువు
ముగుద కుచంబులను వ్యర్థ – ముగఁ దాఁ జేసెన్ ॥

గమ్యార్థము నన్య రీతిగ సొగసుగఁ జెప్పినచో నది పర్యాయోక్తమగును. చెప్పఁదలఁచిన వ్యంగ్యార్థము వేఱు భంగినిఁ జెప్పఁ బడినపుడు వ్యంగ్యతావస్థ కన్న సుందరముగా నుండవలెను.

ఉదాహరణమున భగవంతుఁడగు వాసుదేవుఁడు తనయొక్క యసాధారణమగు వాసుదేవత్వ రూపముచే గమ్యుఁడగుచున్నాఁడు. అతఁడే రాహు వధూ కుచ వైయర్థ్యమును జేసిన వాఁడని ప్రకారాంతరముచేఁ జెప్పఁబడినాఁడు. ఈ వాచ్యార్థము గమ్యార్థముకన్నఁ జమత్కారముగ నున్నది. అట్లు చమత్కారముగ లేకున్న నలంకారము కాదు ఎట్లన ?

కం॥ వానిన్। బొఁగఁడెద రాహువు శిరమును
దెగ నఱికె నెవండు దేవ – దీనత యడఁగన్ ॥

ఇట ప్రకారాంత రాభిధానమునఁ జమత్కారము లేదు.

ఓయీ! రాహు వధూకుచ వైయర్థ్య కారి యను వాక్యార్థమునకు రాహు శిర శ్ఛేద కారి యను నర్థమును గమ్యార్థమునుగాఁ దీసికొని యలంకారము సమన్వయింప వచ్చును. అసాధారణ మగు వాసు దేవత్వ రూపము వఱకుఁ బో నక్కఱ లేదు కదా? యని శంకింప రాదు. ఏలయన?

రాహు శిర శ్ఛేద కారిత్వ రూపార్థము గమ్య మైనను వాచ్యార్థమును బోషించుచు దానికి గుణీభూత మగు చున్నది. ఈ గుణీభూత మగు వ్యంగ్యార్థముచేఁ దోషింపఁ జేయఁ బడు నసాధారణ రూప మగు వాసు దేవత్వమే ప్రధాన వ్యంగ్యము గాన దానిని దీసికొని యలంకార సమన్వయము యుక్తము గాన. లేక

కం॥ ఈకలి వాపఁగ రాహు
స్త్రీకుచ విఫలత్వ కారి – శ్రీహరిఁ గొలుతున్ ॥

అని యుదాహరించిన చో రాహు స్త్రీకుచ విఫలత్వ కారి యనెడు పదము శ్రీ హరికి సామాన్య విశేషణముగఁ గూర్పఁ బడుటచే నిట రాహు శిర శ్ఛేద కారిత్వము ప్రధాన వ్యంగ్య మగును గాన నా యర్థమును దీసికొని యలంకారము సమన్వ యింప వచ్చును.

అట్లు గాక ప్రకృతోదాహరణమున విశేషణవాక్యార్థము 'ఎవ్వఁడు' అను విశేష్యమునకు విధేయతా భంగిచే నన్వయింపఁ బడుటచే దానికొక ప్రాధాన్యము కలదు కాన కేవలము రాహు శిర శ్ఛేద కారిత్వ రూపార్థమే కాక భగవంతుని యొక్క యసాధారణ రూప మగు వాసు దేవత్వ మే గమ్య మని కవి కభిప్రాయము గాన దానిని దీసికొని యే యలంకారము సమన్వ యింపఁ బడినది.

మఱి కొందఱి సంశయ మేమన? పద్యమందలి 'ఎవ్వఁడ' నెడు సర్వ నామ మునకుఁ బ్రసంగ వశమున వాసు దేవుఁడు వాచ్యార్థమే యనియు నతనిని వ్యంగ్యార్థమును గా గ్రహించి యలంకార మెట్లు చెప్పవచ్చునని.

దీనికి సమాధాన మేమనిన? ఆ సర్వ నామమునకు సాధారణ ముగ భగవదూత్రిపుఁడగు వాసు దేవుఁడు వాచ్యార్థమనియు విధేయ విశేషణ రూపమున నున్న వాక్యార్థమునకు నసాధారణ రూపమగు వాసు దేవత్వము వ్యంగ్యార్థ మనియు నట్టి గమ్య మగు నర్థమును దీసి కొని యలంకారము సమన్వయింప వచ్చునని. మఱి యొక యుదాహారణ మెట్లన?

తే॥ గీ॥ ఎవని పాదంబు లోకంబు – నెంచి చూచు
లోక మెవ్వని పాదంబు – నాకలింప
లేదో! వారలు నీవిద్య – లీల నెఱుఁగ
వేడ్కఁ జేసియుఁ దెలియరు – విశ్వ గురుఁడ! ॥

ఒకండు తన గురువు నిట్లు స్తుతించు చున్నాఁడు. గౌతముఁ డక్ష పాదుఁ డగుటచే నతని పాదము లోకమును జూడఁగలదు. పతంజలి శేషావ తార మగుటచే నురగుఁడు గాన నతని పాదముల నెవ్వరు నెఱుంగఁ జాలరు. ఇట గౌతముఁడును బతంజలియును దమ యసాధారణ రూపములచే గమ్యులగుచు భంగ్యంతరముచేఁ జెప్పఁబడిరి. మఱియును.

తే॥ గీ॥ తలఁప దిరిసెన మొగ్గమా – ర్దవముఁ గేరు
నంఘ్రి యుగళిని నీ కఱ – కౌ మనంబ
దెంత దప్పులఁ గారింప – నిచ్చ గించెఁ
దెలియ నాకది చెప్పంగ – వలయు నతిథి! ॥

రాయ బారిగా వచ్చిన నలుని గూర్చి దమయంతి పల్కిన వాక్యము. నీ ప్రియురాలు మెంతవఱకని గమ్యార్థము. అది భంగ్యంతరముచేఁ జెప్పఁబడినది. గమ్యము కన్న రమ్యముగఁ గూడ నున్నది. మఱియును.

శా॥ ఏ సర్వేశున కంబు రాశి దొనయా? – నెవ్వాని వాహంబులన్
వ్యాసార్థుల్ సవరింతుర్, భూషణ కరం – డంబెంచఁ బాతాళమా ।
ద్యో సీమంబదె పూల తోట, మఘవా – ద్యుల్ శాటికా పాలుర్
ష్వాసతూ్సనుఁడు చందనంబవు, నమ – స్సావేల్పు రాజేనికిన్ ॥

సర్వేశ్వరునకు వేదములు గుఱ్ఱములు. భుజంగంబు లాభరణంబులు. చంద్రుఁడు భూషణము. దిక్కులు వస్త్రము. ఇష్వాసతూ్సనుండు :- పుష్పములు ధనుస్సు గాఁ గల మన్మథుఁడు చందనము. శంకరుఁడు మన్మథుని భస్మ మొనర్చి యొడలికిఁ బూసికొనెనని పురాణ ప్రసిద్ధము. ఈ పై వాక్యార్థములు వివక్షా ధీనము లగుచుండ వేదత్వా ద్యాకార ముచే గమ్యము లగుచున్నవి. ఈ గమ్యములగు వేదాదులే భంగ్యం తరముచే వాచ్యముగఁ జమత్కారముగఁ జెప్పఁ బడినవి,

మఱియు సర్వేశ్వరునకు దేవతా సార్వ భౌమత్వమును బోధిం చుటకై యిట్లు చెప్పఁ బడినది.

ఈ యలంకార లక్ష్య లక్షణ సమన్వయముల నలంకార సర్వస్వ కారుని రీతి భిన్నముగఁ గన్పట్టు చున్నది. ఎట్లనిన ?

అతఁడు "గమ్య మానార్థమును భంగ్యంతరముచేఁ జెప్పుట పర్యా యోక్తమ"ని సంప్రదాయాగతమగు నీలక్షణమునే గ్రహించి నాఁడు. కాని యీక్రింద నీయఁబడిన ప్రాచీనోదాహరణమును వేరు రీతిగ సమన్వయించినాఁడు.

తే॥ గీ॥ ఎచ్చరించి యు చక్రంబు – నెవఁడు రాహు
కాంతల రతోత్సవంబును – గొంగలింత ।
చొక్కు కులుకులు దొఱంగించి – చుంబనంబు
నొక్క దానినె మిగులు గా – నుక్కఁజేసె ॥

ఏభగవంతుఁడు తన చక్రమును నఱకుమని యాజ్ఞాపించి నంత మాత్ర మునసే రాహు కాంతల రతికిట్టి లోపము కలుగఁజేసెనో యతనికి నమస్కారమని వాక్యార్థము.

ఈ ప్రాచీనోదాహరణము నతఁడెట్లు సమన్వయించెనన? రాహు వధూగత రతోత్సవ విశేషముచే దానికిఁ గారణ భూతమగు రాహు శిరశ్ఛేదము గమ్యమగుచున్నది. గమ్యమున కభిధాన మసంభవము కానఁ గార్యాది రూపముననే చెప్పక తప్పదు. ఈరీతిగ గమ్యమగు నర్థమునకు నన్యరీతి నభిధానము గల్గుటచే నిట యలంకారము గలదని సమన్వయించినాఁడు. ధర్మియగు వాసుదేవుఁడువ్వఁడనెడు సర్వ నామముచేఁ జెప్పఁబడుటచే నాయర్థము వ్యంగ్యము కా వీలులేకుంటచే నిట్లు సమన్వయింపక తప్పదని యతని యాశయము.

అతని యనుయాయి యగు లోచనకారుఁడు గూడ

కం॥ అది పర్యాయోక్తం బె
    య్యది వేఱు విధంబు చేత – నభిహిత మగుడున్ ।

అను లక్షణమునే గ్రహించి దాని యుదాహరణమునఁ గార్యమును వాచ్యము గను గారణమును వ్యంగ్యముగను జూపి లక్షణమును బర్యాయోక్తమనెడు లక్ష్యనామమును శ్లేశముతో నన్వయించినాఁడు. ఎట్లన ?

ఏయర్థము వేఱు విధముచేత ననగా వాచ్యము కన్న వేఱగు వ్యంగ్యార్థముతోఁ గూడినది గా నభిహితమగు చో నని లక్షణమున కర్థమును జెప్పినాఁడు. పర్యాయోక్తమనెడు లక్ష్య నామమునకుఁ బర్యాయముతో ననఁగాఁ బ్రకారాంతరమగు వ్యంగ్యార్థముతోఁ గూడుకొని ఉక్తమనఁగా నభిహిత మగునది యని.

ఇట్టి శ్లేశము వారికేలనో తెలియ రాకున్నది. మేము గమ్యార్థమునకుఁ బ్రకారాంతరముచే నభిధానములోఁ గొన్ని సరసమగు నుదాహరణముల నిచ్చి యున్నాము కదా ?

'ఎచ్చరించియుచక్రింబు' అనెడు పాచీనోదాహరణమునఁ గూడ నెవఁడనెడు సర్వ నామమునకు మేము లోఁగడఁ జెప్పిన రీతిగ సాధారణమగు భగవత్స్వరూపమే వాచ్యార్థమనియు విధేయమగు విశేషణ

వాక్యార్థమునకు నసాధారణ రూపమగు వాసుదేవత్వము గమ్యమనియు ననెడు భేదమును గ్రహించి యలంకారము చక్కగ సమన్వయింప వచ్చును గాన నలంకార సర్వస్వ కారుని యొక్కయు లోచన కారుని యొక్కయు సమన్వయ రీతి క్లేశభూయిష్ఠమని చెప్పక తప్పదు.

మఱియు నలంకార సర్వస్వ కారుఁడు చెప్పినట్లు రాహు శిర శ్ఛేదమే గమ్యమగుచో నదియును బ్రస్తుతమేకాన, ప్రస్తుతాంకురమే కాఁగలదుకాని పర్యాయోక్తము కానేరదు. మేము చెప్పిన రీతిగ సమన్వయ మెట్లన? భగవంతుఁడగు వాసుదేవుఁడు చక్రము నాజ్ఞా పించినంతమాత్రముననే రాహు శిరమును చక్రము ఖండించినది. ఇదియును బ్రస్తుతార్థమే. ఇట్లు ఖండించుటచే నాతని స్త్రీరతికట్టిలోపము ప్రాప్తించినది. ఈ వాచ్యార్థముచే నాభగవంతుని యసాధారణ రూప మగు వాసుదేవత్వము గమ్యమగుచున్నది. అని

దీని ఫలితార్థమేమనిన? పై పద్యమున నట్టి రాహుస్త్రీ రతి వైకల్యముచే దానికిఁగారణ భూతమగు రాహు శిరశ్ఛేద రూపమగు కారణము గమ్యమాన మగుచున్నను నాయర్థము ప్రకృతమై వాచ్యార్థ సిద్ధికి సాధన భూత మగుటచే గుణీభూత మగుచు నప్రధాన మగు చున్నది. కాన దానినిఁ బ్రధాన వ్యంగ్య మనరాదు. మఱేమన? ఈ గుణీభూత వ్యంగ్యార్థముచేఁ బరిపుష్టిఁ జెందిన రాహుస్త్రీ రతివైకల్య కారిత్వ రూపమగు వాచ్యార్థముచేనిట్టి యసాధారణ కార్యకర్త యగు వాసుదేవుఁ డసాధారణ మహిమ కలవాఁడనెడు వ్యంగ్యార్థము స్ఫురిం చుచున్నది. పద్యమందలి యెవ్వఁడనెడు సర్వనామముచే వాసుదేవుఁడు కేవలము భగవద్రూపముచే సాధారణముగ వాచ్యమగుచున్నాఁడు. పై రాహుస్త్రీరతి వైకల్య కారిత్వ రూపమగు వాచ్యార్థముచే మహి మాతిశయముగల తనయొక్క వాసుదేవత్వమనెడు నసాధారణ రూప ముచే వ్యంగ్య మగుచున్నాఁడు. ఇట్టి వ్యంగ్యార్థము పద్యమున భంగ్యం తరముచే వాచ్యమగుచున్నది. కాన నలంకారము సమన్వితమగు

చున్నది. మఱియు గమ్యమగునది వాచ్యము. కావీలులేదు కానఁ బర్యాయముచే ననఁగాఁ గార్యాది ద్వారముచే నుక్తమగుచున్నది. అనఁగా నాక్షిప్తమగుచున్నదనియును బర్యాయోక్తమను పదమునకుఁ బర్యాయముచే ననఁగాఁ గార్యాది రూపమగు ప్రకారాంతరముచే నుక్తమనఁగా నాక్షిప్తమగునది యని యర్థమును జెప్పి పై పద్యమున రాహు శిరశ్ఛేద రూపమగు కారణము రాహుస్త్రీ రతివైకల్య రూపకార్యముచే నాక్షిప్తమగుచున్నదని యలంకార సర్వస్వ కారుని యన్వయ క్లేశము వ్యర్థమని తెలియవలెను. అని.

కొందఱీపద్యమును వేఱువిధముగఁ బర్యాయోక్తమునకు విషయమని సమన్వయించిరి. ఎట్లన ?

వాసుదేవుఁడు భగవద్రూపముచేఁ దెలియఁబడుట విష్ణు మర్యాదచే లభ్యమగుటయే సుందరముగానఁ బర్యాయోక్తమునకు విషయమగుచున్నదని.

కాని యిట్లనుట పొసఁగదు. ఏలఞన ? పర్యాయోక్తములో వ్యంగ్యముయొక్క సౌందర్యమే శోభావహము కాదు. మఱియేమన ? వ్యంగ్యార్థము భంగ్యంతరముచేఁ వాచ్యమగుటయే శోభాధాయకము. ఆలోచింప వ్యంగ్యము భంగ్యంతరాభిధానము కన్నఁ బరాయోక్త ములో సుందరమును గాదుకదా ? ఇట రమ్మను నర్థమును వ్యంగ్య ముగానెంచి యీదేశమలంకరింపఁ బడుగాక యని కాని సఫలత నొందిం పఁబడు గాక యని కాని వాచ్య రీతిగఁ జెప్పుటయే సుందరము కదా ? అందుచేఁ బర్యాయోక్తమున వ్యంగ్యమసుందరము గాకుండఁగఁ జేయుటకైనఁ బ్రయత్నింప నవసరములేదు. పర్యాయోక్తమున వ్యంగ్యార్థము తఱచుగ వాచ్యార్థముకన్న నసుందరమగుట తప్పదు కాన.

## పర్యాయోక్తము. II

కం॥ అదియును బర్యాయోక్తం
బెదనొక నెపమెంచఁ దనదు – హితమొదవుటకై ।

కదలకమీారిరువురు నీ
పాదనుండుడు చూతలతిక – పొడగనఁబోదున్ ॥

తన కోరికను గూర్చుకొనుటకు నొక నెపమును నవలంబించినచో నదియుఁ బర్యాయోక్తమగును. ఒకచేటి తననాయికతో నిట్లుపలికెను. ఓ చెలీ! నీవును నీచెలికాఁడును నీ లతాగృహముననుండుడు. నేను జూతలతను జూడంబోవుచున్నానని. వారి స్వేచ్ఛావిహారమును మన మునఁదలఁచి యీానెపముతో బయటకుఁ బోయినది. మఱియును.

ఆ॥ వె॥ రాధ! నాదుబంతి – రాకేందువదన! నీ
యొడిని దాఁచనగునె? వడిగ నిమ్మ ।
టంచుఁదరిని జేరి – యాపె నీవిని సడ
లించు కృష్ణుఁడు వెల – యించు ముదము ॥

వెనుకటి పద్యమున నితరుల యిష్టము సాధింపఁబడినది. ఈపద్యమునఁ దనయిష్టము సాధించుకొనఁబడినది.

వ్యా జ స్తు త్య లం కా ర ము. 30.

కం॥ కృతులన్ వ్యాజస్తుతి యది
స్తుతి నిందనుదెల్ప నింద – స్తుతినిన్ దెలుపన్ ।
ద్యుతటిని! నీకు వివేకము
పతితము పాపులను స్వర్గ – భాగులఁజేయన్ ॥

నిందచే స్తుతినిగాని స్తుతిచే నిందనుగాని తెలిపినచో వ్యాజస్తుతి యగును. ఇట పుణ్యవంతులను వలెఁ బాపులనుగూడ స్వర్గమును బొందించుటచే గంగకు వివేకము శూన్యమను నిందచే గంగాప్రభావ ము స్తుతింపఁబడినది.

స్తుతిచే నిందాభివ్యక్తి యెట్లన?

తే॥ గీ॥ బాగుబాగోసి దూతికా! – క్రాఁగనేల?
యింతకంటెను నాకు మే – లేమి సేయు ।
వలయు నెంచఁగ నాకయి – పంటనొక్కు
లకట! తాల్మిని గోళ్లఁ జీ – రికలు గొంటి ॥

ప్రియుని దోడ్కొని వచ్చుటకై పంపఁబడిన దూతికను గూర్చి నాయిక యిట్లు పలుకుచున్నది. నీవతని దోడ్కొని రాలేకపోతివని వగవకుము. నాకై పంటనొక్కులు గోళ్లచీరికలుగూడ ననుభవించితివి. ఈ స్తుతిచే నాకై పోలేదనియు నాతనితోఁ గ్రీడించుటకుఁబోతివి గాననిది దూతికా ధర్మవిరుద్ధమనెడు నింద వ్యక్తమగుచున్నది.

నిందచే స్తుతికి మఱియొక యుదాహరణమెట్లన ?

తే॥ గీ॥ శౌర్యగర్వము రాజేంద్ర – కార్యమగునె ?
పొంగి నీవటు పోరు స – ల్పంగనొక్క
తురగ మెక్కిన మాత్రనఁ దొడరి సప్త
తురగగాములు గారె ! నీ – యరులు సరగ ॥

రాజస్తుతి. ఓరాజా ! శౌర్యమును గూర్చి నీవు గర్వపడనలదు. రణమున నీవొక గుఱ్ఱము నెక్కినంతనే నీయరులు సప్త తురగములచే నడుతురు. మిక్కిలి బలాఢ్యులగుదురని భావము. ఇది నింద. సప్త తురగుఁడన సూర్యుఁడనియు నతని జేరుదురనియు నర్థాంతరమును దీసికొనినచో రాజస్తుతి వ్యక్తమగుచున్నది. యుద్ధములోఁ జచ్చిన యోధులు సూర్యమండలమును బొందుదురని శాస్త్రము.

స్తుతిచే నిందాభివ్యక్తికి మఱియొక యుదాహరణము.

శా॥ సాఁబాల్మేను మురారి హైమవతియున్-సాఁబాలు గైకొంట నో
హో ! బాహాఢ్య ! పురారిరూపు సెడ నా-ద్యోగంగ రత్నాకరున్ !
జాబిల్లం బెను మింటి శేషుఁడహివా – సంబౌర ! సర్వజ్ఞతా
ప్రాబల్యంబధినాయకత్వము నినున్ – భైక్షుంబు వట్టెన్ ననున్ ॥

శంకరకవికృతము. ఓప్రభూ ! విష్ణువు సగబాలును బార్వతి సగబాలును వరములచే గ్రహింప నంత శివునిరూపము లేకుండఁబోయినది. ఆతని నాశ్రయించిన వస్తువులు తమతమ తావులకుఁ బోయినవి. సర్వజ్ఞత్వము నధీశ్వరత్వమనెడు నీశ్వరుని యుత్కృష్టగుణములు నిన్నాశ్రయించినవి. బిచ్చమెత్తుట యనునది నన్ను జేరినది. ఇట స్తుతిచే నింద వ్యక్తమగు

చున్నది. ఎట్లన ? ఓ రాజా ! నాపాండిత్య మెఱిగియు నాదారిద్ర్యము దీర్పకుంటివని.

పై యుదాహరణములన్నిటను నిందాస్తుతులు రెండును నొక వ్యక్తికే సంభవించి యున్నవి. భిన్నవ్యక్తి విషయకము లెట్లన ?

శా॥ నీవెవ్వండవు ? కోతి ! రామవిభు సం - దేశార్థవాహుండ నె
 చ్చోవర్తిల్లెడు ? గండఁడా హనుమ, చి-చ్చేన్ బెట్టెనీలంక కా
 రా ! వాఁడాసురబాలబద్ధుఁడనుచున్ - హాసించి తిట్టాడి మే
 నోవంగం గపులెల్ల మోద నడగెన్ - బో ! యేడనో సిగ్గునన్ ॥

హనుమన్నాటకములో నంగదునకును నొక రక్కసునికిని సంవాదము. ఇట హనుమంతుని నిందచే నితర వానరులతనికన్న శక్తిమంతులని స్తుతి వ్యక్తమగుచున్నది.

అన్యస్తుతిచే నన్యనిందాభివ్యక్తి యెట్లనిన ?

మ॥ నిగుడన్ జూడవుమోముమెచ్చులనుబూ-న్కింబల్కవాఘ్యాలిమో
 లఁగడున్ గర్వపుఁబల్కులన్ వినవు, వ్రా - లన్ బోవు పేరాసచే,
 చిగురుంబూరి తఱిన్ గ్రసింతు, నిదురన్ - సేవింతువెవ్వేళ నై
 నఁగురంగంబ ! వచింపు మేతపము రా - ణం జేసితో యేదెసన్ ॥

రాజసేవాక్లిష్టుఁడొకఁడు హరిణమునుద్దేశించి పల్కుచున్నాఁడు. ఉదాహరణము స్పష్టము. ఇట హరిణమును స్తుతించుటచే రాజసేవకుని యాత్మనింద వ్యక్తమగుచున్నది.

అలంకార సర్వస్వకారుఁడు దీని నప్రస్తుత ప్రశంసా భేదమునుగా వక్కాణించెను. ఆతఁడు సారూప్య నిబంధనయగు నప్రస్తుత ప్రశంస వైధర్మ్యముచేతఁగూడ సంభవించునని చెప్పి—

తే॥ గీ॥ వికచకల్హారసంగతి - ప్రకటసురభి
 శీతలంబులు వనసీమ - వాతములును ।
 రామునిందీవరశ్యాముఁ - బ్రకటముగఁ
 దాఁకి సౌఖ్యంబు చేకూర్చి - ధన్యమాయె ॥

ఈపద్యము నుదాహరించినాఁడు. కల్హారపుష్పముల సంబంధముచేఁ బరిమళించుచుఁ జల్లగనున్న వనవాయువులు ఇందీవరశ్యాముఁడగు రాముని దాకి సౌఖ్యమిచ్చి ధన్యమాయెను. ఇట వాతస్తుతిచే నేను ధన్యుఁడనుగాననెడు వక్తృనింద వైధర్మ్యముచే స్ఫురించుచున్నది. యని సమన్వయించినాఁడు.

ఆచార్యదండియు నిదియే యప్రస్తుతప్రశంస యనియును గార్యకారణ నిబంధనయగు నప్రస్తుతప్రశంస లేదనియుఁ జెప్పినాఁడు. ఎట్లన?

కం॥ స్తుతి, సంగతి విడనప్ర
స్తుతప్రశంస యనఁగనిలఁ - జొప్పడుఁ గృతులం ।
దితరుల సేవింపక సుల
భతృణాంబువుల హరిణములు - వని మను వేడ్కన్ ॥

కం॥ రాజానువృత్తి దుఃఖితుఁ
డౌజనుఁడొకఁడాత్మనిట్లు - హరిణమువృత్తిన్ ।
రాజన్నుతిఁ బొగడుటచే
నోఁజననిద్దియును దలఁప - నప్రస్తుతమై ॥

సందర్భములేనిస్తుతి యప్రస్తుత ప్రశంసయగును. ఎట్లన ? ఇతరులను సేవింపక దొరకిన తృణములచేతను నీరములచేతను హరిణములు వేడ్కతో జీవించుచున్నవి. ఈ హరిణస్తుతికి సందర్భములేదు. రాజసేవచే విసిగిన సేవకుఁడొకఁడు హరిణవృత్తినిఁ బొగడుచున్నాఁడు. ఇది నిజమగు స్తుతికాదు. కాననిది యప్రస్తుతము. 'నిగుడన్ జూడ' వనెడు పద్యములోఁగూడ నప్రస్తుతప్రశంస యనియే దండిమతము. కాని యట్లనుటకు వీలుకాదు. స్తుతిచే నింద యభివ్యక్తమగుటచే నిట వైచిత్ర్యము కలదుకాన దీనిని వ్యాజస్తుతి యనుటయే చెల్లును. లేకున్న వ్యాజస్తుత్యుదాహరణముల నన్నిట నప్రస్తుత ప్రశంసయే కావలసి వచ్చును. వ్యాజస్తుతి కుదాహరణము లేకయే పోవలసి వచ్చును.

వ్యాజస్తుతి యనెడు పదమునకు నన్యస్తుతివ్యాజముచే నన్యస్తుతి యనెడు నర్థమును గ్రహించినచో నన్యులను స్తుతింపవలయు ననెడు తలంపుతో నన్యస్తుతి యొనరించిన తావులఁగూడ వ్యాజస్తుతి యగును. ఎట్లన ?

తే॥ గీ॥ తరుణి! నీమోవికెంజాయ - లురలఁజిమ్ము
దొండపండును దమిపేర్మిఁ - దోఁటినొక్క ।
కొదమచిల్క యదెట్టి పె - న్గట్టునుండి
యెట్టి తపమును జేసెనో! - యెంత తడవు ॥

ఇట చిల్కకొదమయొక్క స్తుతిచే నాయికయొక్క యధరసౌభాగ్యాతిశయము యొక్క స్తుతి వ్యక్తమగుచున్నది.

వ్యా జ నిం దా లం కా ర ము. 31.

కం॥ నిందన్ నిందయు వ్యక్తిం
బొందగఁ గృతి వ్యాజనింద - పొల్చును సువిధీ! ।
నిందింపనలదె ? వానిని
జిందన్ నీయొకశిరంబె - చిదిమె నెవండో ॥

నిందచే నిందాభివ్యక్తి వ్యాజనిందయగును. ఓబ్రహ్మ! నీయొక సిరస్సునే నఱికినవానిని నిందింపవలెను. ఇట బ్రహ్మ శిరమును నఱికిన హరుని నిందచే దుఃఖమయ సంసారమును సృజించిన బ్రహ్మయొక్క నింద వ్యక్తమగుచున్నది. మఱియును.

తే॥ గీ॥ నీదుతప్పేమి కాకమా! - నీల్గియార్వ
ధాత నొక్కనె తిట్టంగఁ - దగు నెవండు ।
నీకు సహకారతరువున - నేకవసతి
మధురకూజితపికముతో - మహిని జేసె ॥

ఇట కాకియొక్క నిందచే బ్రహ్మయొక్క నింద వ్యక్తమగుచున్నది.

ఈ వ్యాజనిందాలంకారమును నితరాలంకారికులెవ్వరును జెప్పి యుండక పోయినను నన్యస్తుతిచే నన్యస్తుతి వ్యక్తమగునెడు నైదవ

వ్యాజస్తుతికిఁ బ్రతిగాఁగన్పట్టుటచే నిదియొక యలంకారముగాఁ జెప్పం బడినది.

ఇచ్చట నొకశంక కల్గుచున్నది. అన్యస్తుతిచే నన్యస్తుతియును నన్యనిందచే నన్యనిందయు వ్యక్తములగు తావులఁగ్రమముగ వ్యాజస్తుతి వ్యాజనిందాలంకారముల నంగీకరించినచో స్తుతినిందారూపమగు నప్రస్తుత ప్రశంసాలంకారముయొక్క యుదాహరణములలోఁగూడ ననఁగా 'కృతియొక్కఁడె పత్నులగుమి' 'మోహావిశేషబంధమున' ననెడు నప్రస్తుత ప్రశంసోదాహరణములలోఁగూడ నన్యస్తుతిచే నన్యస్తుతియు నన్యనిందచే నన్యనిందయు ద్యోతితములగుటచే వ్యాజస్తుతి వ్యాజ నిందలే క్రమముగఁ గావలసివచ్చునుగాని యప్రస్తుతప్రశంస కారాదు గదా ? యని.

దీనికి సమాధానమెట్లన ? వేఱువేఱగు నుదాహరణములలో నన్యోన్యప్రసక్తికి నవకాశములేకుండఁగ స్వతంత్రముగఁ బ్రవర్తించు రెండలంకారములు మఱియొక యుదాహరణమున నెచ్చటనైనను సంభవించిన సంభవింపవచ్చును. వ్యాజస్తుతి వ్యాజనిందలయొక్క ప్రసక్తి యెంతమాత్రమును లేనట్టి "ఎంచలోపల భిదంబులెన్నొ గలవు" అనెడు నుదాహరణమునఁ గేవలము సమానరూపముగల ప్రస్తుతవృత్తాంతమును స్ఫురింపఁజేయుటకు మాత్రమే యప్రస్తుత వృత్తాంతము వర్ణింపఁబడినది. కాననిచ్చట సారూప్యనిబంధనయగు నప్రస్తుతప్రశంసకుఁ జోటుకలదు. అట్లే యప్రస్తుతప్రశంసకుఁ బ్రసక్తి లేనిచోటుల వ్యాజస్తుతి వ్యాజనిందలకును జోటుకలదు. ఇట్లు ప్రత్యేక ముగ స్వతంత్రములగు రెండలంకారము లొకపద్యమున నెచ్చటనైనను గలిసియుండినను దోషములేదు. కాన 'కృతియొక్కఁడె పత్నులగుమి' 'మోహావిశేషబంధమున' యనెడు పద్యముల వ్యాజస్తుతి వ్యాజనిందా లంకారములుండినను నుండవచ్చును. అంతమాత్రముచే నప్రస్తుత ప్రశంసాలంకారముండఁగూడదని చెప్పనక్కరలేదని.

ఆలోచింప "నీదు తప్పేమికాకమా నీల్గియార్య" ననెడు వ్యాజ నిందోదాహరణమున నప్రస్తుత ప్రశంసయును గన్పట్టుచున్నది. ఎట్లన ? ఇట విధి నిందచేతను దన్మూలకమగు కాకనిందచేతను గ్రమముగఁ దార తమ్యము దెలియని రాజుయొక్కయు నతనిచే గౌరవింపఁబడిన మూర్ఖుని యొక్కయు నిందస్ఫురించుటచే సారూప్యనిబంధనయగు నప్రస్తుత ప్రశంసయును గలదు. ఆయప్రస్తుతప్రశంసకు వ్యాజనిందయే మూలము. కాన వ్యాజనిందయును గలదు. ఇట్లగుటచే నీపద్యమున వ్యాజనిందా మూలకమగునట్టియు వ్యాజనిందారూపమగు నప్రస్తుత ప్రశంసాలంకా రము కలదనినచో మిక్కిలి చమత్కారము గోచరించుచున్నది.

ఈరీతిగనే వ్యాజస్తుతిమూలకమగునట్టియు వ్యాజస్తుతి రూపక మగు నప్రస్తుతప్రశంసాలంకారము గూడఁగన్పట్టు చున్నది. ఎట్లన ?

శా॥ వెచ్చింపండె ? విరించి సొంపు పెనుపుల్ – వేసారఁడే యట్టు ! తా
నిచ్చంబోయెడు వానికిన్ మదనవ – హ్నిం బెట్టు డెందాన నీ ।
మెచ్చున్నన్ సరిసంగఁడీనిఁ గనలే – మిన్ గన్యకున్ జాలి రా
దిచ్చందానన యీపెఁజేయు నతఁడిం – కే యర్థమీక్షించెనో ? ॥

బ్రహ్మ యీతరుణిని సృష్టించుటలో మిక్కిలి శ్రమము నొందెననియు నీపెను జూచినంతనే త్రోవఁబోవువానికిని మదనవహ్ని పుట్టుచున్నదని యును గాని యీపెకుఁదగిన వరుఁడు లేకుంటచే గన్యంత విలువగూడ నీపెకు లేకపోయెననియు నీపెస్సృష్టించు నతనికింకెట్టితలఁపు కలదో కదా? యని పద్యార్థము. ఒకకవి తనకవితకుఁ దగిన పోషకుఁడు లేమింజేసి విసిగి యొకకన్యకను నప్రస్తుతవిషయమునుగాఁ దీసికొని యిట్లు తల్పఁ చినాఁడు. ఇట తరుణీసృష్టిని నిందించు నెపముచేఁ దరుణీనిందయు నా నిందచేఁ దరుణీ సౌందర్యప్రశంస చేయఁబడినది. ఆప్రశంస, స్వకవితా నిందా వ్యాజముచేతను దద్ద్వారా కవితాసృష్టి నిందావ్యాజముచేఁ దన కావ్యమందలి శబ్దార్థములయొక్క చమత్కారాతిశయము యొక్క ప్రశంసలోఁ బర్యవసించుచున్నది.

ఆలోచింప నీపద్యముయొక్క వాచ్యార్థము సమంజసముగఁ గన్పట్టదు. ఏలయన ? ఈపద్యమందలి యూహ వీతరాగునకుఁ గల్గదు కదా ? సరాగునకుఁ గల్గినదనియుఁ దలఁప వీలుకాదు. సరాగుఁడు దానే తగిన వరుఁడనని తలఁచునుగాని వరుఁడులేఁడని తలఁపఁడుకదా ? ఈరీతిగ నప్రస్తుతమగు వనితారూపార్థమునకు సామంజస్యము లేకున్నను బ్రస్తుతమగు కవితారూపార్థమునకు సామంజస్యము కలుగును గాన నలంకారము పొసఁగును. మఱియు వాచ్యార్థమున సామంజస్యము లేకుంటచేతనే యీపద్యమును బ్రాచీను లప్రస్తుత ప్రశంసాపరముగఁ జెప్పిరి. అప్రస్తుతార్థమందలి యసామంజస్యమే ప్రస్తుతార్థమందుఁ దాత్పర్యమును దోపింపఁ జేయుచున్నది. అప్రస్తుత ప్రశంసలో వాచ్యార్థము సమంజసముగా నుండఁబనిలేదు. గమ్యమగు ప్రస్తుతార్థము సమంజసముగ నున్నఁజాలును.

ఆ క్షే పా లం కా ర ము. 32.

కం॥ స్వయముక్తప్రతిషేధ మ
నయమాక్షేపము విచార - ణముసేయ, సుధా।
లయ! నూపుము నీరూపుఁడె
లియఁ బ్రేయసి మోముగలదు - లే! వలదింకన్ ॥

వక్త తానొక విషయమును బలికి తిరిగి యూహసేసి దానిని బ్రతిషేధించినచో నది యాక్షేపాలంకారమగును.

ఒకఁడు నేత్రానందముకొఱకై తనరూపుఁజూపుమని చంద్రుని వేడుకొని పిదపఁ బ్రేయసిముఖము కలదని తెలిసికొని వలదని నిషేధించెను. మఱియును.

తే॥ గీ॥ సరససాహిత్య జలధిఁద్రి - చ్చంగఁబొడము
కర్ణపీయూషము కవిప్ర - కాండులార!।
దాఁచుఁ డసురులువోలెఁ ద - త్కావ్యవస్తు
చోరులెల్లెడ వేచియు - న్నారు దోప ॥

తే॥ గీ॥ దొంగిలించినఁబో ! కవి - ద్రిహిణులకును
గొదువ గాదది యెంతయు - మదిఁదలంప ।
వేల్పులవ్విధి రత్నాలు - వెలికిఁగొనిన
నబ్ధి యీనాటఁగూడ ర - త్నాకరంబె ! ॥

తొలిపద్యమునఁ గావ్యార్థచోరులవలనఁ గావ్యవస్తువును దాఁచఁగలందు లకుఁ గవీశ్వరులను గోరి మలిపద్యమున సముద్రమున రత్నములకు వలెఁ గవీశ్వరుల కల్పనలకు క్షయము లేకుండుటను దెలిసికొని ప్రతి షేధించినాఁడు.

ఆ క్షే పా లం కా ర ము. II.

కం॥ ఈసాహితిని నిషేధా
భాసంబాక్షేపమంచుఁ - బల్కుదురొండుల్ ।
దాసిని నేఁగాను సుమా !
యాసతి తనుతాపమటు ల - యానల నిభమా ॥

అలంకారసర్వస్వకారాదులు నిషేధము మాత్రమే యాక్షేపము కాదనియు నిషేధము బాధితమగుచు నర్థాంతరమును బోధించినచో నదియు నాక్షేపమని నుడివిరి. నాయికచేఁ బంపఁబడినదూతి నాయకు చెంతకుఁబోయి నేను దూతినికాననియు నాయికాతాపము ప్రళయానల కల్పమనియును బల్కినది. దూతి తాను దూతినికాననుట యాభాసము. అట్లాభాసమై తనవాక్యములు దూతీ వాక్యములుగా నసత్యములని తలంపరాదనియు నాయికా సంతాపఁము దుర్భరముగాన వేగ రావల యుననెడు నర్థవిశేషమును బోధించుచున్నది. ఆక్షేపమనఁగా వేఱొక యర్థమును దీసికొనివచ్చుట యని యర్థము. మఱియును.

తే॥ గీ॥ రాజశేఖర ! మేమటు - రాజవాచి
కముల మోసెడువారము - గాము వినుము ।
విశ్వ బంధుఁడ వగుచీవు - విశ్వమందుఁ
బగతుఁడొక్కండు నీనాట - నగపడండు ॥

వార్తాహరులొక ప్రభువు వద్దనిట్లు పలికిరి. వారిట్లుపలుకుట పొసఁగదు, అది సంధికాలమందుఁ బల్కెడురీతిగఁ దమమాట లసత్యములు కావని యుఁ దమరాజును మిత్త్రునిగాఁ దలఁచి రక్షింపవలయు ననెడు విశే షార్థమును దీసికొని వచ్చుచున్నది.

ఆ క్షే పా లం కా ర ము. III.

కం॥ స్ఫుటముగ విధియు నిషేధం
బటుగర్భితమైన నన్య - మాక్షేపమగున్ ।
చటులమతి ! పొమ్ము పోయిన
నటనే నాపుట్టు వీవు - నరయుదు కాదే ! ॥

విధిస్ఫుటముగను నిషేధము గూఢముగనున్న నదియు నాక్షేపమగును. దేశాంతరము పోఁదలఁచిన భర్తనుగూర్చి భార్య పల్కినది. నీవు పోయిన నామరణము తథ్యముగానఁ బోవలదని నిషేధము లోఁగన్ప ట్టుచున్నది.

ఆ॥ వె॥ నీదుయాత్ర రమణ ! - కాదు కాఁటియపెట్టఁ
జిరము నన్నునమ్ము - మరసి యరసి ।
పోవ నిచ్చయున్నఁ - బోవచ్చు వడిఁబడి
సందియంబు డెండ - మందు వలదు ॥

చిరము బాధింపదనుటచేఁ దనమరణము నిశ్చయము కాన వెడలవల దని నిషేధము గర్భితమగుచున్నది.

వి రో ధా భా సా లం కా ర ము. (33)

కం॥ హరి విరోధాభాసం
బారయఁగ విరోధమునకు - నాభాసతచే ।
హారము దాల్పక యున్నను
హారులు నీకుచములంచ - యానరో ! తెలియన్ ॥

విరోధము లేకున్నను విరోధమున్నటులు కన్పట్టినచో నది విరోధా భాసము. అది మనోహరమగు నలంకారము. హారము లేకున్నను హారు

లనఁగా హారముకలవి యను నర్థమున విరోధము. హారులన మనస్సు నాకర్షించునవి యను నర్థమున విరోధము లేదు.

చం॥ నలునిఁ గనంగఁ దద్రిపున్ప - నాథులువోలె విరుద్ధధర్మముల్
విలవిల భీతినొంది తమ - భేదకతన్ విడనాడెఁజుమ్ము! స।
మ్మిలిత తదీయతేజమున - మిత్రవిజేత యమిత్రజేతయై
మెలగుటఁ జారదృక్కయియు-మించి యతండు విచారదృక్కుగాన్.

నలునిఁజూచి యతని శత్రురాజులు తమలోని విరోధమును విడిచి నటులు లోకములోని పరస్పరవిరుద్ధ ధర్మములు గూడఁ దమలోని భేదభావమును విడిచినవి కాఁబోలును. ఎట్లన ? అతఁడు తన తేజముచే మిత్రవిజేతయును, అమిత్రవిజేతయును గూడ నాయెను. ఒక వ్యక్తియే యట్లగుట విరోధము. మిత్రశబ్దమునకు సూర్యుఁడును స్నేహితుఁడు ననెడు నర్థద్వయమును గ్రహించిన విరోధము తొలఁగును. అట్లే చారదృక్కు విచారదృక్కనఁగాఁ జారదృక్కు కాడను నర్థములో విరోధము గలదు. కాని చారులే కన్నులుగాఁ గలవాఁడు, విచారముచే ననఁగా నాలోచనచేఁ బ్రతివస్తువును జూచువాఁడ నెడు నర్థమున విరోధము లేదు. పై రీతిగ మిత్రజేతృత్వము, అమిత్రజేతృత్వ మనెడు విరుద్ధధర్మములును చారదృక్త్వము చారదృక్త్వాభావము ననెడు విరుద్ధధర్మములును నలునియందుఁ గన్పడుటచే నట్టి ధర్మములుగూడఁ దమలోని విరోధమును వీడినవా! యని కవి యుత్ప్రేక్షించినాఁడు. ఇట విరోధాభాసము శ్లేషమూలకము.

ఇట విరోధత్యాగమును మొదటనుత్ప్రేక్షించి దానినిఁ బ్రధానమునుగాఁ జేసికొని యుత్తరార్ధమున విరోధాభాసాలంకారము చూపఁబడినది.

## విభావనాలంకారము. 34.

కం॥ ముక్తమువో కారణమిల
వ్యక్తముకార్యంబుగా వి - భావన చెలఁగున్ ।

రక్తము తత్పదయుగళము
లక్తకరససిక్తమగుచు – లక్షింపమియున్ ॥

కారణము లేకున్నను గార్యము పొడమినచో విభావన యగును. ఆమె పదద్వంద్వము లత్తుక పూయఁబడకున్నను నెఱ్ఱగ నున్నది. పాదముల యెఱ్ఱఁదనమునకు లత్తుకపూతను గారణమునుగాఁ దీసికొని యది లేకున్నను నెఱ్ఱఁదనమనెడు కార్యమును జూపినాఁడు. స్వభావము చేతనే రక్తిమ కల్గియుండుటచే విరోధము లేదు.

తే॥ గీ॥ త్రాగకున్నను మత్తిల్లు – రాజహంస
తుడువకున్నను నమలతఁ – బడయు నభము ।
తేర్పకున్నను నీరంబు – తేటపడును
విశ్వమీరీతిఁ దల్కొత్తి – వేడ్క సేయు ॥

శరదృతు వర్ణనము. త్రాగుడు మున్నగు ప్రసిద్ధకారణములు లేకున్నను మత్తిల్లుట మున్నగు కార్యములు వర్ణింపఁబడినవి. ఋతుధర్మము లగుటచే విరోధము పరిహృతము.

తే॥ గీ॥ కుటిలకుంతలతురుమును – గొక్కముడువఁ
దావిగల్గిన గోళ్లహ – స్తాన నృపతి ॥
పూలఁద్రుంపినఁ గూడ నా – పూలతీవ
తొడిమ లొత్తుచు నుండెఁబోఁ – దోటఁదేంట్లు ॥

కారణ భూతమగు పూలు లేకున్నను దేంట్లు వ్రాలుట యనెడు కార్యము వర్ణింపఁబడెను. తురుమును ముడుచుటచే రాజు చేతిగోళ్లకుఁ దావి కల్గుటయనెడు కారణమును జూపుటచేఁ గారణవిరోధము తొలఁగినది.

## విభావనాలంకారము. II.

కం॥ హేతువు బలముగ లేకయు
నాతతకార్యంబు పుట్ట – నట్టులె చెల్లున్ ।
చేతోజుఁ డనిశితాదృఢ
హేతితతిన్ జగమునెల్ల – హేల జయించున్ ॥

కారణము దుర్బలముగ నున్నను బలవత్కార్యము పుట్టినట్లు వర్ణింపఁ బడినచో నదియు విభావన యగును.

వాఁడిలేనట్టియును గట్టివికానట్టి యాయుధములచే ననఁగాఁ బూలచే మన్మథుఁడు జగమును హేలగ జయించుచున్నాఁడు.

తే॥ గీ॥ తెమ్మెరలచేత వడి విర - జిమ్మఁబడిన
బాణ చూతక చంపక - రేణువులును।
పథిక లోచనములలోనఁ - బడకయునును
బొరలఁ గన్నీటిఁదొఱఁగించుఁ - బూలతోట॥

కన్నీటిని స్రవింపఁజేయుటలో రేణువులు కంటఁబడుట కారణము. పుష్ప రేణువులను జూచుటచేఁ గన్నీరు పొరలునట్లు వర్ణించుటచేఁ గారణమును బలముగఁ జూపలేదు.

వియోగము కలవారికి నంతమాత్రముచేతనే కన్నీరు రాలును. గాన విరోధము లేదు. బాణమనగా గోరింటపూవు. ఇట కారణమునకు బలము చాలకుండుట యనఁగా రేణువులకుఁ గంటితో స్పర్శనక్రియ లేకుండుట.

ఆచార్యదండి విభావనాలంకారమును విశేషోక్తియని వక్కాణించెను. తొలియుదాహరణమున మన్మథుని మహిమాతిశయమును మఱియుదాహరణమునఁ బుష్పములకు నుద్దీపకత్వాతిశయము ననెడు విశేషము దెల్పుడుచేయఁబడుటచే నిది విశేషోక్తియని యతని యభిప్రాయము.

వాడితనము గట్టితనము కంటఁబడుట యనెడు విశేషధర్మములు కారణముల లేకుంటయే కారణ దౌర్బల్యమని తలఁచి మాచేనీ భేదముగూడ విభావనఁగాఁ జెప్పఁబడినది.

### వి భా వ నా లం కా ర ము. III.

కం॥ అవరోధముననుు గార్యో
ద్భవమైనఁ దృతీయమగు వి - భావన చెలఁగున్।

నృవరా! నీ యసి భుజగం
బవని నరేంద్రులను గూడ – నద్దిర! కఱచున్ ॥

నరేంద్రశబ్దమునకు రాజులును విషవైద్యులును గూడ నర్థము. ఓరాజా! నీకత్తియనెడు పాము మణిమంత్రౌషధాదులు కలనరేంద్రులను గూడఁ గఱచుచున్నది. శ్లేషవశమున వచ్చిన విషవైద్యులనెడు నర్థమున మణిమంత్రాదికమగు బలవత్ప్రతిబంధమున్నను ఖడ్గమనెడు భుజంగము కఱచుట యనెడు కార్యము పుట్టినట్లు వర్ణింపఁబడినది.

కం॥ చిత్రమిది నీదు తేజో
మిత్రుఁడు రాజేంద్ర! వేఁడి – మిని భువిఁజెలఁగున్
ఛత్ర విరహితుని వదలి వి
చిత్రముగా ఛత్రసహితుఁ – జిచ్చునఁ బెట్టున్ ॥

ఛత్రరూపమగు నవరోధమున్నను రాజుయొక్క ప్రతాపమనెడు సూర్యుఁడు తపించునట్లు వర్ణింపఁబడియె.

ఆరాజు ఛత్రమును దీసివైచి నమ్రులగు వారిని బాధింపక ఛత్రధరులయి గర్వితులగు శత్రువులను బాధించుచున్నాఁడని భావము.

## వి భా వ న. IV.

కం॥ కారణ భిన్నమునను గా
ర్యారంభము దెల్పఁ దుర్య – మయి యటులగు న।
య్యారే! శంఖమునను వీ
ణారవ ముదయించు శ్రవణ – నందన మగుచున్ ॥

కారణముకాని వస్తువునుండికూడఁ గార్యము పుట్టినట్లు వర్ణింపఁబడినచో నదియు నాల్గవ భేదమగును. స్త్రీయొక్క కంఠము శంఖముగాను గీతము తంత్రీనాదముగాను నధ్యవసింపఁబడెను.

## వి భా వ న. V.

కం॥ రీతిని విభావనయు విప
రీతమునను గార్యమాథ్య – రీతినిఁ బొడమన్ ।

శీతాంశు కిరణములును బ
రీతాపము గూర్చు సుంద - రీమణికకటా ! ॥

విపరీత కారణమునుండి కార్యసంపత్తొలసిన నదియు విభావన. తాపమును జల్లార్చు చంద్రికిరణములవలనఁ దాపము పుట్టినట్లు వర్ణింపఁ బడెను. మఱియును.

తే॥ గీ॥ రాజిలఁ గుమార సూర్యుఁడు - రహినిఁ గువల
యంబు వికసించె నక్షత్ర - మవతరించె।
భళిర ! పరరాజ యువకుల - పాణిపద్మ
ములును మొగిడెను గాంతులు - మొఱక వడఁగ ॥

ఒక రాజకుమారుని వర్ణనము. రాజకుమారుఁడనెడు సూర్యుఁడుదయింపఁగాఁ గువలయము వికసించెను. నక్షత్ర మవతరించెను. పర రాజయువకుల పాణిపద్మములు వికసించెను. చంద్రునివలనఁ గలుగ వలసిన కార్యములు సూర్యునివలనఁ గల్గినట్టు చెప్పఁబడెను. కువలయము :- కలువ, భూవలయము. నక్షత్రము :- రిక్క, క్షత్రియజాతి యొక్క యభావము. పాణిపద్మములు :- హస్తములనెడు పద్మములు, పద్మములవంటి హస్తములు. తొలియర్థమున విభావనాలంకారము. మలి యర్థమున విరోధములేదు. మఱియు -

ఆ॥ వె॥ అల వివేకలవము - కలుగని చనుదోయి
నొగులఁబెట్టుఁ గాక - జగము నెల్ల ।
శ్రుతులఁ దవిలి మిగుల - నుతిఁగాను నక్షులు
జనుల నొవ్వఁజేయు - టనుచితంబు ॥

కొలఁదియును వివేకములేని చనుదోయి జగమును బాధించినను శ్రుతులనఁగా వేదముల నభ్యసించి పేరుగన్న కండ్లు అట్లుచేయుట తగదు. వివేకమనఁగా జ్ఞానము, మధ్యమున నవకాశమనియు నర్థము. శ్రుతులనఁగా వేదములు, చెవులునని యర్థము. అర్థభేదముచే నలంకార సమన్వయము చేసికొనవలెను.

వెనుకటి యుదాహరణములలోఁ గార్యకారణ విరోధము స్వాభావికము. ఈపద్యమున శ్రుతి పరిచయము కలుగుటయనెడు కారణ మాగంతుకము. ఇట్టి యాగంతుక కారణముతో నొరుల నొవ్వఁజేయుట యనెడు కార్యమునకు విరోధము చూపఁబడినది. ఇదియే భేదము.

## విభావన. VI.

కం॥ ఆరయ నదియు విభావన
కారణమే కార్యమునను – గరగరఁబుట్టన్ ।
కీరితి సంద్రము వాడమెను
ధారుణి నీహస్తకల్ప – తరువున నృపతీ ! ॥

కార్యమగు వస్తువు కారణవస్తువునుండి పుట్టినట్లు వర్ణించినచో నదియు విభావన యగును. సముద్రమునుండి కల్పతరువు పుట్టుట ప్రసిద్ధము కాఁగా నిట సముద్రము కల్పతరువునుండి పుట్టినట్టు వర్ణింపఁబడినది.

ఆ॥ వె॥ పుడమి నెల్ల లతలు – పుట్టును గిరులందు
గిరులు లతలఁ బుట్టు – టరయ మెందు ।
ఎంచఁ జిత్రమిదియ – కాంచుడు విటులార !
కనకలతను గిరియు – గంబు వుట్టె ॥

గిరుల లతలు పుట్టుట ప్రసిద్ధము. ఇట లతయందే గిరులు పుట్టినట్లు చెప్పఁబడుటచే నిది విభావన. కనక లతయనఁగాఁ గనకలతవలె నున్న యొక కామిని యని యర్థము. ఆపె యందు గిరియుగమనఁగాఁ గుచ యుగము పుట్టెనని భావము.

## విశేషోక్తి - అలంకారము. 35.

కం॥ కారణ సౌష్ఠవ మొలసియుఁ
జేరమి కార్యంబు దగవి – శేషోక్తి యగున్ ।
మారుఁడను దీపమేధిత
మై రంజిల్లినను స్నేహ – మంటదు కొఱతన్ ॥

సమగ్రికారణమున్నను • గార్యము పుట్టకున్నచో విశేషోక్తియగును. మన్మథుఁడనెడు దీపము వృద్ధియగుచుఁ బ్రజ్వరిల్లుచున్నను స్నేహము తఱుగుటలేదు. స్నేహమనఁగాఁ దైలమనియుఁ బ్రేమయనియు నర్థద్వయము. మొదటియర్థమున నలంకారము సమన్వితమగుచున్నది. అర్థాంతరమునఁ బ్రేమ యతిశయించుచున్నదని భావము.

కం॥ అనురాగవతియు సంధ్యయు
మొనకడ దివసంబు నిలిచి - ముచ్చటనుండున్ ।
కన దైవగతి యదేమియొ!
తను పారఁగ సంగమమునఁ - దవుల నయారే! ॥

అనురాగవతి :- ప్రేమకలది, ఎఱుపురంగు గలదియును నర్థద్వయము. తొలియర్థమునఁ గారణసమగ్రిత యున్నను సంగమరూపకార్యము పుట్టనట్లు వర్ణించుటచే నలంకారము సమన్వయించుచున్నది. కార్యవిశేషము పుట్టనట్లు వర్ణించుటచే నీయలంకారమునకు విశేషోక్తి యనెడు పేరువచ్చినది. ఇట కార్యానుత్పత్తికి దైవగతి రూపమగు నిమిత్తము చెప్పఁబడుటచే నిది యుక్తవిషయయగు విశేషోక్తి యనియు వెనుకటి పద్యమున నిమిత్తము చెప్పఁబడకుండుటచే నటననుక్తవిషయయగు విశేషోక్తియనియును భేదము నెఱుంగునది.

## అసంభవాలంకారము. 36.

కం॥ తెలుప నసంభవనీయత
నలిపిన కార్యంబునకు న - సంభవము మహిన్ ।
దెలియఁ గలఁడెవ్వఁడిల గో
కుల బాలుఁడు కొండనెత్తి - కొనఁ గలఁడనుచున్ ॥

జరిగిన నేకార్యమునైన నూహాతీతముగాఁ దెల్పినచో నది యసంభవాలంకారమగును. గొల్లపిల్లఁడు కొండనెత్తుట యూహాతీత విషయమని చెప్పఁబడెను.

చం॥ ఇది తొలిపట్టు నీటికి, వ - హించును సన్నుతరత్నరాశి నం
చఁదలఁచి యీపయోధిఁ దగఁ-జొచ్చితిమీఁదర్వాగఁ దృష్ణఁ బ్రేల్మెడిన్।
చెదరక దాని మానిం తన - చేరను బట్టి జలీయజీవి బె
ట్టిదముగ నొంచి పీల్చుట ఘ - టించుననటంచుఁ దలంచు టెట్టులో॥

అగస్త్యుఁడు సముద్రమును దన పురిసిటఁబట్టి పీల్చుట యూహింపరాని విషయమునుగాఁ జెప్పినాఁడు.

అ స ం గ తి - అ ల ం కా ర ము. 37.

కం॥ అల హేతు కార్యములకుం
దలఁపని భిన్నాధికరణ - త యసంగతియగా।
జలదములు విషము ద్రావఁ గు
తలమున మూర్ఛిలిరి పథిక - తరుణులు సూడన్॥

కార్యకారణములకు వేఱువేఱగు స్థానములు చెప్పఁబడుచో నసంగతి యగును. విషముద్రావిన వ్యక్తి మూర్ఛిలుట సహజము. ఇట మేఘములు విషముద్రావఁ బథికాంగనలు మూర్ఛిల్లినటులు వర్ణింపఁబడినది. విషమనఁగా విషపదార్థమనియు నీరనియును నర్థద్వయము. మొదటి యర్థమున నలంకారము సమన్వయించు కొనవలెను. మేఘోదయమును జూచి వియోగదుఃఖముచేఁ బథికాంగనలు మూర్ఛిల్లిరని భావము.

ఆ॥ వె॥ తలఁపఁ జిత్రమిదియె - ఖలభుజంగమ వధ
క్రమము వేఱుభంగిఁ - గానఁబడును।
చెంతఁజేరి యన్యు - చెవిని ముట్టిన నంత
నొండు నరుని యసువు - లుండ వకట!॥

సర్పదంశ మొకనికిఁ గాఁగా మఱియొకని ప్రాణములు పోవుట యసంగతి. కొన్నితావుల నసంగతికిఁ దగిన కారణమును గూడఁదెల్పినచో మిక్కిలి సొగసుగ నుండును. ఎట్లన?

తే॥ గీ॥ మానినీ ! నీవు వేమాఱు - లానియాని
మెట్ట నాతని కోర్కెల - మెట్ల చాలు।
నాతఁడూర్పుల నిగుడించు - నక్కజముగ
ధ్యాన మహిమను దన్మయ - త్వమును నొంద ॥

దమయంతితో హంస యిట్లనెను. నీవు నలుని కోర్కెలనెడు మెట్లపై నడువ నాతనికి నిట్టూర్పు లొాడమెనని. నడిచినవాని కలసటచే నిట్టూర్పులు పుట్టుట యుక్తముకాని యితరునకుఁ బుట్టవు. ఇది యలంకారము. నాలుగవ పాదమున నట్లగుటకుఁ గారణముగూడఁ జూపఁబడినది. లక్షణమునఁ దలఁపని భిన్నాధికరణత యనఁగా సంభవములేని భిన్నాధికరణత యని యర్థము. కాన నది సంభవ యోగ్యమైనచో నలంకారము కాదు. ఎట్లన ?

ఆ॥ వె॥ ఎంతతడవు సుభ్రు - వెడఁ దమినడి నొంది
యంటియంటి బొామల - వింటి నొంచె। ?
నంతతడవు నాదు - నంతరంగము నాపె
వాలు చూపుటమ్ము - లోలిఁ జీల్చె ॥

వింటి న్వొంచుటకును దత్కార్యమగు చీల్చుటకును భిన్నాధికరణత్వమే ప్రసిద్ధము.

## అసంగతి - అలంకారము. II – III.

క॥ ఒకచోఁ దలఁచిన పని మఱి
యొకచోఁ జేయుటయు నట్టు - లొప్పును గృతులం।
దొకపనిఁ దలకొని మాఱగు
నొకపనిఁ జేయుటయుఁగూడ - నొనరఁగ నటులా ॥

క॥ ధాత్రిని నపారిజాతముఁ
జిత్రింపఁగఁ దలఁచి దివము - సేయవె యట్టుల్ ।
గోత్రోద్ధారముఁ దలకొని
గోత్రోద్ఛేదంబు సేసి - కులుకవె ? కృష్ణా ! ॥

కృష్ణునిఁగూర్చి యిందు౯ని సోపాలంభ వచనము. భూమినిఁ జేయఁదలఁచిన పని స్వర్గమునఁ జేయఁబడినటులు వర్ణింపఁబడెను. భూమిని నపారిజాతము ననఁగా అప + అరిజాతము=శత్రురహితముగాఁ జేయుట. స్వర్గమును అ + పారిజాతము= పారిజాతవృక్షములేని దానినిగా నని యర్థము. రెండవ పద్యమున గోత్రోద్ధారము :- గోత్రా+ఉద్ధారము= భూమినెత్తుటను దలఁచి గోత్ర+ఉద్ధారము=పర్వతములను నలుగఁ గొట్టుటను జేసితివి. వరాహావతారమున భూమి నెత్తునపుడు తన డెక్కలచే నచ్చటి పర్వతములు నలుగఁగొట్టఁబడినవని. పై యర్థభేదములచే నలంకారమును సమన్వయించు కొననగు. ఇది శ్లేషమూలకము. మఱియును.

తే॥ గీ॥ ఆజి నీఖడ్గ ఖండిత - రాజసతుల
కగును జోళేంద్ర! కొంగ్రొత్త - నగల తీరు।
కంకణము కంట నమరును - గాదె! పత్ర
లతిక లూరులఁ దిలకంబు - లలిత పాణి॥

చోళభూపతీ! నీచేఁ జంపఁబడిన రాజులయొక్క స్త్రీలకుఁ గొంగ్రొత్త నగలతీరు గల్గినది. చేతుల ధరింపవలసిన కంకణము కంటియందును, చెక్కిళ్ల ధరింపవలసిన పత్రలతికలు తొడలయందును, నొసటఁ బెట్టుకొనవలసిన తిలకమును జేతియందును ధరించుచున్నారు. ఇట్టులొకచోటఁ జేయవలసిన పని మఱియొకచోఁ జేయఁబడినటులు వర్ణింపఁబడినది. కంకణము వలయము- నీటిబొట్టు. పత్రలతికలు ॥- మకరికాది పత్రికలు - ఆకులతోఁగూడిన తీవలు. తిలకము :- బొట్టు - తిలలతోఁ గూడిన నీరు. అని యర్థద్వయము. మొదటి యర్థమున నలంకారమును సమన్వయించుకొనఁదగు. భర్తలు యుద్ధమునఁ జచ్చుటచేఁ గంట నీరుబెట్టుచున్నారనియు, అడవులలోఁ దిరుగుటచే వారి యూరువులకు నాకులతోఁగూడిన తీవలడ్డుకొనుచున్నవనియు భర్తలకుఁ దిలోదకముల నిచ్చుచున్నారనియు నన్వయమున సత్యార్థమును నెఱుంగవలయును. ఇదియును శ్లేషమూలకమే. శుద్ధమెట్లన?

తే॥ గీ॥ ముజ్జగంబులఁ దేహుల - మోహకలికఁ
దున్మింప నిటు కాంతినీరధి - రూపుఁ దాల్చి ।
దానసే ముగ్ధకాంతల - మానసముల
మోహముంచెదు కనుత్కృష్ణ - ముద్దుకృష్ణ ! ॥

మోహకలికఁ దున్మింపఁదలఁచి మోహముచేయుట యనునది యొకపనినిఁ జేయఁదలఁచి మఱియొకపనిని జేయుటచే నలంకారము స్పష్టము.

వి ష మా లం కా ర ము. 38.

కం॥ పొందొందని వస్తువులకుఁ
బొందును గూర్పంగ విషమ - ముగఁ జెలఁగును మె ।
త్తందనమున దిరిసెపుఁబూఁ
జందపుఁ జెలియేడ ! మదను - జ్వరమది యేడా ! ॥

పొందులేని వస్తువులకుఁ బొందును గూర్చినచో విషమమగును. దిరిసెన పూవువలె మెత్తని కాంతకును దీవ్రమగు మన్మథతాపమునకును సంఘటన తగినదికాదు. మఱియును.

ఉ॥ ఆ యెలనాగ మోముసిరు - లందఁ దలంచితి వేని చంద్ర ! య
త్తోయధి నొక్కమాఱు తగ - దూకొని కందును ద్రోవరుద్ది శో ।
భాయుత దివ్యపుష్ప పరి - వాసిత రూపుఁడవౌచు రమ్ము కా
కేయెడ ! నీవు నాపె ముఖ - మేడ ? వచింపుము సత్య మీయెడన్॥

తొలిపద్యమున సతీతత్తాపములకు సంఘటనలో వస్తుసద్భావము కలదు. ఈపద్యమునఁ జంద్రునకును దన్వీముఖశోభకును సంఘటన స్వతస్సిద్ధముకాదు. ఊహావిషయము మాత్రమే యగుచున్నది.

వి ష మా లం కా ర ము. II

కం॥ కారణము కంటెఁ గార్యం
బారయ వైరూప్యమొంద - నట్టులె చెల్లున్ ।
భూరమణ ! నీదు శితి తర
వారి ; సితంబైన కీర్తిఁ - బ్రసవించు నిలన్ ॥

కారణగుణములు కార్యమందు సంక్రమించున నెడు న్యాయము కలదు. అట్లుకాక విరుద్ధముగఁ జెప్పినచో విషమాలంకారమగును. నల్లని ఖడ్గమునుండి దెల్లనికీర్తి పుట్టినట్లు వర్ణింపఁబడెను. విరుద్ధకారణమునన్న విరుద్ధకార్యము పుట్టుటయనెడు విభావనాలంకారము యొక్క పంచమ భేదముకన్న నీవిషమమునకు భేదమేమనిన ? విభావనాలంకారములోఁ గార్యకారణములకు నివర్త్య నివర్తక భావము గలదు. తాపనివృత్తికిఁ గారణమగు చంద్రకిరణములు తాపమునకుఁ గారణమగుట విభావన. ఈ విషమభేదములోఁ గార్యకారణములు విలక్షణగుణము కలవి యగును. ఖడ్గమునకు నీలగుణము లోకప్రసిద్ధము. కీర్తికి ధవళగుణము కవిలోక ప్రసిద్ధము.

విషమాలంకారము. III

కం॥ సుహితార్థోద్యోగంబున
నహితార్థము గూడఁబుట్ట - నటులగుఁ గృతులం।
దహహా! భక్ష్యప్రుఁగోరిక
నహిపేటినిఁ దుంచునెలుక - నహి వడిఁ బట్టెన్॥

మిక్కిలి హితమగు కోరికఁగోరి ప్రయత్నింపఁ గోరిక సిద్ధింపక పోవుటయే కాక యనిష్టముగూడ నొదవిన విషమాలంకారమగును. ఉదాహరణము స్పష్టము. ఇట తినుబండము నొందెడు నాశచే నెలుక పాము పెట్టెను గొరుక దానికది లభింపకపోవుటయే కాక పామువాతఁ బడుట యనెడు ననిష్టముకూడ సంభవించినది.

ఆ॥ వె॥ కోరినన్ని పాలు - గోపాలుఁ డితఁడీఁడె?
యంచుఁ దలఁచి నీదు - నండఁ జేర।
తల్లిపాలఁగూడఁ - ద్రావంగ దూరంబు
చేసెదేల? కృష్ణ! - చిత్రమొదవ॥

మోక్షమిచ్చుటచే నట్లాయె నని భావము. ఈ యుదాహరణములు రెండును, ఇష్టార్థము పొందకపోవుటకును, అనిష్టార్థము నొందుటకును నుదాహరణములు.

అనర్థపరిహారమునకై ప్రయత్నించి తాసట్టి యభిలషితమును బొందక పోపుటయేకాక మఱియొకనికి ననర్థమును గూర్చుటయు విషమాలంకారమగును. ఎట్లన ?

ఆ॥ వె॥ వెలఁది! సైంహికేయు - వెఱవున నిలఁబాసి
మింటఁ జంద్రుఁజేరి - మిగులుచున్న।
శశమునకును దాని - సంగతిఁ గొన్నట్టి
యాతనికినిఁ దర్ప్ర - యము ఘటిల్లె॥

ఒకఁడు తనచెలితో నిట్లు పలుకుచున్నాఁడు. సైంహికేయమనఁగా సింహీపుత్రుఁడు. అనఁగా సింహపుపిల్లయనియు రాహువనియు నర్థద్వయము. సింహపుపిల్లవలని భయముచే శశమాశ్రయించిన చంద్రు నాశ్రయింప దానికోర్కె సిద్ధింపక పోవుటయేకాక దానినిఁ జేరఁదీసిన యతనికిఁగూడ సైంహికేయునిచే ననర్థము వాటిల్లినది.

పరులకు ననర్థమును జేయనెంచి యదిచేయలేకపోవుటయే కాక తాననర్థమును బొందుటగూడ విషమమగును. ఎట్లన ?

ఆ॥ వె॥ గాలిచూలి తోకఁ - గాల్పంగ నలెపంచు
రావణుండు దాని - రగులఁజేసె।
దివ్య హర్మ్యపంక్తిఁ - దేజరిల్లెడు నాత్మ
నగరియందె మంట - లెగయఁజూచె॥

ఆత్మనగరియందె యను నిర్ధారణచే హనుమంతునకు ననర్థము వాటిల్ల లేదని స్పష్టమగుచున్నది.

మూఁడవ విశేషభేదమున "అహితార్థముగూడఁబుట్ట"నను లక్షణములోని 'కూడ' ననెడు సముచ్చయముచేఁ గేవల మిష్టానవాప్తియు విషమాలంకారమగునని సమన్వయింపవచ్చును. అందుచేఁ గేవలమనిష్టప్రాప్తియును గేవల మిష్టానవాప్తియును నీరెండును విషమాలంకార భేదములు కావచ్చును. అనఁగా మూఁడవ విషమాలంకారము మూఁడు భేదములగుచున్నది. ఎట్లన ?. ఇష్టానవాప్తితోఁ గూడిన యనిష్టప్రాప్తి

యొక భేదము. కేవల మనిష్టప్రాప్తి రెండవ భేదము. కేవల మిష్టాన వాప్తి మూడవ భేదము.

తొలి భేదమున కుదాహరణములీయఁబడెను. కేవలమనిష్టప్రాప్తి యనెడు రెండవ భేదమున కుదాహరణ మెట్లన ?

తే॥ గీ॥ తమ్మి గొడుగుగఁ దాల్పంగఁ - దలఁచి దాని
బీజ ముంపఁగ వాపిని - బేల ! తలఁతు ।
కాలమిది కలి లోకంబు - కనదు మేలు
పెరిగి బలిమిని నీమోము - సిరులఁ గొనును ॥

ఒక స్త్రీ సహస్రపత్రకమలమును గొడుగుగఁ జేసికొనఁ దలఁచి వాపిలో నాపద్మబీజమును నాటదలంచుకొన నాపెచెలి యిట్లనినది. ఇట యిష్టమగు పద్మసంప్రాప్తి కలుగవచ్చునుగాన ననిష్టమగు ముఖ కాంతి హరణమొక్కటియే చూపఁబడినది.

కేవలమిష్టానవాప్తి యనెడు మూడవ భేదమున కుదాహరణము.

తే॥ గీ॥ అలసినాఁడవు విడు కొండఁ - గలిసి మేము
మోయువార మటంటచే - మోపు సడలఁ ।
బట్ట భరవక్రభుజులు గో - పాలురైనఁ ।
జూచి హసియించు కృష్ణుఁడు ప్రోచుఁగాత ॥

శ్రీకృష్ణుఁడు కొండనెత్తఁ గొంతతడవైన పిమ్మట గోపాలురతనితో నిట్లనిరి. కృష్ణా ! నీవలసితివి. మేమందఱము కలిసి మోయువారము నీవు కొంత సేద దీర్చుకొనుమని. అంత నతఁడట్లుచేయుటకుఁ గొంత సడలఁబట్ట వారి చేతులు క్రుంగఁదొడఁగినవి. దానిని జూచి యాతఁడు నవ్వఁదొడంగెను. ఇట గోపులకుఁ గొండ మీఁదఁబడవలసిన ప్రమాదము కృష్ణకరస్పర్శముచేఁ దొలఁగినను శైలధారణరూపమగు నభీష్టము వారికి సిద్ధింపలేదు. మఱియును.

తే॥ గీ॥ ఇలఁ గలంకము వాయ నీ - యిట్టితాలు
పతివ ! నీముఖమాయె నీ - వచటఁ గూడ ।

తిలకమిషమున లాంఛన – మొలయఁ జూతు
చెలులు గూర్పరె! మచ్చ నా – శ్రితుల కిలను॥

చంద్రుఁడు గోరిన యనిష్ట పరిహారరూపమగు నభీష్టము లభింపలేదు. మఱియును.

ఆ॥ వె॥ సుతుని ముద్దుమోముఁ – జూడ నేర్వని నాకు
మౌని శాపమెంచ – మహిత వరము।
సాగుఁబెట్టు నేలఁ – గాఁగఁగాల్చెడు మంట
మొలకలెలమి మొలువ – మొదటి యెరువు॥

గజమని భ్రమించి మునికుమారునిఁ జంపిన దశరథుని నీకుఁ బుత్రశోక మగుఁగాత నని మునిశపింపఁ బుత్రులులేని దశరథుఁడిట్లనుకొనెను. పుత్రులులేని దశరథునకు మునిశాప మిష్టమగుటచేఁ బరున కనిష్టము గూర్పవలెననెడు స్వేష్టము మునికి లభింపలేదు.

ఒక వ్యక్తి తన యిష్టసిద్ధికొఱకు మఱియొక వ్యక్తినిఁ బనుప నాతఁడావ్యక్తి యభీష్టము నెఱవేర్పక తనకార్యమును నెఱవేర్చుకొనుటగూడ నిష్టానవాప్తిరూపమగు విషమభేదమే యగును. ఎట్లన?

ఆ॥ వె॥ ఎవనిఁబిల్వ దూతి – నేనంపితినో యాపె
యతని యంకమందె – యత్తమిల్లె।
నాదుమోఱకంబొ! – యాదైవగతి యానొ!
తెలియఁజెప్పుడు దీనిఁ – జెలియలార!॥

నాయకునిచెంత దూతికి స్వేచ్ఛాప్రవృత్తి "అతనియంకమందె యత్తమిల్లె" ననుటచే సూచింపఁబడెను. మఱియు.

తే॥ గీ॥ క్లీబమాటను మోసంబు – లేదటంచు
నాపె చెంతకు మానసం –బల్లఁబనుప।
అదియు నావన్నెలాడిని – వదలి రాదె?
మోసమాయెను బాణిని మునినినమ్మ॥

పై యుదాహరణములన్నియుఁ గేవలమిష్టానవాప్తికి నుదాహరణములు. ఇష్టావాప్తి గల్గియును బిమ్మట ననిష్టావాప్తి సంభవించినపుడుకూడ నీయలంకారము కానచ్చును. ఎట్లన ?

ఉ॥ నీ చరణాంశుదీధితుల - నీరజబంధువు వొందఁగోరి రే
లేచిన వహ్నిఁజొన్ని తన - యిద్ధకరంబులఁ దోలి సంజలం।
దాచితరక్తిమం గని ము - దాత్మత శామితతాపుఁడౌచు వే
దోచుట దాఁగలుప్తి వగ - తో విరియింపఁడె? తూలి వెట్టలన్ ॥

అప్పయ్యదీక్షితులువారి వరదరాజస్తవము. ఓహరీ! సూర్యుఁడు నీ చరణకిరణములయొక్క యెఱ్ఱని కాంతినిఁ బొందఁదలఁచి తన కిరణములను రాత్రివేళలఁ బ్రజ్వలించెడు నగ్నిలోఁజొన్పి పొద్దుట నాయగ్ని నుండి బైటకుఁదీసిచూడ నవి యెఱ్ఱఁగనుంటచేఁ గోర్కె ఫలించినదని తాపమును శమింపఁజేసికొనినాఁడు. ఆరక్తిమ క్షణికమగుటచే దుఃఖముతో మగుడఁదాపము నొందుచున్నాఁడు.

సూర్యుఁడు రాత్రివేళల నగ్నిలోఁ బ్రవేశించునని శ్రుతి చెప్పుచున్నది. సూర్యుఁడుదయమున నెఱ్ఱగనుండుటయు వేడిమి లేకుండుటయుఁ బ్రత్యక్షము. దానినిఁ బైరీతిగఁ జమత్కరించినాఁడు.

సూర్యునకుఁ దొల్తఁ దన కిరణములకు భగవంతుని చరణరక్తిమ సంభవించుట యనెడు నిష్టము సంభవించుటయుఁ బిమ్మట నారక్తిమ క్షణికమగుటచే నిష్టానవాప్తియు వర్ణింపఁబడెను. మఱియును

ఉ॥ నీముఖ సామ్యమున్, వరద! - నీరజకోశపు ముద్రిడుల్చి చే
తోముదమొప్పఁ దత్సుషమ - దోఁచిన మిత్రకరంబులాని యీ
సోముఁడు పున్నమన్ గొనియు - సోలుచు నోలినిఁ గ్రుంకుచుండి శ్రీ
లీమొగి నీతిదక్కి గడి - యింప నశించునటంచుఁ దెల్పెడిన్ ॥

వరదరాజస్తుతి. ఓహరీ! చంద్రుఁడు నీ ముఖసామ్యమును గోరినాఁడు. ఆసామ్యసంపద పద్మమందుఁగలదు. కాన మిత్రుని కరములచేఁ బద్మకోశమును విడఁగొట్టించి సామ్యసుషమ్మను దోపించి తీసికొనినాఁడు.

ఈరీతిగ సామ్యసంపదను గొనియు నొక్కపున్నమనాడే నీముఖముతో సరిగనుండి పిమ్మట క్షీణించుచు నీతిదక్కి గడియించిన శ్రీలు నశించు నని బోధించుచున్నాఁడు.

కోశము :- పద్మకుళము, ధనాగారమనియు నర్థములు. మిత్ర కరములు :- సూర్యకిరణములు, స్నేహితుని హస్తములు. సుషమ :- శోభ, శ్రీయు నర్థములు. ఈయర్థ భేదమును గ్రహించి యలంకారము సమన్వయించుకొనవలెను.

ఇట చంద్రునకుఁ దొల్త నిష్టావాప్తిఁగల్గినను బిదపనిష్టానవాప్తి చూపఁబడెను. నీపదసామ్యమున్ అను పదమునకు మూఁడవపాదమం దలి 'కొని' యను పదముతో నన్వయము.

అభీప్సితము నొందకున్నను దానినిఁ బొందినటులు భ్రాంతి గల్గుటకూడ విషమాలంకారమగును. ఎట్లన ?

శా॥ అల్లాలక్షితిపాల ! నీ యరిపురిన్ - వ్యస్తంబులౌ కెంపులన్
భిల్లస్త్రీగొని చంద్రనిప్పుకల భ్రా - న్తింబొంది గంధంపుఁదు ।
న్కల్లొల్యంబున వానిఁజేర్చి యరగాన్ - గన్మూసి యూదంగఁ దేం
ట్లుల్లంబాడఁగ నూర్పుతావులను రా - నూహించె ధూమంబుగాన్ ॥

నిప్పును రగుల్పఁదలఁచిన బోయెత యల్లాలక్షితీంద్రుని శత్రురాజుల యొక్క పట్టణములు దిబ్బలుకాఁగా నచ్చటఁ జెదరియున్న రత్నము లను నిప్పుకణములనుగా భావించి వానియందు నచ్చటి మంచిగంధపు ముక్కలను జొనిపి కండ్లు సగముమూసికొని యూదఁగా నాపెయూర్పు తావులకుఁజేరిన తుమ్మెదలను ధూమమునుగా భ్రమించెను. రగుల్చుట యనెడు నాపె యభీష్టము సిద్ధింపకపోయినను సిద్ధించినట్లు భ్రాంతిని వర్ణించుటచే నిది విషమము.

## సమాలంకారము. 39.

కం॥ పొందికగల వస్తువులకుఁ
బొందును గూర్పంగ సమము - పొల్చును గృతులన్ ।

చిందాడు గుబ్బచన్గవ
పొందుంగొని బలుపుముత్తె - పుం బేరడరున్ ॥

పొందికగల రెండు వస్తువులకుఁ బొందు సమాలంకార మగును. ఇట యను రూపములగు కుచతటీ ముక్తాహారములకుఁ జక్కఁగ సంబంధము కూర్పఁబడినది. ఈ సమాలంకారము విషమాలంకారముయొక్క మొదటి భేదమునకుఁబ్రతి.

ఆ॥ వె॥ హిమ మరీచిమండ - లమును గౌముదివోలె
సోమచూడు జహ్ను - సుతయు వోలె ।
తగిన నిన్నుఁజేరి - తద్దయుఁ గీరితి
చెన్నుమీఱెను నర - సింహభూప ! ॥

చంద్రమండలమునకు వెన్నెలకును, శంకరునకును జాహ్నవికిని, నరస రాజునకును గీర్తికి, జక్కని సంబంధము వర్ణింపఁబడినది. మఱియును.

ఆ॥ వె॥ తలఁపఁ జిత్రమగు వి - ధాతృ సంఘటనా వి
లాస పాటవము సె - బాసు! భళిర ! ।
వేప చెట్లపండ్ల - తీపుతీరును దానిఁ
గ్రోలి యుబుకు కాక - కులముజూడ ॥

వేపపండ్ల తీపునకును దానిఁగ్రోలి యుబుకు కాకకులమునకును సంఘటన హాస్యముగ వర్ణింపఁబడినది. వెనుకటి యుదాహరణము స్తుతి రూపము. ఇది నిందారూపము.

స మా లం కా ర ము. II

కం॥ కారియము సొగసు మీఱఁగఁ
గారణ గుణమొందినట్లు - కల్పన యదియా ।
నీరజవగుటను నీకిటు
లారయ నీచానుసరణ - మర్హాము లక్ష్మి ! ॥

కార్యమునకుఁ గారణగుణ మబ్బినట్లుచెప్పిన నదియు సమమగు. నీరు నిమ్నగామి యగును దానఁబుట్టిన లక్ష్మికిని నీచానుసరణము

యు క్తమని చెప్పఁబడినది. ఈసమాలంకార భేదము ద్వితీయ విషమా లంకార భేదమునకుఁ బ్రతిగనున్నది. మఱియును.

కం॥ వనదహన జాత ధూమము
వనదాత్మను బొంది వర్ష - పాతముచే నా।
వనవహ్ని నె యడచుట దగు
వనజంబై వనము గాల్పఁ - బఱగుట నదియున్ ॥

దవాగ్నివలనఁబుట్టిన పొగ మేఘరూపమునుబొంది వర్షించి తనకుఁ గారణమగు వనవహ్నినే యార్పుచున్నది. అది యు క్త మే. ఏలయన ? ఆవనాగ్నియు వనములోఁబుట్టి వనమును గాల్చుచున్నది కాన.

మఱియును.

మ॥ తొలుదొల్తన్ గరలానలంబు కొనచే - తుల్ వట్టినట్టాడి యా
వల బాల్యంబున శంభుఫాల శిఖిసా - వాసంబునన్ బెద్దయై।
యెలప్రాయంబున రాహుదంష్ట్రల విషం - బేపారి జీర్ణింప నీ
చలి వెల్గిట్టు కరంబులన్ దగు ననున్ - సంతాపితన్ శేయఁగాన్ ॥

విరహిణీ చంద్రోపాలంభనము. పుట్టుకనుండి విషమున్నగు వస్తువు లతో సంబంధముకల చంద్రునకు సంతాపించుట యు క్తమని కారణ గుణానుగుణముగ వర్ణింపఁబడినది.

తొలి యుదాహరణముల రెంటిలో మొదటిదానియందు లక్ష్మికి నీచానుసరణరూప కార్యము కారణమగు జలముయొక్క స్వభావము నకుఁ దగియున్నది. ఈపద్యమందుఁ జంద్రునిచేఁ జేయఁబడిన తాప రూపకార్యము చంద్రునియందలి దుష్టసంసర్గ రూపకారణమునకు ననురూపముగ నున్నది.

## స మా ల ం కా ర ము. III

కం॥ ధారుణి సమమది యేఫల
మారయ నాఫలమనిష్ట - మరయక బెరయన్।
వారణముగోరు నీకిటు
వారణలాభంబు తలఁప - భవ్యము గాదే ? ॥

అనిష్టమును బొందకయే కోరిన ఫలమును బొందుట సమము. గజమును గోరి ప్రభువు నాశ్రయింపఁబోవు పండితుని నడ్డగించి ద్వారపాలకు లిట్లనిరి. వారణ పదమునకు గజమనియు నడ్డుకొనుటయనియు నర్థద్వయము నాశ్రయించి యలంకారము సమన్వయించుకొనఁదగు. ఇది శ్లేషమూలకము. ఇష్టావాప్తి శ్లేషవశమున సిద్ధించినది.

రాజదర్శనార్థికి ద్వారమం దడ్డుకొనఁబడుట యనిష్టముగదా? యనినచో రాజద్వారమందు దౌవారికులు రాజదర్శనార్థినిఁ గొంత తడవు వారించుట తప్పదుగాన నిది విషమాలంకారమువలె నుత్కటమగు ననిష్టముకాదు. ఈసమాలంకారభేదము తృతీయ విషమ భేదములోని 'కూడన్' అను పదముచే గ్రహింపఁబడిన విషమభేదత్రయమునకును బ్రతిద్వంద్వియని తెలియఁదగు. ఎందుచేతనన? ఉత్కటమగు ననిష్టములేకుంటచేతను గోరఁబడిన యిష్టము లభించుటచేతనును.

ఉత్కటమగు ననిష్టమును బొందియున్నను శ్లేషవశమున నభీప్సితము సిద్ధించినట్లు వర్ణించినచో నదియు సమాలంకారమే యగును. ఎట్లన?

కం॥ ఉచ్చ కరినెక్కి యటనము
నిచ్చగఁగొని దేవ నిన్ను – నిటుకొలిచెదు నా।
కుచ్చాటనంబె వరముగ
నిచ్చితి వధిగుణులసేవ – యెటు విఫలంబౌ॥

ఉచ్చగజారోహణమునుగోరి ప్రభువునాశ్రయింపఁ గారణాంతరముచే నాస్థానమునుండి వెడలఁగొట్టఁబడిన పండితుఁడు రాజునుగూర్చి యిట్లనెను.

ఉచ్చాటన మనఁగా నున్నతకరినెక్కి తిరుగుటయనియు లేవఁగొట్టుట యనియును రెండర్థములు, రెండవ యర్థమును గ్రహించినచో నుత్కటమగు ననిష్టము కల్గినది. ఈయర్థమున నధిగుణులసేవ యెటువిఫలంబౌ ననునది ముఖస్తుతి మాత్రమే. మొదటియర్థమును గ్రహించి యిష్టార్థలాభమును జెప్పుటచే సమాలంకారము సిద్ధించుచున్నది.

ఈస్తుతి వ్యాజముగాఁ జేయఁబడినదిగాన దీనిచే నింద వ్యక్తమ గుచున్నది యనినచో నప్పుడుత్కటమగు ననిష్టమే సంభవించినది కాన విషమాలంకారమే యగుచున్నది. కాని మొదట వాచ్యమగు స్తుతిని స్తుతినిగానే గ్రహించినచో సమాలంకారమగుటకు నడ్డులేదు. ఇచ్చటగూడ సమము శ్లేషమూలకము.

శ్లేషవశమున నొకయర్థమును గ్రహించి యసత్యమగు ననిష్టార్థ ప్రతీతి చూపఁబడినను నర్థాంతరమున సత్యమగు నిష్టావాప్తి యున్నచో నదియు సమాలంకారమగును. ఎట్లన ?

తే॥ గీ॥ తండ్రి కొమరుని "నఖలుశ - స్త్రంవిధార్య"
మంచుఁ బ్రేముడి సూపిశా - సించు వేళ।
అట్టిశస్త్రమ్మునే సమ - కట్టి తాల్చి
ముద్దుకొమరుఁడు తనతండ్రి - సుద్దునడిపె॥

'నఖలుశస్త్రంవిధార్యమ్' ఈసంస్కృతవాక్యమున నున్న 'నఖలు' అను పదము నేకపదముగా గ్రహించినచో నఖ+లు అనఁగా గోళ్లను గోయునట్టి యని యర్థము వచ్చును. దీనికి మిక్కిలి వాడిగలది యని తాత్పర్యము. తండ్రి కొమరుని వాడిగల శస్త్రమును ధరింపుమని శాసించినాఁడు.

కాని 'నఖలు' అనునవి 'న, ఖలు' అని భిన్నపదములుగా గ్రహిం చినచో 'శస్త్రంనవిధార్యమ్ఖలు' అని వాక్యమగుచున్నది. అనఁగా శస్త్రమును ధరింపవలదని నిషేధరూపార్థము వచ్చుచున్నది. ఈయర్థము తండ్రికభీప్సితముకాదు.

'ముద్దుకొమరుఁడు తన తండ్రి సుద్దునడిపె' ననుటచేఁ దండ్రి శాసనవాక్యములోఁ దండ్రి యభీష్టమును జేయకుండుటకు వీలగు నర్థాం తరముకూడ నున్నట్లు స్ఫురించుచున్నది. ఇట్లు విరోధార్థమునుగూడఁ జెప్పవలెనన్నచో 'శస్త్రంనవిధార్యంఖలు' అనఁగా శస్త్రము ధరింప వలద నెడు వ్యతిరేకార్థమును జెప్పవలెను.

ఈయర్థమును గ్రహించినచోఁ దండి యభీష్టము నెరవేరదు. ఈయర్థము సత్యముగాకున్నను శ్లేషవశమున సంప్రాప్తమగుటచేఁ దండి కనిష్టార్థము ప్రతీయమానమగుచున్నది. ఇట్లనిష్టార్థప్రతీతి యున్నను దొలియర్థము సత్యమగుటచే నాయర్థమునఁ దండికిష్టావాప్తి యున్నదికాన సమాలంకారము కలదు.

ఇట వక్తవ్యాంశమేమనిన? సత్యమగు నర్థమున అనిష్టావాప్తియే జూపఁబడినను శ్లేషవశమున వచ్చిన యసత్యార్థములోనైనను ఇష్టావాప్తి చూడఁబడినచో సమాలంకారము కలుగుననియు నది చమత్కృతినిఁ జూపుననియును.

ఇట్లే యసత్యార్థమున అనిష్టావాప్తి వ్యక్తమగుచున్నను సత్యార్థమున నిష్టావాప్తి యున్నచో సమాలంకారము కలుగుననియు నది చమత్కృతినిఁజూపుననియును సిద్ధాంతము,

మొదటి భేదమునకుఁ దొలుత నుదాహరణ మీయఁబడెను, రెండవ భేదమున కీపైపద్య ముదాహరణమని తెలియవలయును.

"వారణముగోరుసీకిటు" అను నుదాహరణమున స్వల్పమగు నట్టి యనిష్టమును, "ఉచ్చైకరినెక్కి" యను నుదాహరణమున నుత్కటమగునట్టి యనిష్టమును బ్రతీయమానమగుటచే అనిష్టప్రతీతి యెంత మాత్రమును లేని సమాలంకారోదాహరణమెట్టన ?

ఆ॥ వె॥ తపము సుగతి నిడదె? – తమ్మి నీటనునిల్చి
తపనుఁ జూచిచూచి – తపముసేసి।
త్వత్పదముగఁ బుట్టి – తనరి యన్నిటికన్న
సుగతి ననుభవించు – చుండె సుదతి! ॥

సుగతిశబ్దమునకు నుత్తమ లోకప్రాప్తి యనియు సొగసగు నడకయు నని యర్థద్వయము.

పద్మమునకుఁ దపము చేయుటచే నుత్తమలోకప్రాప్తి గలుగకున్నను బాదజన్మయందు విలాసగమనమనెడు నిష్టము సంప్రాప్త

మాయెను. ఇట యనిష్టసంప్రాప్తి సంభవములేకయే యిష్టసంప్రాప్తి శ్లేషచేఁ జూపఁబడెను.

విచిత్రాలంకారము. 40.

కం॥ యతన స్వరూప మిల వాం
ఛిత విపరీతంబుగా వి - చిత్రింబడి యా।
నతులగుదురు సుజనులు త్రిజ
గతిసమధిక పదవి నొందఁ - గాఁ దలఁచుచిలన్ ॥

కోరికకు విరుద్ధమగు ప్రయత్నము విచిత్రాలంకారము. సుజనులు నున్నతస్థానము నొందఁగోరి వినయముచే వంగుచున్నారు. మఱియును.

తే॥ గీ॥ ఖలుల ముఖముల మలినంబు - గా నొనర్చి
విమలమును జేయు నీకీర్తి - విశ్వమంత।
మిత్రసంతుష్టి నెడ నెంచి - మిత్రునకును
దోహ మొనరించు నీతేజ - మోహతారి! ॥

మిత్రశబ్దమునకుఁ జెలికాఁడు సూర్యుఁడును నర్థములు.

అధికాలంకారము. 41

కం॥ అట నధికమ్మాధారం
బెటఁ బృథు వాధేయమునును - బృథుల తరంబౌ।
నెట బుడగలో! బ్రహ్మాండము
లట నీటను నీగుణమ్ము - లడఁగవు దేవా! ॥

పెద్దది యగు నాధారముకన్న నాధేయము మిక్కిలి పెద్దదిగఁ జెప్పఁబడుచో నధికాలంకారమగును. ఏమహాజలరాశిని ననంతబ్రహ్మాండములు బుడగలుగ నుండునో యచ్చటఁగూడ నీదుగుణము లిముడవు. విపులమగు మహాజలరాశియనెడు నాధారముకన్న : నాధేయమగు ప్రభుగుణములు విపులతరముగాఁ జెప్పబడెను. మఱియును.

ఆ॥ వె॥ విలయ వేల నెటస - కల జగంబులు సొచ్చి
యొడము గల్గి మనునొ - యేపుమీఱె।

అట్టి కృష్ణునొడల - నమర సంయమి రాకఁ
బుట్టు ముదములిముడ - కుట్టివడెను ॥

మాఘకావ్యమున నారదాగమన వర్ణనము. ప్రళయ కాలమున నిమిడి జగములు భద్రముగనున్న కృష్ణుని యుదరమున నారదుని రాకచేఁ గలిగిన ముదము లిముడలేదు.

అ ధి కా లం కా ర ము. II.

కం॥ విపులాధేయము కంటెఁ ద
లప నాధారాధికతయు - లలి నటులగుఁ దా।
నపరిమితము బ్రహ్మాం
డపబాధము నీగుణౌఘ మమరునొ యేడన్ ॥

ప్రభుగుణము లనంతములు. అవిగూడ బ్రహ్మాండమున నిముడుచున్నవి. స్వతస్సిద్ధముగ విపులమగు నాధేయముకంటె నాధారము విపులతర ముగఁ జెప్పఁబడుటచే నిది యధికాలంకారము. మఱియును.

ఆ॥ వె॥ ఔర! భూప! త్రిభువ - నాంతర మది యెంత
విరివి యౌనొ? యేరి - కరయ నగును।
కొలువ నలవి గాక - వెలయు నీశుభకీర్తి
గరిమ యెచట నిముడు - నొరయకుండ ॥

ఆధేయమగు రాజకీర్తి కాధిక్యమును దానికాధారమగు త్రిభువన మధ్యభాగమునకు దానికన్న నాధిక్యమును జూపఁబడినది.

ఇట నుపస్తుతమగు త్రిభువన మధ్యభాగము యొక్క విరివిని 'ఔర!' అను పదముచే స్తుతించుటచేఁ బ్రస్తుతమగు రాజకీర్తి యొక్క యాధిక్యమునకు న్యూనత భాసించుచున్నదని తలంపరాదు. ప్రస్తుతమగునట్టియు నాధేయమగు రాజకీర్తికన్న నాధారమగు త్రిభువనాంతరముయొక్క వైశాల్యమునకుఁ దక్కువతనము నంగీక రించియే యధికాధేయమునుగూడ నిముడ్చుకొనిన యల్పాధార మెంత పొగడ్త నొందఁదగునో యని స్తుతించినాఁడుకాన స్తుతి యనుచిత మనఁదగదు.

అధికాలంకారముయొక్క యీరెండు భేదములకును సామాన్య లక్షణ మెద్దియన? ఆధారాధేయములు రెంటిలోను జిన్నదియైనను నొకదానికి నాధిక్యము వర్ణించుటయే యని తెలియవలెను.

అ ల్పా లం కా ర ము. 42.

కం॥ ఒగి నాధేయము కన్నన్
దగ నాధారంబు సూక్ష్మ – తరమే నల్పం।
బగు నీమణి మాలోర్మిక
మగువా! నీచేత జపపు – మాలగఁ దిరుగున్ ॥

ఆధేయము సూక్ష్మముకాఁగా దానికన్న నాధారము సూక్ష్మమగుచో నది యల్పాలంకారమగును. చిన్నచిన్న మణులను గుచ్చి మాలగఁ జేసి దానిని నంగుళీయముగ నొనరింప నది మణిమాలోర్మికయని తెలియవలెను. అంగుళీయకమే సూక్ష్మమగుచుండ నది చేత జపమాలగాఁ దిరుగుటచే నాధారమగు చేయి మిక్కిలిసూక్ష్మ మగుచున్నది. ఆమె విరహముచే మిక్కిలి కృశించినదని భావము.

ఆ॥ వె॥ నీదు నడుము కన్న – నీరేజ పత్రాక్షి!
సూక్ష్మ మబ్జనాళ – సూత్రి మెంచ।
అదియుఁ జెలియ! నీ స్త – నాంతరంబునఁ జాలి
నంత చోటు నొంద – దెంత తడవ॥

పద్యార్థమును నలంకారమును స్పష్టము.

అ న్యో న్యా లం కా ర ము. 43.

కం॥ ఒండొరు వొందఁగను పక్రృతి
దండిగ నన్యోన్య మగును – దత్త్వజ్ఞ మతిన్।
మండనము నిశకు శీతాం
శుండటు లానిశయు నతని – శోభకుఁ గతమా॥

రెండు వస్తువులు పరస్పరము తమయొక్క శోభకుఁగారణము లగుచో నన్యోన్యమగును. రాత్రికిఁ జంద్రుఁడును జంద్రునకు రాత్రియును శోభను గూర్చుకొనుచున్నవి.

ఆ॥ వె॥ చేతివ్రేళ్ల సడలఁ - జేసి పైఁజూచుచు
బాటసారి యొకఁడు - నీటిఁద్రావ ।
పానశాలనున్న - పడఁతియు నతని దో
సిలిని నీరు వోసెఁ - జిన్ని దార ॥

ఒక చలివెందలి వద్దనున్న యొక పడఁతి యొక యువకుని దోసిలిని నీరుపోయుచుండ నాతఁడాపె మోమును గొంత తడవు చూడ నెంచి వ్రేళ్లను సడలించి నీళ్లు త్రాగుచుండెను. ఆమెయు నతని మోమును గొంతతడవు చూడఁదలచి దోసిలి నిండకుండునట్లు చిన్నిదారగా నీరు పోయఁదొడఁగెను. వీరి చేష్టలు స్వోపకారకములయ్యును బరోపకారకములునుగాన నలంకారము సిద్ధించుచున్నది.

విశేషాలంకారము. 44

కం॥ విదితంబగు నాధారం
బొదిఁగియు నాధేయముండ - నొప్పు విశేషం ।
బొదిఁగినను నినుఁడు దీపము
నఁ దగులొ్కని వానిఘృణుల - ణంచెడు నిరులన్ ॥

ప్రసిద్ధమగు నాధారము తొలఁగినను నాధేయము నిల్చియున్నచో నది విశేషము. సూర్యుఁడస్తమించినను వాని కిరణములు చీకటినిఁ బోగొట్టుచున్నవి. రాత్రి సూర్యకిరణములు వహ్నినిఁజొచ్చునని శాస్త్రము చెప్పుచున్నది. ఈరీతిగ దీపమును జేరి చీకటినిఁ బోగొట్టుచున్నవని సమన్వయము.

ఆ॥ వె॥ నీరులేని చోట - నీరేజ మద్దానఁ
గలువలమరు నవియుఁ - గనక లతిక ।
నుండు మెత్తఁదనము - నొంది యద్ది. చెలంగు
నౌర ! కీడుదొంతి - యగు నిదంత ॥

ప్రసిద్ధాధారమగు నీరులేకున్నను బద్మము కలువల స్థితి వర్ణింపఁబడెను. ఇదంతయుఁ గాలవిపరీతమని చమత్కరించినాఁడు. పద్మమన మొగమని

యును గలువలనఁ గన్నులనియు నర్థ్యావసానము. కనక—లతయన బంగారు తీవయనియు నాపేరుగల యొక సుందరి యనియును నర్థము.

ప్రసిద్ధాధారము తొలఁగుటయే కాక మఱియొక యాధార మేదియును లేకుండఁ బ్రళయాంతము వఱకు నొక వస్తువునకు స్థితిఁ దెల్పినను విశేషమగును. ఎట్లన?

ఆ॥ వె॥ స్వర్గ సీమఁజేరి – నఱలుచున్నను నేరి
సరస కల్పనాఢ్య – గిరము తొర! ।
జగము నలరఁజేయు – యుగముల తుదిదాక
నట్టి కవులు వంద్యు – లెట్లు కారు? ॥

సరస కల్పనల కాధారభూతులగు వాల్మీకి మున్నగు మహాకవులు మృతిఁజెందినను వారి వాక్కులకు మఱియొక యాధారము చూపకయే ప్రళయావధి స్థితి వర్ణింపఁబడెను.

వి శే షా లం కా ర ము. II

కం॥ తలఁప విశేషం బదియును
బలుదిక్కుల వస్తువొకటి – వర్ణితమైనన్ ।
వెలుపల లో వెనుకను ముం
గల నలుదెసలందు నాపె – గన్పడు నాకున్ ॥

ఒకవస్తువే పలుదిక్కులఁ గన్పట్టునట్లు వర్ణించినచో నదియు విశేష మగును. విరహియొక్క వాక్యమిది.

తే॥ గీ॥ హృదయసీమను విడనాడి – యేగ వెల్ల
దెసలఁ గన్పట్టు దణకువ – యెసక మెసఁగ ।
తనయ! కానకుఁ బోయినా – వనెడు వార్త
రవులు తనుతాపమున నెంతు – రామభద్ర! ॥

దశరథుని విలాపము. శ్రీరాముఁడు వనమునకుఁబోయినను దశరథుఁడు చిత్తభ్రమముచే నలుదిక్కుల నతనిఁ జూచుచు శరీరతాపముచే నాతని వనవాసమును నిశ్చయించుకొనుచున్నాఁడు.

## వి శే షా లం కా ర ము. -III

కం॥ అల్ప పదార్థారంభము
సల్పి యశక్యార్థకృతియుఁ - జన్గ నటులగు దృ।
క్కల్పిత శుభ! నినుఁ గని యా
కల్ప మహీరుహముఁ గనులఁ - గాంచితి నృపతీ! ॥

అల్పారంభముచే నశక్యమగు నర్థమును నిర్వహించుటయును విశేష మగును. అల్పమగు రాజదర్శనముచే దుర్లభమగు కల్పవృక్షదర్శనము సిద్ధించినట్లు వర్ణింపఁబడినది. మఱియును.

ఆ॥ వె॥ మరులు గొల్పురూపు - మాయించు తేజంబు
మహిత విద్యగన్న మాన్యు నిన్ను।
సృష్టిసేయు స్రష్ట - సృజియించెఁ గొంగొ్త్త
మరునిఁ దిగ్మతేజు - మఘవ గురుని ॥

విజాతీయములగు సౌందర్యము తేజము విద్యను బొందిన యొక్క రాజును సృష్టించినంతమాత్రమునఁ గొంగొ్త్తవారగు మన్మథుఁడు సూర్యుఁడు బృహస్పతి యీముగ్గురను వేఱువేఱుగా సృష్టింప నక్కఱ లేకుండుట యనెడు కార్య సౌకర్యము బ్రహ్మకుఁ గల్గినది.

## వ్యా ఘా తా లం కా ర ము. 45.

కం॥ అగు వ్యాఘాతం బొకపని
కగు హేతువు తద్విరుద్ధ - మగు పనిసేయన్।
జగములఁ గులికించెడు నవి
వగఁబెట్టును వానిఁగొంచు - వలరాజు రసన్ ॥

ఒకపనిని నెరవేర్చు వస్తువులు దానికి విపరీతపు పని చేయుచో నది వ్యాఘాతము. జగదానందకరమగు పుష్ప మలయ మారుత చంద్రికా దులచే మన్మథుఁడు జగమును బాధించుచున్నాఁడు. ఆనందకరములగు పుష్పాదులు బాధాకరములాయెను.

ఒక సాధనముచే నొకఁడొక పనినిఁ జేయ నాసాధనముచేతనే మఱియొకండాపనిని విపరీతముగఁ జేసినచో నదియును వ్యాఘాతమగును.

తే॥ గీ॥ చూపుచే దగ్ధుఁడగు భావ - సూతి నెవరు
చూపుచేతనె వెలయింతుర్రి - చోద్య మొప్ప।
నిటల నేత్రుని గెలిసే - యుటకుఁ దగిన
వామ లోచనులను గొల్తు - వారి నాత్మ॥

ఈశ్వరుఁడు చూపుచే మన్మథునిఁ దగులఁబెట్టెను. ఆచూపుచేతనే స్త్రీలు మన్మథుని జీవింపఁ జేయుచున్నారు.

వ్యా ఘా త ము. II

కం॥ అనువుగఁ గొను కారణమే
యనను-గుణంబుగనుఁ జెప్ప - నట్టులు చెల్లున్।
జనకా! నాపై బాలుం
డను కృప గలదేని వదలు - టనుచితము ననున్॥

ఒక పని కనుకూలమని గ్రహింపఁడిన కారణమును దానికనుకూలము కాదని తెల్పినచో నదియు వ్యాఘాతమగును. ఒకరాజు జైత్రయాత్రకుఁ బోవుచుఁ దన కుమారుని బాలుఁడనెడు కారణముచే నింట వదలఁ దలఁచుకొనుచుండ నాబాలుఁ డాకారణము నే చూపి యింట వదలు టనుచితమని చెప్పెను. మఱియును.

తే॥ గీ॥ కలుగ నోపును లేమి నా - కిల నటంచు
భీతి నొందుచు లోభి యీ - వినిఁ ద్యజించు।
దానశాలియు నాభీతి - తోనె యాత్మ
విత్త మీఁడె? సుపాత్రుల - కెత్తరమున॥

లోభి దానము చేయకుండుటకు దారిద్ర్యభయమును గారణముగా నొకఁడు చెప్ప దాత దానముచేయుటకుఁ గూడ జన్మాంతరమున నా భయమునే మఱియొకఁడు కారణముగాఁ జూపెను.

### కారణమాలాలంకారము. 46.

కం॥ కారణ మాలా లంకృతి
కారణముల మున్నువెన్క – గతులను దెల్పన్ ।
ధారుణి నయమున సిరి సిరి
నారయఁగా నీవి యీవి – నధిక యశంబా ॥

ఉత్తరోత్తరములకుఁ బూర్వపూర్వములును నట్లే వీని కవియును గారణములుగాఁ జెప్పఁబడుచోఁ గారణమాల యగును. ఇట యుత్తరోత్తరమగు సిరి యీవి యశము నీమూడింటికిని బూర్వపూర్వమగు నీతి సిరి యీవి యీ మూడింటినిఁ గారణములుగాఁ జూపినాఁడు రెండవది యెట్లన ?

తే॥ గీ॥ నిరయములు పాపముల నగు – నిశ్చయంబు
పాపమెంచఁగ దారిద్ర్య – భవము సుమ్ము ।
నమ్ము దారిద్ర్య మప్రదా – నమునఁ గల్గుఁ
గాన దానపరుండగుఁ – గాత నరుఁడు ॥

పూర్వపూర్వములగు నిరయములు మున్నగువానికి నుత్తరోత్తరములగు పాపములు మున్నగునవి కారణములుగాఁ జెప్పఁబడినవి.

### ఏకావళి – అలంకారము. 47.

కం॥ సముపాత్త ముక్తరీతి మ
హిమ నర్థశ్రేణిఁ గూర్ప – నేకావళి ; నే ।
త్రము లాకర్ణగములు క
ర్ణములు భుజ స్తంభలంబ – న రుచిరములునా ॥

కం॥ కనఁగ భుజస్తంభంబులు
ననుపమ జాన్వంతలంబ – నానందదముల్ ।
తనరెడు జానువులును మో
హాన రత్నాదర్శ నిభము – లాన్నృపతి కగున్ ॥

సముపాత్త ముక్తరీతి యన నొక వస్తువును గ్రహించి తిర్గి విడిచి పెట్టెడు పద్ధతి. ఈపద్ధతిచే వస్తు పరంపరను గూర్చినచో నేకావళి

యగును. ఈసముపాత్త ముక్తరీతిలోఁ బూర్వపూర్వ పదార్థమునకు నుత్తరోత్తర పదార్థమును నుత్తరోత్తర పదార్థమునకుఁ బూర్వపూర్వ పదార్థమును విశేషణభావము నొందును. అనఁగా నపరిధానములగు నని యర్థము. మొదటి పద్ధతికిఁ బై పద్యము లుదాహరణములు. ఎట్లన?

ఈపరిభువునకు నేత్రములు కర్ణాంతమును బొందినవి. ఇట పూర్వపదార్థమగు నేత్రములకు నాకర్ణగముల నెడు పదార్థము విశేషణ మగుచున్నది. అనఁగా గుణవిశేషమును గూర్చుచు నపరిధానమగు చున్నది. అట్లే తక్కిన విశేషణముల నన్వయించుకొనఁదగు.

ఇట కర్ణ భుజ స్తంభ జాను పదములు తొలుత గ్రహింపఁబడి తిర్గి ముక్తము లగుటను దెలిసి కొనవలెను.

ఉత్తరోత్తరమునకుఁ బూర్వపూర్వము విశేణమగుట యెట్లన ?

ఉ॥ ఏది దిగాత్మ కాల విభు - వెవ్వఁడు దానఁ జెలంగు నేనియం
దూఁదు సుధోర్మి వానిఘృణు - లుత్థితుఁడౌ నెటనుండి యాతఁడ
ల్లేదగు దానిపిత్త మిడు - నేఁడట వేలిమి వానిజీవితం
బేది వహించు యద్గుణము - నిద్దియు నాహరుమూర్తులేలుతన్ ॥

ఈశ్వరునియొక్క యెనిమిది మూర్తులను జెప్పుచున్నాఁడు. ఏది దిక్కు, ఆత్మ, కాలమువలె వ్యాపకమైనదో యనఁగా నాకాశమని యర్థము. ఎవ్వఁడు దానఁ జెలఁగు ననఁగా సూర్యుఁడు. ఏనియందు నాసూర్యుని ఘృణులు సుధాతరంగము నుత్పత్తిచేయునో యనఁగాఁ జంద్రుఁడు. ఆతఁ డెటనుండి యుత్థితుఁడౌనో యనఁగా సముద్రము. అనఁగా జల భూతము. దాని పిత్తమేదో యనఁగా బడబానలము. అనఁగాఁ దేజో భూతము. ఏఁడట వహ్నియందు హోమము నిడునో యనఁగా సోమ యాజి. వాని జీవితం బేది వహించునో యనఁగాఁ బ్రాణవాయువు. అనఁగా వాయుభూతము. ఇద్ది యనఁగా నీవాయువు యద్గుణఃకు వహించునో యనఁగాఁ బృథివి. పృథివియొక్క గుణమగు గంధమును వాయువు వహించుచున్నదికాన.

ఇట పూర్వాపూర్వ పదార్థములగు నాకాశాదు లుత్తరోత్తరము లగు సూర్యుఁడు మున్నగు పదార్థములకు నాధారములుగా వర్ణింపఁ బడుటచే నప్రధానములుగాన విశేషణము లగుచున్నవి. ఆధారాధేయ వస్తువులలో నాధారవస్తు వప్రధానమును నాధేయవస్తువు ప్రధాన మనియు నెఱుంగునది.

## మా లా దీ ప క ము. 48.

కం॥ మాలాదీపకమది యెట
హేలన్ దీపకము గలియు - నేకావళితోన్ ।
వాలుచు మారుఁడు నెలకొనె
నాలలనా చిత్తమందు - నది నీయందున్ ॥

ఏకావళియు దీపకమును గలిసినచో నది మాలాదీపక మగును. మారుఁ డాలలనా చిత్తమందు నెలకొనెను. ఓసుందరుఁడా! యా లలనా చిత్తము నీయందు నెలకొనెను. అనఁగా నాపె నిన్ను ప్రేమించుచు న్నదని తాత్పర్యము. నెలకొనెన నెడు క్రియాపదము రెండు వాక్యముల నన్వయించుటచే నిట దీపకముకలదు. ఇట చిత్తమొక మారు గ్రహింపఁబడి ముక్తమగుటచే నేకావళియుఁ గన్పట్టుచున్నది.

శా॥ కంటన్ గంటిని దేవ! నీవటులు సం - గ్రామాంగణంబద్దు వి
ల్లంటన్ మోపఁగ దేనిదేని నదియే - దంటెన్ వడిన్ దెల్పెదన్ ।
వింటెన్ గోలలు కోలలన్ రిపుతలల్ - వే వాని భూమండలం
బొంటెన్ దానిని నీవు నిన్ను యశమో-హో! దాని ముల్లోకముల్ ॥

'ఎదియేదంటెన్' అను వాక్యములోని యంటెనను క్రియాపద మొక్కటియె కోలలు వింటెనంటెనను రీతి నన్నివాక్యముల నన్వయించు కొనఁదగు. ఇదియే దీపకము. కోలలు మున్నగు పదములు గృహీతములై ముక్తములగుచున్నవి కాన నేకావళియును గలదు. కాన మాలా దీపకము.

సారాలంకారము. 49.

కం॥ అధికత నొందఁగఁ బైపై
నధికృత వస్తువులు గృతుల - నగు సారంబై ।
మధువగు మధురము దానన్
సుధ దానన్ సుకవిగిరము - చొప్పడునట్టుల్ ॥

ఉత్తరోత్తర పదార్థములకు నాధిక్యమనఁగా నుత్కృష్టత చెప్పఁబడి నచో సారాలంకారమగును. తేనె మధురము దానికన్న నమృతము మధురము. దానికన్నఁ గవివాక్కు మధురము. మాధుర్యములో నుత్తరోత్తర వస్తువులకు నుత్కర్షము చెప్పఁబడినది. మఱియును :—

శా॥ శ్రీవిష్ణూదరమందు నుండు జగముల్ - శేషాహి నాతండు, పా
రావారోర్మ్మల నాతఁడుండు, మునిచే - రన్ బట్టె నద్దాని, నీ ।
ద్యోవీథిన్ మినుకౌ నతండు, నరసిం - హోర్వీశ! త్వత్కీర్తి లీ
లా వామాక్షికి నద్ది కర్ణమున హే - లన్ దాల్చు నీలాబ్జమా ॥

విష్ణూదరములో జగములుంటచే నది చాలపెద్దది. ఆవిష్ణువు శేషుని యందుంటచే నతండాతనికంటె పెద్దవాఁడు కావలసియున్నాఁడుకదా? శేషునికన్న సముద్రము. ఆసముద్రమును జులుకమునఁ బట్టుటచే నగస్త్యుఁడు. అతఁడు నక్షత్రముగ నుంటచే నాకాశము. ఆయాకాశము నరసింహరాజుయొక్క కీర్తి కాంతకుఁ జెవిలోని నల్లకల్వగ నుంటచే నతని కీర్తియును గ్రమముగఁ బెద్దవిగ వర్ణింపఁబడినవి.

పైయుదాహరణములు శ్లాఘ్యవస్తువులకు గుణోత్కర్షమును దెల్పుచున్నవి. అశ్లాఘ్యవస్తువులకు నుత్తరోత్తరోత్కర్షమును సారాలంకారమగును. ఎట్లన?

ఆ॥ వె॥ పూరికన్న బెండు - పుడమిని నూలుపో
చరయ దానికన్న - యాచకుండు ।
గాలి వానినేల - కైకొంచు నెగయదు?
తిరిపె మడుగునంచు - వెఱచి యేమొ! ॥

ంకన్న నూలుపోఁచ తేలికైనది. ఈరెంటికన్న యాచకుఁడు తేలిక యనఁగా బరువులేనివాఁడనియును జులకన చేయఁదగినవాఁడనియు నర్థము. యాచకుఁడు తృణము నూలుపోఁచలకన్న తేలికయైనచో గాలి వూరి నూలు పోఁచలనువలె నెందుచేఁ బైకెగురఁ గొట్టుట లేదని శంకించి వానినిఁ దాకనెంచినచోఁ దననుగూడ బిచ్చమడుగునని భయముచేతఁ గాఁబోలునని కవి చమత్కరించినాఁడు.

ఉభయరూపమెట్లన ?

ఆ॥ వె॥ కొండ పెద్ద దాని - యండ నబ్ధియుఁ బెద్ద
యబ్ధికన్న మిన్న - దార ! పెద్ద ।
మిన్నుకన్నఁ బెద్ద - మేటి బ్రహ్మము దాని
కన్న నాశపెద్ద - కాంచఁ గలిని ॥

కొండ మొదలు బ్రహ్మమువఱకును పెద్దతనము శ్లాఘ్యగుణము. వర్జ్యమగు నాశయందుఁ బెద్దతనము శ్లాఘ్యగుణముకాదు.

య థా సం ఖ్యా లం కా ర ము. 50.

కం॥ ఒగిఁబెట్టిన యర్థములకుఁ
దగనొగి సంబంధమిడ య - థాసంఖ్యమగున్ ।
పగతుని నెచ్చెలి నిడుమను
దెగటార్పుము తనుపుమయ్య - తెగఁద్రోయు మిలన్ ॥

రెండు వరుసలలో నుంచిన యనేక వస్తువులకుఁ గ్రమమగు సంబంధమును జూపినచో నది యథాసంఖ్యమగును. పగతుని నెచ్చెలిని ఇబ్బందిని యను నీమూడింటికినిఁ దెగటార్పుము తనుపుము తెగఁద్రోయుమనెడు క్రియలతోఁ గ్రమముగ సంబంధమును గూర్చుకొనవలెను. మఱియును.

ఆ॥ వె॥ శరణుఁ జొచ్చెనేమొ ? - గరవిషంబును బోలి
యుదరమందుఁ జేరి - చదుపునేమొ ?
విడువఁ డాత్మధనముఁ - దొడరుచు భోగింపఁ
దలఁప నైననేర్వఁ - డిలను లోభి ॥

గరవిష మనఁ బెట్టుమరిదు. ఇట పూర్వార్ధమందలి రెండు విషయము లకును నుత్తరార్ధమందలి విషయములు రెంటితోఁ గ్రమాన్వయము.

ప ర్యా యా లం కా ర ము. 51.

కం॥ ధర నొక్కటి పెక్కింటిని
వరుసగఁ దగ నండగొనఁగఁ – బర్యాయంబౌ।
సరసిజమును విడి చంద్రునిఁ
బరిగొనె మదిరాక్షి రుచిర – వదన ప్రభయున్ ॥

ఒక వస్తువు పెక్కింటిని వరుసగ నాశ్రయింపఁ బర్యాయమగు. ఉదాహరణము స్పష్టము. వదనప్రభ తొలుతఁ బద్మమును బిమ్మటఁ జంద్రుని నాశ్రయించినది. సరసిజమును నాశ్రయించినటులు చెప్పకున్నను గమ్యమానమగుచున్నది. ఇట పూర్వాధారాశ్రయము గమ్యము. ఉత్తరాధారాశ్రయము వాచ్యముగనున్నది. కనుకనే కావ్యప్రకాశ పర్యాయలక్ష్యము సంగతమగును. ఎట్లన ?

మ॥ కటిబంధంబు తనుత్వమున్ విడిచె వే – గన్ దాల్చె మధ్యంబు, సం
ఘటనాంచత్పదముల్ విడెన్ జలగతుల్ –కన్నుల్ గొనెన్ దామురః
స్థట ముత్తుంగ కుచద్వితీయత శుభా – స్యం బద్వితీయత్వమున్
బొటమించెన్ గద ! యీపె యంగకగుణం– బుల్ మాఱెఁబ్రాయం
బునన్ ॥

బాలభారత నాటకములో స్వయంవర సమయమున ద్రౌపదినిఁ జూచి భీముఁడిట్లనుకొనెను. బాల్యమున నొక యవయవమును నాశ్రయించిన గుణము యౌవనమున మఱొక యవయవము నాశ్రయించెను. ఎట్లన ? కటిబంధము సూక్ష్మతను బాదములు చలగతులను బాల్యముననొంది యౌవనమున విడువ వానినిఁ గ్రమముగ నడుమును గన్నులును బొందినవి. మూడవ పాదమున సమన్వయమెట్లన ? చిన్నఁదనమున వక్షఃస్థలము అద్వితీయముగ నుండెను. ఇప్పుడది కుచములతోఁ గూడి యుండుటచే నాయద్వితీయతను విడిచెనని తాత్పర్యము. అద్వితీయ

మనఁగా రెండవ వస్తువుతోఁ గూడికొననిది యని యర్థము. కుచద్వితీయత యనఁగాఁ గుచములనెడు ద్వితీయవస్తువు కలది యాయెనని యర్థము. దీనిచే వక్షము చిన్నఁదనమందలి తన యద్వితీయత్వమును విడిచెనని వ్యక్తమగుచున్నది. ఈ యద్వితీయత్వమును ముఖము గ్రహించినది. ఇచ్చట నద్వితీయత్వమన సాటిలేనిదగుట యని యర్థము. యౌవనమున సంపూర్ణ కలలతో నుండుటచే ముఖము నిరుపమాన మాయెనని తాత్పర్యము. ఇట ద్వితీయ రహితత్వము అనుపమత్వ మనెడు రెండర్థములకు నైక్యమధ్యవసించి యాయర్థద్వయ బోధకముగ నద్వితీయపదము ప్రయోగింపఁబడెను. ఈపద్యమున మూఁడుపాదము లను బూర్వావయవము విడిచినగుణము పరావయవము నాశ్రయించి నట్లుచెప్పఁబడెను. మఱియుఁ బూర్వావయవాశ్రయణము గమ్యమగు చున్నది. కాన నిది పర్యాయాలంకారమునకు లక్ష్యమగుచున్నది.

గమ్యముగాక యనేకాశ్రయములన్నియు వాచ్యములగుట కుదాహరణ మెట్లన ?

తే॥ గీ॥ ఉత్తరోత్తర మున్నతి - నొందు పదవిఁ
గాంచ నీకేరు దెల్పిరి - కాలకూట ! ।
ఆది నంభోధి హృదయంబు - నంత శివుని
గళము సేరితి వీనాఁడు - ఖలుల నాల్క ॥

హృదయముకన్న గళము దానికన్న నాలుకయు నొకదానికన్న నొకటి పైపై స్థానములు. పై యుదాహరణముల సంకోచ వికోచములు లేవు.

సంకోచమునుజూపిన యుదాహరణ మెట్లన ?

తే॥ గీ॥ ఆది వసుధా తలంబంత - యడరఁ దిరిగి
యంతఁ దరువుల నీడల - చెంతఁజేరి ।
చండ భానుఁడు చండిమ - నుండఁ జలువ
నీటి యడుగును జేరె నీ - నాట నొయ్య ॥

గ్రీష్మకాలవర్ణనము: శీతలమునకు హేమంత శిశిర ర్తువులను, వసంత ర్తువునను గ్రీష్మర్తువునను గ్రమముగ నుత్తరోత్తరాధార సంకోచము చూపఁబడెను. ఆధార సంకోచమన నాధారము చిన్నదగుట యని యర్థము.

వికాస పర్యాయమెట్లన ?

ఆ॥ వె॥ దొండపండు విధము – నుండు నీ వాతెర
యందె రాగముండె – నతివ! దొలుత।
చంచలాక్షి! యిప్పు – డంచిత గతిఁజూడ
హృదయ సీమఁగూడ – నది చెలంగు ॥

యువతిని సంబోధించి యొకఁడిట్లనియె. ఓయువతీ! రాగము బాల్యమున నీపెదవియందే యుండెను. ఈనాఁడు హృదయమునఁ గూడఁ జేరినది. రాగమన రక్తిమ యనియు ననురాగ మనియును గూడ నర్థము. ఆయర్థములం బద్యమందు సమన్వయించు కొనఁదగు. ఇటు రాగము పూర్వాధారమగు వాతెరను విడువక యే హృదయ మనెడు మఱియొక యాశ్రయమును గూడఁ బొందినట్లు వర్ణింపఁబడినది. కాన నిది వికాస పర్యాయము.

పర్యాయాలంకారము. II.

కం॥ ఏకాధారము నందు న
నేకార్థంబుండ నొగి న – కెంతురు సుకవుల్।
ప్రాకట వాహిని వాఱిన
యాకడ సైకతము నేడ – దే! కంటఁ బడున్ ॥

ఒక యాధారముననే వరుసగ ననేక వస్తువులుండునట్లు వర్ణింపఁ బడినచో నదియుఁ బర్యాయమగును. ఉదాహరణము స్పష్టము. మఱియును

ఉ॥ ఆదిని దేహముల్ మనల – కాయె నొకండయి నాథ! యంత నీ
వౌదు ప్రియుండ వేము ప్రియు–రాండ్రము గాఁగ హాతాశనుంటె
సాదిత భేదబుద్ధి నిటు – సాకఁగ నీవు ధవుండ వేము లో [మా
కాపృత రీతి భార్యలము – ప్రాణ దృఢత్వము హేతు వింతకున్ ॥

అమరుక కావ్యములోనిది. ఒక కాంత తొల్తఁ దనను మిక్కిలి ప్రేమించి పిమ్మట సామాన్య రీతి నాపె నాదరించెడు భర్తను గూర్చి యిట్లు పల్కుచున్నది.

తొలుతఁ బ్రేమాతిశయముచే నభేద భావమును. పిమ్మట ప్రేమ భావమును. అంతఁ బోష్య పోషక భావమును గ్రమముగఁ దగ్గించుచుఁ జూపఁబడెను. ఇట్లయ్యును, దాను జీవించి యుంటకుఁ దనప్రాణములు గట్టివగుటయే కారణమని యాపె నుడివెను. ఇట దంపతులనెడు నొక యాధారమందే యనేక భావములు కాలక్రమముగ నాధేయముగ వర్ణింపఁ బడినవి.

పరివృత్తి - అలంకారము. 52.

కం॥ పరివృత్తి వినిమయం బొం
డొరు వల్పాధికులు వొంద - నొయ్యన నగు న ।
న్నరపతి యొరస్ జూచుచు
శర మొక్కటి విడిచి కొనియె - శత్రు శ్రీలన్ ॥

అల్పాధిక వస్తువులకు వినిమయ మనఁగా మార్పిడి వర్ణింపఁ బడినచోఁ బరివృత్తి యగును. రాజు క్రేఁగంటిని నొక్క బాణము విడిచి యనఁగా మిక్కిలి తేలికగా విడిచి యని భావము. ఇట యల్పమగు శరము నొక్క దానిని విడిచి యధికములగు శత్రుసంపదలను గ్రహించి నట్లు వర్ణింపఁబడెను. మఱియును.

తే॥ గీ॥ అసువులను బాసి స్వర్గంబు - నధి వసించు
వృద్ధ గృధ్రపతికి వేల - పింప నేల ? ।
శిథిల దేహంబు వెచ్చించి - శీత భాను
భా సముజ్జ్వల కీర్తినిఁ - బడయు కతన ॥

జటాయువు వార్ధక్యముచే శిథిలమగు తన శరీరమునువిడిచి చంద్రకిరణములవలె స్వచ్ఛమగు గొప్పకీర్తినిఁ గొన్నట్లు చెప్పఁబడెను. కానఁ బరివృత్తి కలదు.

పరిసంఖ్యాలంకారము. 53.

కం॥ ఇల నడ్డి యొకట నొక్కటి
బలిమిని వేఱొకట నిలుపఁ - బరిసంఖ్య యగున్ ।
తిలకింపఁ దఱిగె దీపం
బుల స్నేహము యువతి చిత్త - ములఁ గాదట్టుల్ ॥

ఒకదానిని నొకచో నిషేధించి మఱియొకచో నిలుప ననఁగాఁ గలదని చెప్పినచో నది పరిసంఖ్య యగును. ఉత్తరార్థమునఁ బ్రభాత వర్ణనము. దీపముల స్నేహము తఱిగినది. యువతుల చిత్తమున నట్లు తఱుగ లేదు. ఇట స్నేహము తఱిగెనను విషయము యువతుల చిత్తమున నిషేధింపఁబడినది. దీపముల నిలుపఁ బడినది. దీపముల స్నేహమనఁ దైలమని యర్థము. చిత్తముల స్నేహమనఁ దమ ప్రియుల యందలి ప్రేమభావ మని యర్థము. మఱియును.

తే॥ గీ॥ యత్పురి విలాసినీ నయ - నోత్పలంబు ।
లుద్దవిడి శ్రుతి వర్త్మల - హద్దు మీఱె ।
ఏడ నౌర ! మహాకాల - చూడ నుండు
వన్నె చందురుఁడును బట్టె - వక్రిమంబు ॥

ఉజ్జయినీ పట్టణ వర్ణనము. ఏ పట్టణమున స్త్రీల నల్లకలువల వంటి కన్నులు శ్రుతిమార్గముల హద్దులను గూడ మీఱి వర్తించుచున్నవో. అనఁగా స్త్రీల కన్నులు దప్ప నింకెవ్వరు నట్లు మీఱి వర్తించుట లేదని యర్థము తోఁచుచున్నది. అట్లే ఏపట్టణమున మహాకాల నాథుని శిర మున నున్న చంద్రుఁడొక్కఁడే వక్రిమమును బట్టుచుండెనో. ఇతరు లెవ్వరు నట్లు వక్రిమమును బట్టలేదని నిషేధ మర్థసిద్ధ మగుచున్నది. ఇట నేత్రోత్పలముల పక్షమున శ్రుతివర్త్మల యొక్క హద్దులనఁ కర్ణాంతిక మార్గములని యర్థము. వానిని మీఱెనన నచ్చటి స్త్రీల యొక్క కండ్లు కర్ణాంతిక భాగముల నతిక్రమించినంత విశాలముగ నున్నవని తాత్పర్యము. పౌర జను లెవ్వరు శ్రుతి వర్త్మహద్దులను

మీాఱ లేదనఁగా వేద చోదిత మార్గముల నతిక్రమించి వర్తించుట లేదని తాత్పర్యము. అట్లే చంద్రుఁడు వక్రిమంబును బట్టెనన వంకరగ నుండెనని యర్థము. నగరవాసు లెవ్వరు దానిని బట్టలేదన వక్రి బుద్ధులను బొందుట లేదని యర్థము. ఇటు శ్లేషచే వచ్చిన యర్థ ద్వయమునకు నైక్య మధ్యవసింపఁబడెను. ఈ యుదాహరణమున మఱియొక చోటునఁ గాదనెడు నిషేధము శబ్దముచేఁ జెప్పఁబడకుండు టచే నర్థసిద్ధ మగుచున్నది. మొదటి యుదాహరణమున నట్టి నిషేధము కూడ శబ్దముచేఁ జెప్పఁబడుచున్నది. ఇది యే రెంటికి భేదము.

వి క ల్పా లం కా ర ము. 54.

కం॥ సమబల యుగళి విరోధము
కమనీయతఁ జెప్పనగు వి - కల్పము గృతులన్ ।
నమనము చాపములఁకొ శర
ణము శిరములకో కొనుండు - నరపతు లారా ! ॥

తుల్యబలముకల రెండు వస్తువులకు విరోధము ననఁగా సహభావము లేకుంటను జక్కఁగఁజెప్ప వికల్పమగును. రాజదూతలు శత్రురాజు లనుగూర్చి యిట్లుపల్కిరి. ఓ నరపతులారా ! ఈసమయమున మీాకు నీరెండింట నొక్కటియే శరణము. ఎట్లన ? మారాజునొద్ద శిరము ల్వాంచుటయొ లేక శరములఁబట్టి సమరము సల్పుటయొ. ఈరెండు నేక కాలమునఁ జరుగు పనులు గాకుంటచే నీరెంటికిని విరోధము గలదు. మఱియును.

ఆ॥ వె॥ నీల నీరదములు - నిలుచుండి వర్షించు
నెమ్ములార్చి పురుల - నృత్య మొందు ।
కాంతుఁడొండె ఖలకృ - తాంతుఁడొండెను నేడె
మరుని పీడనుండి - మఱలఁజేయు ॥

వర్షర్తువున విరహిణీ వచనము. ప్రియ సమాగమ మైనను లేక మర ణము సంభవించినను మరుని పీడ తొలఁగును. ఈరెండును బరస్పరము

విరుద్ధములగు కారణములు. ప్రియ సమాగమమైనచో మరణము సంభవింపదు. మరణమే సంభవించిన ప్రియ సమాగమము సంభవింపదు కాన నీ రెంటినిఁ గోరుకొనుటలో విరోధము కలదు.

### స ము చ్చ యా ల ం కా ర ము. ౫౫.

కం॥ యుగపద్భావితములను బ
హు గణితముగఁ జెప్ప నగు స - ముచ్చయ మిల నీ।
పగతురు చత్తురు పాఱుదు
రగురా! వణకుదురు భీతి -నవనిన్ నృపతీ!॥

విరోధము లేకుంటచే బహుకార్యములను నొక్కమారు సంభవించి నటులు వర్ణించినచో సముచ్చయమగును. ఇట చచ్చుట మున్నగు కార్యములకుఁ బరస్పర విరోధము లేకుంటచే రణమున రాజశత్రువులకు నీకార్యములు గొద్దికొద్ది వ్యవధానములోఁ గల్గినను ఆవ్యవధానము తెలియకుండుటచే నొక్కమాఱే కల్గినటులు వర్ణింపఁబడెను. మఱియు.

చం॥ వినుమిటు వన్నెకాఁడ! మదిఁ-బ్రేముడియున్ ములుకీవు నాటయా
వన నవసౌధ మాపె యెడ - బాటున సోలుచు నేమి సేసెనో।
కొనఁబడు సెజ్జఁ జిక్కు నుడు-కున్ బలవించును వాడు వందురున్
దొనఁకుఁ దిరుంగుఁ దొట్రిలు గ-నుంగొను శూన్యతఁ జేష్ట దక్కెడున్

ఒకదూతి నాయకునితో నాయికా విరహతాపమును జెప్పుచున్నది. ఇట పైక్రియలకుఁ గొలదిగ కాలవ్యవధాన మున్నను నది తెలియ నంతగ నుండుటచే నాక్రియలన్నియు నొక్కమాఱే సంభవించి నటులు వర్ణింపఁ బడెను. దీనిచేఁ గాంతా విరహాతిశయము వ్యక్తమగుచున్నది. దొంతిగ నమర్చి యున్న తామర పూరేకులను నొక్కమాఱు గుచ్చినచో నాదింపఁపడిన సూది యొక రేకునకుఁ బిమ్మట మఱియొక రేకును గుచ్చి కొనినను గాలభేదమును దెలియకుంటచే నొక్క మాఱే గ్రుచ్చు కొని నట్లు తోఁచును. అట్లే ప్రస్తుతమునఁ గూడఁ దెలియవలెను.

## సముచ్చయాలంకారము. II

కం॥ ఒకపని పలువుం డ్రిహమహ
మికఁ జేయుటగూడఁ గవిస - మితి నటులగు ను।
చ్చకులము రూపము వయసు న
ధిక విద్య ధనంబు వానిఁ - దిమిరించుఁ గడున్ ॥

కార్యసిద్ధికి నొకసాధనమే సమర్థమగుచుండ బహుసాధనములు పూని కతో సహాయమొనరించి నటులు వర్ణించినచో సముచ్చయమగును. గర్వకారణము సత్కుల మొక్కటే యగుచుండ రూపము మున్నగు వానినిఁగూడఁ బూనికతోఁ గార్యసిద్ధిలో సహాయము లగుచున్నట్లు చెప్పియున్నాఁడు. మఱియును.

చం॥ తెలియఁగరాని యీావి, యతి - ఘం దగ నాదరణంబుసేఁత, పె
న్కలిమిని దర్పమొందమి, ప-గన్ గొని యొండుల దూరకుంట, దాఁ
దెలుపమి మేలొనర్చియును, - దెల్పుట యొద్దుల మేలు వెల్లడిన్,
గొలుచుట విద్యలన్, దెలుపుఁ - గుంభిని మానవు నాభిజాత్యమున్॥

ఉత్తమ కుల సంభూతిని సూచించుటకుఁ బై కారణములలో నొక్కటియే చాలియుండినను బహు విషయములు కారణములుగా ఖలేకపోతన్యాయముచేఁ బ్రసక్తములగుచున్నవి. ఖలేకపోత న్యాయమనఁగా ధాన్యము గింజలను దీసికొనుటకుఁ గళ్లములోఁ బఱులొక్కమాఱుగనే నెట్టుకొనుచు వ్రాలునట్టు.

## కారకదీపకాలంకారము. 56.

కం॥ కారక దీపక మగు నొక
కారక మొక క్రియము వస్తు - గతముగఁ దెలుపన్ ।
దూరము వోవును దెరువరి
చేరఁగ వచ్చెడును జూచుఁ - జెంగట నడుగున్ ॥

ఒక కర్తృకారకమును గ్రియా రూప వస్తువులకు సంబంధింపఁజేసినచో నది కారకదీపకమగును. బాటసారి దూరము వోవును దారి తెలియక

తిరిగివచ్చును. వచ్చి పథిసరమును జూచును. చూచి దగ్గఱకుఁ జేరును. చేరి మార్గమును బ్రశ్నించును. త్రోవఁదప్పిన బాటసారి పనులివి. వీనికొక వరుస చెప్పఁబడినది. మఱియు నీక్రియలన్నిఁటికి బాటసారి యొక్కఁడే కర్తృకారకముగఁ జెప్పఁబడినాఁడు. మఱియును.

ఉ॥ కూరుకుఁ గ్రుంగు మెక్కుఁ దిరు - గున్ గుసులాడుచు రాణివాసమం
దారయనుండుఁ బాచికల - నాడుఁ గనం దఱిగాదు పెండిర ।
మ్మారసి, పొమ్మటంచు ఫణి - హారులు జేఁపులవాకిటన్ మమున్
దారునఁ ద్రోతురమ్మ నయ - నమ్ముకొనన్ గనుమమ్మ శ్రీసతీ ! ॥

ప్రభుదర్శనమునకుఁ బోయిచుట ద్వారపాలకులచే నడ్డగింపఁబడిన కవి నిర్వేదవాక్యములు. ప్రభువు నిద్రించుచున్నాఁడుకాన దర్శనమునకు సమయము గాదు. సమయమరసి రమ్ము పొమ్మని ద్వారపాలకు లడ్డుకొనిరి, తిరిగి మఱియొకతఱిఁ బోవ స్నానము చేయుచున్నారనియు, మఱొకమారు భోజనము చేయుచున్నారనియు నట్లే పాదచారము చేయుచున్నారనియు. జుట్టు నాఱఁ బెట్టుకొనుచున్నారు. అంతఃపురములో నున్నాఁడు. పాచికలాడుచున్నాఁడని యీరీతిగ నెన్నిమాఱులు పోయిన నన్నిమాఱులును నిట్లే తటాలునఁ ద్రోయుచున్నారు కాన నోలక్ష్మీ మాదారిద్ర్యము దీర్పుమని కవియొకఁడు లక్ష్మిని బ్రార్థించుచున్నాఁడు, మొదటి యుదాహరణమున బాటసారి యనెడు కర్త పద్యములో వాచ్యముగనుండెను. ఇట ప్రభువనెడు కర్తృకారకము పద్యమున వాచ్యముగ లేదు. కాని గమ్యమగుచుండెను. అట్టి కర్తకు నిద్రించుట మున్నగు బహుక్రియలతో నన్వయము చెప్పఁబడెను. మఱియు నిద్ర స్నానము భోజనము మున్నగు క్రియలకు నొక క్రియమును గూడఁ గలదు. ఈకారకదీపకము ప్రథమ సముచ్చయమునకు విపరీతముగనున్నది.

### స మా ధ్య ల ం కా ర ము. 57.

కం॥ పెరకారణ మొలయంగ సు
కరమైనన్ గార్యమెన్నఁ - గ సమాధి యగున్ ।

తరుణి తనరమణుఁ గలియఁగఁ

బోరిఁబోరి నుబలాట మొందెఁ - బ్రొద్దును గ్రుంకెన్ ॥

తలఁచిన కార్యమునకుఁ గారణాంతరము సంభవించుటచే నాకార్యసిద్ధి సుకరమగుచో సమాధి యగును. సమాధియనఁగాఁ జక్కఁగఁ గార్య సంధానము చేయఁబడినదను నర్థముచే నీనామము సార్థకము. రమణునిఁ గలియ నుబలాటపడు రమణికి సూర్యాస్తమయ మగుట కార్యము వేగమే సిద్ధించుటకు సాయపడుచున్నది. మఱియును.

ఆ॥ వె॥ ఆపెయల్క దీర్ప - నాసను నేనాపె

చరణములను బడఁగ - నరయునంత ।

దైవగతినిఁ జేసి - తద్దయు నీరదుం

(శ్రుతి) డడర నుఱిమె మేల - దట్టె చేసె ॥

సమాధ్యలంకారము ద్వితీయ సముచ్చయమునకు విపరీతముగనున్నది. సముచ్చయాలంకారమున వేఱువేఱుగఁ గార్యసాధకములగు పెక్కు వస్తువులకు ఖలేకపోత న్యాయముచేత నొక్కమాఱు కార్యసాధనము నకై సమావేశము చెప్పఁబడును. సమాధ్యలంకారమున నొకహేతువు కార్యమును సాధించుచుండఁగాఁ దలఁపని తలఁపుగ మఱియొకహేతువు సంఘటించి యాకార్యము సుకరమగునట్లు చెప్పఁబడును. కాంతకుఁ దన ప్రియునిఁ గూడవలెననెడు తలంపే యాకార్యసిద్ధికిఁ బ్రబలమగు కారణమగుచుండఁగా నంధకారమునకుఁ గారణమగు సూర్యాస్త మయము కొద్దిగ సహాయపడుచున్నది. రెండవ పద్యమునఁ గాంత యొక్క కోపము తీర్చుటకు నాపె పాదములఁ బడుటయే ప్రధాన కారణము కాఁగాఁ దలఁపని తలంపుగ సంభవించిన ఘనగర్జితము కార్యము శీఘ్రముగ సిద్ధించుటకుఁ దోడ్పడినది.

## ప్ర త్య నీ కా లం కా ర ము. 58

కం॥ బలవద్రిపు పక్షంబున

నిలుపఁ బరాక్రమము ప్రత్య - నీకము, దన్నుం ।

గెలిచిన కండ్లను డాయు చె
వులఁ దొ్రక్కను నల్లకలువ – పొలుపు చెలంగన్ ॥

బలవంతుఁడగు శత్రువును నెదిరింపఁజాలక యతని పక్షమున నున్న వానిపై పరాక్రమము చూపుట ప్రత్యనీకము.

కండ్లు నీటులో నల్లగలువలను గెల్చినవి. అట్టి కండ్లను నెదిరింపఁ జాలక నల్లగలువ కండ్లప్రక్కనున్న యనఁగా దానికి దగ్గఱనున్న యని యును దానినాశ్రయించియున్న యనియు నర్థము. అట్టి చెవినిఁ ద్రొక్కు చున్నది. ఒక సుందరి తన చెవిలో ధరించిన నీలోత్పలమును జూచి యొక కవి యిట్లు చమత్కరించినాఁడు. మఱియును.

తే॥ గీ॥ నాదురూపంబు గీరితి – నాశ మొందఁ
జేయువానిని నాత్మలోఁ – జేరఁ దీయు।
నీపె యంచును నీమీఁది – యీర్ష్య చేత
వోలె మరుఁడాపెఁ గాఱించు – జాలి దొఱఁగి ॥

దూతి నాయకునితో నిట్లు చెప్పుచున్నది. ఓయీ! నీవు రూపమున మన్మథుని జయించితివి. అతఁడు నిన్ను నెదిరింపలేక నీయందు మనస్సు నుంచి నిన్నుగొల్చుచున్న నాచెలిని బాధించుచున్నాఁడని. ఇట యీర్ష్యచేతవోలె ననుచోట హేతూత్ప్రేక్ష కలదు. కాని యిది ప్రధానమగు నలంకారముకాదు. మఱియేమన ? ఈర్ష్యను హేతువుగాఁ దీసికొని తనకు శత్రువగు నాయకుని జయింపలేక యతని సంబంధిని యగు నాయికను మన్మథుఁడు పీడించునట్లు చెప్పుటచేఁ బ్రత్యనీకమే ప్రధానమును జమత్కారియు నగుచున్నది.

శత్రుపక్షమువానిని బాధించునపుడు సంభవించు నలంకారము సాక్షాత్తుగా శత్రువునే బాధించుటలో విశేషముంటచేఁ గైముతిక న్యాయముచే నచ్చటఁగూడఁ బ్రవర్తించును. ఎట్లన ?

తే॥ గీ॥ స్వీయ మద్య ప్రపాబ్జంబు – మూయు కతనఁ
గినుక చెందిన మధుపౌఘ – మొనరఁ గూడి ।

అల సుధాంశుని బింబంబు - నాక్రమించి
యతని నిక్కముగాఁ గళం - కితునిఁ జేయు ॥

చంద్రుని కలంకమును వర్ణించుచున్నాఁడు. తుమ్మెదలు తమకు మద్యశాలయగు పద్మమును మూయుటచేఁ గినిసి యతని బింబము నాక్రమించి యతనికిఁ గళంకమును బుట్టించుచున్నవా? ఏమి. పానీయశాలను మూయు వారికి నపయశస్సు కల్గునుగాన నిది తగునని భావము.

✓ కావ్యార్థాపత్తి - అలంకారము. 59.

కం॥ కావ్యార్థాపత్తి సుధీ
సేవ్యము కైముత్య మర్థ - సిద్ధినిఁ గూర్పన్ ।
భవ్య భవదాస్య నిర్జితుఁ
డై వ్యథ నాయిందువొంద - నబ్జము లేమా ॥

కైముత్యన్యాయముచే నర్థముసిద్ధింపఁ గావ్యార్థాపత్తి యగును.

ఆ యిందువనఁగాఁ బద్మములను లీలగ జయించినవాఁడని భావము. ఓరాజా! యతఁడే నీముఖముచే జయింపఁబడి వ్యథనొందు నపుడు పద్మములు జయింపఁ బడకుండునా? దండాపూపికా న్యాయముచే నితరమగు నర్థము సిద్ధింపదానిని శాస్త్రమున నర్థాపత్తి యందురు. ఆ న్యాయము మూలముగాఁ గలదగుటచే నీయలంకారము నకుఁ గావ్యార్థాపత్తి యనుపేరు వచ్చినది.

దండాపూపికా న్యాయమనఁగా నొకకఱ్ఱకుఁ జివర నప్పముల మూటగట్టి నిలబెట్టిరి. ఎలుక యాకఱ్ఱను గొఱికినది. గట్టిదగు కఱ్ఱను గొఱికిన యెలుక మెత్తని యప్పములను దప్పక కొఱక కలదనెడు యర్థము తోఁచుచున్నది. కైముతికన్యాయమనఁగా నొక కఠినమగు కార్యము చేయఁబడినపుడు దానికన్న సున్నితమగు పని నెఱవేర్చుట కష్టముకాదని తెల్పుట. కిముతయనఁగా నదియెంతపని యని యర్థము. కిముతపద నిష్పన్నము కైముతికపదము. మఱియును.

ఆ॥ వె॥ తెలియ బంధుజీవ - దీప్తిని వన్నెచే
నట్టె తీయు చంచ - లాక్షి మోవి ।

అన్య జీవదీప్తి - హరియించు నంటలోఁ
గలదె యద్భుతంబు - దలఁచి జూడ ॥

బంధుజీవమనఁగా మంకెనపువ్వు. చంచలాక్షి మోవి మంకెనపూవు యొక్క కాంతినిఁ దనకాంతిచేఁ దీయుచున్నది. అనఁగా దానినిఁ బోలుచున్నదని యర్థము. బంధువులయొక్క జీవమునుగూడఁ దీయుచున్నదని యర్థమును గూడఁ దెలియఁదగు. అట్టి మోవి యితరుల జీవమును దీయకుండునా ? దానినిఁ జూచి యువకులు పరవశులై చేష్ట దొఱఁగి యున్నారని భావము.

తే॥ గీ॥ స్వీయ హృదయంబు భేదించి - చెన్ను మీఱ
నుబికి నీల్గెడు నాపెప - యోధరముల !
కొరుల హృదయంబు భేదించు - నుద్యమమున
నెటులు నక్కటికమును బొం - దుఁట ఘటించు ॥

తన యక్కునే భేదించుకొని వచ్చి సిగ్గులేక నిల్లునట్టి యాపె పయోధరములకుఁ బరుల హృదయమును బ్రద్దలుచేయుటలో జాలిపుట్టుట యెట్లు? దానినిఁ జూచిన యువకుల హృదయములలో ధైర్యము తొలఁగుచున్నదని భావము.

కావ్యలింగ - అలంకారము. 60.

కం॥ కృతిఁ గావ్యలింగ మర్థం
బతను సమర్థనము గోర - నది సమకూర్పన్ ।
జితుఁడవు కందర్పుఁడ ! సం
తతము త్రినేత్రుండు నిలుచు - నాడెందమునన్ ॥

సమర్థనముగోరు నర్థమును సమర్థింపఁ గావ్యలింగమగును.

మన్మథుఁడా! జయింపఁబడితివి. నాడెందమున నవలాక్షుండు కలఁడు. కందర్పజయము దుష్కరము. దానిని సమర్థింప నతనిఁగాల్చిన త్రినేత్రుఁడు మనమున నున్నాఁడని చెప్పఁబడెను.

నైయాయికాభిమతమగు వ్యాప్తి పక్షధర్మతాదులతోఁ గూడిన లింగమునకు నలంకారత లేదనుటకుఁ గావ్యవిశేషణము చెప్పఁబడెను.

పదార్థ హేతుకమనియు వాక్యార్థ హేతుకమనియును గావ్యలింగము రెండు తెఱంగులు. పై యుదాహరణమున త్రినేత్రుఁడు నాడెందమున నిలుచుననెడు వాక్యార్థము సమర్థకముగాన నిది వాక్యార్థ హేతుకము.

పదార్థ హేతుక మెట్లన ?

శా॥ మోదంబుండుము భస్మపేటి! సుఖము-ప్పొంగంగ రుద్రాక్షమా
లా! దుర్గాపతి సౌధభూషణమ! హే - లన్ గ్రాలు సోపానమా!
మాదా భక్తికి మెచ్చి శంకరుఁడు యు - ష్మత్సంగ సంజాత సం
మోద ధ్వంసకమైన మోక్షమును సం - మోహంబునన్ ద్రోసెడున్॥

కైవల్యోన్ముఖుఁడగు శివభక్తుని వాక్యము. అతని కింతవఱకు భస్మపేటిక, రుద్రాక్షమాల, శివాలయసోపానమును జిరపరిచితములు. శివప్రసాదముచే నతఁడు మోక్షమునొందనుండి పై వస్తువులకు వీడ్కోలిచ్చుచున్నాఁడు. ఇట మోహధ్వంసకమగు మోక్షమును మోహమనుట యుక్తముగాదు. అట్లనుటచే దానిని సమర్థింపవలసి యున్నది. అందులకై మోక్షమునకు యుష్మత్సంగ సంజాత మోదధ్వంసకమనెడు విశేషణమును గవి కూర్చినాఁడు. పై వస్తువుల సంగమముచే వచ్చెడు నానందమును ధ్వంసమొనర్చుటచే మోక్షమును మోహమునుగా శివభక్తుఁడు వ్యవహరించినాఁడు. పై విశేషణము పదరూపమున నుంటచే నిది పదార్థ హేతుకము.

కొండొకచోఁ బదార్థవాక్యార్థములు రెండును బరస్పరాపేక్ష కలిగి మఱియొక వస్తుసిద్ధికి హేతువులగును. ఎట్లన ?

తే॥ గీ॥ చికురజాల మదెంతో వా - సికిఁ దనర్చు
విదుషి దమయన్తి నెత్తిని - వేనిఁ దాల్చుఁ
బశువుగూడను మూడిన - వ్వాలకుఁ ద్రోయు
చామరంబున దానికి - సమత దగునె ?॥

విదుషి నెత్తినిఁ దాల్చిన కేశజాలమునకుఁ బశువుగూడఁ దన పృష్ఠభాగముచేఁ ద్రోసెడు చామరముతోఁ బోలిక చెప్పఁదగదు.

ఇట విదుషియగు భైమి నెత్తినిఁ బాల్చుననునది వాక్యరూప ములో నున్నది. మూఁడిదోయి యనునది చామరమునకు విశేష ణముగ నున్న ~~[illegible]~~పదము. ఈవాక్యార్థపదార్థములు రెండును గలిసియే సామ్యాభావములో హేతువులగుచున్నవి.

కొన్నిచోటుల సమర్థనీయార్థమును వాక్యార్థము సమర్థించు చుండ నావాక్యార్థమును మఱియొకపదార్థము సమర్థించుటయును గలదు. ఎట్లన ?

శా॥ జన్మంబెత్తు కతంబునన్ దలఁతునో – సర్వేశ ! యొక్కింత ప్రా
గ్జన్మంబందునఁ జేయనైతిఁ దగఁ బూ – జల్ నీకు నేనంచు నెం ।
చన్ముక్తుండను నిప్పుడర్చనలఁ గాం – చన్ బోను జన్మంబు యి
మ్మన్నాన్యార్చన గల్గఁబోదు కద ! దో – షప్రాంప్య మిట్లోప్పునా ॥

ఇట రెండు తప్పులు సమర్థింపవలసి యున్నవి. పూర్వజన్మ మున · శివునర్చింపకుంట యొకటి. భావిజన్మమున నర్చింప లేకుంట యొకటి. తొలి తప్పును సమర్థించుటకు "ప్రాగ్జన్మంబందునం జేయ నైతిఁ బూజల్" అను వాక్యార్థమునఁ బూర్వజన్మానుమానమును హేతువునుగాఁ జూపినాఁడు. రెండవ తప్పును సమర్థించుటకు "ఇప్పు డర్చనల ముక్తుండనగుటచే ముందు జన్మము గలుగఁబోదు" అను వాక్యార్థమున నుత్తర జన్మానుమానము హేతువుగాఁ గైకొనఁ బడినది. తిరిగి జన్మమెత్తకుండుటకు "ముక్తుండ" ననెడు పదార్థము హేతువుగాఁ జెప్పఁబడినది. ముక్తునకు నిఁక జన్మముకలుగదు కదా ?

కొన్నితావులఁ బరస్పరవిరుద్ధములగు రెండు సమర్థనీయములగు నర్థములకు సమర్థకముల రెంటిని వరుసగ స్వీకరించుటయును గలదు. ఎట్లన ?

ఉ॥ ఆ నగరాజపుత్రి తప – మాత్మఁ గలంపఁ బదీయ ముగ్ధ భా
వానుగ రమ్యభాషణ ర – సాధికతన్ విషలేక యుంటఁ, దాఁ ।
బూనిన మాఱువేసమును – బుచ్చఁగ వేగిరపాటు బాగునన్
దోనఁ బెనంగ డెందమురిఁ – దూగెడు మారహరుండు గాచుతన్ ॥

బ్రహ్మచారి వేషమును ధరించివచ్చిన శంకరుఁడు పార్వతి యుగ్ర తపస్సును జూడలేక తన మాఱువేసమును దొలగింపవలె ననియును అట్లే యామె సంభాషణములందలి ముగ్ధభావములను విడువలేకుంటచే నావేసమును దొలఁగింప రాదనియునీ విరుద్ధభావముల నురిఁ దూఁగు చున్నాఁడు. ఇట రెండు విరుద్ధక్రియలకు సమర్థకములుగ రెండు హేతువులు గ్రమముగ గ్రహింపఁబడినవి. మాఱువేసమును తీసివేయ వేగిరపాటునకుఁ దపమాత్మఁగలంచుటయును జాగునకు నామె రమ్య భాషణ రసాధికతయును హేతువులగుచున్నవి.

కొన్నితావుల పరస్పరవిరుద్ధవస్తువులకు రెంటికిని సమర్థకముగా నొక్క హేతువే గ్రహింపఁబడును. ఎట్లన ?

ఆ॥ వె॥ కడలికూతు మోవిఁ - గను లరమోడ్పుగాఁ
గ్రోలుచుండి 'కడలిఁ - గూయఁ ద్రచ్చు!
టార సఫలమంచు - నారయ విఫలమం'
చెంచు వెన్నుఁ డధిగ - మించు జయము ॥

మహావిష్ణువు కడలిని మోత్రవెట్టునట్లు శ్రమించి మథించుట యొక విధముగ సఫలమనియును నొకవిధముగ విఫలమనియును దలఁచెను. ఈరెండింటఁ గడలి కూతురగు లక్ష్మియొక్క మోవిని గ్రోలుట యొక దానినే హేతువుగఁ దెల్పినాఁడు.

లక్ష్మి మోవిని గ్రోలుట యనెడు మహోత్సవము సంప్రాప్తమగుటచే సఫలమనియును మోవికన్న నమృతము దక్కువగుటచే విఫలమని యును దాత్పర్యము.

జయదేవుఁడు శ్లేషమనెడు కావ్యగుణమునకు లక్షణమును

కం॥ పొందిక నొందని యర్థము
నొందింపఁగఁ బొందు శ్లేష - ముపపన్న మగున్ ॥

అని చెప్పియున్నాఁడు. సంభవము కాని యర్థమును సంభవింపఁ జేయు టయని దానియర్థము. ఈశ్లేషగుణమున కీపద్య ముదాహరణముగ నిచ్చియున్నాఁడు. ఎట్లన ?

శా॥ ఓగోదావరి! యీకళింగకవి నీ - యొడ్డుం దగంజేరి నై
రాగావాప్తిని దేశవర్తన సఖన్ - బ్రాహ్మీసతిన్ డించె వే।
వేగఁ వారిధివారి సుప్తహరి నా - భీ తోయ జాతాసనున్
సాగన్ బ్రహ్మను గూర్చు మీపె ధరణిన్ - వర్తిల్లు నెట్లొంటిమై॥

విరక్తుఁడై కళింగకవి గోదావరీ నదియొడ్డున విడిచిన సరస్వతిని సముద్ర మధ్యమునఁ బరుండియున్న విష్ణువుయొక్క నాభీ కమలమందున్న బ్రహ్మను జేర్చుమని పద్యార్థము. గోదావరినది వాణీసతిని బ్రహ్మను జేర్చుటయనెడు నర్థమునకుఁ బొందికలేదు. పొందిక గూర్చుటకు వారిధివారిసుప్త-తోయజాతాసనున్ అను బ్రహ్మవిశేషణము చెప్పఁబడినది. నది సముద్రగామిని యగునుగాన నది సంభవించునని యతని యాశయము.

కాని యీపద్యమునఁ గావ్యలింగముకన్న భేదము కన్పడకుంటచేఁ బదార్థహేతుక కావ్యలింగమే కాని యన్యము కాదు.

పరికరాలంకారమునకును గావ్యలింగాలంకారమునకును సామ్యముకలదు. ఎట్లన? పరికరమునఁ బదార్థవాక్యార్థములు సాభిప్రాయముగ నుండును. కావ్యలింగమున నవి హేతుభావము నొందును గాన. దీనికి సమాధాన మెట్లన?

పరికరమున విశేషణముగా (అప్రధానముగా) గ్రహింపఁబడిన పదార్థవాక్యార్థములు వ్యంగ్యార్థమొకదానిని స్ఫురింపఁజేయును. ఆ వ్యంగ్యార్థము మఱియొక్క వాచ్యార్థమునకు శోభాధాయకమగును. కావ్యలింగమున నట్టులుకాక పదార్థవాక్యార్థములు వ్యంగ్యాంతరాపేక్షలేక స్వయముగనే మఱియొక వాచ్యార్థము సిద్ధించుటకు హేతువులగును. ఇది రెండింటికి భేదము. ఈభేదమునకు వివరణమెట్లన?

'హేయతరవస్తునిలయము' అను పరికరోదాహరణమున విశేషణములచే శరీరము నీచమగుటచే రక్షింపఁదగినది కాదనెడు నర్థము వ్యంగ్యమగుచున్నది. అది దుష్టులు దానినిఁ బోషించుటకై పాపకర్మల

నాచరింతురను వాచ్యార్థసిద్ధికి హేతువగుచున్నది. అట్లే 'శత్రులను వేర్వరింప' ననెడు వాక్యార్థపరికరమున నేను వ్యాసుఁడనుగాను మున్నగు వ్యంగ్యార్థము భాసించి యదియే రాజగుణముల నెన్నఁజాల కుండుట యనెడు వాచ్యసిద్ధికి హేతువగుచున్నది.

దీని సారాంశమేమనిన ? పరికరాలంకారమున వాచ్యములగు వాక్యార్థపదార్థములు వ్యంగ్యార్థమొకదానిని స్ఫురింపఁజేసి తద్ద్వారా వాచ్యసిద్ధిని గూర్చి సాధకము లగుచున్నవి కాని స్వయముగఁ గావని తేలినది.. మఱి

'యుష్మత్సంగసంజాతసంమోదధ్వంసకమ' నెడు పదార్థహేతుక కావ్యలింగమున వ్యంగ్యార్థసంపర్క మెంతమాత్రము సంభవింపదు. అట్లే 'జన్మంబెత్తుకతంబునన్' అను వాక్యార్థహేతుక కావ్యలింగమునఁ గూడ వ్యంగ్యార్థసంపర్క మెంతమాత్రమును లేకుంటచే వాక్యార్థ పదార్థములు సాక్షాత్తుగాఁ గావ్యలింగమున వాచ్యార్థసమర్థకము లగుచున్నవి. కాన నిట్లు కావ్యలింగ పరికరములకు భేదము స్పష్టమని.

కొన్ని కావ్యలింగోదాహరణముల వ్యంగ్యార్థస్ఫురణము గూడఁ గలదు. కాని యట్టితావుల నావ్యంగ్యార్థము స్వయముగ సమర్థనీయార్థ సిద్ధికి సాధనము గాదు. మఱి యేమనినఁ బదార్థవాక్యార్థములు స్వయము ముగనే యట్టి యర్థసిద్ధికి సాధనము లగుచున్నవి. అచ్చటి వ్యంగ్యార్థ మన్నఁనో యాపదార్థవాక్యార్థములకు సమర్థనీయార్థసాధనమున సహా యమొనరించుచున్నది. ఎట్లన ?

'చికురజాల మదెంతో వాసికిఁదనర్చు' ననెడు పదార్థహేతుక కావ్యలింగోదాహరణమున విదుషియను పదమునకుఁ బ్రీతిగఁజెప్పఁ బడుటచేఁ బశువుచేత ననునది వివేకశూన్యమగు ననెడు వ్యంగ్యార్థము కలది. అట్లే త్రిలోచనుఁడుండె నాచిత్తమునన్ అనెడు వాక్యార్థహే తుక కావ్యలింగోదాహరణమునఁగూడఁ ద్రిలోచనపదము కందర్పుని దహింపఁజేసిన వాఁడనెడు వ్యంగ్యార్థము కలది. పై వ్యంగ్యార్థములు

రెండును క్రమముగ దమయంతీ కేశపాశమునకుఁ జామరముతో సామ్యము లేకుండుటలోను కందర్పుని జయించుటలోను నుపయోగించుచున్నవి. అట్లయ్యును బైయుదాహరణముల రెంటను బరికరమే యనుట తగదు. మఱియే మన వ్యంగ్యమగునవివేకిత్వముతోఁ గూడుకొనిన పశువుచే మూఁడిఁ ద్రోయఁబడుటయను పదార్థమే పై సామ్యాభావములో హేతువగుచున్నది. కాని కేవల మవివేకిత్వమనెడు వ్యంగ్యార్థము కాదు. అట్లే త్రిలోచనుఁడను నుదాహరణమునను గందర్పదాహకమగు తృతీయలోచనము గలశివుఁడు నాహృదయమున నుండెననెడు వాక్యార్థమే కందర్పజయములో హేతువగుచున్నదని తెలియఁదగు.

ఈరీతిగ వ్యంగ్యార్థములు పదార్థవాక్యార్థములకు హేతుభావములో సాధకములగుటచేఁ బరికరము కావ్యలింగమున కంగమగుచున్నది కాని ప్రధానముకాదు.

ఓయీ! ఇచ్చట వ్యంగ్యార్థము కావ్యలింగమును సమర్థించుచున్న దంటివి. ఈరీతిగ సమర్థనీయమగు నర్థాంతరమును సమర్థించు కావ్యలింగమునకు మఱియొక సమర్థకమును జూపునట్టి ప్రసిద్ధోదాహరణమే దైనగలదా? యని శంకింతురేని దానికి సమాధాన మెట్లన?

౧౧ 'నీటన్ మున్గెఁ ద్వదక్షితుల్యరుచులీనీలోత్పలంబుల్' అను పద్యము లోఁగడఁ బ్రతీపాలంకారమునకు నుదాహరణముగా నీయఁబడినది. అచ్చట ననేక వాక్యార్థ హేతుకమగు కావ్యలింగము గూడఁగలదు. అట తొలి మూడుపాదములయందలి వాక్యార్థములు కాంతా సాదృశ్య వినోదమును గూడ దైవము సహించుట లేదనెడు నాల్గవపాదము యొక్క యర్థమును సమర్థించుచున్నవికదా? ఆ పాదత్రయమందలి వాక్యార్థములలోని త్వదక్షితుల్యరుచులు, నీదు ముఖతుల్యశ్రీప్రియుండు, త్వద్గతోపమగతిన్ శోభిల్లు ననెడు విశేషణరూపమగు పదార్థములు లేకున్నచో మిగిలిన వాక్యార్థములు కేవలము చతుర్థపాదార్థమును సమర్థింపలేవుకదా?

కానఁ బై విశేషణరూపపదార్థములు వాక్యార్థములకు సమర్థన రూపకార్యమున హేతువు లగుటలో సాధనము లగుచున్నవి.

దీనిచేఁ బదార్థహేతుక కావ్యలింగము వాక్యార్థహేతుక కావ్యలింగమునకు నంగమగుచున్నదని తేలినది.

ఈరీతిగనే పైయుదాహరణముల రెండింటను పరికరము కావ్యలింగమునకు నంగమగుటచే నట పరికరోత్థాపిత కావ్యలింగమని తెలియవలెను.

## అర్థాంతరన్యాసాలంకారము. 61.

General

కం॥ కన సామాన్య విశేషము Particular

లను నర్థాంతరపు న్యాస - మగు నాపేరన్ ।

హనుమంతుఁ డబ్ధి దాఁటె ని

లను దుష్కరమేది మహాత్ము - లకుఁ బరికింపన్ ॥

సామాన్య విశేషములనెడు నర్థాంతరముయొక్క న్యాస మాపేరనే యనఁగా నర్థాంతరన్యాసమనెడు పేరనే వ్యవహరింపఁబడు. ఈసామాన్య విశేషములలో నొక్కటి మఱొక్కదానిచే సమర్థింపఁబడును. అనఁగా విశేషపదార్థము సామాన్య పదార్థముచేతను, సామాన్యపదార్థము విశేష పదార్థముచేతను సమర్థింపఁబడునని యర్థము. సమర్థ్య సమర్థకముల రెంటిలో నొకటి ప్రస్తుతమును రెండవది యప్రస్తుతము నగును.

హనుమంతుఁ డబ్ధిదాఁటె ననెడు వాక్యము విశేష వాక్యము. దానిని సమర్థించుటకై యిలలో మహాత్ములకు దుష్కరమేది కల దనెడు సామాన్యవాక్యము చెప్పఁబడినది. కాన నిట సామాన్యముచే విశేషమును సమర్థించుట యనెడు నర్థాంతరన్యాసాలంకారము.

విశేషముచే సామాన్య సమర్థన రూపమగు నర్థాంతరన్యాస మెట్లన ?

కం॥ పొందుగ గుణవద్వస్తువు

నొందిన యల్పార్థమదియు - నొందును ఘనతన్ ।

సుందర సుగంధి సుమ మా
లం దగిలెడు సూత్రమును ద - లను దాల్పఁబడున్ ॥

గుణవద్వస్తువుతో సంసర్గముకల యల్ప వస్తువుగూడ గౌరవముఁ బొందును. ఈవాక్యము సామాన్యము. ఇది యుత్తరార్ధమందలి విశేష వాక్యముచే సమర్థింపఁబడినది.

ఇటశ్లోక సంశయము. అర్థాంతరన్యాసము కావ్యలింగముకన్న వేఱగు నలంకారము కాదని. ఎట్లన ? అర్థాంతరన్యాసాలంకారమున నప్రస్తుతార్థములగు సామాన్యవిశేషములు రెండును బ్రస్తుతార్థములగు విశేషసామాన్యముల కెట్లుపకరించునని విచారింపవలసియున్నది. ప్రస్తుతార్థమున కుపకరింపని యప్రకృతార్థ కథనము తగదుగాన.

అప్రస్తుత ప్రశంసలోవలె నిచ్చటఁగూడ నప్రస్తుతములగు సామాన్యవిశేషములు ప్రస్తుతార్థములను స్ఫురింపఁజేయుట కుపకరింప వచ్చుననుటకును వీలులేదు. ఇట ప్రస్తుతార్థములుగూడ స్వశబ్దముచే గ్రహింపఁబడినవి కాఁబట్టి.

అనుమానాలంకారములోవలెఁ బ్రస్తుతార్థప్రతీతినిఁ గలుగఁజేయుట కుపకరించు నని చెప్పుటకును, వీలుకాదు. అచ్చటవలె నిచ్చట వ్యాప్తిపక్షధర్మ తాదులు లేకుంటచే.

దృష్టాంతములోవలె నుపమానముగ నన్వయించుటకును వీలు లేదు. దృష్టాంతమున నప్రస్తుతార్థమును నుపమానముగఁ జెప్పిన యుదాహరణమును జూపుచున్నాఁడు.

ఆ॥ వె॥ వీరకోప కరము - విస్రబ్ధ ఘాత దో
షంబు ఖలుని కిల వి - శసన కరము
పంచవక్త్ర సుప్తి - భంజి యైదంతికి
వనమహీజ భంగ - నినద మట్లు ॥

విశ్వసించినవానికి ద్రోహముచే యరాదు. అట్లు చేసినచో తటస్థుఁడగు వీరునకుఁ గోపము పుట్టును. దాన ద్రోహినశించునుఎట్లన ? వన

గజము వన్యవృక్షమును విఱువ నాధ్వనిచే గుహాలో నిద్రించుచున్న సింహామునకు నిద్రాభంగమయి యంత గజమునకు హాని సంభవించునట్లు. ఇట వీరునకును సింహామునకును, నమ్మినవానికిని వన్యవృక్షమునకును, ఖలునకును దంతికిని బింబప్రతిబింబభావ ముండుటచే నిట దృష్టాంతాలంకారము. ఉత్తరార్ధమున విశేషార్ధము గూడ నుపమానముగా గ్రహింపఁబడినది..

ఈరీతిగ నర్థాంతరన్యాసాలంకారమున నప్రస్తుతార్థముపమానముగ గ్రహింపఁ బడవచ్చునని చెప్పరాదు. ఏలయన ? సామాన్యార్థముయొక్క బోధముకొఱకు లోకవిదితమగు విశేషార్ధమును నుపమానముగఁ జెప్పినఁ జెప్పవచ్చునుఁగాని సామాన్యార్థము నుపమానముగఁజెప్పుట సమంజసము కాదుగదా ?

పైనఁ జెప్పినరీతిగ నప్రస్తుతార్థ మర్థాంతరన్యాసమునఁ బ్రస్తుతార్థమున కేవిధముననను నుపకరింపక పోవుటచేఁ బ్రస్తుతార్థమును సమర్థించుననియే చెప్పవలసి యున్నది. ఇట్లైనచో నిదికూడ వాక్యార్థహేతుక కావ్యలింగమే కావలయునుగాని మఱియొక యలంకారము కానేరదు. ఇది సంశయాకారము..

దీనికిట్లు కొందఱు సమాధానమిచ్చిరి. సమర్థనీయార్థమును సమర్థించినచోఁ గావ్యలింగమనియును లోకప్రసిద్ధమగుటచే సమర్థన మెంతమాత్రమును గోరని యర్థమును నాయర్థముయొక్క ప్రసిద్ధిని దృఢపఱచుటకై సమర్థించినచో నర్థాంతరన్యాసమనియును భేదమును దెలిపిరి.

వీరు తమసిద్ధాన్తమును సమర్థించుకొనుటకు నీయుదాహరణములఁ జూపిరి. కావ్యలింగమున సమర్థనాపేక్షకలదనుటకు

"నీటన్ మున్గెద్వదక్షితుల్యరుచులీనీలోత్పలంబుల్" ఈమున్నగు ప్రసిద్ధ కావ్యలింగోదాహరణములఁ బ్రస్తుతార్థమును సమర్థింపక తప్పదుగాన నటకావ్యలింగమని చెప్పకతప్పదు. ఈపద్యవిషయము

గావ్యలింగాలంకారములో విశదీకరింపఁబడినదిగాన నచ్చటనే చూడఁదగు.

అర్థాంతర న్యాసాలంకారమున సమర్థనాపేక్ష లేదనుటకు నీయుదాహరణములఁ జూపిరి. ఎట్లన ?

ఆ॥ వె॥ శరద శీతకిరణు - మురిసి కౌఁగిటఁబట్టె
మెఱపుఁ జూపు దొఱఁగి - తరలె వర్ష
హాతపయోధరలు సు - దతులకు నేరికి
సుభగతా గుణంబు - సుఁక్క కుండు ॥

ఈపద్యమునఁ బూర్వార్థము ప్రస్తుతము. దానిని సమర్థించుటకు నుత్తరార్థము చూపఁబడెను. శరదృతువునకు మంచి యుక్తకాలము, వర్షర్తువునకు యుక్తకాలము తప్పినదని భావము. ఈప్రస్తుతార్థము చక్కగ బోధపడుచుండుటచే దీనికి సమర్థనాపేక్ష లేదు. అట్లే

ఆ॥ వె॥ పగటి చీకువోలె - నగ గుహాలను డాఁగు
నిరుల నెవఁడు గాచు - నినుని వలన
క్షుద్రుఁడైన శరణుఁ - గోర నున్నతులకు
నగును మమత సుజను - నందు వోలె ॥

కుమారసంభవమున హిమగిరి వర్ణనము. ఏగిరి గుడ్లగూబ వలెఁదన గుహాలలో దాగు నంధకారమును సూర్యునివలనఁ గాపాడుచున్నదో. ఈయర్థము విశేషము. దీనిని సమర్థించుటకై యుత్తరార్థమున సామాన్యవిషయము చెప్పఁబడినది. ఇట విశేషార్థము సుఖముగ బోధపడుచుండ దానిని సమర్థించుటకు లోకప్రసిద్ధముకాని సామాన్యవిషయ ముపన్యసింపఁబని లేదు.

కాన నీపద్యముల రెంటను నర్థాంతరన్యాసమనియే చెప్పవలెనని వారి సిద్ధాంతము.

కాని యిట్టి విభాగము తగదు. ఏలయన ? అర్థాన్తరన్యాసమునఁ బ్రస్తుతార్థమునకు సమర్థనాపేక్ష లేదనుటకు వీలుగాదు. విశేషా

ర్థము సుబోధార్థకమగుటచే దానికి సమర్థనాపేక్ష లేకున్నను సామాన్యార్థ మట్లుగాకుంటచే దానికి సమర్థనాపేక్ష తప్పదు గదా? దీనికుదాహరణ మెట్లన?

తే॥ గీ॥ సారహీన పదార్థముల్ - భూరిసంఖ్య
నొకటిగాఁ గూడి కార్యసా - ధకము లగును।
పరకలను బెక్కిటింగూర్చి - పగ్గమల్ల
దాన బంధింపఁబడు మత్త - దన్తి యైన॥

ఇట సామాన్యార్థము ప్రస్తుతము. సర్వవిదితమగు విశేషార్థ మొకటి చూపి దీనిని సమర్థించినఁగాని యిది సుబోధముగాదు. కాన నిచ్చట నొకవిశేషార్థము సమర్థకముగాఁ జెప్పఁబడక తప్పదు.

ఇట శ్లోకశంక పొడమవచ్చును. ఎట్లన?

"'శరదశీతకిరణు' ననెడు నర్థాంతరన్యాసోదాహరణమునఁ బ్రస్తుతమగు విశేషార్థమును సమర్థించుటకై యుపన్యసింపఁబడిన సామాన్యార్థము లోకవిదితమగుటచే సుబోధకమగుచుండునట్లు "సారహీనపదార్థముల్ భూరిసంఖ్య" నను నీయర్థాంతరన్యాసోదాహరణమునఁ గూడఁ బ్రస్తుతమగు సామాన్యార్థమును సుబోధమగుటచే నిటగూడ సమర్థనాపేక్ష యక్కఱలేదుకదా?" అని.

దీనికి సమాధానమేమనిన? సామాన్యార్థము సర్వత్ర లోకవిదిత మగుచున్న దనుటకు వీలులేదు. ఎట్లన? పొగ యేయే తావుల నుండునో యచ్చట నగ్నియుండున నెడునది సర్వసామాన్యమగు వ్యాప్తి. ఇది లోకవిదితమగుటచే విశేషమగు వంటయింటిని నుదాహరణ మీయకయే సుబోధ మగుచున్నను, లోకప్రసిద్ధి నొందని సామాన్య వ్యాప్తినిఁ జెప్పినతావులఁ బ్రసిద్ధమగు దృష్టాంతమును జూపినఁగాని యది బోధపడదు గదా? కాన† విశేషములేని సామాన్యము తగద నెడు న్యాయముచేఁ బ్రస్తుతమగు సామాన్యార్థము విశేషార్థముచే సమర్థనమును జాల యుదాహరణములఁ గోరుచుండు నని చెప్పక తప్పదు.

ఓయీ! యిట్లైనచోఁ బ్రస్తుతమగు విశేషార్థమును సమర్థించుటకై సామాన్యార్థము నుపన్యసించిన తావులఁగూడ నాసామాన్యార్థమును సమర్థించుటకు నీవుచెప్పినటులు మఱియొక విశేషార్థ ముపన్యసింపవలసిన యావశ్యకత కలుగునేమో యని ప్రశ్నించినచో దీనికి సమాధాన మెద్దియన ?

విశేషార్థమును సమర్థింప నుపన్యసింపఁబడిన సామాన్యము లోకవిదితము గాకుంటచే సుబోధము గాకున్నచో దానిని సమర్థించుటకు మఱియొక విశేషము నుపన్యసింపక తప్పదనియే. అట్లుపన్యసించు తావుల వికస్వరాలంకారమగునని ముందు చెప్పఁబడును. ఇంతియకాక,

కావ్యలింగమున నన్నిచోటుల సమర్థనాపేక్షకలదని చెప్పిన యంశముగూడ నాలోచింప నంత సమంజసముగఁ గన్పట్టదు. ఎట్లన ?

"చికురజాలమదెంతో వాసికిఁదనర్చు" ననెడు కావ్యలింగోదాహరణమున సమర్థనాపేక్ష లేదు. ఉపమాన వస్తువులయందు వర్ణ్యమాన పదార్థముయొక్క సామ్యము సంభవింపనపు డుపమాన వస్తువులను నిందించుట లోకప్రసిద్ధముగాన నచ్చట సమర్థనాపేక్ష యావశ్యకము గాదు.

తే॥ గీ॥ శరదఁబున్నెమ చందురుఁ - డరయ నతని
యాస్యదాస్యంబు సేయఁగ - నైనఁ దగఁడు ॥

శారద పూర్ణచంద్రుఁడు నలుని ముఖదాస్యమునకైనఁ దగఁడు.
ఇట్టితావుల సమర్థనము చూడఁబడుట లేదుగదా ? మరియు.

ఆ॥ వె॥ విసముచేతఁ గాదు - పెనుఁగైదువునఁ గాదు
చిచ్చుచేత మిత్తి - చేతఁ గాదు
పాపరాని పరుష - భావంబుగల భామి
నులను జేసె భామి - నులనె నలువ ॥

బ్రహ్మ స్త్రీలను విషము మున్నగువానిచే సృజింపలేదు. ఏలయన ? పై వస్తువులకుఁ గల పరుషభావమునకుఁ బ్రతిక్రియ సంభవించుటచే.

స్త్రీల పారుష్యమునకుఁ బ్రతిక్రియ లేకుంటచే వారిని వారిచేతనే సృష్టించినాఁడు. ఈపద్యము ప్రతిషేధాలంకారమునకు నుదాహరముగా నీయఁబడును.

ఈపద్యమున విషము చేతఁగాదు మున్నగు వాక్యముల యర్థమును సమర్థింప నవసరము లేదు. స్త్రీ లాపదార్థములచే సృష్టింపఁబడకుండుట ప్రసిద్ధము గాన. అయినను బాపరాని పరుషభావముగల యను పదార్థముచే సమర్థనము గాన్పించుచున్నది.

ఈరీతిగ నుదాహరణములు గన్పట్టుచుండుటచే సమర్థనాపేక్ష కలతావులఁ గావ్యలింగమనియును నదిలేని చోట నర్థాంతరన్యాసమనియును వ్యవస్థ చేయుట తగదు.

ఇఁక నీరెండలంకారములకు భేద మేమనిన ?

సమర్థ్యసమర్థక భావముకల యర్థమునకు సామాన్యవిశేషభావ సంబంధమున్నచో నర్థాంతరన్యాసమనియును దానికన్న వేఱగు సంబంధమున్నచోఁ గావ్యలింగమనియును విషయవిభాగము చేయవలయును.

వెనుకటి యుదాహరణముల నప్రకృతముచేఁ బ్రకృతమునకు సమర్థనము చూపఁబడినది. ఇఁకఁ బ్రకృతముచే నప్రకృతమునకు సమర్థన మెట్లన ?

తే॥ గీ॥ రూపసంపద గల్గుచోఁ - బాప వృత్తి
గల్గదను నట్టి సామెత - కల్ల యగునె ? ।
ఏల సుందరి ! నీశీల - మీఁమునీంద్ర
లకును నుపదేశమాయెఁ ద - లంపగారి ! ॥

మాయాబ్రహ్మచారి యగు శంకరుఁడు పార్వతినిఁ గూర్చి యిట్లు పలికెను. ఆకార సౌష్ఠవమున్నచోటఁ బాపవృత్తి గలుగదు. ఇది సామాన్యమును నప్రకృతమును గూడనగుచున్నది. ఇది విశేషమును బ్రస్తుతము నగు నుత్తరార్ధముచే సమర్థింపఁబడుచున్నది. మఱియును.

ఆ॥ వె॥ దాన మిచ్చు పెద్ద - తా జలావృతుఁడైన
సగతి కుండెవండు - జాఱకుండు ?
దంతినీటమున్గ - తఱి దాని కటతటిన్
దేంట్లగుమి యదేల - తెరలి విడునొ ? ॥

దాత జలావృతుఁడైనచో నన్యమగు నాలంబనము కలవాఁడు వానిని విడిచి పోవును. డలల కభేదముంటచే దాతపక్షమున జడావృతుఁడని యన్వయము. గజపక్షమున జలావృతమని సమన్వయము నెఱుంగునది. ఇట పూర్వార్థము సామాన్యమును నపరిష్కృతమునై యున్నది. ఇది విశేషమును బరిష్కృతమును నైన యుత్తరార్థముచే సమర్థింపఁబడు చున్నది.

వి క స్వ రా లం కా ర ము. 62.

కం॥ అమరు విశేషము సామా
న్యమును విశేషమును దెలిపి - న వికస్వర మో ।
టమి చివ్వ నాతనికి లే
దు మహాత్ము లధృష్యు లౌర ! - తోయధులు వలెన్ ॥

ఒక విశేషార్థమును సమర్థించుటకు నొక సామాన్యమును దెలిపి దానిని సమర్థించుటకు మఱియొక విశేషమును నుపన్యసింప వికస్వరమగును. ఈ నృపతికి రణమున నోటమి లేదనెడు విశేషార్థమును సమర్థింప నొక సామాన్యము మహాత్ము లధృష్యు లనుదానినిఁ జెప్పి దాని సమర్థనమునకై తోయధులు వలె ననెడు మఱియొక విశేష ముపన్యసింపఁ బడినది.

కాని యిట మహాత్ములధృష్యు లనెడు సామాన్యము సుబోధముగ నుండుటచే దానిని సమర్థింపఁ బనిలేదు. కాన సరియగు నుదాహరణ మేది ? యన

ఆ॥ వె॥ హిమ మనర్ఘ రత్న - సముదయ నిధికి నే
ని కిలుఁ గూర్పలేదొ ! - నిగ్గు కొఱత

వణఁగుఁ గాదె కీ యసమ - గుణ రాశినొక దోస

మిందు కిరణములను - గందు వోలె ॥

హిమగిరి వర్ణనము. రత్ననిలయ మగు నేహిమగిరికి మంచు సౌభాగ్యమును లోపింపఁ జేయలేదో యట్టి హిమగిరి విరాజిల్లు చున్నదని సమన్వయము. ఈ విశేషార్థమును సమర్థించుటకై గుణరాశిలో నొక దోస మణఁగు ననెడు సామాన్యము చెప్పఁబడినది. కాని యీ సామాన్యము సుబోధము కాకుంటచే దీనిని సమర్థించుటకై యిందుకిరణములఁ గళంకమునవలె నని మఱియొక విశేష ముపన్యసింపఁబడినది. ఈ రెండవ విశేష ముపమానరీతిలోఁ జెప్పఁబడినది.

అర్థాన్తర న్యాసరీతిచేఁ గూడఁ జెప్పవచ్చును. ఎట్లన ?

చం॥ చెవు లవియంగ నారవము - సేయక యుండు మరందశాలి చూ

త విటపిఁ గాకమా! పరభృ - తంబుగ నెంతుము నిన్నుఁ, గొన్నివ

స్తువులకు నాశ్రియాధికతఁ - జొప్పడు గణ్యత, నేపళోర్వరా

ధవు నళికంబునంటు బుర - దన్ గని కస్తురియంచు నెంచ రే? ॥

ఓ కాకమా! చెవులు బ్రిద్దలగునట్లు రుతిసేయకుము. అట్లైన నీమామిడి గున్నయందున్న నిన్నుఁ గోకిలయని యనుకొందుము. ఇది విశేషార్థము, దీనిని సమర్థించుటకుఁ గొన్నివస్తువులకు నాశ్రియ గౌరవముచే గౌరవము గల్గునెడు సామాన్యార్థము చెప్పఁబడినది. ఈ సామాన్యార్థము ప్రసిద్ధము గాకుంటచే దాని సుఖబోధము కొఱకై నేపాళరాజు నొసట నంటిన బురద మున్నగు విశేషార్థ ముపన్యసింపఁబడినది. మఱియును.

చం॥ మలినతఁ బేర్చు నంబుజ హి-మద్యుతులన్ మధులిట్క-ళంకముల్

దెలియఁ ద్వదాననంబునకు - దృక్తిలకంబుల శోభఁ గూర్చు నం

మిలితములైన దోషము ల - మేయ గుణత్వమునొందు నొందుచోఁ

బొలుపుగ వక్త్రవాక్యగుణ-ముల్ గద! యాభ్రమ విప్రలంభముల్ ॥

తుమ్మెదలు పద్మమునకును, కళంకము చంద్రునకును మాలిన్యము గూర్చుచున్నవి. ఓతన్వీ! యాతుమ్మెదలును గళంకమును నీముఖమును

నకుఁ గన్నులుగను దిలకముగను రూపునొంది శోభను గూర్చుచున్నవి. ఇట కండ్లు తుమ్మెదలుగను దిలకము కళంకముగను నధ్యవసింపఁబడినవి. ఈవిశేషవాక్యార్థమును సమర్థించుటకు వేఱువేఱుగ నున్నపుడు దోషములుగఁ గన్పట్టు వస్తువులు వేఱొకచోఁ గలిసి గుణములుగ మాఱు ననెడు సామాన్యార్థ ముపన్యసింపఁబడినది. ఈసామాన్యము సుబోధము కాకుంటచే దానిని సమర్థించుటకు భ్రమవిప్రలంభములు కలిసి వక్తకు గుణమును గూర్చు ననెడు విశేషము చెప్పఁబడినది.

ఈ విశేషార్థము యొక్క వివరణ మెట్లన ?

ఒరులకు భ్రాంతినిఁ గల్గించునట్లు మాట్లాడుట వక్తకు దోషము. అట్లే యొరులను వంచించునట్లు మాట్లాడుటయును దోషమే కాని యీరెండు దోషములను నొక్క వాక్యమునఁ బొందు పఱచినచో నవి వక్తకు నైపుణ్యమును గూర్చును. ఎట్లన? ఒక వాక్యనిపుణుఁ డెదుటనున్న వస్తువునుగాని యేదైన విషయమునుగాని తన యుక్తులచే నెదుట లేనటు లెదుటివానికి భ్రాంతినిఁ బుట్టించి తిరిగి తన యుక్తులచేతనే యావస్తువు గాని యావిషయముగాని యున్నటులు తోపింపఁజేసి నాఁడనుకొందము ఇట్లు చేయుట యెదుటివానిని వంచించుట యౌనుగదా ? అట్లయ్యు నీరీతిగ నెదుటివానిని భ్రమింపఁ జేయుశక్తియును దిరిగి తన యుక్తులచే నతనిని విశ్వసింపఁజేసి యీరీతిగ వంచించు శక్తియును వక్తకు సంభాషణ చాతుర్యమును జూపి యతనికి గుణముగ మాఱుచున్నవి.

పౌఢోక్తి - అలంకారము. 63.

కం॥ రుచిరోత్కర్షాహేతువుఁ
బచరింపన్ హేతువనుచుఁ - బ్రౌఢోక్తి యగున్ ।
కచములు <u>కాళిందీతట</u>
రుచిర తమాలౌఘ నీల - రుచి లసితంబుల్ ॥

అందమగు నుత్కర్షమునకుఁ గారణముగాని దానినిఁ గారణమని చెప్పి నచో నది ప్రౌఢోక్తియగును. శిరోజములు కాళిందీనది యొడ్డున నున్న

రుచిరమగు తమాలవృక్ష సముదాయమువలె నీలకాంతిచేఁ బ్రకాశ మానము లగుచున్నవి. తమాల వృక్షములయొక్క వర్ణము మిక్కిలి నల్లగానున్నది యని తెల్పుటకై తమాలవృక్షములకు నల్లని నీరుగల కాళిందీ తటమున నుండుటచే రుచిరములనెడు విశేషణము చెప్పఁబడి నది. తమాలవృక్షములయొక్క నైల్యము వృద్ధియగుటకు యమునా తటినిఁ బుట్టుట కారణము గాకున్నను హేతువుగాఁ జెప్పఁబడినది. కానఁ బ్రౌఢోక్తి యగుచున్నది.

కం॥ సురతరు సురసురభి వరసు
ర రమణ మణి ధనద శంఖ – రమ్య నిధి రజో।
భర పూతపయ స్తేజో
వర నిశ్శ్వసితాంత రాభ్ర – వైకృతుఁ డితఁడౌ॥

రాజస్తుతి. ప్రతి వ్యక్తియును బృథివ్యాది పంచభూతములచే నిర్మింపఁ బడుట ప్రసిద్ధము. కాని యీరాజుయొక్క దానగుణము చూడ నితఁడు సామాన్యమానవుఁడు వలెఁగాక విశిష్టములగు పంచభూతము లచే నిర్మింపఁబడి నటులొక కవి వర్ణించుచున్నాఁడు. అది యెట్లన? సుర తరువుయొక్క రజోభర మనెడు పృథివీభాగ మీతని సృష్టికిఁ బ్రకృతిభూతము. సురసురభి యొక్క పూతమగు క్షీరము జలభూతము. సురమణియొక్క తేజస్సు తేజోభూతము. ధనదునియొక్క నిశ్శ్వసితము వాయుభూతము. శంఖనిధియొక్క యాకాశ మాకాశభూతము. ఈ పంచభూతములచే నీప్రభువు నిర్మింపఁబడుటచే నితని కీదాతృత్వగుణము సంభవించియుండునని చమత్కరించినాఁడు. ఈ దాతయగు రాజును సృష్టించుటలోఁ బైనఁ బేర్కొనిన వస్తువులు కారణము గాకున్నను హేతువులుగాఁ జెప్పఁబడుటచే నిది ప్రౌఢోక్త్యలంకారము.

## సంభావనాలంకారము. 64.

కం॥ ఇట్లుల్లగుచో నను నూహ యె
చట నగుఁ బరసిద్ధి కొఱకు – సంభావన యా

నట వక్త శేషుఁడగుచోఁ
బటుగతిఁ జెప్పంగ నగు భ - వద్గుణము లిలన్ ॥

ఇటులగుచో నాకార్యము సిద్ధించుననెడు నూహ యెచ్చట నగునో యచట సంభావనాలంకారము. ఓప్రభూ! శేషుఁడు వక్తగ నున్నచో నీ గుణములు వర్ణింపఁగలఁడు. సహస్ర ముఖములుగల యతఁడు వర్ణింపఁగలఁడుగాని యేకముఖముగల నేను వర్ణింపఁజాలనని తాత్పర్యము. మఱియును.

తే॥ గీ॥ నేన యేని విధాత్రుఁడఁ - బూని జగతి
నుండు కస్తురి మెకముల - యండ యుగళి
నుండి గందంపు గుణము వే - ఱుండఁ దీసి
ఖలుల జిహ్వలఁ బెట్టెద - నిలువు దోఁప ॥

నేనే సృష్టికర్తనైనచోఁ గస్తురి మెకముల యండ యుగళినుండి సౌరభమును దీసి దుర్జనుల నాలుకలఁ బెట్టగలవాఁడను. ఇట్టి తావుల నతిశయోక్తి భేదమని కావ్యప్రకాశ కారుని మతము.

మిథ్యాధ్యవసితి - అలంకారము. 65.

కం॥ మిథ్యగఁ దెలుపుట కొకటిని
మిథ్యార్థంబొండు సెప్ప - మిళితము గాఁగన్ ।
మిథ్యాధ్యవసితి ; వెలచెలి
తథ్యము వశ నింగిపూల - దండను దాల్పన్ ॥

ఒక విషయమును మిథ్యయని తెలుపుటకు మఱియొక మిథ్యార్థమును జెప్పినచో నది మిథ్యాధ్యవసితి యగును. వెలయాలు స్వాధీనురాలగుట యసత్యమని తెల్పుటకు గగనపుష్పమాలను దాల్చుట యనెడు మిథ్యార్థాంతరము చెప్పఁబడెను. గగన పుష్పమాల ధరించుట వంటిది వెలచెలి వశయగుట యనురీతిగ రెంటికి నభేదము భాసించుటచే నీయుదాహరణము నిదర్శనా గర్భితముగ నున్నది. శుద్ధమగు నుదాహరణ మెట్లన ?

ఉ॥ ఈనరనాథు మర్త్యశము - లెంచఁ బరార్ధము సంఖ్య మించుఁ బ్రి
జ్ఞా నయనుండు సూడనగు - శ్రావ్యములౌ బధిరాళి కష్టమం।
బైన స్వరంబుఁ బేర్చి సల - యంబుగ వంజలఁ బుట్టు మూగగుం
పానుచుఁ గూర్మకాంతల ప - యోబ్ధి తటిన్ దగుఁ గూడి పాడఁగన్॥

ఒక ప్రభువు స్తుతి. ప్రభువునకు నపయశస్సులు లేవని చెప్పుటకు నితర ములగు నసత్యార్థములు చెప్పఁబడెను. ఎట్లన ? పరార్థమును మించిన సంఖ్య, గ్రుడ్డివాఁడు చూచుట, చెవిటివాఁడు వినుట, అష్టమస్వ రము, వంజలకుఁ బుత్రిలు, మూగవారు పాడుట, ఆడతాబేళ్లకు స్తన్యము యీ మిథ్యార్థములు పద్యమునఁ జూపఁబడినవి.

అసంబధమున సంబంధమును జూపునట్టి యతిశయోక్తి భేదము కన్న నీయలంకారమునకు భేదమేమనినచో నొకవిషయమునకు నసత్య తను సిద్ధింపఁజేయుటకు మఱియొక యసత్యార్థము నుపన్యసించుటయే చమత్కృతి జనకమగు భేదముకలదు. కనుకనే దీనిని ప్రౌఢోక్తియని యును జెప్పరాదు.

ఇచ్చట మఱియొక శంక గల్గుచున్నది. ఎట్లనిన ? ఒక విషయ మునకు మిథ్యాత్వసిద్ధికై మిథ్యార్థము మఱొక్కటి చెప్పఁబడినచో మిథ్యాధ్యవసితివలె నొక విషయమునకు సత్యత్వసిద్ధికై మఱియొక సత్యార్థమును దెల్పినచోఁ దథ్యాధ్యవసిత్యలంకారము గూడ నేల యుండరాదనియును దీనికిఁ దగిన యుదాహరణముగూడ నీయవచ్చు ననియును, దీని కుదాహరణ మీరీతిగ నుండవచ్చును.

శా॥ గంగా! పూతతరంగ! లోకజననీ! - కళ్యాణి! పుణ్యాగమో
త్సంగంబందునఁ గ్రీడలాడుఁగద! స - త్య త్వద్గుణౌఘుం బస।
త్సంగీర్ణార్థ మొకింత నేర్వని హరి - శ్చంద్రుండు భక్తిన్ జపిం
చెంగా! ధర్మసుతుండు కీర్తనము చే - సెన్ గాదె! దానిన్ గడున్॥

ఓగంగానదీ! నీయొక్క గుణసముదాయము పుణ్యమగు వేదములలోఁ గ్రీడలాడినది. అనఁగాఁ బరమసత్యములగు వేదములచేఁ బ్రతిపాదింపఁ

బడినది. మఱియు నాడినమాట తప్పని హరిశ్చంద్రునిచేత జపింపఁబడి నది. సత్యసంధుఁడగు ధర్మసుతునిచేఁ గీర్తింపఁబడినది. అనఁగా సత్య సంధులగు వీరిచే స్తుతింపఁబడుటచే గంగాగుణములు పరమసత్యములని విశ్వసింపవచ్చునని భావము.

ఇట గంగయొక్క పావనత్వాది గుణములకు సత్యత్వమును బ్రతిపాదించుటకై హరిశ్చంద్రాదులయొక్క ప్రవచనసత్యత్వ ముపన్య సింపఁ బడినది. కాన నీరీతిగ తథ్యాధ్యవసిత్యలంకార మనునదిగూడ నేల కల్పింపరాదని.

దీనికి సమాధాన మేమనిన? సత్యార్థమున సంశయ ముదయింపదుగాన దానిని స్థిరపఱచుటకై మఱియొక సత్యార్థమును గల్పించు టకుఁ గవి తన ప్రతిభాశక్తిని జూపింప నవసరము లేదు.

కవియొక్క ప్రతిభావిశేషముచేఁ గల్పింపఁబడిన యర్థవిశేషములే యలంకారములగును గాని యన్యము లలంకారములు కానేరవు. కానఁ బై పద్యమందునఁ గవియొక్క ప్రతిభా విశేషము భాసింపకుంటచే నట్టితావుల నలంకార మున్నదనుటకు వీలుగాదు. పై యుక్తులచేఁ దథ్యాధ్యవసితి యనునది యలంకారమనుటకుఁ దగదని సమాధానము.

ల లి తా లం కా ర ము. 66.

కం॥ ప్రతిబింబిత వాక్యార్థము
కృతి వర్ణ్యవిశేష్యమున ల - గించిన లలితం।
బు తొలఁగ నీరం బీనా
తి తలంచును గాదె! కట్టఁ - దీరుగఁ గట్టన్ ॥

వర్ణ్యమానమగు వాక్యార్థమును వాచ్యముగఁ జెప్పక దానికిఁ బ్రతి బింబము గానుండు మఱియొక వాక్యార్థమును జెప్పి దానినిఁ బ్రస్తుత విశేష్యముతోఁ సంబంధింపఁ జేసినచో లలితాలంకారమగును.

దఱిఁజేరిన నాయకుని నిరాకరించి యతఁడు మఱియొక నాయి కపై నాసక్తుఁడు కాఁగాఁ దిరిగి నాతనిఁ బొంద యత్నించుచున్న నాయి

కను జూచి యూపె చెలులీరీతిగ నాపె నుద్దేశించి పల్కిరి. ఈపె నీరంతయుఁ దొలఁగిన పిమ్మట గట్టుఁ గట్టుచున్నదని. అనఁగా నీపె ప్రయత్నము గతజల సేతుబంధనమువలె నిరర్థక మనిభావము.

ఇట నివృత్త నాయకానయన రూపమగు ప్రస్తుత వృత్తాంతము వర్ణింపఁబడలేదు. దానికిఁ బ్రతిబింబ భూతమగు గతజలసేతు బంధన రూప మగు నప్రకృత వృత్తాంతము వర్ణింపఁబడినది. ఆ యప్రకృత వృత్తాంతమునకును బ్రకృత ధర్మి పదార్థమగు నాతియే కర్తృకారక ముగాఁ జేయఁబడినది.

ఈ యలంకారమునకు నప్రస్తుత వృత్తాంతము యొక్క సంబంధముకల యితరాలంకారములకంటె భేదమును జూపుచున్నాఁడు.

అప్రస్తుత ప్రశంసలోవలె నిచ్చటఁగూడ నప్రస్తుతార్థముచేఁ బ్రస్తుతార్థము స్ఫురింపఁ జేయఁబడుటచే నీలలిత మప్రస్తుత ప్రశంసయే యని యేల యనరా దని ప్రశ్నము.

అప్రస్తుత వృత్తాంతముచేఁ బ్రస్తుత స్ఫూర్తి రెంటింటఁ దుల్యమే యైనను నప్రస్తుత ప్రశంసలో నప్రస్తుత ధర్మిఁగూడ వాచ్యమగును లలితమున నట్లుకాక ప్రస్తుతధర్మి యొక్కటియే వాచ్యమగు నని సమాధానము.

సమాసోక్తిలోఁగూడ నప్రస్తుత వృత్తాంతప్రసక్తి యుంటచే లలితము సమాసోక్తి యేల కారాదని ప్రశ్నము.

సమాసోక్తిలోఁ బ్రస్తుత వృత్తాంతముచే నప్రస్తుత వృత్తాంత స్ఫూర్తి యగుచున్నది. లలితమున నప్రస్తుతముచేఁ బ్రస్తుతస్ఫూర్తి యగుచున్నదని సమాధానము.

ప్రకృతాప్రకృతార్థమున నైక్యము గన్పట్టుటచే నిది నిదర్శన యేల కారాదని ప్రశ్నము.

నిదర్శనమున శబ్దోపాత్తములగు ప్రకృతాప్రకృతార్థములకు నైక్యారోపము గలదు. ఇట నైక్యము భాసించుచున్నను బ్రకృతార్థము వాచ్యము కాకుంటచే నట్లన రాదని సమాధానము.

మఱి యొకరీతిగీ నిదర్శన కావచ్చునని శంకింపవచ్చును. విషయ విషయి పదార్థములు వాచ్యములగునపుడు ప్రవర్తించు నలంకారము కేవలము విషయిని గ్రహించు నప్పుడుకూడఁ బ్రసక్తము గావచ్చునని యంగీకరించినచో లలితమున విషయము (ప్రకృతము) చెప్పఁబడకున్నను విషయి (అప్రకృతము) చెప్పఁబడుటచే నిదర్శన యేలకాకాదని.

దీనికి సమాధానమెట్లన ? అట్లైనచోఁ బ్రకృతాప్రకృతములు రెండును వాచ్యములగు నపుడు ప్రవర్తించు నభేదరూపకము కేవల మప్రస్తుతమునే చెప్పి ప్రస్తుతమును జెప్పక యూరెంటికి నభేదమును దెల్పు రూపకాతిశయోక్తియొక్క స్థాన మాక్రమింప వలసి వచ్చును. అనఁగా రూపకాతిశయోక్తి గూడ నభేదరూపకమే కావలసివచ్చును. అట్లనుటకు వీలుకాదు కదా ? కానఁ బ్రస్తుతాప్రస్తుతములు వాచ్యములుగ గ్రహింపఁబడునపుడు ప్రవర్తించు నిదర్శనాలంకారము కేవల మప్రస్తుత విషయమునే గ్రహించెడు లలితమున సంభవింపదని.

ఈలలితము రూపకాతిశయోక్తి యనఁగా భేదమున్నను నభేదమే రూపముగల యతిశయోక్తి యేలకాఁగూడదని సంశయము కల్గుచున్నది. ఎట్లన ? "వాపియొకండు మింటఁదగ భాసిలు" ననెడు రూపకాతిశయోక్త్యుదాహరణములఁ బ్రస్తుతములగు నాభి నూగారు మున్నగు పదార్థములు చెప్పఁబడక (విషయనిగరణముచేసి) వాని యందు శబ్దోపాత్తములగు వాపి, నీలమణుల బాట మున్నగు నప్రస్తుత పదార్థముల యభేదము నధ్యవసింపుమనటు లీలలితమునఁ బ్రస్తుత నాయకుఁడు మున్నగు వానినిఁ జెప్పక (విషయనిగరణముచేసి) వానియందు నప్రస్తుతమగు నీరు మున్నగు వానియొక్క యభేదము నధ్యవసించుటచే నిది యతిశయోక్తియే యగునని సంశయము.

దీనికి సమాధానమెట్లన ? ఇట విషయి వాచక పదములచే నభేదాతిశయోక్తిలో వలె విషయ పదార్థములు లక్షింపఁబడుటలేదు. అనఁగా నతిశయోక్తిలోవలె నిట విషయ విషయి పదార్థములకు

నభేదాధ్యవసాయము లేదు. మఱి యేమనినఁ బ్రస్తుత ధర్మియందు సంబంధింపఁ జేయఁబడిన యప్రస్తుత వృత్తాంతము యొక్క సాదృశ్యము వలనఁ బ్రస్తుత నిష్ఫల నాయకానయన ప్రయత్న రూప వ్యవహారము తోఁపింపఁ జేయఁబడుచున్నది.

ఇట్టి భేదముంటచే లలితము అతిశయోక్తి కాదని.

మఱియు నిట్టి భేదము గోచరించుటచేతనే సారూప్యనిబంధన యగు నప్రస్తుతప్రశంస యభేదాతిశయోక్తి గాకున్నది.

ఎట్లన ? "కృతియొక్కఁడె పక్షులగుమి" ననెడు సారూప్యనిబంధనయగు నప్రస్తుతప్రశంసోదాహరణమునఁగూడ వదాన్యాంతరమును యాచింపని మానవంతునకును శకుంతమగు చాతకమునకు నభేదమధ్యవసించినటులు గన్పట్టుటచే నభేదాతిశయోక్తియే యగుననెడు సంశయము గల్గుచున్నది.

కాని యభేదాతిశయోక్తిలోఁ బాపి మున్నగు నప్రస్తుతపదార్థములకును బ్రస్తుతనాభిమున్నగు పదార్థములకు నభేదాధ్యవసాయము కల్గుటచే విషయివాచకపదములచే విషయపదార్థములు బోధింపఁబడుచున్నవి. అట్లు పై యప్రస్తుతప్రశంసలో బోధింపఁబడుట లేదు. మఱి యేమన ? సమానరూపముగల యప్రస్తుత వాక్యార్థమువలనఁ బ్రస్తుత వాక్యార్థ మవగతమగుచున్నది. ఈకారణముచే నప్రస్తుతప్రశంస యతిశయోక్తి కానేరదు. అట్లే లలితాలంకారముగూడ నతిశయోక్తి కానేరదు.

దీని ఫలితార్థమేమనిన నతిశయోక్తిలో నభేదాధ్యవసాయముంటచే నప్రకృతార్థబోధసమకాలముననే ప్రస్తుతార్థబోధము కలుగుచున్నది. పై యప్రస్తుతప్రశంసలోను లలితములోను నభేదాధ్యవసాయము లేకుంటచే నప్రస్తుత వాక్యార్థబోధము కల్గినతరువాతనే ప్రస్తుత వాక్యార్థబోధము సారూప్యముచేఁ గలుగుచున్నదనియు నిట్టి భేదము కలదనియును దెలియుచున్నది.

ఒకవేళ నప్రస్తుతప్రశంసలో నతిశయోక్తియందువలె నప్రస్తుత వాక్యార్థ బోధసమకాలముననే ప్రస్తుతవాక్యార్థబోధము కలుగుటకైన నవకాశమున్నదికాని లలితమున నట్లు కలుగుటకు నవకాశము లేదు.

ఈరీతిగఁ బ్రథమమునఁ బ్రతీతివిషయమైన యప్రస్తుతవాక్యార్థమునకుఁ బిమ్మటఁగాక తత్సమకాలముననే ప్రస్తుత వాక్యార్థప్రతీతిగల సారూప్యనిబంధనయగు నప్రస్తుతప్రశంస కుదాహరణమెట్లన ?

ఉ॥ నాల్కమడంచుటన్ జెవుల – నారతమిట్టటు త్రిప్పుటన్ మద
శ్రీల్కలరంగ నాత్మపర – చింత దొఱంగిన దృష్టిఁగొంట వే।
పల్కులివేటికో భ్రమర ! – పల్మఱు నీవు నెఱింగియుండియున్
గుల్కుచుఁ గొల్చెదేల ? మదిఁ – గుందక వారణశూన్యహస్తమున్

ఓభ్రమరమా ! నాల్కమడంచుట యెల్లప్పుడును జెవులుత్రిప్పుట మద సంపదచే స్వపరజ్ఞానము లేకుండుట యీదుర్గుణములను నీ వెఱింగియుం డియు గజముయొక్క శూన్యహస్తము నాశ్రయించుచుంటివి. ఈ యర్థము అప్రకృతము. దీని సారూప్యముచే దానగుణశూన్యుఁడగు దుష్టప్రభువును సంబంధించిన ప్రస్తుత వాక్యార్థము స్ఫురింపఁజేయఁ బడుటచే నిట సారూప్యనిబంధన యగు నప్రస్తుత ప్రశంసాలంకారము. ఈయలంకారమున కిది ప్రసిద్ధమగు నుదాహరణము. శూన్యహస్త మన గజపక్షమున రంధ్రములుకల తొండమనియు దుష్టప్రభువు పక్ష మున దానశూన్యమగు చేయియనియు నర్థము. ఇట్లే తక్కినవానిని నుభయపక్షముల నన్వయించుకొనఁదగు.

ఇట చెవులుతిప్పుట యనెడు క్రియారూపగుణ మొక్కటియే కర్ణాఘాతముచే భ్రమరము గజమును సేవింపకుండుటలో హేతువగు చున్నదికాని తక్కిన నాల్కమడంచుట మున్నగునవి హేతువులు కా వీలులేదు. మదశ్రీ దానిని సేవించుటలోనే హేతువగుచున్నది. ఇవి దుష్టప్రభువును సేవింపకుండుటలో యుక్తమగు హేతువులగుచున్నవి. కాన గజసంబంధి వాక్యార్థబోధము పిమ్మటఁగాక వారణపదము దుష్ట

ప్రతిబింబరూపార్థమునుగూడఁ గలుపుకొనియే గజరూపార్థమును జెప్ప వలసి యున్నది. మఱియు నీరెంటికి నభేదముకూడ నంగీకరింపకతప్పదు.

ఇట్టిపోలిక యున్నను నప్రస్తుతమగు భ్రమరసంబోధనముచేఁ జమత్కారము కలదని తలఁచి యీపద్యమును నప్రస్తుతప్రశంస కుదాహరణముగఁ బలుకురిచ్చిరి.

ఈరీతిగ లలితాలంకారమునఁ బ్రస్తుతార్థమునకు నప్రస్తుతార్థ ముతో సమకాలమున బోధమెంతమాత్రమును లేకుండుటచేతను నప్ర స్తుతవాక్యార్థమునకుఁ బ్రస్తుతధర్మి కర్తృకారకముగా నుండున నెడు చమత్కారముండుటచేతను నభేదాతిశయోక్తి కాదనిచెప్పుటలోఁ దప్పేమికలదు. ?

ఇందుచే లలితాలంకారము సర్వాలంకారవిలక్షణమని తేలినది.

ఈయలంకారమునకు మరియొక యుదాహరణ మెట్లన ?

ఆ॥ వె॥ వేఁడి వెలుఁగు వలన - వెడలు నాకులమేడ
నలఁతినెఱుఁగు నాదు - తెలివియేడ ।
నంతు తెలియరాని - యంభోధి దాటంగఁ
జేతఁ దెప్పకొయ్య - నూతఁ గొంటి ॥

రఘువంశ కావ్యములోనిది. ఇట అల్పవిషయముల నెఱిఁగిన బుద్ధిచే ననంతగుణములుకల సూర్యవంశమును వర్ణింపఁదలఁచిన నేననెడు ప్రస్తుతవృత్తాంతమును జెప్పక దీనికిఁ బ్రతిబింబ భూతమగు నపార పారావారమును దాటఁదలంచి తెప్పకొయ్యను జేతఁబట్టితిననెడు ప్రతి బింబరూపార్థము మాత్రమే వర్ణింపఁబడెను. పూర్వార్థమునఁ జెప్పఁబడు విషమాలంకారముచేఁ బైనఁజెప్పఁబడిన ప్రస్తుతవృత్తాంతము తాత్పర్య రూపమున గమ్యమానము మాత్రమే యగుచున్నది. ఈరీతిగఁ బ్రతి బింబవాక్యార్థమునకుఁ బ్రకృతధర్మియగు కాళిదాసమహాకవియే కర్త గాఁజేయఁబడుటచే నిట లలితాలంకారము. పై యుక్తులచే నిదర్శన కాదు.

మఱియొక యుదాహరణము.

తే॥ గీ॥ మహి వసంతవిముక్త ప్ర - మదవనంబు
స్థితిని నే దేశమునకుఁ గూ - ర్చితి తలంప ।
త్వదభిధాన పవిత్రితా - భరిత వర్ణ
మాల యది యెద్ది? తెల్పుమో - మహితచరిత! ॥

రాయబారియగు నలునిగూర్చి దమయంతి యిట్లు పల్కినది.

ఇట నీ దేశ మెద్ది? నీపే రేమి? యనెడు ప్రస్తుత వాక్యార్థములను జెప్పక వానికిఁ బ్రతిబింబవాక్యార్థములు చెప్పఁబడినవి. మఱియు వానికి నీవనెడు ప్రస్తుతధర్మియే కర్తగాఁ జేయఁబడినది.

### ప్రహర్షణాలంకారము. 67.

కం॥ పొందుగ యత్నము లేకయె
యందిన నుత్కంఠితముఁ బ్ర - హర్షణమగు నే ।
సుందరిఁ దాఁ దలఁచెనో వే
గం దగ నాచెలియ దూతి - గా దరిఁ జేరెన్ ॥

యత్నము లేకయే యుత్కంఠితమగు ఫలము సిద్ధించినఁ బ్రహర్షణమగును. తాఁ గోరిన వనితను విటుఁడు ప్రయత్నమక్కఱలేకయే పొందెను. ఉత్కంఠయనఁగా నిచ్ఛావిశేషము. దాని లక్షణ మెట్లన?

కం॥ సకలేంద్రియసుఖ మొక్కట
నకలుషగతిఁ గలుగునెడు - నభిమతిచే నే ।
ప్రకటేచ్ఛ గల్గుదాని బ
హుకవులు దలపోయుచుందు - రుత్కంఠ యనన్ ॥

సకలేంద్రియ సుఖములు సిద్ధించునని యొకపదార్థముఁ గోరుట యుత్కంఠ యనఁబడును. మఱియును.

ఉ॥ మబ్బులు గ్రమ్మెనింగినిఁ ద - మాల విసీలము లీవనస్థలుల్
గొబ్బున నింటిఁ జేర్పు నిశ - కున్ వెఱపొందు నితండు రాధ! యి
ట్లబ్బ వచింప నందసుతుఁ - డా పెనుగూడి రహస్యసంగతం
బబ్బ నొనర్చు సూర్యతన - యాతట కుంజరతుల్ చెలంగుతన్ ॥

రాధామాధవుల మానసిక ప్రేమము ప్రసిద్ధము. వారి స్వేచ్ఛావిహార మునకు నందని దేశ మప్రయత్నముగఁ దోడ్పడినది. పద్యము స్పష్టార్థము.

ప్ర హ ర్ష ణ ము. II

కం॥ తనరన్ గామ్యాధికఫల
మనయము సిద్ధింపనిలఁ బ్ర - హర్షణ మట్టుల్ ।
కునికెడు దీపంబెగఁద్రో
య నెదను దలఁపంగ భానుఁ - డంతనె పొడమెన్ ॥

కోరబడిన ఫలముకన్న నధికఫలప్రాప్తియును బ్రహర్షణమగును. ఉదాహరణము స్పష్టము. మఱియును.

తే॥ గీ॥ చాతకము తృష్ణ పీడింప - జలధరమును
గతిపయాంబు కణంబులఁ - గాంక్షఁ గోర ।
నదియు స్వీయాంబుధారల - నవని నంత
తనిపె నెంతటి వింతయో - ఘనుల యీవి ॥

ప్ర హ ర్ష ణ ము. III

కం॥ తదుపాయసిద్ధి యత్నము
నఁ దదర్థాప్తియుఁ బ్రహర్ష - ణం బెట్లన్నన్ ।
మదిఁగొని నిధికజ్జలమును
ముదమున నావేరుద్రవ్వఁ - బొడవడె నిధియున్ ॥

ఒకవస్తువు నొందఁదలఁచి దాని యుపాయమునకై ప్రయత్నము చేయు నపుడు ప్రధానవస్తువే లభింపఁ బ్రహర్షణమనఁబడు.

నిధినిఁజూపు నంజననిర్మాణమునకై మూలికను ద్రవ్వునపుడు నిధియే బయల్పడెను. మఱియును.

తే॥ గీ॥ చేతికందెడు పూలను - జిదిమి కొమ్మ
కొమ్మచివురంటు విరులఁ దాఁ - గోయనెంచి ।
మ్రానికొమ్మను జరణంబు - నూనునంత
నదియుఁ బదపడి పూచెసం - ముదము హెచ్చ ॥

ఒకస్త్రీ చేతికందెడు పూలనుదుసిరిపి కొమ్మచివురుననున్న పూల్కై క్రిందుమాసినన౯ బాదముంప నదియే పూచెను. స్త్రీపాదాఘాతముచే నశోకము పూయుననిశాస్త్రముగదా!

విషాదనాలంకారము. 68.

కం॥ అభిమత విరుద్ధవస్తువ
నభిమతిఁ బుట్టన్ విషాద - నంబడి పరగున్ ।
ప్రభఁగుందు దీపమెగఁ ద్రో
య భృశము యత్నింప నంత - నది నడఁగుంకెన్ ॥

కోరిన వస్తువునకు విరుద్ధవస్తువు పుట్టినచో విషాదనము. క్రుంకుచున్న దీప మెగఁద్రోయ నది నడిగఁ గ్రుంకెను. మఱియును.

తే॥ గీ॥ రేయిగడచును రేఁబోక - డాయుఁ బొద్దు
పొడము వెలిదమ్మి తనముడి - మోము విరియు।
నంచు ముడిదమ్మిఁ జెఱఁబడ్డ - యళి దలంచు
తఱిని వనకరి పద్మినిఁ - బెఱికె నకట! ॥

మధు పానముచే మత్తిల్లిన తుమ్మెద లోనుండఁ బద్మము ముకుళించి నది. మేల్కాంచిన తుమ్మెద రాత్రిగడచును దెల్లవారును సూర్యుఁ డుదయించును దమ్మివిరియు ననితలంచుచుండఁగనే వనకరి తమ్మినిఁ బెఱికి వైచినది.

ఉల్లాసాలంకారము. 69.

కం॥ పరుని గుణదోషములచే
నొరునకు నవిగలుగ వఱలు - నుల్లాసంబై ।
సరిమున్కాడుదోసము
హరియించుత సాధ్వియని సు - రాపగ యెంచుకా ॥

పరుని గుణముచే నొరునకు గుణమును దోషముచే దోషమును గుణ ముచే దోషమును దోషముచే గుణమును గల్గుట యుల్లాసము. పతి వ్రత తన పతితో సరిమున్కలాడినచోఁ దనకు నాపె పవిత్రత సంక్ర మించునని గంగ తలంచును. మఱియును.

తే॥ గీ॥ తేడ! నీవటు దాడుల - జాడ నుండ
వైరితరుణులు దమకుచ - పాళిఁ గఠిన
తాగుణంబును బాదప - ద్మములఁ గోరి
ధాతఁ దిట్టుదురాత్మల - నేటు దక్కి॥

ఓ రాజా! నీవు వారి భర్తలను జయింప శతృస్త్రీలు వనములఁ బరుగిడుచుఁ గుచముల కాఠిన్యము పాదములకు బ్రహ్మ యేలసృజింపలేదని యతనిని దూషించుచున్నారు. ఆసమయమునఁ బాదములకు మార్దవము దోషము. దానిచే దానిని సృజించిన ధాతకు దోషమారోపింపఁబడెను.

ఇతరుల గుణముచేఁ బరులకు దోషమును, దోషముచే గుణమును గల్గుటెట్లన?

తే॥ గీ॥ అవని సజ్జనసంగతి - నరయ నట్టి
ధనమునకె వింతదోషంబు - దవ్వులు నరయ!
భూపసేవకు లిల వధఁ - బొందకుంట
భూరిధనలాభ మద్దియె - వారి కగును॥

సజ్జనత్వమనెడు నుత్తమ గుణముగల మనుజుల నాశ్రయింపకుండుట ధనమునకు దోషము. రాజునకుఁ గ్రూరభావము దోషము దానిచే వాని సేవకులకు వధములేకుండుట గుణముగాఁ జెప్పఁబడినది.

మఱికొన్ని యుదాహరణము లెట్లన?

ఆ॥ వె॥ వారువముల వడినిఁ - దేఱు వేపాఱఁగా
నంసమంస మెంతో - యత్తుకొనియె
నంగమద్ది యొకటె - యుండె సార్థక్యంబు
శేషమంగ మిలక - శేషభరము॥

విక్రముఁడూర్వశిని రథముపై నిడుకొని వచ్చుచు నిట్లుతలఁచెను. రథవేగముచే నామె భుజము నతని భుజ మత్తుకొనినది. అది సార్థకమాయెను. అట్లుకాకుంటచే రెండవది నిరర్థకమాయెను. నాయిక

యొక్క యంగమునకు సౌందర్యాతిశయము గుణము. దానిచే నాయం గమునంటిన యతని భుజమునకు సఫలతయనెడు గుణము చెప్పఁబడినది. దోషముచే దోషమెట్లన ?

చం॥ చరచర వీడుమీవనము - చందన ! నందితలోక ! మిత్ర ! యిం
దరయఁగనుండు శూన్యహృద - యంబులు కర్కశదుష్టవంశముల్ ।
విరివిగ నగ్ని ఘర్షణజ - భీకర పావక దీర్ఘ కీలలన్
గరము నిజోచ్చరూపమునె - కాక దహించును గాన నంతయున్ ॥

అన్యాపదేశము. ఓచందనవృక్షమా ! యీయడవినుండి తొలఁగిపొమ్ము లేనిచో నిచ్చటి వెదురుడొంకలు తామంటుకొని యడవినంతయును గాల్చును. తమలోఁదాము కలహించుకొను జ్ఞానశూన్యులచెంత నివసించు సజ్జనునిగూర్చి వారిని వదలిపోవలయుననెడు నప్రస్తుతార్థము గోచరించుచున్నది. వెదురుల మధ్యభాగమున నవకాశముండును. పైనఁ గాఠిన్యముండును. దుష్టులకు హృదయము జ్ఞానశూన్యము మఱియు దయారహితము. వెదుళ్లకు రాపిడిచే నగ్నిపుట్టించుట దోషము. దానిచే వనమునకును గాలుట దోషము.

ఉ॥ దానముగోరి తేంట్లుద్విర - దంబును జేర మదాంధబుద్ధియై
వీనులఁగొట్టి దవ్వుల ద్ద్యు - వీధికిఁ బోవెలిఁబెట్టుఁగాదె ! య ।
ద్దాన గజంబుగండముల - దండనె మండనహానియౌ మృదు
స్నానముసేయు నామధుప - సంతతి పద్మవనంబు సేరెడున్

మదమును గోరివచ్చిన తుమ్మెదలను గజము వెడలఁగొట్టినను నవి తమ యాహారమును బొందుటకుఁ బద్మవనముఁ జేరుచున్నవి.

ఇట మధుపములు గజగండములకు భూషణమగుట గుణము. దానిచే గజము వానిని దూరముగఁ దోలుట దోషముగాఁ జెప్పఁబడినది. దోషముచే గుణమునకు నుదాహరణమెట్లన ?

ఉ॥ వంతున మూర్ఖునెన్ బెదవిఁ - బట్టెను నాల్కను జప్పరించెఁ బె
న్వింతగఁ బంటనొక్క నట - నీరస మంచుమిసెంగ దే ! యటం ।

చింతగ వంతనొందనగు నే - మణిరాజమ! కోతిచేత నీ
కింతియ మేలు లోఁగలిమి - నెంచఁ బగుల్పమి రాలఁజెచ్చెరన్ ॥
కోతి తనచేతఁజిక్కిన రత్నము నిన్నిరీతులఁ బరీక్షించి తుదకు నీరసమని యుమిసినది. దానినొక కవి చూచి రత్నమును సంబోధించి యిట్లో దార్చినాఁడు. ఇట వానరదోషము చపలత్వము, దానిచే రత్నమునకు రూపహాని లేకుండుట గుణముగా వర్ణింపఁబడినది. ఉత్కృష్టమగు నుల్లాసముకలది యను నర్థముచే నీయలంకారమున కుల్లాసమనిపేరు సార్థకము. ప్రథమ చతుర్థోదాహరణముల నీయుల్లాస మన్వర్థము. ద్వితీయ తృతీయోదాహరణముల ఛత్రిన్యాయముచే లాక్షణికము. ఛత్రిన్యాయమనఁగాఁ గొందఱు గొడుగులను ధరించి నడచుచుండ నాగుంపులోఁ గొందఱు గొడుగులు ధరింపకున్నను గొడుగులున్న వారితోఁగలిసిన లేనివారికిఁగూడ గొడుగులుకలవారనియే వ్యవహారమువచ్చును. ఇట్లే గుణముచే గుణము దోషముచే గుణము వర్ణింపఁ బడిన మొదటి నాల్గవ యుదాహరణముల నుల్లాసమన్వర్థము. అచ్చట సంతోషముంటచే. రెండు మూడవ యుదాహరణముల సంతోషము లేకున్నను గుణదోష సంబంధము మాత్రము వర్ణింపఁబడుటచే నుల్లాస పదము లాక్షణికమని భావము.

అ వ జ్ఞా లం కా ర ము. 70.

కం॥ పరుని గుణదోషములచే
నొరునకు నవి గలుగకున్న - నుర్వీ తలమం।
దు రహి నవజ్ఞాలంకృతి
బెరయును గవివరుల సమితి - విస్మయ మొందన్ ॥

కం॥ దొరకొన సలిలముఁ బ్రస్థం
బొరగియు వారాశి నల్ప - ముదకము నెకొనున్ ।
సరసిజములు మొగిడినఁబో
యురయఁగఁ గీడేమి గల్గు - నమృత ద్యుతికిన్ ॥

పరుని గుణదోషములచే నొరునకు నవి సంక్రమింపకున్నచో నవజ్ఞాలంకారమగును. సముద్రమున జలసమృద్ధి గుణము. దాన మున్గిన కుంచమునకు నాగుణలాభము గలుగలేదు. చంద్రోదయమునఁ గమలములు ముడుచుకొనుట వానికి దోషము. అయినను జంద్రునకు దోషాభావము వర్ణింపఁబడినది. మఱియును :–

చం॥ అలరు మదీయవాణి సుధ – యట్లు సుధీహృదయంబులన్ రసా
కలిత మొనర్పు, మూఢమతి – గైకొనమిన్ గొదువేమి గల్గు, సాం।
ద్రుల మురిపించు చూడ్కికొనఁ – బ్రౌఢ గలంచు యువాళి మానసం
బుల, నటు కాక యొప్పునె? య – బోధ కుమారుల నట్లు సేయఁగన్ ॥

ఒక కవి యిట్లనుచున్నాఁడు. నాకవిత విద్వాంసులను సంతోషపెట్టినఁ జాలును. మూర్ఖులు దానిని గ్రహింపకున్నచో నాకులోటు లేదు. ప్రౌఢ తన యొరచూపుచే యువకుల నాకర్షించును. బాలుర నాకర్షింపఁజాలదు.

ఇట కవితయొక్క గుణముచే నరసికులకును, ప్రౌఢస్త్రీగుణముచే బాలకులకును హృదయోల్లాసరూపమగు గుణము సంభవింపలేదు. మఱియును.

ఉ॥ ఎద్దును నెక్కు దిక్కరుల – కేమి ఘటిల్లె లఘుత్వభావమే,
ప్రొద్దునఁ దాల్పఁ బాపఁదొడ – వుల్ నునుబంగరు పొందు కీడదే।
మద్దిర! నెత్తిఁ బూనఁ గజ – లాంశు జగత్త్రయరత్నదీపమా।
ప్రొద్దున కేమి లొచ్చు! జగ – ముల్ దొరవోట నికెట్లు దూఱెదన్॥

శంకరుఁడు ప్రత్యక్షము కాకుంటచే నొకభక్తుఁడు శివునిఁగూర్చి యిట్లనెను. దిక్కరులవిడిచి యెద్దునెక్కు వానికేమి కొదువగల్గినది? పద్యార్థము సుబోధము. దిగ్గజముల నాదరింపకుంట దోషము. కాని వానికా దోష మంటలేదు.

## అనుజ్ఞాలంకారము. 71.

కం॥ దోసము గోరుట నుజ్ఞ స
మాసాదిత మాట నట స – మంచితగుణ మే

యే సమయమునను నిడుమలు
పై సోఁకుత ! విష్ణుభక్తి - వర్ధిలు కతనన్ ॥

మంచిగుణములు లభించును గాన దోసము కోరుట యనుజ్ఞాలంకార మగును. సర్వకాలములఁ గష్టములుకలుగుట మంచిది. దుఃఖసమయమున విష్ణుభక్తి కలుగునుగాన. మఱియును.

తే॥ గీ॥ ఈవుసేసిన యుపకృతి - యెల్ల హనుమ !
నాదు చెంతనె జీర్ణింప - నోఁ దలంప
నెంచఁ బ్రత్యుపకృతిని వాం - ఛించు నరుఁడు
పూని యిడుములఁ గోరువాఁ - డౌను దానె ॥

హనుమంతునిఁ గూర్చి శ్రీరామవాక్యము. ఓహనుమ ! నీయుపకారము నాచెంతనే నిలుచుఁగాక. నీయుపకారమునకుఁ దగిన ప్రత్యుపకారము లేదనిభావము. మఱియు నుపకారమును జేసినవాఁడు ప్రత్యుపకారమును గోరినచోఁ దనకుఁ బుణ్యము తగ్గునుగాన నట్లుకోరుట కీడును గోరుకొనుటయే యగునని భావము.

ఇట యుపకారికిఁ బ్రత్యుపకార మొనరింపకుండుట దోషము. ఆదోషము నంగీకరించుటలో విపత్తినిఁ గోరకుండుట యనెడు గుణము హేతువుగా గ్రహింపఁబడినది. అదియును వైధర్మ్యరీతినిఁ బ్రసక్తమగు సామాన్యముచే విశేషమును సమర్థించుట యనెడు నర్థాంతరన్యాసముచేఁ జూపఁబడినది.

అది యెట్లన ? ప్రత్యుపకారము నభిలషింపనివాఁడు విపత్తినిఁ గోరుటలేదు. ఈయర్థము పద్యమందలి యుత్తరార్థముయొక్క యర్థమునకు వైధర్మ్యముచేఁ బ్రసక్తమగు నర్థము. ఇది సామాన్యము. దీనిచే హనుమంతుఁడు ప్రత్యుపకారమును గోరరాద నెడు విశేషార్థము సమర్థింపఁబడినది. ఈయర్థము గుణము. ఇది పైదోషమును గోరుకొనుటలో హేతువుగా గ్రహింపఁబడినది. మఱియును :-

మ॥ అల పై శాచికరూపమొంది భవద - భ్యాశంబు సేరంగ మా
వలపౌ, భూతపతీ! తలంపమమర - పార్థ్యంబులా భాగ్యరా
సులు, నీవాసగృహాంగణంబున శచీ - శుండాదిగా దిక్పతుల్
సలియన్ నిల్తురు వక్రతుండ కరదం - డ ధ్వంసితో క్షీణులై ॥

శివభక్తుని వచనము. పిశాచరూపము నొందినదైనను నీనివాసమగు
× కాటినిఁ జేరఁదలఁచుచున్నాము. ఇంద్రాదుల భోగములనుఁ గోరము.
వారుగూడ నీయింటిముందు వినాయకుని తొండముదెబ్బలు తినుచు
నీదర్శనమునకై వేచియుందురు.

ఇంద్రాదులచే సేవింపఁబడుట యనెడుగుణము అనఁగా మేలు
సంభవించుటచేఁ బిశాచరూపమను దోషముగూడఁ గోరఁబడినది.

లే శా లం కా ర ము. 72.

కం॥ ఇల దోషగుణములకు నెం
చలలిని గుణదోషభావ - సంగతి దెలుపన్
వెలయును లేశాలంకృతి
తిలకింపఁగ సత్కవీంద్ర - దీవ్యత్కృతులన్ ॥

కం॥ కలతమరుతముల నలుది
క్కుల విహగము లొలసి కలసి - కూయుచుఁదిరుగన్
చిలుకా! పంజరబంధము
పలుకుల తియ్యందనంపు - ఫలమటె! నీకున్ ॥

దోషగుణములను గుణదోషములుగాఁ దలంచుట లేశాలంకారము.
రాజాస్థానమునఁ జిక్కుకొనియున్న విద్వాంసుఁడగు తనకొమరునిఁ
జూడ నవకాశమునొందని తండ్రి యిట్లనుకొనుచున్నాఁడు. ఇతరము
లగు పక్షులు స్వేచ్ఛగఁ దిరుగుచుండ నోచిలుకా! నీకుఁ బంజరబంధము
తియ్యని పల్కులకు ఫలమని.

ఇతరములగు పక్షులకుఁ దియ్యని పలుకులు లేకుండుట దోషము.
అది గుణముగాను, చిలుకకుఁ దియ్యని పలుకులుగుణము, అది దోషము
గాను దలంపఁబడినది,

ఇట వ్యాజస్తుతియని తలంపరాదు. పశువుల స్తుతినిందల నెపముచే నితరుల నిందాస్తుతులయందుఁ గవికిఁదాత్పర్యము లేకుంటచేత. మఱి యేమన? కుమారునిఁజూడ వీలుగాకుంటచే గుణము దోషముగను దోషము గుణముగను దలంపఁబడెను. మఱియును :–

ఉ॥ పావనవృత్తతత్పరత – స్వైరవిహారముమీడి దుర్యశో
భావనభీతులై కరము – వందుచు నేలఁజరింతు౹ సజ్జనుల్ ।
వావిరిమంచిచెడ్డల వి – భాగము నేర్వక కుందఁబోక తా
నేవిధి దూఱువడ్డ సుఖ – యించెడు మూఢుఁడు ధన్యుఁడౌఁగదా!

నిర్దుష్టజీవనమునుగోరి యపకీర్తియమునకు వెఱచి స్వేచ్ఛగ విహరింపక సజ్జనులు కష్టముగ జీవింతురు. వివేకశూన్యుఁడు తాను దూఱువడినను గుందక స్వేచ్ఛాసంచారియై సుఖించును. సజ్జనజీవనము గుణమైనను దోషముగను, మూర్ఖజీవనము దోషమైనను గుణముగను, దలంపఁబడినది.

అచార్యదండియొక్క లేశాలంకారలక్షణ మెట్లన ?

కం॥ స్తుతినొండె నిందనొండె జ
గతి లేశంబుగను జెప్పఁ – గా లేశమగున్ ॥

స్తుతినిగాని నిందనుగాని లేశముగ ననఁగాఁ గొలఁదిగ వర్ణించినచో నది లేశమగును. దీనికతని యుదాహరణ మెట్లన ?

తే॥ గీ॥ బలిమి ప్రాయంబు సద్గుణ – ములను గల్గి
కామకేళిని మించి సం – గ్రామకేళి
నుత్సహించెడు నీరాజు – యోగ్యపతిగఁ
గాంచి చేకొంట నీకుయు – క్తంబు తరుణి! ॥

స్వయంవరమున రాకుమారినిఁగూర్చి సఖీవచనము. ఇట నిరంతర సంభోగసుఖమునుగోరు కన్యకకు రాకుమారుని సంగ్రామాసక్తి దోషము. అట్లయ్యు నాతనికిఁ గోపము రాకుంటకై దానిని గుణముగా వర్ణించినది. మఱియును :–

ఆ॥ వె॥ చంచలాత్ముఁడితఁడు - వంచనా చతురుండు
నీనిపొందు నాకు - వేడ్కగాదు
సఖియ! నీనితప్పు - సవరించు కొంటకై
చాటుశతము నీఁడు - చక్కనేర్చె॥

చెలులు నాయకునిచెంత మానము కాపాడుకొనుమని నాయికకు బోధించిరి. ఆపెవల్లె యనిచెప్పి యట్లుచేయఁజాలక వారు పరిహాసింప వారితో నిట్లనియె. నాయకునియొక్క చాటుచాతుర్యము గుణమయ్యు నాయికచే దోషముగా గ్రహింపఁబడినది.

మొదటి పద్యమున స్తుతినిందచేతను రెండవపద్యమున నింద, స్తుతిచేతను స్ఫురింపఁజేయుటచే నీపద్యములు వ్యాజస్తుతికి నుదాహరణములగుట తగునని నుడువరాదు. రాజునకుఁ గోపమురాకుంటకై పరులకుఁ దెలియనిరీతిగ నిందాస్తుతులను లేశముగఁ జెప్పఁదలఁచుటచే వ్యాజస్తుతికన్న విశేషము కలదుకాన.

ఆలోచింపఁగా నిట వ్యాజస్తుతియున్నను నుండవచ్చును. అంత మాత్రముచే లేశాలంకారమునకు శుద్ధమగు నుదాహరణము లేకపో లేదు. వ్యాజస్తుతియొక్క సంపర్కము లేని "కలతమరుతములు" "పావనవృత్తతత్పరత"యను నుదాహరణములు చూపఁబడినవి. అటులే వ్యాజస్తుతికిఁగూడ లేశాలంకారముయొక్క సంపర్కములేని "నీవె వ్వడవున్నోతి" "నిగుడన్ జూడవు" అను పద్యము లుదాహరణముగ నీయఁబడినవి. ఈపద్యముల నన్యనిందచే నన్యస్తుతియును నన్యస్తుతిచే నన్యనిందయును స్ఫురించుటచే, దోషగుణములను గుణదోషములుగ నొనర్చుటయనెడు లేశాలంకారలక్షణ మెంతమాత్రమును బ్రసంగిం చదు. ఇట్లు భిన్నవ్యక్తివిషయక వ్యాజస్తుతియందే కాక యేకవ్యక్తి విషయకమునను లేశాలంకార ప్రసక్తిలేదు. ఎట్లన?

చం॥ అమృతమరీచి యంకము పు - రారి గళంబు మురారి దేహమున్
సమదహరిత్కరీంద్ర మద - సార మహీపరిలిప్త గండభా

గములును నేటికిన్ నిబిడ – కాలిమగల్గి కనంబడున్ గదే!
విమలత దేనికబ్బె? పృథి – వీ తిలకా! భవదచ్ఛ కీర్తులన్ ॥

ఇట్టి స్థలముల వ్యాజస్తుతియేకాని లేశాలంకారప్రసక్తి యెంత మాత్రమునులేదు. ఓరాజా! నీకీర్తిచే బ్రహ్మాండమంతయును దెల్లఁబడెనని తలంచుచున్నావు కాఁబోలును, చంద్రునిమచ్చ మున్నగునవి నేటికిని నల్లగనేయున్నవి. ఇట చంద్రికలంకాదులకుఁ దెల్లఁదనము గలుగఁజేయలేకపోవుట రాజయశస్సునకు దోషము. అది లేశాలంకారములోవలె గుణముగాఁ బర్యవసించుటలేదు. మఱియేమన? చంద్రకళంకాదులే నల్లగనున్నవిగాని తక్కిన జగమంతయును రాజకీర్తిచేఁ దెల్లబాఱెనని పరిసంఖ్యచే మఱియొక గుణము రాజకీర్తికి స్ఫురింపఁ జేయఁబడుచున్నది.

ఎట్లైనను వ్యాజస్తుత్యుదాహరణముల గుణము దోషముగాఁ జెప్పఁబడినను నంతమాత్రముచేఁ బర్యవసానము నొందక మఱియొక స్తుతిగూడ స్ఫురించినచో నచటఁగూడ లేశాలంకారమనరాదు. ఎట్లన?

తే॥ గీ॥ ఎల్లకోర్కెల నెల్లర – కిత్తు వనుచు
బుధులు పొగడుదురయ్య నిన్ – బూటకముగ
వైరులకు నీవు నీపృష్ఠ – భాగ మధిప!
వక్షమది యీవుగా! పర – భామినులకు ॥

ఓప్రభూ! నీవు వైరులకు వెన్నునిచ్చుటలేదు. పరకాంతలకు నక్కునిచ్చుటలేదు. కాన సర్వదాతవని యెట్లనవచ్చును. ఇట నింద వాచ్యమగుచున్నది. పరిసంఖ్యావిధిచే నారెంటినిఁ దక్క సర్వము దానము చేయంబడెనని మఱియొక స్తుతి గోచరించుచున్నది. ఇట్లు నిందచే స్తుతి గోచరించుచున్నదికాన నిట వ్యాజస్తుత్యలంకారము.

వైరులకుఁ బృష్ఠభాగమును బరకాంతలకునక్కు నీకుంట రాజునకు గుణము. కాని యది దోషముగ గ్రహింపఁబడినది. అంతమాత్రమున లేశాలంకారమనరాదు. నిందచే మఱియొకస్తుతి గోచరించుటచే.

ఈరీతిగ లేశవ్యాజస్తుతులకు సాంకర్యములేనట్టి యుదాహరణములీయబడినవి. ఎచ్చటనైనను సాంకర్యముకల్గినను గలుగవచ్చును. ఎట్లన? "శౌర్యగర్వము రాజేంద్ర! కార్యమగునె" ఇది మున్నగుచోట గుణదోషములను దోషగుణములనుగా నిరూపించుటయే వ్యాజస్తుతిరూపమున నుండినదికాన నచ్చట రెండలంకారములకును సాంకర్యముండిన నుండవచ్చును. ఈరీతిగ వ్యాజస్తుతి-అప్రస్తుత ప్రశంసలకుఁ గూడ సాంకర్యము లోఁగడఁ జూపఁబడినది.

ము ద్రా లం కా ర ము. 73.

కం॥ వాచ్యార్థమంటు పదముల
సూచ్యార్థముదెలుప ముద్ర - చొప్పడు హరిణీ
యూచ్యాక్షియుగళి విపులత
రుచ్యనితంబతను నాపె - రుచికందమగుౘ ॥

వాచ్యార్థమును దెల్పు పదములచే సూచ్యార్థమునుగూడఁ దెల్పినచో ముద్రాలంకారమగును. ఆడలేళ్ల చేతఁగూడఁ గోరఁదగిన కన్నులవైశాల్యముచేతను మోహజనకమగు నితంబముచేతను నాపె కోరఁదగియున్నది. ఈపదములలో రుచికందమనెడు పదముచే నీవృత్తము కందవృత్తమని సూచింపఁబడెను. ఆలోచింప ఛందశ్శాస్త్రమున వృత్తనామమును సూచించుట తగునుగాని యలంకారశాస్త్రమునఁ దగదు. అట్లైన నెట్లో సమన్వయించుకొనఁదగు.

ఇట్లే నవరత్నమాలయనెడు పద్యమాలలోను నక్షత్రమాలయనెడు పద్యమాలలోను రత్నజాతుల నామములను నక్షత్రములను సూచించుటగూడ ముద్రాలంకారమే యగును. నాటకముల వక్ష్యమాణార్థమును సూచించుటగూడ నీయలంకారమునకు లక్ష్యమగును. ఎట్లన?

తే॥ గీ॥ న్యాయపథమును విడువని - నరునితోడఁ
బులుగు లామెకములు గూడఁ - జెలిమి సలుపు।

చెట్టతోఁ బ్రవను గోరికఁ – బట్టి తిరుగు
నట్టివానిని విడుచుఁదోఁ – బుట్టు గూడ ॥

అనర్ఘరాఘవ నాటకములోనిది. శ్రీరామచంద్రునకు జటాయువు నుడుతయును సాయమొనర్చినవనియు రావణుని విభీషణుఁడుగూడఁ బరిత్యజించెననియు వక్ష్యమాణవృత్తాంతమును సూచించుటచే నిట ముద్రాలంకారము,

రత్నావళి – అలంకారము. 74.

కం॥ విమలతఁ బ్రకృతార్థములకుఁ
గ్రమిక ప్రతిపాదనంబు – రత్నావళి యా।
సమరున్ జతురాస్యుండని
సము నీతని శ్రీధవుండు – సర్వజ్ఞుఁడనన్ ॥

ప్రకృతములగు నర్థములకు శాస్త్రపురాణలోకక్రమము ననుసరించి క్రమము చెప్పఁబడినచో రత్నావళియగును. వర్ణ్యమాన ప్రభువును బ్రహ్మవిష్ణుమహేశ్వరులతో సమానునిఁగాఁ జెప్పుచుఁ బురాణములోని దేవతాక్రమముగూడ గ్రహింపఁబడినది. మఱియును :–

మ॥ రతిసక్తప్రియలాంఛనంబు,శ్రితకా – ర్కశ్యాప్త సారస్యమున్,
ధృతిఁ బ్రహ్లాదపరంబు,సక్రమగతిన్ – భూభృత్సమయోద్ధ్వంసిను
ద్ధతచక్రప్రవిరోధి,భోగియు,స్మరో – ద్ధారిన్, ఖలీనోన్ముఖం
బు,తగన్ నీకుచపాళి వెన్ను పదిరూ – పుల్ వొంది నర్తించెడున్॥

ఇట తరుణీస్తనపరముగను దశావతారపరముగను నర్థద్వయముకలదు. ఎట్లన ! స్తనము రతిసక్తులగు ప్రియులయొక్క నఖక్షతములు లాంఛనములుగాఁ గలది. కాఠిన్యముగలది. సరసత్వముకలది. అనఁగా శృంగార రసమును బురిగొల్పునది. ప్రకృష్టమగు నాహ్లాదముకలది. సంతోషము గూర్చునదియని యర్థము. క్రమవృద్ధి కలది. పర్వతములఁ బోలియున్నది. చక్రవాక సామ్యముకలది. చందన చర్చాది భోగములుకలది. మన్మథోద్రేకమును గల్గించునది. ఖ :– ఇంద్రియ సుఖమందు, లీన :–

ఆసక్తిగల కాముకులకు ఉన్ముఖంబు :- అనుకూలమైనది. దశావతార వర్ణన కెట్లన? మత్స్యఫలాంఛనము మత్స్యము. శ్రితకార్కశ్యము :- పై భాగమునఁ గాఠిన్యముగలది కూర్మము. శ్రితపారస్యము :- భూమి నెత్తినపుడు నీటఁ దడిసినది. వరాహము. అట్లే నారసింహము. క్రమ వృద్ధిగల వామనుఁడు. క్షత్రియుల గర్వమడఁచిన పరశురాముఁడు. విహాగసమయమునఁ జక్రవాకములకు శాపమిచ్చిన శ్రీరాముఁడు. భోగి :- శేషావతారమగు బలరాముఁడు. స్త్రరోద్ధారి :- ప్రద్యుమ్నునిఁ గన్న శ్రీకృష్ణుఁడు. ఖలీన :+ ఉన్ముఖము :- అశ్వరూపముగు కల్కి.

ఓతరుణీ! ఈ దశావతారములును నీకుచపాళి నాశ్రయించి వర్తించుచున్నవని యన్వయము. ఇట లోకప్రసిద్ధమగు దశావతారములు గ్రమముతప్పక వర్ణింపఁబడినవి. మఱియును.

చం॥ పనిచెను లేఖ వాదుడెలు - పన్ గనుసోగ సరోజశోభకున్
వినిచెను బూర్వపక్షసర - ణిన్ గుచభారము కుంభలీల క।
ద్దిన బొమతీవతీరనువ - దించెను మారశరాస విభ్రమం
బనయము నాపెమోమురుచు - లైందవ రోచికి దూషణంబిడెన్॥

ఆపె కనుసోగ సరోజశోభకు వాదుకొఱకు లేఖఁబంపెను. అనఁగా నాపెకన్నులు పద్మములను బోలియున్నవని యర్థము. ఇట్లే తక్కిన యవయవములఁ బూర్వపక్షము, అనువదించు, దూషణమిడు ననెడు పదములచే నాయాయి వస్తువులతో సాదృశ్యము బోధింపఁబడుచున్నది,

ఇట ప్రస్తుతార్థములకుఁ దగినట్లు వాదముచేయునపుడు పండిత లోకమునఁ బ్రసిద్ధమగు లేఖపంపుట, పిమ్మటఁ బూర్వపక్షముచేయుట యును, ననువాదము చేయుటయు, నంతమున వాదిచేఁజూపఁబడిన హేతువులను దూషించుట, యనెడుక్రమ ముపన్యసింపఁబడినది.

ప్రసిద్ధక్రమమును విడిచియును బదార్థములు వర్ణింపఁబడుచో నీయలంకారము కావచ్చును. ఎట్లన?

వచనము :- ఏప్రభువు ప్రతాపము శత్రువుల యంతఃపురములో వహ్నిమయమై లోచనముల జలమయమై నిట్టూర్పుల మారుత

మయమై యంగముల క్షమామయమై యనఁగా నంగములు పీడను సహించునవిగానఁ బృథివీమయమని చెప్పఁబడినది. అంతఃకరణ మాస మయమున శూన్యమగుటచే నాకాశమయమై ప్రవర్తించినది. ఇట పంచభూతములు క్రమమువిడిచి వర్ణింపఁబడినను నలంకారము కలదు.

ఇట్లు దిక్పాలురయొక్కయు నవగ్రహములయొక్కయును గ్రమ ముపమానరీతిగఁగాని రూపకరీతిగఁగాని ప్రకృతార్థముతో సంబంధింపఁ జేసి వర్ణింపఁబడినచో రత్నావళియగును.

ప్రకృతముతో సబంధింపకున్నను శ్లేషచేఁ గ్రమికపదార్థము లను గ్రమముతప్పక వర్ణించినను లేక క్రమమువిడిచి వర్ణించినను రత్నావళి పొసఁగును. ఎట్లన ?

తే॥ గీ॥ మిత్ర ! చంద్రాస్య యీబాల – మీననేత్ర ॥

ప్రకృతార్థముతో సంబంధింపకున్నను శ్లేషవశమున సూర్యచంద్రుల యొక్క క్రమము చెప్పఁబడినది.

తే॥ గీ॥ గురువృజఘనంబు చెలఁగనీ – తరుణి ధరణి

మందగామిని యాట యా – నందమార ! ॥

ప్రకృతముతో సంబంధము లేకున్నను శ్లేషచే గురుశనులయొక్క బోధము కల్గుచున్నది. గురుశనులకు నియతక్రమమును లేదు. అయినను రత్నావళి కలదు. మూలగ్రంథములోనిది కాకున్నను నొకచాటు వీయలంకారమునకుఁ జమత్కారియగు నుదాహరణమగుటచేఁ జూపు చున్నాను.

కం॥ ~~తే॥ గీ॥~~ ఏమీననఁ దాబేలన

నాముంగిటికి కేలరాఁడు – నరహరి పిన్నన్ ।

రాముని మున్మారంపితిఁ

బ్రేమముతో బుద్ధి సెప్పి – పిలువుము కల్కి ! ॥

ఇట దూతీప్రేషణము ప్రకృతముకాఁగా దశావతారములును వరుస తప్పక చూపఁబడినవి.

తద్గుణాలంకారము. 75.

కం॥ వెలయన్ స్వగుణమువిడి య
న్య లలితగుణగరిమ నొంద - నగుఁ దద్గుణమై।
చెలి! నీముక్కున ముత్తెం
బలరారును గెంపువోలె - నధర ద్యుతిచే॥

స్వగుణమును విడిచి యధికమగు నన్యవస్తుగుణమును గ్రహించుట తద్గుణమగును. ఓచెలీ! నీముక్కున ముత్తెము పెదవియొక్క యెఱుపుచేఁ దన తెల్లఁదనమును విడిచినది. మఱియు దాని యెఱ్ఱందనమును గ్రహించినది. మఱియును.

తే॥ గీ॥ రాజదురు తేజ! నీశత్రు - రమణి, కట్టుఁ
గోకగాఁగట్టఁ జివురులఁ - గోయ నంటి।
గోళ్ల తెలికాంతు లవ్వానిఁ - దెల్లపఱుప
నెల్ల యాకులటంచు భా - వించి విడుచు॥

ఓప్రభూ! నీశత్రురమణి యడవులఁబడి యెఱ్ఱని చివుళ్లను గోకగాఁ గట్టఁ గోయనెంచి విరహాపాండిమచేఁ దెల్లని గోళ్లకాంతులు ప్రసరింప వెల్లయాకులని తీయకుండె.

చివురులు తమరక్తిమనువీడి గోళ్ల తెలికాంతులను గ్రహించినవి. కానఁ దద్గుణాలంకారము.

పూర్వరూపాలంకారము. 76

కం॥ మగుడన్ స్వగుణము నొందుట
యగుఁగవిమతిఁ బూర్వరూప - మనఁగన్ శితికం।
ఠ గళాంశు లిప్తునును బ
న్నగపతి నీయశము సేసె - నరవర! ధవళున్॥

విడిచిన తనగుణము నొందుట పూర్వరూపము. ఓప్రభూ! హరుని యొక్క గళకాంతిచే నల్లనగు శేషునిఁగూడ నీకీర్తి తెల్లనివానినిఁగాఁ జేసినది. శేషుఁడు తన తెల్లఁదనమును దిరిగి పొందినటులు వర్ణింపఁ బడెను. మఱియును :-

ఆ॥ వె॥ అరుణకాంతి పర్వ - నాత్మవర్ణము వేఱు
భంగి మాఱు సూర్య్య - వాఱువములు ।
వెనుతురులను బోలు - పృథు నీలమణి రుచిన్
గాంచె నేడ నైజ - కాంతి మగుడ ॥

రైవతకగిరి వర్ణనము. నీల వర్ణములగు సూర్యాశ్వము లరుణుని కాంతిచే రక్తిమను బొంది రైవతగిరిచెంతఁ బోవునపుడు నచటి నీల కాంతమణుల కాంతులచేఁ దిరిగి తమ నైల్యమును బొందినవి. రైవతకము మిక్కిలి యెత్తుగ నున్నదని భావము.

దీనినిఁ గొందఱు తద్గుణాలంకారమునుగానే చెప్పిరి. నీలకాంతిని వదలి యరుణకాంతినిఁ బొందుట యొక తద్గుణము. తిరిగి నీలకాంతినిఁ బొందుట మఱియొక తద్గుణమనియును జెప్పిరి.

పూ ర్వ రూ పా లం కా ర ము. II.

కం॥ ఉర్విఁ దొలఁగినను నొక్కటి
పూర్వస్థితి వర్తనంబు - పొల్చును నట్టుల్ ।
నిర్వాణమువో దీపము
ఖర్వముగాఁ గాంతిపర్వెఁ - గాంచీ మణులన్ ॥

వస్తువొకటి దొలఁగిపోయినను బూర్వస్థితి గన్పడుట పూర్వరూపాలంకారము. దీపమారిపోయినను గాంచీమణులచేఁ గాంతికి విరామము గలుగలేదు. మఱియును.

ఉ॥ ద్వారమునందు ఖడ్గులు, మ - దచ్యుతి దృప్తగజాళి బైట, దు
ర్వారముగా స్ఫురన్మణిధ - రంబులు లోనఁదిరుంగుఁ గంచుకుల్, ।
చేరెడుఁ దల్పపాళి మహి - మీగణ మోనృపశేఖరా ! భవ
ద్వైరుల శూన్యగేహముల - వర్తిలు నేడును రాజ్య భావముల్ ॥

ప్రభువునుగూర్చి కవివచనము. ఇట శత్రువుల శూన్యగృహములందుఁ గూడ రాజ్యస్థితి చూపఁబడెను. ఖడ్గులు :- ఖడ్గమృగములనెడు ఖడ్గ ధారులు; ద్వారమందునను; బైట మత్తగజములును. అంతఃపుర

భూములయందు మఱులను ధరించిన సర్పములనెడు సౌవిదల్లురును. శయనభూములయందు మహిషస్త్రీలనెడు రాజభార్యలును గలరు. శత్రుగృహములు దిబ్బలగుటచే నడవులు మొలిచినవని భావము. ఇది శ్లేషమూలము. మహిషీగణము :- ఎద్దెలగుంపు.

అ త ద్గు ణా లం కా ర ము. 77

కం॥ చిరసంగతాన్య గుణముల్
ధర నొందక యుంట యగు న - తద్గుణము తిగన్ ।
సిరరాగము కల మనమునఁ
జిరముంచితిఁగాని రక్తిఁ - జేకొనవకటా ! ॥

చిరకాల సంబంధము కల్గినను నన్యవస్తుగుణములు సంక్రమింపకున్నచో నతద్గుణమగును. ప్రియునిఁగూర్చి కాంతావచనము. లక్ష్యము స్పష్టార్థము. రాగమనఁగా ననురాగమనియు రక్తిమయనియు నర్థద్వయము సమన్వయించుకొనఁదగు. మఱియును.

మ॥ విహరించున్ మదవారి నీలముల ది - గ్వేదండ గండంబులం
దు హరించున్ రిపుకామినీ నయన సం దోహాంజన శ్రీల నో ।
నృహరీ ! భూమిపతీ ! యనైనను భవ - న్నిర్మిద్ర కీర్తిచ్ఛటల్
రహియించున్ శరదిందు సుందరరుచిన్ - లాలించి నల్దిక్కులన్ ॥

ఓనరసరాజా ! నీకీర్తి మదవారిచే నల్లనగు దిగ్గజగండభాగముల విహరించినను, శత్రుకాంతల కంటికాటుకలను హరించినను, దన ధవళిమను విడువలేదు. ఇట కీర్తికిఁ జిరసంగతమగు నన్యవస్తువుల నైల్యము సంక్రమింపలేదు.

అన్యవస్తుగుణము మఱియొకదానికి సంక్రమించుటయు సంక్రమింపకుండుటయు ననెడు లక్షణములుకల యుల్లాసాలంకారము, అవజ్ఞాలంకారముకన్న నీతద్గుణ-అతద్గుణములకు భేదమేమనిన ?

ఉల్లాసము-అవజ్ఞయనెడు నలంకారముల; గుణమనఁగా దోషప్రతిపక్ష మర్థము. తద్గుణాతద్గుణముల రూపరసగంధములనెడు ద్రవ్యగుణ మర్థము.

మఱియు నుల్లాసావజ్ఞలయందు నన్యవస్తువునకు నన్యవస్తుగుణ మదియే సంక్రమింపవలెననియును సంక్రమింపరాదనియు నర్థముకాదు. మఱియేమన ? గురూపదేశముచే సచ్ఛిష్యునకును అసచ్ఛిష్యునకును జ్ఞానోదయము కల్గునట్లును గలుగకుండునటులును బ్రకృతగుణజన్యము లగు నితరగుణము లుత్పన్నమగుటయును గాకుండుటయు నని తెలియ వలెను. అదెట్లనిన ?

"సరిమున్కనాదుదోషము" అను నుల్లాసోదాహరణమునఁ బతివ్రతయొక్క పాతివ్రత్యగుణముగాక తజ్జన్యమగు పవిత్రతాగుణము గంగకు సంక్రమించునటులు చెప్పఁబడినది. అట్లే

"సరసిజములు మొగిడినఁబో" యనెడు నవజ్ఞాలంకారోదాహరణ మునఁ బ్రస్తుతమగు పద్మసంబంధి ముకుళీభావ రూపదోషముగాక తజ్జ న్యమగు కీడురూపమగు దోషము లేకుంట చెప్పబడినది.

తద్గుణాతద్గుణముల నన్యగుణసంక్రమణాసంక్రమణములనఁగా రక్త స్ఫటిక వస్త్రమాలిన్యాది న్యాయముచే నన్యవస్తువునకు నన్యవస్తుగుణ ముచే వర్ణముకలుగుట కలుగకుండుటయును వివక్షింపఁబడును. ఎట్లన ?

"చెలి ! నీముక్కున ముత్తెము" అను తద్గుణోదాహరణమున నధరరక్తిమచే ముత్తెమునకు రక్తిమ యనెడు వర్ణము సంక్రమించి నటులును నతద్గుణమున సంక్రమింపనటులును వర్ణింపఁబడినది. ఈరీతిగఁ బైయలంకారములకు భేదము స్పష్టము.

రక్తస్ఫటికన్యాయమనఁగా దగ్గఱనున్న వస్తువుయొక్క రక్తిమ స్ఫటికమునఁ బ్రతిఫలించిన విధముగ ననియును,వస్త్రమాలిన్య న్యాయ మన మలినవస్త్రమందు రంగుపట్టకుండురీతిగ ననియును నర్థము తెలియ వలెను.

ఆలోచింపఁగా నవజ్ఞాలంకారమును దద్గుణాలంకారమును విశే షోక్తి భేదములే యని తెలియవలయును. ఏలయన ? "కారణసౌష్ఠవ మొలసియు" ననెడు విశేషోక్తిలక్షణము ప్రసంగించుటచే. అట్లైనను

నుల్లాసాలంకారమునకుఁ బ్రతిద్వంద్విగా నవజ్ఞాలంకారమును, తద్గుణమునకుఁ బ్రతిద్వంద్విగా నతద్గుణమును జెప్పఁబడినవి.

అ ను గు ణా లం కా ర ము. 78.

కం॥ పరసన్నిధి నైజగుణం
బరయఁగ నుత్కర్ష నొంద - ననుగుణ మింపౌ।
వరములు నాపె కటాక్షము
లారగఁగ నతినీలభావ - మొందుచు మెఱసెన్ ॥

పరసన్నిధిని నన్యవస్తుగుణమునకు నుత్కర్ష మనుగుణము. కటాక్షముల సంపర్కముచేఁ గర్ణోత్పలములకు నైల్యగుణోత్కర్షము చెప్పఁబడినది.

మఱియును :-

ఆ॥ వె॥ పుట్టుకోతి మద్య - మును ద్రావెఁ గడుపారఁ
బిదప దానిఁగుట్టె - వృశ్చికంబు।
భళిర ! యంతఁబట్టె - బలిమిఁ బిశాచంబు
దాని చేష్టలెంచఁ - దరమె ? మనకు ॥

వానరజాతికి సహజమగు చాపల్యమునకు మద్యపానము మున్నగు వానిచే నుత్కర్షము చూపఁబడినది.

మీ ల నా లం కా ర ము. 79.

కం॥ మీలితము భేదమేమియుఁ
బోలికచేఁ దెలియకున్నఁ - బొల్పుగ నగు నా।
లోలాక్షి లోహితాంఘ్రుల
నాలక్తకరసము దెలియ - దాయెఁ గనంగన్ ॥

పోలికయుంటచే రెండువస్తువులకు భేదమెంతమాత్రమును దెలియకుండుట మీలనము. ఎఱ్ఱని పాదముల లత్తుకరసము తెలియఁబడుటలేదు.

మఱియును :-

ఆ॥ వె॥ మల్లెపూల దండ - లుల్లాసమునఁ దాల్చి
చందనంబు నొడలఁ - జక్క నలఁది।

పట్టువలువ తెలిమి - గట్టి రేయెండలో
నభిసరించు చెలుల - నగునె ? కనఁగ?॥

తొలిపద్యమున రక్తిమగుణసామ్యముచేఁ జరణమునకును నలక్తకరసమునకును భేదము దెలియకుండెను. మలిపద్యమున ధవళిమగుణసామ్యముచే వెన్నెలకును నభిసరించు చెలులకును భేదము తెలియకుండెను.

నా మా న్యా లం కా ర ము. 80.

కం॥ విదితము సామాన్యంబని
సదృశత వ్యావర్తకంబు - చక్కఁగఁ గానమిన్ ।
మదవతులు తమ్మికొలఁకున
ముదమున డిగఁదెలియవాయె - మొగములు మిగులన్ ॥

తే॥ గీ॥ రత్న ఖచితంబులౌ స్తంభ - రమ్యపాళి
సంక్రమించిన ప్రతిబింబ - శతముచేత
నావృతుండగు లంకేశు - నంగదుండు
కొలువు మధ్యంబునను గనఁ - దెలియఁడాయె ॥

సాదృశ్యవశమువలన రెండు వస్తువులకు విశేషము (వ్యావర్తక ధర్మము) గోచరింపనపుడు సామాన్యము. తమ్మికొలనున నున్న స్త్రీల ముఖములు తెలియకున్నవి. రత్నస్తంభముల రావణుని రూపము ప్రతిబింబింప నతని నిజరూప మంగదునకుఁ దెలియకుండెను.

మీలితమున నొకదానిచే రెండవవస్తువుయొక్క స్వరూపము భిన్నముగ భాసింపదు. సహజమగు చరణరక్తిమచే నాగంతుకమగు నలక్తక రసరక్తిమ భిన్నముగ భాసించుటలేదు.

సామాన్యమున నన్నన్ని వస్తుస్వరూపములు భిన్నభిన్నముగ దృష్టిగోచరమగుచున్నను భేదమును జూపునట్టి గుణము లేకుంటచే విశేషము (తేడా) గోచరింపదు. సరస్సులలోనున్న పద్మములయొక్కయు ముఖములయొక్కయు స్వస్వరూపములు వేఱువేఱుగ దృష్టి విషయములగుచున్నను, సభలోనున్న రావణదేహమునకును నతని

ప్రతిబింబములకును బ్రహ్మగ్రాహ్యమున్నను ముఖమిదియనియును పద్మ మిదియనియును నక్షత్రబింబమిదియనియును ప్రతిబింబమిదియనియును విశేషము తెలియఁబడుట లేదు. కనుకనే భేదము తిరోహితమగుటచే మీలితమనియును భేదము తిరోహితముకాకున్నను సామ్యముచే వ్యావర్తకధర్మము భాసింపకున్నచో సామాన్యమనియు నీయలంకార నామము లన్వర్థము లగుచున్నవి.

కావ్యప్రకాశకారాదులు వస్తుద్వయమునకు లక్షణసామ్యముం డుటవలన నారెండు వస్తువులలో బలీయమగు నొకవస్తువుచే నితరవస్తువు నకు స్వరూపతిరోధానము కల్గినచో మీలితాలంకారమనియును, స్వరూపములు ప్రతీయమానములగుచున్నను గుణసామ్యముండుటచే భేదతిరోధానము కల్గినచో సామాన్యాలంకారమనియును లక్షణముల నుడివిరి. ఇట్లు చెప్పి

చం॥ కొనలను గన్నులల్లఁదిరు - గున్ నడుములున్ జలభంగురంబు లెం
చ నడలు కుల్కుసొంపుల పసన్ జెలఁగున్ గమనీయమాను మో
మనయము నిట్టు లంగనల - యంగములం దళుకొత్తఁ గ్రొత్తజ
వ్వనము, మదోదయంబు గనుపట్టదు - పేర్మినిఁ దావు గల్గియున్ ॥

కన్నులకొనలు తిరుగుట మున్నగునవి స్త్రీలకు నవయౌవనకార్యము లును మదకార్యమునుగూడ నగుచున్నవి. ఇట ప్రబలమగు పైధర్మ ములుగల శరీరములచే మదోదయస్వరూపము తిరోహితమగుచున్నది. ఈపద్యమును మీలితాలంకారమునకు నుదాహరణమునుగా నిచ్చిరి. "మల్లెపూలదండలుల్లాసమునఁదాల్చి" యను పద్యమున వెన్నెలచే నభి సారికలకుఁ దిరోధానములేక ధావళ్యసామ్యముచే భేదముమాత్రము గోచరింపకుండుటచేత సామాన్యాలంకారమనియును జెప్పిరి.

వీరి మతమున "మదవతులు తమ్మికొలఁకున" నను పద్యమునఁ బ్రబలవస్తువుచే దుర్బలవస్తువునకు స్వరూపతిరోధానము లేకుంటచే మీలితమునుగాదు. ముఖపద్మముల స్వరూపములు వేఱువేఱుగ స్పష్ట

ముగ దృగ్గోచరములగుట చే "మల్లెపూలదండల" నెడు పద్యమునందు వలె సామాన్యమును గాదు. మఱియొక యలంకారమేదైనను గాఁద గునని చెప్పవలయును.

లేక సామాన్యాలంకారమునకు గుణసామ్యముచే విశేషమును (తేడా) దెలియకుండుటను సామాన్యలక్షణముగాఁజెప్పి తిరిగి దానిని రెండువిధములుగ విభజింపవచ్చును.

వస్తుద్వయమునకు భేదము తెలియఁబడుచు సాదృశ్యముచే వ్యావర్తకధర్మము గోచరింపమి విశేషము దెలియంబడకుండుట యొక విధము. భేదము తెలియఁబడకుండఁగనే విశేషము తెలియఁబడకుండుట రెండవవిధము.

ఇట్టి భేదద్వయమునఁ దొలిభేదముచే "మదవతులు" అను పద్యమునను మలిభేదముచే "మల్లెపూలదండ" లనెడు పద్యమునను సామాన్యాలంకారము కావ్యప్రకాశకారాదుల మతమునను సమన్విత మగుచున్నది.

చంద్రాలోకకారుని మతమననుసరించి, స్వరూపముచే వేఱు వేఱుగ దృగ్గోచరమగుచున్నను సాదృశ్యముచే భేదము తెలియకుండుట మీలితమనినచో "కొనలను గన్నులల్లఁదిగున్" మున్నగు పద్యముల మీలితలక్షణము వర్తింపకుంటచే మఱియొక యలంకారమేదైనను గావలయుననియే చెప్పవలెను.

లేకున్న సాదృశ్యముచే భేదము గ్రహింపఁబడకుండుటయే మీలితమునకు సామాన్యలక్షణమునుగాగ్రహించి తిరిగి దానిని రెండు భేదములుగా విభజింపవలెను.

సాదృశ్యమువలన బలీయమగు వస్తువుచే దుర్బలవస్తువునకు స్వరూపతిరోధానము గల్గుటచే భేదము భాసింపకుండుట యొక భేదము గను, స్వరూప తిరోధానము లేకుండఁగనే భేదము భాసింపకుంట రెండవభేదముగను గ్రహింపవలెను.

ఇందలి తొలిభేదముచే "కొనలను గన్నుల్లల్లఁదిరుగున్" అను పద్యమునఁ జంద్రాలోకకారుని మతమునఁగూడ మీలితాలంకారము సిద్ధించుచున్నది. రెండవభేదము ననుసరించి "లోలాక్షీ లోహితాంఘ్రుల" "మల్లెప్రాలదండలుల్లాసమున" ననెడు స్థలముల మీలితాలంకారము స్పష్టము.

ఈరీతిగఁ గావ్యప్రకాశకారుని మీలితోదాహరణమగు "కొనలను గన్నుల్లల్లదిరుగు" ననుపద్యమునఁ జంద్రాలోకకారునికిఁగూడ మీలితాలంకారము సిద్ధించుచున్నది. చంద్రాలోకకారుని సామాన్యాలంకారోదాహరణమగు "మదవతులు తమ్మికొలఁకున" ననెడు పద్యమునఁ గావ్యప్రకాశకారునికిఁగూడ సామాన్యాలంకారము సిద్ధించుచున్నది.

పై రెండలంకారముల యుదాహరణములలోను స్వరూపతిరోధానము, భేదతిరోధానము, విశేషాగ్రహణమను విషయభేదములను జూచుకొనఁదగు.

## ఉన్మీలిత – విశేషాలంకారములు. 81–82.

కం॥ గురుతర హేత్వవగతిచే
నురవున భేదంబు దెలియ – నున్మీలితమా
సరసత నొకకారణమునఁ
జిరము విశేషంబు గన వి – శేషకమునునౌ ॥

కం॥ నరపతి ! నీయశమున మఱు
గరసిన హిమనగము స్వర్గు – లరయుదురు వలిన్ ।
సరసిజములు వదనములును
నురవడిఁ దెలియంగ నాయె – నుడుపతి వొడమన్ ॥

మీలన సామాన్యములకు వరుసగనీ రెండును బ్రతిగనున్నవి. మీలితమువలె భేదము తెలియనపుడు నొకహేతువుచే భేదము నెఱింగినచో నున్మీలితము. సామాన్యాలంకారమువలె విశేషము గోచరింపనపుడు నొక

కారణముచే విశేషము స్ఫురింపఁజేయఁబడినచో విశేషాలంకారమగును. నరపతికీర్తిచే హిమనగము తెలియఁబడకుండునపుడు చలిచే దేవతలు దానినిఁ దెలిసికొనిరి. సరసిజములకును వదనములకును విశేషము దెలియఁబడకుండునపుడు చంద్రోదయముచే విశేషము తెలియఁబడెను.

తద్గుణాలంకారరీతిచే భేదము తెలియఁబడనపుడు హేత్వంతరముచే భేదము గోచరించినటులు చెప్పినను నున్మీలితాలంకారమగును. ఎట్లన ?—

ఉ॥ నట్టువఁ గేరుశంకరుని – నవ్వుల డంబు విడంబనంబునన్
దిట్ట భవద్యశంబది యు – నిందితవైఖరి వ్యాప్తిఁజెంద నల్ ।
పట్టుల, శ్రీనృసింహ ! కమ – లాపతి నాభిసరోజ సౌరభం
బట్టులు రేగకున్న నమ్మ – తాశను లేగతిఁ గాంతురాతనిన్ ॥

నృత్యమొనరించు శంకరుని యట్టహాసమును గేలిసేయు నీకీర్తి మహావిష్ణువును దెల్లపఱచెను. ఇది తద్గుణము. నాభీ సరోజసౌరభముచేఁ గీర్తికిని నాతనికిని భేదమును దెలిసికొనుట యున్మీలితము.

ఆ॥ వె॥ కాకపికములరయఁ – గాలవర్ణంబులు
దాన భేదమెంచఁ – దరమె ? మనకు ।
నిలవసంతఋతువు – వెలయుంగఁ గాకంబు
కాకమౌను బికము – గాదె! పికము ॥

ఇట వసంతఋతువుచేఁ గాకపికములకు భేదమరయుట విశేషాలంకారము. రెండవ కాకపికశబ్దములు కాకము కాకముగానే పికము పికముగానే తెలియఁబడు ననెడు నర్థాంతరమును బోధించుటచే నర్థాంతర సంక్రమితవాచ్యార్థము కలవి.

తే॥ గీ॥ శివపురంబున వాసంబు – చేయుభక్తు
లెల్లవారికి శివచిహ్న – మెల్ల సమము ।
సతత పార్థప్రహార చి – హ్నిత శిరంబ
దెంచి చూపును దొల్లింటి – యీశుఁ దెలియ ॥

కాశీనివాసులగు శివభక్తుల కంఠములు శివచిహ్నములు సమముగ నుంటచేఁ బ్రసిద్ధశివునకును శివభక్తులకును భేదము తెలియుటలేదు. కాని పార్థపరిహారము భక్తులకన్న నతనికి భేదమును జూపుచున్నది కాన విశేషాలంకారము.

వెనుకటి పద్యమున గుణసామ్యము స్వాభావికము. ఇట యాగంతుకము.

ఉ త్త రా లం కా ర ము. 83

కం॥ గూఢోత్తరంబు నిడ నా
రూఢిగ సాకూతగర్భ - రుచి నుత్తరమా।
గాఢంబెట వైతసమాఁ
బ్రౌఢిని నట నేటి బాటఁ - బాంథుఁడ! తగురా!

అభిప్రాయ గర్భముగా సమాధానమిచ్చినచో నుత్తరాలంకార మగును. ఏఱు దాటుటకుఁ దగినచోటును బాటసారి ప్రశ్నింప నొక యువతి యిట్లు సమాధానమిడెను. దుబ్బుపొదలు దట్టముగనున్న తావునందు నేఱుదాటఁదగినదని నుడువుటచే నట స్వేచ్ఛావిహారము నకుఁ దగినస్థలమని యూపె యభిప్రాయము. మఱియును.

ఆ॥ వె॥ బండలెల్లకడల - నుండెడు నీయూర
వింత కలుగఁబోదు - నుంతయైన।
అల పయోధరోద్ధ - తులఁజూచి సుఖముండఁ
దలఁపు కలిగెనేని - నిలుము పాంథ! ॥

బాటసారి రాత్రి నివాసమును గోర నొకతె యిట్లుపల్కినది. వింతలు లేకుంటచే నీయూర నివసించుట యుక్తముకాదని బాహ్యార్థము. జనులు మందబుద్ధులగుటచే స్వేచ్ఛావిహారమున నపవాదు గలుగఁ బోదుగాన నిలువుమని యాకూతము. పయోధరోద్ధతులను పదము శ్లిష్టము. పై రెండుదాహరణములఁ బ్రశ్నవాక్య మనుమేయము.

ప్రశ్నోత్తరములు రెండును వాచ్యములగు నుదాహరణమెట్లన?

తే॥ గీ॥ కుశలముండునె యూపె, క - ల్గునుర యుసులు,
సేమమడిగితిఁ, జెప్పితిఁ - జెందు నుసుఱ ।
టంచుఁ, బల్కెదవేలనీ - వట్టిమగుడ,
నసువులుండఁగ మడిసెనం - చనఁగ నగునె ?॥

దూతికకును నాయకునకును సంవాదము. నాయిక సేమముగ నున్నదా? యని యతఁడడుగ దూతి నాయికకుఁ బ్రాణములు మాత్రముండెనని సమాధానమ్మిచ్చెను. నీ వియోగతాపముచేఁ జావసిద్ధముగనున్నది కాన నీవు వేగముగ వచ్చియాపె నుజ్జీవింపఁజేయుమని దూతికయొక్క యభిప్రాయము. ఇట ప్రశ్నోత్తరములు రెండును వాచ్యములు.

ఉ త్త రా లం కా ర ము. 11

కం॥ కృతినట్లగుఁ బ్రశ్నమునకు
నితరోత్తరమునకభిన్న - మే నుత్తరమున్ ।
సతతంబేదగుఁ గంటకి
హిత యెద్దిర ! మేధ్యమేవి ? - యిల నాలు సుమీ ! ॥

ప్రశ్నోత్తరముల రెంటియొక్క వర్ణక్రమమొక్కటియైనను; ప్రశ్నద్వయమునకు సమాధానమొక్కపదముచేఁ జెప్పఁబడినను నుత్తరాలంకారమగును. ఎట్లన ?

ప్రశ్నమునకు నుత్తరమభిన్నమగుటకులక్ష్యము :- కంటకి ఏదగు నని ప్రశ్నము. ముండ్లుకలజంతు వేదని యర్థము. సమాధానముగూడఁ గంటకి ఏదగునని. ముండ్లుకలది ఏదుపందియని యర్థము. ఏదు+అగునని సంధిభేదము నెఱుంగునది.

ఒక ప్రశ్నముయొక్క సమాధానమునకు వేఱొండు ప్రశ్నముయొక్క సమాధానపదము తుల్యమగుట యెట్లన ?

హిత యెద్దిర ? మేలునుగూర్చు నాడుది యెవతె యని యొక ప్రశ్నము. మేధ్యమేవి ?, అనఁగాఁ బవిత్రములైనవి యేవి యనునది మఱియొక ప్రశ్నము. రెంటికిని "ఆలు" అని సమాధానము. భార్య

యనియు గోవులనియు నర్థభేదముచే సమాధానభేద మెఱుంగునది. ఆలు పదము ప్రశ్నద్వయమునకు ననుగుణముగ నేకవచనమునను బహువచనమున నుండుటను నెఱుఁగునది.

సూ క్ష్మా లం కా ర ము. 84.

కం॥ మదిఁదెలిసి పరుని తలఁపును
దదితరు న్నాకూత చేష్టి - తము సూక్ష్మంబౌ।
ముదమున నేఁజూడఁగ నా
మదవతి పాపటను గప్పె - మణిఁ దాఁ గురులన్॥

చీఁకటి పడినపిమ్మట సంకేతకాలమని యాపె యాకూతము.

ఆ॥ వె॥ మదను కేళికిఁ దగు - నదనుదాఁ దెలియంగఁ
బూని చూచుమిండ - గీనిఁ జూచి।
నేర్పులాడి యొకతె - నెనరునఁ గనుఁగీటి
కేళికంజమును మొ - గిడ్చె లీల॥

సూర్యాస్తమయమైన పిమ్మటయని యాపె యాకూతము.

పి హి తా లం కా ర ము. 85.

కం॥ పరువృత్తాంతము నెఱిఁగిన
యొరు సాభిప్రాయచేష్ట - యొగిఁ బిహితంబౌ।
సరగున మగఁడిలుసేరఁగ
గరితయుఁ దొలిసంజఁ గుమిలి - కంకటి వ్రాల్చెన్॥

సవతి యింటికేగి రేయినంతయు నలసితివిగాన నిద్రింపుమ్మని యాపె యభిప్రాయము. పై యలంకారమునఁ బరునియభిప్రాయమును నీయలంకారమున నొరుని ప్రవర్తనమును దెలియుటయను భేదము నెఱుంగవలెను. మఱియును :-

ఆ॥ వె॥ చెలియ మోముజార్చు - చెమ్మట చాలుచే
గళము నలఁదు కుంకు - మలమిఁ గనుచు।
నగుచు బోటియొార్తు - మగలాగు దెలుపంగఁ
గరతలాన దిద్దె - ఖడ్గరేఖ॥

చేత ఖడ్గరేఖ పురుషలక్షణము, ఓచెలీ! పురుషాయితము నొనరించుటచే నీవు పురుషుఁడవైతివని యాపె యాకూతము.

వ్యా జో క్తి - అ లం కా ర ము. 86.

కం॥ అరయుచు నాకృతిగుప్తినిఁ
బరకారణ మెంచి తెలుప - వ్యాజోక్తి యగున్ ।
విరిపొడి రేఁగుట నుపవన
ధరణిన్ జెలి! మాసె నాదు - తను విటు కనుమీ! ॥

ఆకారగోపమునకై యొక కారణమును దెలుప వ్యాజోక్తియగును. రహస్యకారణముచేఁగల్గిన తన శరీరమాలిన్యమునకుఁ బూలతోఁటలోని పుప్పొడినిఁ గారణమునుగాఁజూపి యాకారగోపన మొనర్చెను. మఱియును :-

ఆ॥ వె॥ ఏనిమనము కన్య - నూనదు వ్రణితమౌ
కాంత కెంపుమోవిఁ - గాంచ నిలను ।
వలదటన్న వినక - చెలియ! మూచుంచితి
లోనఁ గొదమ తేఁటిఁ - బూను తమ్మి ॥

విటదష్టమగు కాంత యధరమును జూచి సంశయించు భర్తృసన్నిధిని నాపె తప్పును గప్పఁదలఁచి యాపెచెలి యాపెతో నిట్లనియెను. పద్మములోని తేఁటిపోటును గారణమునుగాఁ బన్నినది.

ఛేకోక్తికిని వ్యాజోక్తికిని భేదమేమన? ఛేకోక్తి మాటలకు వేఱొకయర్థము గల్పింపఁబడును. వ్యాజోక్తిలోఁ గారణాంతరము చూపి యాకారగోపన మొనరింపఁబడును.

వ్యాజోక్తి లక్షణములోనున్న "తెలుపన్" అనుపదమునకు నాకారగోపమునకై చేయఁబడు క్రియ యర్థము. ఆక్రియ వాక్కు, లేక మఱి యేక్రియయైనను గావచ్చును. ఇట్లనుటచే

ఆ॥ వె॥ రాజవీధి వచ్చు - రాజీవలోచను
హరిని గాంచి పొడము - నాత్మ రతిని ।

గనుచు నాతఁడు గనియెడి — ప్రేమ సక్తి వెంగ
సతిని మ్రొక్క కప్పె — నాపె యుక్తి ॥

తనను గల్గిన రతిని గనుచు మున్న యువానిచే నొండొకనాతి నర్తింప నొకతెయదే కృష్ణునిపై భక్తిభావముచేతఁగాని రతిభావముచేతఁగాదని కప్పిపుచ్చ నమస్కారచేష్ట నుపాయముగాఁ గైకొనుటచే నుక్తిలేకున్నను నిట యుక్త్యలంకారము సిద్ధించినది,

ఇట్లే సూక్ష్మపిహితాలంకారములలోఁ గూడఁ జేష్టితమును నదియు వచనరూపవ్యాపారమునకును నుపలక్షకము. కాననే

తే॥ గీ॥ నళినదళమున నాకొంగ — నిలచుఁ బచ్చ
యాల భాజనమున శుక్తి — యోలెఁ గాంచు ।
మంచుఁ బల్కెను సఖితోడ — మించుబోఁడి
కలియుచోటును మగనితో — కాంతఁ జూచి ॥

ఇట నిర్జనప్రదేశమగుటచే నీకొంగ తామరాకునఁ గదలక నిలిచియున్న దనియును గాననిదియే సంకేతస్థానమనియును నాపె యుపపతికి సూచించినది. ఇట చేష్టగాక వచనమునే స్వాభిప్రాయసూచకమునుగ గ్రహించినను సూక్ష్మాలంకారము ప్రవర్తించుచున్నది.

ఇట ధ్వనియని శంకింపరాదు. సంకేతస్థానముయొక్క వ్యంగ్యతను నాల్గవపాదమునఁ గవి స్వయముగఁ దెలుపుచేయుటచే. ఇట్లే పిహితాలంకారములోఁగూడ ధ్వనికాదనియు నలంకారమనియును దెలియనగు.

కవి వ్యంగ్యార్థమును స్వవచనముచే సూచింప నలంకారమగు ననియు సూచింపనిచో ధ్వనియనియును భేదమును దెలియనగు. ఈ విషయ మప్రస్తుత ప్రశంసాలంకారములో వివరింపఁబడినది.

ఆలోచింప ఉత్తరము, సూక్ష్మ, పిహితము, వ్యాజోక్తియు నీయలంకారములకు నుదాహరణములగు "గాఢంబెటవై తసమా" మున్నగు పద్యముల భావము కవిచే స్వవచనముచేఁ బ్రకటితము

గాకుంటచేతను కేవలము వక్తృబోద్ధవ్యవిశేషముచే విశేషితమైన వస్తుసౌందర్యబలముచేతనే వక్తృభావము బోధవిషయమగుటచే గమ్యమగుచుంటచే నటనలంకారము కాదనియు ధ్వనియనిచెప్పుటయు నుచితము.

"గాఢంబెటవై తసమా" మున్నగుచోటులఁగూడ

కం॥ రూఢంబగు తనభావము

గూఢంబుగఁ బఠికుఁదెలిపెఁ – గోమలి యట్టుల్ ॥

మున్నగురీతినిఁ బద్యములఁ బూరించి కవి స్వవచనములచే భావమును దెల్పినచో ధ్వనిగాక యలంకారమే యగును.

కాన "మదనకేళికిఁదగు" "చెలియమోముజాఱ్చు" "రాజవీధివచ్చు" మున్నగుచోటుల నిగూఢభావము కవిచే స్వవచనముచేతనే తెలుపుడుచేయఁబడుటచే నలంకారమేకాని ధ్వనికాదని యెఱుంగునది.

గూఢోక్తి – అలంకారము. 87.

కం॥ ఇతరోద్దేశ్యక వాక్యము

కుతలంబున నొరునిఁ బల్క – గూఢోక్తి యగున్ ।

ధృతి నన్యక్షేత్రము వృష

పతి ! వీడుము క్షేత్రపతియు – వచ్చుచునుండెన్ ॥

ఒకవ్యక్తి నుద్దేశ్యునిగాఁ జేసికొనినమాట తటస్థునికిఁ దెలియకుండ నొరునిగూర్చి శ్లేషభంగిచేఁ జెప్పఁబడినచో గూఢోక్తి యగును. పరకళత్రము ననుభవించుచున్న కామునిఁగూర్చి చెప్పఁదలఁచిన మాటను నితరులకుఁ దెలియకుండఁగఁ బొలమున మేయుచున్న వృషభమును సంబోధించి యాపెసఖి యిట్లుపలికినది. ఓవృషభమా ! పరక్షేత్రమును విడిచిపొమ్ము. క్షేత్రపతి వచ్చుచున్నాఁడు. క్షేత్రమనఁగా :— కళత్రము, సస్యస్థానియు నర్థద్వయమును సందర్భమునసుసరించి యన్వయించుకొనునది. దీని నప్రస్తుతప్రశంస యనరాదు. కార్యకారణాది రూపమగు వ్యంగ్యము లేకుంటచే. శ్లేషాలంకారము ననరాదు.

అప్రకృతార్థమునకుఁ బ్రకృతార్థముతో నేకత్వగను నన్వయము లేమిం టచే. ఇట శ్లేషము పరవంచన కొఱకు మాత్రమే నిర్దేశింపఁబడినది. కాన నలంకారాంతర మే యగుచున్నది. కాననిది గూఢోక్తి యలం కారము. మఱియును :-

ఉ॥ అంగడికేగె నాఘుఁడర – యన్దరిరాదు సపత్ని కొంగుమా
సెంగ దెయంచు వృద్ధులును – జెచ్చెర లోపల కేగిరట్టి సే
దంగొని బానిసల్ నిదురఁ – దాకిరి సెజ్జ యొకండె తోడు నా
కింగితవేది! సూగమ స – విరాహిత! మాధవ! నాకునీవనిశన్ ॥

మాధవుఁడనెడు చెలికాని రాకనుగోరుచున్నదై పుష్పవతి యగుతనకు మాఱుదిక్కు లేదనియును దన్నురక్షింపుమని భగవంతునిఁ బ్రార్థిం చెడునెపముచే నొరులను వంచించుచున్నది. ఆగమసవిరాహిత :- వేద మాలచే స్తుతింపఁబడినవాఁడా! రాకచేతనే యిష్టమును గూర్చువాఁడా! యని యర్థద్వయమును దగినరీతి నన్వయించుకొనఁదగును.

వివృతోక్తి - అలంకారము. 88.

కం॥ విన్నృతోక్తి శ్లిష్టగుప్తము
కవిచే విన్నృతంబు గాఁగఁ – గవిమతిఁ జెలఁగున్ ।
ధుర్వమన్యక్షేత్రమును వృ
ష! వడిన్ విడుమనుచుఁ బలికె – సాకూతముగన్ ॥

శ్లిష్టమైనట్టియు గుప్తమగు నర్థము కవిచేఁ బ్రకటితమైనచో విన్నృతోక్తి యగును. ఇట గమ్యమగునట్టియు శ్లిష్టమగు నర్థము సాకూతముగ ననెడు కవివచనముచే వ్యక్తము చేయఁబడుచున్నది. మఱియును :-

చం॥ ఉడుగు విషాదసక్తి వల – దూర్ధ్వగతి శ్వసనాప్తి ప్రతిరి! వే
విడు గురుకంప మిట్టిబల – భిత్పటు జృంభణ మేల? రమ్మటం
చెడ భయగుప్తి సాకున ది – విద్యులఁ దోపిడఁ జేసి మంథము
గ్ధుఁడుదధి లక్ష్మి నేనికిడెఁ – ద్రుంచుత నాహరి దుష్కృతౌఘముల్ ॥

సముద్రమునుండి వెలువడిన లక్ష్మిని సంబోధించి యాపెపెత సముద్రుఁ డిట్లు పల్కుచున్నాఁడు. విషాదము నొందకుము. ఊర్ధ్వగతమగు నుచ్ఛ్వాసమును జేయకుము. మిక్కిలి కంపమును విడిచిపెట్టుము.

బలమును హరించు నావులింత యేల? సముద్రమంథనముచే వచ్చిన యలసటను దాళుకొనుమని భావము. ఈరీతిగ నాపెకు భయమును దొలఁగించెడు నెపముచే నితర దేవతలను గోరకుండఁజేసి మహావిష్ణువునకు నాపెనిచ్చెను.

విషాదుఁడు :- శంకరుఁడు. శ్వసనుఁడు :- వాయువు. గురువు :- బృహస్పతి. బలభిత్తు :- ఇంద్రుఁడు. ఈ దేవతలను నిరాకరించుటలో విషాద, ఊర్ధ్వగతి, పటుజృంభణ, కంపములనెడు పదములు వారి యందలి దోషసూచకములుగా గ్రహింపఁబడినవి. ఇట వ్యంగ్యార్థము "భయగుప్తి సాకున దివిజ్యులఁదోృపిడఁ జేసి" యను కవివచనముచేత నే సూచింపఁబడినది.

ఇది పరవంచనకు గుప్తావిష్కరణము. లజ్జచే గుప్తమగు నర్థమునకు నావిష్కరణమెట్లన ?

చం॥ గతిఁగన గోపరాగహతి - గన్నులు గప్పఁ జలించితిట్లు నన్
బతితను బూని కేశవ! శు - భంబులఁ గూర్పుచుఁ బ్రోవవేల? యం
చితగతి నీవెకా! విషమ - జిహ్మగతి క్షతమైన కామినీ
తతి కిటుజాడ గోపియనఁ - దద్జ్ఞుఁడు గోష్ఠగ కృష్ణుఁ డేలుతన్ ॥

ఒకగోపి గోశాలలోనున్న శ్రీకృష్ణునిగూర్చి యిట్లుపలికినది. త్రోవ నడుచుచుండగా గోవులపరాగము కన్నులఁబడ చలించితిని విషమ స్థలములయందు జిహ్మగమనముచే దెబ్బతినిన స్త్రీలను రక్షించుటకు నీవే సమర్థుఁడవనునది బాహ్యార్థము.

వ్యంగ్యార్థ మెట్లన ? ఓగోప ! రాగహతిచేఁ జలించి నిన్నుఁ జేరితిని. పతితను :- పతిభావమును బూని రక్షింపుము. విషమములు :- బేసి సంఖ్యగల, జిహ్మగతి :- బాణములుగల మన్మథునిచే, క్షతమైన

స్త్రీలకు నీవుగదా కే గతియని. ఈవ్యంగ్యార్థము, జాడన్ :- సూచనచే గోపి యను ననెడు స్వవచనముచేఁ గవి వ్యక్తీకరించినాఁడు.

ఇది శబ్దశక్తిచే గ్రహింపఁబడిన గుప్తావిష్కరణము. అర్థశక్తి మూలక మెట్లన ?

చం॥ తెరలెడి నచ్యుతా! తనివి - తీరదుగా నిను నెంతచూచినన్
మఱుగుననున్నచో మనల - మాఱుగ నెంచును పాపలోక మి
త్తెఱగున గోపి పిల్పునుడిఁ - దెల్పు నిరీక్షణ నిష్ఫలత్వ మా
గరిత గగుప్పనొందఁ దన - కౌఁగిట నత్తెను కృష్ణుఁ డేలుతన్ !

శ్రీకృష్ణునిఁగూర్చి గోపీవాక్యము. నిన్నుఁజూచినంతమాత్రమునఁ దనివి తీరదు. మఱియు లోకము మాఱుగ నెంచునుగాన నేను వరలిపోదు నని బాహ్యార్థము.

నీపొందుఁగోరి యెంతితడవు వేచియున్నను నీమనస్సు చ్యుతము గాకున్నది. అనఁగాఁ జలింపకున్నదని భావము. ఇది వ్యంగ్యార్థము.

ఈవ్యంగ్యార్థముగూడ నచ్యుతా! యనెడు పిలుపు నుడి యనఁగా సంబోధనముచేఁ గవిచే వ్యక్తము చేయఁబడినది. అచ్యుతుఁడనఁ జలింపనివాఁడనియును నర్థము.

ఓయీ! నావిషయములో నస్ఖలితుఁడ వగుచున్నావు. నీ కలియకచేతనే కాని చూచినంతమాత్రమునఁ దృప్తి కలుగదు. పాప లోకము మాఱుగ నెంచుటచే నపయశస్సు ప్రాప్తించుఁగాక. వ్యర్థ ముగ మనలను వంచించుకొనుచున్నాము. ఇట్టి వ్యంగ్యార్థములన్ని యును, "అచ్యుత!, నిరీక్షణనిష్ఫలత్వమును దెల్పు" అనెడు కవివాక్యము లచేతనే వ్యక్తముచేయఁబడుచున్నవి.

ఇది కవినిబద్ధమగు వక్తచే గుప్తార్థావిష్కరణము. కవిచే గుప్తా ర్థావిష్కరణ మెట్లన ?

ఉ॥ ఓగిరమొల్లఁ గామినుల - నుల్లమునన్ దలపోయ సౌరభా
భోగములన్ భజింప నిటు - పొందఁగ సుభ్రువు! నీవు కోపమున్ !

రాగ వినమ్ర భావములఁ - గ్రాలెడు దృష్టిహితుండ నాపయిన్
వేగమె కోపమున్ విడుము - నీవొదగక్ సకలంబు నంధమా ॥

నేత్రరోగి తనకంటిని సంబోధించి యిట్లు పల్కుచున్నాఁడు.

ఓసుభ్రువు ! :- అందమగు బొమలుకల నేత్రమా ! నీవు కోపము నొంద ననఁగా రోగమునొంద నేను భోజనము మున్నగు వానిని విడిచితిని. ఎఱ్ఱఁదనమును జెప్పల నెత్తలేకుంటను బొందిన దృష్టీ ! హితుఁడనగు నాపై కోపము ననఁగా నెఱ్ఱఁదనమును విడిచియుండుము.

ఈబాహ్యార్థముచే నీవ్యాఖ్యానములచే హృదయప్రసన్నతను విడిచియున్న భార్యను ననునయము చేయు కాముకక్రియయును బ్రతీయమాన మగుచున్నది. ఎట్లన ? ఓసుభ్రువు ! :- ఓకాంతా ! నీవు గోపింప నేను సమస్తభోగములను బరిహరించితిని. రాగ వినమ్ర భావములచే వర్తిల్లువాఁడును దృష్టిహితుండ నగు నాపై కోపము వీడుము. నీవులేకున్న నాకు జగమంతయు నంధకారమయముగనుండును. ఇట పక్రృతార్థము దృష్టిహితుండనెడు పదమున దృష్టియను పదమును విభజించి దానిని సంబోధనాంతముగాఁ దోపింపఁజేసి యావిష్కరింపఁబడుచున్నది.

కవి నిబద్ధవక్తృగుప్తము తటస్థులను వంచించుటకును కవిగుప్తము కవియొక్క ప్రౌఢత్వమును దెలియజేయుటకును నుపకరించును.

యుక్తి - అలంకారము. 89.

కం॥ తనగుట్టుగప్పు పనిన
న్యుని వంచింపఁగను గృతుల - యుక్తి చెలంగున్
నినుఁజెలి చిత్రము వ్రాయుచుఁ
గని యొరుఁ బూవింటివ్రాసెఁ - గరమున లీలన్ ॥

తన రహస్యమును దెలియకుండ నొకపనినిఁజేసి యితరులను వంచించుట యుక్తియగును. నాయకునితో దూతిచెప్పుచున్నది. ఓయీ ! నాచెలి

నీరూపమును జిత్రపటమున వ్రాయుచు వేళొంకుకాంత దానిని జూడఁ దనగుట్టు గప్పుటకుఁ జిత్రము కరమునఁ బూవింటిని వ్రాసెను. మన్మథ చిత్రమునుగా భ్రమజెందుటకట్లు వ్రాసెనని భావము. మఱియును :—

చం॥ వలపున రేయిఁబంపతులు – పల్కిన పల్కులనింటిచిల్క వె
ల్గొలయఁగ మామచెంతఁ గులు – కొల్కఁగఁ బల్కను గోడలంత సి
గ్గిలి తనకమ్మ కెంపును ద – గిల్చెవడిన్ గొనముట్టి దాడిమీ
ఫలపరిపక్వ బీజము నె – పంబున వాకను గట్టునట్లుగాన్ ॥

చిలుకపలుకుల నరికట్టి తన రహస్యోక్తులను వినుచున్న తన మామను వంచించినది. వ్యాజోక్తిలో నాకారగోపనము యుక్తిలోఁ దదన్య గోపనమనియు భేదము. లేక వ్యాజోక్తిలో మాటచేగోపనము యుక్తి లోఁ గ్రియచే గోపనమనియును భేదము. ఇట్లైనను "రాజవీధివచ్చు రాజీవలోచను" నను పద్యమున యుక్తియేయగును.

లోకోక్తి – అలంకారము. 90.

కం॥ కృతి లోకోక్తియగున్ నుతి
యుతముగఁ బ్రథితార్థలోకి – కోక్తి నచింపన్ ।
ధృతిఁగొని కనులన్ మూయుచుఁ
గతిపయ దివసంబులెట్లొ – గడుపుము సుదతీ! ॥

ప్రసిద్ధార్థమగు లోకోక్తినిఁజెప్ప లోకోక్తి యగును. కండ్లుమూసికొని కొన్నిరోజులెట్లో గడుపుమనునది లోకప్రసిద్ధము.

కం॥ జగతిన్ వరదుఁడవని పే
రు గణించినకతన వరద! – రూపటె వరదా।
నగుణము దెలిపెడు హస్తము
జగమెఱిగిన బ్రాహ్మణునకు – జందె మదేలా? ॥

వరదరాజస్వామికి వరదానగుణముద్ర లేదు. దానికిఁగారణము వరదుఁ డనఁగా వరములనిచ్చువాఁడను ఖ్యాతి జగత్ప్రసిద్ధముగాన. నాల్గవ పాదమున లోకోక్తి గలదు.

ఛేకోక్తి - అలంకారము. 91.

కం॥ ఇలఁబెర యర్థముఁ దెలుపన్
జెలఁగెడు లోకోక్తి కృతుల - ఛేకోక్తి యగున్ ।
దెలియుఁగా భుజంగమొక్కఁడె
వెలయు భుజంగాంఘ్రి గతుల - వెలివడ సఖుఁడా! ॥

అర్థాంతరమును దెల్పునట్టి లోకోక్తి ఛేకోక్తి యగును. పాముకాళ్లు పామునకే తెలియునన్నది లోకోక్తి.

ఒకఁడొకని వృత్తాంతము ప్రశ్నింప వాఁడు మూఁడవవానినిఁ జూపి యిట్లతనికి సమాధానమిడెను. ఇతఁడతనికిఁ జెలికాఁడనునది ప్రసిద్ధము కదా? ప్రకట వ్యాపారాదులలోవలె రహస్యవ్యాపారమ్ములోఁగూడ నీతనికే యెఱుక తగియుండునెడు నర్థాంతరమును నీలోక్తి తెల్పుచున్నది. కాననిది ఛేకోక్తి యగుచున్నది. మఱియును :-

మ॥ కన రావా మలయానిలాంకురంబులును మా - ఘ్యశ్రీ నివాసంబులో
వనపంక్తుల్ విలసిల్లు గ్రీష్మమును దాఁ- బొటెన్ ముదంబుండెదేన్।
ఘనుఁడా! గూర్పుము కాంతతోనతని వే-గం బేఁడు తాగోవులన్
వెనుదీయించు ధనంజయుండతఁడె పృ - థ్విన్ జూతు నీబింకమున్ ॥

ధనార్జనమునకై దేశాంతరమునకుఁబోయి యెంతకాలమునకు నింటికిఁ జేరని యొకప్రశుపారియని భార్య పరితపించుచుండ నాపెసఖి మేఘునిఁ గూర్చి యిట్లుపల్కినది. వసంతర్తువు గడిచినది. మల్లెల నుల్లసిల్లు గ్రీష్మము తొలఁగినది. వర్షర్తువు వచ్చినను వాఁడింటినిఁ జేరలేదు. కాన నీవైనను నాతని వెనుకకు రప్పింపుము. వాఁడు గోసదృశుఁడు గాన ధనాసక్తుఁడుగానను నోమేఘుఁడా! వానిని భార్యతోఁగలిపినచో నీశక్తి ప్రశంసింపఁబడును. గోవులను వెనుకకుఁ గొట్టినవాఁడె ధనంజయుఁడను లోక్తి, ధనాసక్తుని ధనమును జయించినవాఁడే వెనుకకుఁ దీయఁగలఁడనియును, ప్రస్తుత దేశాంతరవాసి గోసదృశుఁడనియును వ్యంగ్యయుక్తముగాఁ బ్రయోగింపఁబడినది.

## వక్రోక్తి - అలంకారము. 92.

క॥ ధ్వానన్ శ్లేషముఁ గాకువు
ధ్వానంబన్యార్థమునకు - వక్రోక్తి యగున్ ।
భానుఁడు వొడమెను సువిలా
సానందిని కింకవిడుచు - మది గుడినుండెన్ ॥

శ్లేషముచేతఁగాని కాకుస్వరముచేతఁగాని యన్యార్థమును స్ఫురింపఁజేసినచో నది వక్రోక్తియగును. రేయినంత కోపించిన ప్రేయసినిఁ గూర్చి ప్రియుఁడుదయమున నిట్లు వచించెను. ఓసువిలాసానందిని ! :- విలాసలచే నానందింపఁజేయుదానా! సూర్యోదయ మాయెను. కింకను విడువుమని. ఆమె పై వాక్యమున కర్థాంతరము కల్పించి వేఱుగ సమాధాన మిచ్చినది. ఎట్లన ? ఓసువిలాసా! :-మంచి విలాసములు కలదానా! నందిన్ :- ఈశ్వర వాహనమగు నందీశ్వరుని, ఇఁకింకన్ :- ఇప్పటికైనను, విడిచిపెట్టుమని శ్లేషించి దీనికిఁ దగినట్టు, అది గుడిలోనున్నదని సమాధానమిచ్చెను. మఱియును. :-

తే॥ గీ॥ కొమ్మ ! యయిదు వరాలనీ - కొఱకుఁ దెచ్చి
నాఁడఁ గైకొంచుఁ గోపము - వీడు మింక ।
రాలఁదెచ్చిన మగువల - రవులు కినుక
తరలునంచును దలపోయఁ - దగునటయ్య ! ॥

పూర్వార్థము భర్తృవాక్యము. అయిదు వరహాలఁదెచ్చితి ననియతఁడు పల్క భార్యశ్లేషముచే నర్థాంతరమును గల్పించి సమాధానమిచ్చినది. ఎట్లన ? ఓకొమ్మ ! ఓయయిదువ ! రాల నీకొఱకుఁ దెచ్చితినని శబ్దములను విడఁదీసి యుత్తరార్థమును సమాధానమిడినది.

ఉ॥ భావనసేయుమా ! త్రిదశ - వక్త్ర విరూపత నేఁడె కోమలీ !
చేవగ నిల్వనౌనె ? మొనఁ - జేసి సలక్ష్మణ రామమానికిన్ ।
కేళివులవించు నావడిఁజ - రింపదె ? కోతులమూక వెండి నీ
వీవిధిఁ బల్కు మోరి శర ! - యేడవ యక్కరమున్ ద్యజించుచున్

రావణుఁడు మదాంధుఁడై సీతాదేవికిఁగల్గఁ బోవునట్లు కీడులనుబల్క నాపె వానిమాటలనే కొంచము మార్పిడిచేసి వానికే కీడుగల్గునట్లు సమాధానమిచ్చినది. మొనఁజేసి :- రణమున సేనలఁగూర్చుకొని, ఆవడిన్ :- ఉపద్రవములో. తక్కిన పద్యము సుబోధము.

ఈపద్యమున మొదటి మూడుపాదముల నేడవయక్షరము "త్రి" "నె" "వ" యనునవి తొలఁగింప దశవక్త్ర, నిల్వఁగనౌ, ఆడిచరింపదె యని పదములు మిగులుటచే రావణునకు హాని వ్యక్తమగుచున్నది.

పైవన్నియు శబ్దశ్లేషమూలకమగు వక్రోక్తులు. అర్థశక్తి మూలకము లెట్లన ?

చం॥ తిరిపరి యెందునుండు సుద – తీ ! బలియిష్టిని, నే/డఁదాండవం
బురువడు బృందవాటి, నెట – నుండు మృగంబెరుగన్ గదే ! కిటిన్,।
జరఠవృషంబు గన్పడదె – చండిరో ! దాని నెఱుంగు గోపుఁడం
చు రమయు గౌరి సొంపునుడిఁ– జొక్కెడు మేలపుఁ బల్కులేలుతన్ ॥

రమాపార్వతుల సంవాదము. నీ పతి బిచ్చగాఁడని లక్ష్మి పార్వతిని హేలనసేయ నీభర్త బలిచక్రవర్తిని మూడడుగులు వేడుకొనెనని సమాధానమిడెను. తక్కిన ప్రశ్నోత్తరములు సమన్వయించు కొనఁదగు. ఇది శ్లేషవశమునఁగాక యర్థవశముచేత వచ్చినవక్రోక్తి.

కాకుస్వరముచే నెట్లనిన ?

ఆ॥ వె॥ దుడుకుఁ జెందితీవు – తొయ్యలి ! నీకిటు
తగదు కోపమంచు – మగఁడు వలుక ।
కోపమెంచఁ దగదు – పోపొమ్మటంచు నా
యతివ విరుల దండ – నతనిఁ గొట్టె ॥

కోపమెంచఁ దగదు ? యను కాకుస్వరముచేఁ గోపింపఁదగునని యర్థాంతరము తోఁచుచున్నది.

## స్వభావోక్తి అలంకారము. 93

కం॥ అగును స్వభావోక్తియధల
పఁగ జాత్యాదులకునగు స్వ – భావము దెలుపన్ ।

మృగములు కనులన్ ద్రిప్పుచు
నిగుడుచుఁ గర్ణము లటవిని – స్పృశతినిఁ గాంచెన్ ॥

జాతి, గుణ, క్రియలయొక్క స్వభావమును వర్ణించినచో నది స్వభావోక్తి యగును. ఇట హరిణజాతియొక్క స్వభావము వర్ణింపఁబడెను మనుజుల విచిత్రవేషమును జూచి తెల్లారితిగఁ జూచుట స్వభావము.
మఱియును :-

ఉ॥ ఒజ్జలచెంత నుండి తగ – నొండొరు నైపువశిన్ జఠించుచున్
ఒజ్జకుఁ జేరి తోవనిడు – పట్టున నిబ్బరమంత తూలఁ డా ।
రుజ్జిగ మాఱుదిక్కునకు – నోసరి వెంటియు నట్టెపోయి పెన్
లజ్జ పెనంగ వేమఱు చె – లంగిరి తాపము నవ్యదంపతుల్ ॥

గురువందనము చేయుటకుఁబోయి తిరిగి వెడలునపుడు తొందరచే నొకరికొక రెదురుగఁబోయి యొండొరులకుఁ దోవనిచ్చుకొనుటకై ప్రయత్నించి యిరువురొక ప్రక్కకే చనిరి. ఇట్టు పలుమాఱు సిగ్గిలుచు తిరుగాడిరి. ఈరీతిగ నవ్యదంపతులకు సిగ్గును దుడుకుతనమును స్వభావము.

భా వి కా లం కా లం కా ర ము. 94.

కం॥ భూతము భావియు నర్థము
లీతఱిఁ జూపట్టునట్టు – లిడ భావికమౌ ।
చూతుంగదె సురలసురులు
నేకునఁ దలపడ్డ పోరు – నిత్తఱిఁ గూడన్ ॥

భూత భవిష్యద్వృత్తాంతములను వర్తమానములుగ స్వయముగఁ జూచుచున్నటులు వర్ణించినచో భావికమగును. భూతమగు సురాసుర యుద్ధము తత్కాలమున జరుగుచున్నటులు వర్ణింపఁబడెను. మఱియును

తే॥ గీ॥ నాదు నయనము నయనమన్ – నాతి పలుకు
వించుఁ గ్రిందనుబడ్డ నా – వెలఁది పైటఁ
దీయ నెంచిన ననుఁజూచి – చేయు నాపె
నగవు నాకంట నిలుచు నీ – నాఁటఁ గూడ ॥

నయనమనఁగా నేత్రము. నేత్రమనఁగా వస్త్రము. ఒక చెలి తన పైట గాలికెగిరి క్రిందఁబడఁగా నానయనము నయనమని తోందఱగా నెను. ఆభావమెఱిఁగిన యొక యువకుఁడు దానిఁ దీయనెంచి యాపె ముందు నకుఁ జనెను. ఆపెయు నతనిఁజూచి చిరునగవు చేసెను. అతఁడా విష యము నతని చెలికానితోఁ గొంతకాలమైనపిమ్మటఁ జెప్పుచున్నాఁడు. అదియును దత్కాలమునఁ జరుగుచున్నట్లు వర్ణింపఁబడెను.

ఉ దా త్తా లం కా ర ము. 95.

కం॥ ఇతరాంగము నుతచరితం
బతను సమృద్ధియు నుదాత్త - మాఁ గవికృతి వి ।
స్తృతమహా నీగిరి చరియన్
వితతాహవ మాయె శంభు - భీభత్సులకున్ ॥

ఇతరపదార్థముల కంగభూతమైన శ్లాఘ్యచరిత్రనుగాని లేక విస్తార మగు వస్తుసమృద్ధినిఁగాని వర్ణింప నుదాత్తమగును. ఇట యింద్రకీల పర్వమునకుఁ గీర్తినిఁగూర్చు కిరాతార్జునుల యుద్ధము వర్ణింపఁబడినది.

అధిక వస్తు సమృద్ధి కుదాహరణ మెట్లన ?

మ॥ అలజాబిల్లి వెలుంగు పైపయిని డా - యన్ జెమ్మలూరంగ నా
నెలరాల్పాదుల నీటివెల్లువలు పూ - న్కిన్ బాఱ నేకక్రియల్ ।
గలుగన్ బోకయె యేపుమీఱి కొనల - ల్లక్ వీచుభీమాత్మజా
లలితోద్యానము చూడ్కిఁ జూఱకొనవ్రా-లన్ నిల్చె నాహంస
తాన్॥

భైమీవనములోని చెట్లకుఁ జంద్రకాంతశిలలు కుదురులుగాఁ గట్టి నట్లును వానిపై చంద్రకిరణములు ప్రసరింప వానినీరముచే నాచెట్లు గుబురుగ పెరుగుచున్నట్లు వర్ణింపఁబడుటచే నిట వస్తుసమృద్ధి వర్ణింపఁ బడినది. మఱియును :-

తే॥ గీ॥ రత్నఖచితంబులౌ స్తంభ - రమ్య పాళి
సంక్రమించిన ప్రతిబింబ - శతముచేత ।

నాప్త్రతుండగు లంకేశు - ననిలతనయుఁ
పెట్టి కేలకుఁ జెలిసెను - గుట్టు దొఱఁగి ॥

రావణుని యాస్థానమున స్తంభములన్నియు రత్నఖచితములనుటచే నత్యుక్తివృద్ధి సూచింపఁబడెను.

అ త్యు క్తి - అ లం కా ర ము. 96.

క॥ తగనద్భుతంబు మిథ్యయు
నగు శౌర్యాదికము సెప్ప - నత్యుక్తి యగున్ ।
జగమున దాతగ నీవు ప
రఁగ నర్థులు గారె? భూవ - రా! స్వర్ద్రువులై ॥

అద్భుతమును నసత్యమునునగు శౌర్యౌదార్యములను వర్ణింప నత్యుక్తి యగును. రాజు దాతగానుండ నతని యాచకులును గల్పతరువులైనట్లు వర్ణింపఁబడెను. ఇది దాతృత్వమున కత్యుక్తి.

శౌర్యమున కత్యుక్తి యెట్లన?

తే॥ గీ॥ ఏడుకడలులఁ బుడమి నో - ఱేఁడ! నీదు
తేజమను నగ్గిచెలరేఁగి - తివిరి కాల్ప ।
మగుడ నీవైరితరుణుల - వగఁ దొరంగు
నశ్రువాహిని వెల్లువ - యుడర నింపె ॥

రాజప్రతాపము సప్తసముద్రముల నింకింప శత్రుస్త్రీల కన్నీటి ప్రవాహము తిరిగి నిండించె ననుటచే నత్యుక్తి.

సంపదయొక్క యత్యుక్తిలో నుదాత్తాలంకారమనియు శౌర్యౌదార్యాదుల యత్యుక్తిలో నత్యుక్త్యలంకారమనియును భేదము తెలియనగు

అతిశయోక్తికిని నత్యుక్తికిని భేదమేమనిన?

ఆ॥ వె॥ అరయు సుందరాంగి! - విరివి నొందుచు నున్న
కొమరు గొల్పు నీదు - గుబ్బలకును ।
బాహులతల నడుమఁ - బరికింపఁ బూఁబోఁడి!
చాలినంత చోటు - పాలుపడదు ॥

ఈపద్య మసంబంధాతిశయోక్తికి నుదాహరణముగా నీయఁబడినది. ఇట వస్తువునకు సదుక్తికలదు. అనఁగా వస్తుగతి యతిశయముగాఁ జెప్పఁబడినను దానికి సంభవమెంతమాత్రమును లేకపోలేదు. అత్యుక్తిలో వస్తువునకు సంభవమేకలుగదు. ఎట్లన ?

తే॥ గీ॥ ఆది సృజియించె నల్పంబు – నాకసంబు
నబ్జభవుఁడంత నెచ్చెలీ ! – కుబ్జ బుద్ధి ।
నూహ దొఱగంగ నీకుచ – యుగ్మమునకుఁ
జేసె నీరీతి దఱిలేని – జృంభణంబు ॥

ఇట కుచయుగళి విస్తృతికి నంతులేదనుట వస్త్వసంభవము. ఇదియే రెంటికిని భేదము.

నిరుక్తి – అలంకారము. 97.

కం॥ పెరయర్థము నామములకు
నురవడ నుత్పత్తిమై ని – రుక్తి చెలంగున్ ।
ధర నిట్టి దుండగంబుల
నరయుట దోషాకరుండ – వని యెంతు నినున్ ॥

జగత్ప్రసిద్ధమగు నామములకు వేఱగు నర్థమును గల్పించుట నిరుక్తి. దోషా + కరుఁడు. రాత్రినిఁ జేయువాఁడు చంద్రుఁడు. దోషములకు నాకరమైనవాఁడని యర్థాంతరము కల్పింపఁబడినది. ఒక విరహిణి చంద్రు నీరీతి దూషించుచున్నది. మఱియును :–

తే॥ గీ॥ కవుల గణియించు తఱిని నా – కాళిదాసుఁ
బోలిఁ దొలిదొల్తఁ జిటికెన – వ్రేలి నంటె ।
నతని కెనయగు కవికఱ – వగుట నేటి
కిని ననామిక సార్థక – తను జరించు ॥

చిటికెన వ్రేలి ప్రక్కవ్రేలికి ననామికయని ప్రసిద్ధనామము. కాని దానిపై కాళిదాసునితో సమానుఁడగు కవి లెక్కకు రాకుంటచే నామరహిత మాయెనని యర్థాంతరము కల్పింపఁబడినది.

### ప్ర తి షే ధా లం కా ర ము. 98

కం॥ విత్తము ప్రతిషేధంబు జ
గత్తతము నిషేధ ముచిత - గతిఁ జెప్పంగన్ ।
నెత్తముకాదిది జూదరి!
హృత్తటి భేదించు ముల్కు - లివు నాటసువిూ! ॥

జగత్ప్రసిద్ధమగు నిషేధవాక్యమును గావ్యముల నుచితగతిఁ జెప్పినచోఁ బ్రతిషేధమగును. ఒకనేర్పరి యుద్ధభూమిని నొక జూదగాని నిట్లుట్టంకించెను. ఈనిషేధవాక్యము లోకప్రసిద్ధము. దీనినిఁ దిరిగి యుచ్చరించుట నిరర్థకమై వేఱగు నభిప్రాయమును బోధించుచున్నది. అట్లు బోధించు నపుడే చమత్కారమును గూర్చుచున్నది. యుద్ధము పాచికలయాట కానేరదు. అట్లుకాదని చెప్పుట నిరర్థకమై యోజూదరీ! పాచికలాడి యితరుల వంచింపఁగలవుకాని రణవిహారములో నసమర్థుఁడవు సుమీ! యను నర్థాంతరమును బోధించుచున్నది. అదియు జూదరి! యను సంబోధనముచే సూచింపఁబడుచున్నది. మఱియును :-

ఆ॥ వె॥ విషము చేతఁగాదు - పెన్కైదువునఁ గాదు
చిచ్చుచేత మిత్తి - చేతఁ గాదు ।
పాపరాని పరుష - భావంబు గలభామి
నులను జేసె భామి - నులనె నలువ ॥

స్త్రీలు విషము మున్నగువానిచే నిర్మింపఁబడకుండుట ప్రసిద్ధము. అట్లు తిరిగిచెప్పుట నిరర్థకము. అయినను నర్థాంతరమును బోధించి చమత్కృతినిఁ గూర్చుచున్నది. ఎట్లన? స్త్రీలకు విషము మున్నగు వాని కన్న క్రౌర్యము మెండుగఁ గలదని. అదియును "పాపరాని" యను విశేషణముచే సూచింపఁబడినది.

### వి ధ్య లం కా ర ము. 99.

కం॥ ఇల సిద్ధవస్తువునకున్
లలిని విధానంబు విధ్య - లంకృతి యగుఁ గో ।
యిల గోయిలయగుఁ బంచమ
కలితము కూజితము సేయు - కాలం బౌదవన్ ॥

సిద్ధవస్తువునకు విధానము నిరర్థకము. అట్లగుచు వేఱొండు నర్థమును స్ఫురింపఁజేసినచో విధ్యలంకారమగును.

ప్రసిద్ధమగు కోయిలను గోయిలనుగాఁ జెప్పుట నిరర్థకము. అట్లగుచు నతిమధురమగు పంచమస్వరమును గూయుచు సకలజనులను సంతోషపెట్టు ననెడు నర్థమును స్ఫురింపఁజేయుచున్నది. అదియుఁ బంచమరుతి సేయునట్టి యనెడు కాలవిశేషణముచేఁ బ్రకటితమగుచున్నది.

అట్టి యుదాహరణముల యందలి వ్యంగ్యార్థము లర్థాంతర సంక్రమిత వాచ్యములు. అట్లయ్యు వీనికి ధ్వనియని వ్యవహారము లేదు. కవియొక్క స్వవచనముచేతనే ప్రకటితములగుటచే. ఈవిషయము ప్రస్తుతాంకురాలంకారమున విచారణ చేయఁబడినది.

విధినిషేధములు ప్రతిషిద్ధములైనచో నాక్షేపాలంకారమగును. ప్రసిద్ధవస్తువులకు విధినిషేధము లాక్షేపాలంకారమునకుఁ బ్రతిద్వంద్వి యగు నీయలంకారములుగాఁ జెప్పఁబడినవి. ఇదియే భేదము. మఱియును :-

చం॥ మడిసిన భూసురార్భకుని - మన్పను బాదజమౌనిపై నసిన్
దడయక దూయుమా! దునుమ - దక్షిణహస్తమ! నిండు వేఁకటిన్
బడలికనుండు నాజనక - నందిని సీతను జేతులారఁ గా
నడవికిఁద్రోయు రాముభుజ - మౌదు విదెట్టిది! జాలిఁ జూపగన్॥

శంబూకుని సంహరింపఁబోవునపుడు శ్రీరామచంద్రుఁడు తన దక్షిణహస్తమును సంబోధించి యిట్లనుచున్నాఁడు. ఇట రాము బాహువును రాముబాహువౌదువని విధించుట యయుక్తమగుచు రామునకు నిర్దయత్వమును స్ఫురింపఁజేయుచున్నది. అదియును "నిండు వేఁకటిన్ బడలికనుండు" అను విశేషణముచేఁ బ్రకటింపఁబడినది.

## హేత్వలంకారము. 100.

కం॥ అనువుగఁ గారణ కార్యము
లను గూర్చుచుఁ జెప్ప హేత్వ - లంకృతియగు మో ।

హనుఁడగు విధుఁడతివల మాన
మున మానము తొలఁచ నుదయ - మున నలరారున్ ॥

కార్యకారణముల రెంటినిఁగలిపి చమత్కరించినచో హేత్వలంకారమగును. మోహనుండగు చంద్రుఁడు మానవతుల మానమును దొలఁగించుటకై యుదయించుచున్నాఁడు. చంద్రదర్శనముచే మానవతులు మానమును విడిచి తమభర్తలను జేరుచున్నారని భావము. చంద్రోదయమనెడు కారణమును మానినీ మానచ్ఛేదమనెడు కార్యమును యుక్తముగఁ గవిగూర్చినాఁడు. మఱియును :-

ఆ॥ వె॥ వెలఁది! నీదుమోవి - విద్రుమ చ్ఛాయమై
చౌటినేలఁబర్వు - బాటవోలె ।
నేనిమనము నార్చి - ప్రాణికతోఁ బిపా
సాకులమును జేయ - దాకలింప ? ॥

ఓతరుణీ! నీమోవి విద్రుమకాంతిగలది. అది చౌటినేలయందలి త్రోవ వలె నెవనిమనమును బిపాసాకులమును జేయదు? మోవి విద్రుమ చ్ఛాయమన? పగడమువలె నెఱ్ఱనిది. చౌటినేలలబాట ద్రుమచ్ఛాయ లేనిది. పిపాసాకులము :- కోర్కెలనెడు నాశచే వ్యాకులమగునది. బాటపక్షమున దప్పికచే వ్యాకులమగునది. ఆర్చి :- ఆడించి. బాట పక్షమున ఆర్చియని యలఘురేఫయుక్తము. ఆర్చి యనఁగా నాఱి పోవునట్లు చేసియని యర్థము. ఇట కార్యకారణములు పొందుపఱుపఁ బడినవి. మఱియును :-

శా॥ మానంబొల్లదు శాంతియడ్డెదును హ్రీ - న్నేలరాయు స్వాతంత్ర్య[మున్
దీనత్వంబునఁ ద్రిప్పమోము తొలఁగున్ - గేలూచి ధీరత్వ మిం ।
త్తైనన్ బేర్మిని నిన్ను వెంబడిన నా - కాశా! ఫలంబిద్దె నే
నేనిన్ గాలను దాకనొల్ల నను వాఁ - డే రోయుఁ గాల్వట్టినన్ ॥

ఒకఁడాశను సంబోధించి యిట్లనుచున్నాఁడు. మాన మంగీకరింపకున్నను, శాంతి వలదన్నను, లజ్జ నేలనురాచినను, నేలను రాయుట లజ్జకనుభావము. స్వాతంత్ర్య మిష్టపడకున్నను ధైర్యము చేయివదల్చుకొని తొలఁగిపోయినను, అనఁగా వీనినన్నిటిని లెక్కచేయక యాశచే నేను బాదముతోఁ దాకనొల్లని వానినిగూడఁ గాలువట్టినను వాఁడు

నన్ను నీసడించుచున్నాఁడు. ఆశను వెంబడించుటచే నవమానముకన్న మేలేమియును గలుగలేదని భావము. ఇచ్చట నాశ కారణము. అవమానము కార్యము. రెంటికిని సమావేశము కూర్పఁబడినది.

హే త్వ లం కా ర ము. II

కం॥ తెలుపఁగఁ గారణకార్యం
బుల కైక్యము గృతుల హేతు - వు పరుల నుడులన్ ।
తెలివేంకటేశు శ్రీఁగ
న్నులు లక్ష్మీవిలసితములు - నుతి కర్తలకున్ ॥

కార్యకారణముల కభేదము దెల్పుటయును హేతువగును. వేంకటేశ్వరుని కటాక్షములు లక్ష్మీవిలసితములకుఁ గారణములగుచుండఁగా నాకటాక్షములే లక్ష్మీవిలసితములని కార్యకారణముల కభేదము చెప్పఁబడినది.

శ్రీ వేంకటేశ్వరస్వామి కటాక్షములు ప్రసరించినచోఁ దప్పకను శీఘ్రముగను సంపదలు కల్గునని తాత్పర్యము.

రూపకాలంకారమున రెండు వస్తువులకు సాదృశ్యముచే నభేదము చెప్పఁబడును. ఇచ్చట గార్యకారణభావముచే నభేదము చెప్పఁబడును. ఇది భేదము. మఱియును :-

ఉ॥ ఆయువు దానలీలకు, శ్రీ - తాకృతి విశ్వసనంబు నమ్రభూ
నాయకకోటి, కుత్సవము - నారులకండ్లకు, వెల్గు కీర్తి, కా ।
భాయుత విద్వదాళికి శు - భంబును, బ్రాణము వీరలక్ష్మి, క
త్యాయతనంబు ధర్మమున - క్రాచుఁ గళింగవిభుండు రాజిలున్ ॥

దానలీల కాయువునిచ్చువాఁడని చెప్పవలసియుండఁగా దానికాయువే యగుచున్నాఁడని చెప్పఁబడినది. ఇట్లే తక్కిన చోటులఁ గారణభూతుఁడగు కళింగపతిని గార్యభూతునిగాఁ జూపినాఁడు.

కం॥ శతసంఖ్యాక కావ్యాలం
కృతి లక్షణలక్ష్యములను - గీర్తించితి నే ।
వితతంబుగఁ బ్రాచీనుల
మతమును నాధునిక మతము - మతిఁ దలఁచి తగన్ ॥

—:0:—

# ✓ రసవదాది - అలంకార ప్రకరణము.

———:0:———

కం॥ రసభావ తదాభాసము
లసదృశగతి భావశాంతి – యను సంధింపన్ ।
రసవత్ ప్రేయో ఽలంకృతు
లసమోర్జస్విత్వమును స – మాహితమునునే ।

కం॥ ఉదయము సంధియు శబలత
పదిలముగా భావమునకుఁ – బరఁగినఁ ద్రితయం ।
బదియగుఁ బ్రత్యాసాదులఁ
జమరఁగఁ జెప్పంగఁ గృతుల – సరసత మీఱన్ ॥

కం॥- పొంకము వెలయఁ బ్రమాణా
లంకృతు లెన్మిది చెలంగు – లలి నన్నిటికిన్ ।
సంకలనంబునఁ బమనే
సంకె నలంకృతులు బెరయు – నకలంకముగాన్ ।

రతి, హాసము, శోకము, క్రోధము మున్నగు నవవిధములగు చిత్తవృత్తి విశేషము స్థాయిభావ మనఁబడును. అది విభావము, అనుభావము, వ్యభిచారిభావములచే నభివ్యక్తమైనచో రసమని పిలువఁబడును. అభివ్యక్తియనఁగా మఱుగుననున్నదానిని వెల్లడిపరచుట. అట్టి రసము కావ్యములఁ బ్రధానముగానుండును.

అట్లుగాక మఱియొకదాని కంగమైనచో రసవదలంకారమని వ్యవహరింపఁబడును.

విభావము, అనుభావము నీరెంటిచే నభివ్యక్తమగు నిర్వేదము మున్నగు ముప్పదిమూఁడు వ్యభిచారిభావములును, దేవతలు, గురువు, శిష్యుఁడు, ద్విజుఁడు పుత్రుండు మున్నగు వారియెడ నభివ్యక్తమైన రతియును భావమనఁబడును. ఈభావము ప్రధానముగాక మఱియొక దాని కంగమైనచోఁ బ్రేయోఽలంకారమని వ్యవహరింపఁబడును.

ఔచిత్యరహితములగు రసభావములు క్రమముగ రసాభాసభావాభాసములని చెప్పఁబడును. ఆ యాభాసములు ప్రధానముగనుండక యన్యాంగములగుచో నూర్జస్విదలంకారమగును.

భావమునకు శాన్తినొందునవస్థ భావశాంతి యనంబడును. అది యితరాంగమగుచో సమాహితాలంకారమగును.

భావమునకు నుదయావస్థ భావోదయమనియును, పరస్పర విరుద్ధములగు భావములకు విరోధము లేనట్లు, అనఁగాఁ గలియిక వర్ణింప భావసంధి యనియును, భావములకుఁ బరస్పర సమ్మర్దముచే నొకభావమునకుఁ దిరోధానమును మఱియొకదానికి నభివ్యక్తియును వర్ణించుచో నది భావశబలత యనఁబడును.

ఈభావోదయ భావసంధి భావశబలతలను నితరాంగముగ వర్ణించుచోఁ గ్రమముగ నవి భావోదయాలంకారమనియును భావసంధ్యలంకారమనియును భావశబలతాలంకారమనియును బిలువఁబడును.

ఈరీతిగ రసవదాద్యలంకారములు. మఱియును. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము, అర్థాపత్తి, అనుపలబ్ధి, సంభవము, ఐతిహ్యము, ఈయెనిమిదియునుఁ బ్రమాణాలంకారములు. మొత్తము పదునైదలంకారములు.

వాని కుదాహరణము లెట్లన ?

తే॥ గీ॥ మాని వెలయును యోగీంద్రుఁ – డైన కుంభ
సంభవుండు సముజ్జ్వల – శక్తిరాశి ।
యెవని చులుకంబునందున – నెంచ దివ్య
మీనకూర్మంబు లొక్కెడఁ – గానఁబడియె ॥

దివ్యములగు మీనకూర్మములుగూడ నగస్త్యుని పురిసిటఁ గన్పట్టెనని వర్ణించుటచే నిది యద్భుతరసము, అదియు నగస్త్యునియందలి రతి యనెడు భావమున కంగముగా వర్ణింపఁబడుటచే నిది రసవదలంకారము. మఱియును :–

తే॥ గీ॥ పీనకుచముల మర్దించి - ప్రాని విప్పి
కాంచిఁ బైఁద్రోచి నీవిఁగా - గమున విచ్చి।
సరసతను నాభి నూరువు - జఘున భాగ
మంటి నిమురుచుఁ జొక్కించు - హస్తమిదియె॥

యుద్ధభూమినిఁ దెగిపడియున్న భూరిశ్రవస్సుని బాహువును జూచి యాతని భార్య లీరీతిగ దుఃఖించుచుండిరి. ఇట కరుణారసమునకు శృంగారరసమంగముగాఁ జేయఁబడినది.

2. ప్రేయోఽలంకారమునకు భావాలంకారమని నామాంతరమును గలదు. ప్రేయోఽలంకారమున కుదాహరణమెట్లన ?

చం॥ శివపురి స్వర్నదీతటి వ - సించుచు గోఁచినిఁబెట్టి నెత్తి భ
క్తివశత నంజలిన్ మొగిచి - దీనశరణ్యా! పురాంతకా! త్రినే।
త్ర! వరద! గౌరివల్లభుఁడ! - రక్షణసేయుమటంచు నార్చుచున్
దివసములన్ నిమేషగతి - నేఁ గడఁబెట్టుట యెన్నఁడో కదే!॥

ఒక విరాగి వచనము. కాశీపట్టణమున గంగయొడ్డున గోచినిఁబెట్టి శంకరా! రక్షింపుమనుచు భక్తితత్పరతచే నేనెప్పుడు కాలమును నిమేషముగఁ గడుపుదునోకదా! ఇట శాంతిరసమునకు నెప్పుడోకదే! యను పదముచే సూచింపఁబడిన చింతయనెడు వ్యభిచారిభావ మంగముగాఁ జేయఁబడెను. మఱియును :-

శా॥ విన్నుందాఁకు గిరుల్ వెడందకడలుల్ - పెంపార వే పృథ్వి! నీ
వన్నింటిన్ దగమోయుచున్ బడలవా - హా! నీకు జేజేలటం।
చెన్నో మాఱునుతింపనుండ నృపతీ! - యీ నీభుజంబామహిన్
మన్నింపన్ వహియించునంచు స్మృతిరా - నావాకులంటెన్ గడన్॥

ప్రభుస్తుతి. ఓరాజా! కులపర్వతములను మహాసముద్రములను మోయుచు బడలనట్టి భూదేవతను బలుమాఱులు నేను స్తుతించుచుండ నట్టి భూమినిఁగూడ మోయుచు నలసటచెందని నీభుజము స్మృతికి రాఁగా నట్టి భూమిని స్తుతించు నావాక్కు లడఁగిపోయినవి. ఇట నృప

విషయకమగు రతియనెడు భావమునకు పృథివీ విషయకమగు రతి యనెడు భావమంగముగా వర్ణింపఁబడినది.

3. ఊర్జస్వి దలంకారము.

మ॥ వని నీశత్రునృపాంగనల్ జితరిపూ! - పంకించి వేవేగఁ బో
వను బోయల్ రభసంబునన్ బొదువ దు - ర్భావంబునం జేరి వా
రి నితాంతోచ్చలదున్నత స్తనతటుల్ - రెక్కొన్న వాల్చూపులన్
గని పుల్కల్ వొడమంగ నిల్చిరి తొలం-గన్ విస్మృతోద్యోగులై

పరిభువర్ణనము. ఓపరిభూ! నీశత్రుస్త్రీలు వనములఁబట్టి పోవునపుడు బోయలు దుర్భావంబున వారిదరిచేరియు వారి యంగసౌష్ఠవమును జూచి యచ్చెరువొంది దుర్బుద్ధినివిడిచి నమ్రులై యొదిగి నిలిచిరి.

ఇట రాజునందుఁ గవికిఁగల రతికి బోయలకు రాజకాంతల యందలి శృంగారరసాభాస మంగమగుచున్నది. మఱియు :-

ఆ॥ వె॥ నీవు కంటఁబడఁగ - నోవిభూ! మాపుట్టు
వరయు ఫలమటంచు - నరిగణంబు।
నిన్ను వెయ్యినోళ్ల - నృహరి భూనాయకా!
సంగరాంగణమున - సన్నుతించు ॥

నరసరాజునందలి కవిరతిభావమునకు నాతని శత్రువులకు నతనియందుఁ గల రతిరూప భావాభాస మంగమగుచున్నది.

4. సమాహితాలంకారము.

చం॥ ఎడముగనుంటి నీపెతలఁ - పేమియొ చూతమటంచు నాపెయున్
గడఁక శఠుండితండు వలు - కండె యటంచు వహించెఁ గిన్క ని।
ల్లడము వడంగఁ జూడ్కులు స- హింపక యొక్క నెపాన నేను సం
దడిగ నగంగ నాసతి మ - నంబు కరంగఁగ రాల్చెనశ్రువుల్ ॥

ఒకఁడు చెలికానితోఁ దన రహస్యవృత్తాంతమును దెల్పుచున్నాఁడు. తన చెలి కినుక చెంది తనతో మాటలాడకుండఁగాఁ దానును గొంతతడవట్టులే యుండి సహింపలేక యొక నెపముగొని సందడిసేయుచు నవ్వఁగా

నాపె కంటనీళ్లు రాల్చినదని. ఇట శృంగారరసమునకుఁ గోపశాంతి యంగమగుచున్నది.

౫. భావోదయ మెట్లన?

తే॥ గీ॥ ఉపశమిల్లుచు నాయెడఁ – గృపను జూపు
మోయి! నినుఁజూచు చీపవ – లాదుగఁ బఱతు।
తామరాకున గోటిచే – తను లిఖించి
చూడ నినుఁబోలు నాపతిఁ – జూపె హంస॥

దూతయగు నలునిఁగూర్చిన దమయన్తీ వాక్యము. పద్యము స్పష్టార్థము. ఇట నలునిఁగూర్చి దమయంతికిఁ గల్గిన యౌత్సుక్య భావముయొక్క యుదయము శృంగారరసమున కంగమగుచున్నది.

౬. భావసంధి యెట్లన?

మ॥ వడి రానున్న వియోగభారము దలం – పన్ దూలు కాంతన్ గనన్
గడఁకన్ సంగరడంబరంబు వినఁబు – ల్కాల్ దేరు నీచెక్కిలో।
క్కఁడు పుంఖంబులఁజూపు మన్మథు నిషం – గంబట్లు పొల్చున్ మఱొ
క్కఁడువోలున్ నృప! వీరలోకజయమాం – గళ్యార్థపుం బాలికన్॥

ప్రభుస్తుతి. ఓరాజా! నీవు దండయాత్రకు వెడలనుండి వియోగభయముచే ఖిన్నయగు కాంతనుజూడ నొకచెక్కిలి గగుర్పొందినది, రెండవది యోధుల యుద్ధసన్నాహముచే నట్లాయెను. మొదటిది బాణపుంఖములఁ జూపు మన్మథ తూణీరమువలెను రెండవది వీరమాంగళ్యమునకై నిర్మింపఁబడిన పాలికవలెనున్నది. పూర్వము రాజుల జయమునుగోరు పురజనులు రెల్లుగడ్డి మున్నగువానిచేఁ బాలికయనఁగా బుట్టలనల్లి చెట్లఁగట్టు నాచారము కలదట.

ఇట కాంతావిషయకరతికిని యుద్ధమందలి యౌత్సుక్యమునకును సంధివర్ణింపఁబడెను. అదియు రాజవిషయకమగు కవిరతి కంగముగాఁ జేయఁబడినది.

7. భావశబలత యెట్లన?

చం॥ అవగడమేడ నిందుకుల – మయ్యాదియేడ! ; పడంతి వెండి క
న్నవఁబడునొక్కొ—; పెన్ జదువు – కార్యము లెగ్గులె? ; మోము
కిన్కనున్
సువిలసితంబు; సజ్జనులు – నొవ్వరె? ; యేకలనైన నాపెఁగాం
చవశమె? ; ధైర్యముండుము మ – నంబ! ; పఁతేయువ మోవిఁ
ద్రావునో!

దేవయానిని మోహించిన యయాతి మానసికభావములు. ఇందుకుల మెక్కడ? చెడుపను లెక్కడ? దేవయాని బ్రాహ్మణకన్యక గాన మోహింపఁదగదని భావము. ఇది వితర్కము. పడఁతి వెండికన్పడునా? ఇది యౌత్సుక్యము. ఇది వితర్కమును బాధించి తానుద్బుద్ధమైనది. పెనుఁజదువులకు ఫలము లెగ్గులొనర్చుటయా? ఇది మతి. ఇది యౌత్సుక్యమును బాధించినది. కినిసినను మోము సుందరము. ఇది స్మరణము. మతిని బాధించినది. సజ్జనులేమందురో! ఇది శంక. స్మరణమును బాధించినది. కలనైనఁ గన్పడునే? ఇది దైన్యము. చిత్తమా! ధైర్యమేశరణ్యము. ఇది ధైర్యము. ఏయువ మోవిఁద్రావునో! యిది చింత. పై వ్యభిచారిభావము లొండొంటిని బాధించుకొంటచే నిది భావశబలత. ఇది విప్రలంభశృగారమునకు నంగముగాఁ జేయఁబడినది.

\ ప్రత్యక్షమనెడు ప్రమాణాలంకార మెట్లన?

తే॥ గీ॥ ప్రతిఫలిత ముఖచంద్రవి – భాసురంబు
బాలసహకార పల్లవ – భంగ సురభి।
స్వాదు వళినాదితము హిమ – స్పర్శమైన
మదిర నింద్రియవర్గము – మైకమొందె॥

మదిరాపానసుఖవర్ణనము. కాంతాముఖచంద్రునిచే ప్రతిఫలింపఁబడినట్టియును, ఆపెతోఁగలిసి త్రాగఁబడినదని భావము. త్రుంపఁబడిన చూతపల్లవసౌరభము కలదియును, తుమ్మెదల నాదము కలదియును,

శీతలస్పర్శముకల మదిర నాస్వాదింప ఘ్రాణేంద్రియము లన్నియును దృప్తినొందినవి. ఇట యింద్రియతృప్తిచే నింద్రియజన్య ప్రత్యక్షమలంకారము. మఱియును :-

తే॥ గీ॥ సరసిఁ జూపట్టు నయ్యది - సరసిజంబొ ?
యువతి యాననమొకొ ? నే - నూహఁ దెలియ ।
నంచు నెంచుక తానంశ - యించి యొకఁడు
కమలమెఱుగని హావభా - వములఁ దెలిసె ।

ఒకఁడు సరసిలోనున్న యువతిముఖమును దొల్త ముఖమా ? లేక పద్మమా ? యని సంశయించి పద్మమున కసంభవమగు హావభావములచే నిశ్చయించెను. పూర్వపద్యమునఁ గేవల ప్రత్యక్షము, ఈపద్యమున సంశయోత్తర ప్రత్యక్షము వర్ణింపఁబడినది. ఇది భేదము.

2 అనుమానాలంకారమెట్లన ?

ఉ॥ ఆకసమెల్లఁ గప్పెఁ జల - దంబుదధూమము జ్యోతిరింగణా
స్తోక తతుల్ కృశానుకణ - సోదరభావము నొందె విద్యుదా ।
లోక పిశంగముల్ దెసలు - లోకముగా నిటులెంతు నధ్వగా
నోకహషండమందు మద - నుండను దావము రేగెనంచిలన్ ॥

వర్షాకాలవర్ణనము. కదలెడు మేఘములు పొగగాను, మిడుఁగుఱుఁ బురువులు నిప్పురవలుగాను, మెఱుపులచే దిక్కులు పసుపురంగు కలవిగను, నంటచే బాటసారులనెడు చెట్లగుంపులో మదనుఁడనెడు నగ్నిచెలరేఁగినటు లూహింపఁబడెను. ధూమము మున్నగు వహ్నికార్యములచేఁ గారణమగు వహ్నియూహింపఁబడుచున్నది. కాన నిది యనుమానాలంకారము మఱియు :-

చం॥ కరడులఁబోలు చూడ్కులొలు- కఁగ గను నీచెలులేనిపై బొమల్
ముఱియుచు నూపుచుండ్రు శర-ముల్ వడుచుండును గాదె వాసిపైఁ
దెరలుగ, దీననెంతు విలుఁ - దీరుగలాగి మరుండు క్రుద్ధుఁడై
శరముల నేయ వారికను - సన్నఁ జరించును మ్రోలనంచొగిన్ ॥

ఒక నగరమందలి స్త్రీలవర్ణనము. తరంగపంక్తులనుబోలు చూపుల నేయువకునిపై బ్రసరింపఁజేయుచు నీనగరమందలి చెలులు కనుబొమల నూపుదురో నతనిపై వెనువెంటనే మన్మథశరములు ప్రసరించుచున్నవి. ఈకార్యకారణభావముచేఁ గవి యిట్లనుమానించుచున్నాఁడు. వారిముందు ధనుర్ధరుఁడగు మన్మథుఁడు యువకులపై బాణప్రయోగముచేయుటకై వారియాజ్ఞ కెదురుచూచుచున్నాఁడని.

పూర్వోదాహరణమున ననుమానము రూపకసంకీర్ణము. ఇట దృష్టులను బాణములుగా నధ్యవసించుటచే నిది యతిశయోక్తి సంకీర్ణము. శుద్ధానుమానమెట్లన ?

తే॥ గీ॥ కూతలుడిగిన పక్షుల – గుములచేత
మూతిమొగిచిన పద్మినీ – వ్రాతమునను।
విరులనవ్విన మాలతీ – వీరుధములఁ
దోలఁగె నస్తాద్రి కినుఁడంచుఁ – దెలియఁబడియె॥

పక్షికూతలుడుగుట మున్నగుకార్యములచే సూర్యాస్తమయరూపమగు కారణ మనుమానింపఁబడినది. వర్షాకాలమున మేఘావృతమగు దినమున నీయనుమానము యుక్తము. మఱియును :-

చం॥ అడరెడుఁ జండభానుఁడదె – యాఁజన లక్ష్మణ! చెట్లనీడ కా
తఁడు రఘునాథ! రేయి నెటు – తాఁ బొడమున్? విరిసెన్ విధుండు కు।
ట్టుఁడ! యెటు లెంచితిట్టులు కు–రంగముఁ దాల్చుక తాన సుమ్మి? యె
య్యెడ నెలకొంటివో! విధుము–ఖీ! సఖి! హా! హరిణాక్షి! జానకీ!॥

విరహాతురుఁడగు రామచంద్రుఁడు చంద్రుని సూర్యుఁడని భ్రమించిన పిమ్మట సంభవించిన రామలక్ష్మణుల సంవాదము. ఇట కురంగధారణముచే నితఁడు చంద్రుఁడని తెల్పెనుగాన నది యనుమానాలంకారము.

3 ఉపమానాలంకార మెట్లన ?

తే॥ గీ॥ లెక్కలేనట్టి యీమింటి – రిక్కగముల
దానిఁ దెలియుము రోహిణీ – తార యనఁగ।

శకటరూపము నొందును - క్షత్రి నివహ
మేది మెఱయునో! కన్నుల - కింపు గొలుప ॥

ఉపమితికరణ ముపమానము. కరణమన వ్యాపారవత్తగు నసాధారణ కారణము. అనఁగా నేకారణపదార్థమొక వ్యాపారమును బుట్టించి పిమ్మట నొక కార్యవిశేషమును సాధించునో యట్టి కారణవిశేషము కరణమనిపించుకొనును. అనఁగాఁ గారణకార్యములకు మధ్యమున నొక వ్యాపారము పుట్టునని భావము. ఇది ప్రాచీన నైయాయిక మతము.

ఒకఁడొక నక్షత్రవేత్తను రోహిణీనక్షత్రమును దెల్పుమనిన నాతఁడిట్లనెను. పద్యార్థము సుబోధము. అలంకారసమన్వయమెట్లన? శకటాకారనక్షత్రపంక్తిని రోహిణీనక్షత్రమును గానెఱుంగుమనెడు వాక్యమతిదేశవాక్యము. ఈ యతిదేశవాక్యముయొక్క యర్థజ్ఞానముపమానమనఁబడును. ఈవాక్యార్థజ్ఞానముకల మనుజుఁడాకాశమున నొక నక్షత్రసముదాయమును జూచునప్పుడచట శకటసాదృశ్యము కన్పడినది. అంత నతనికిఁ బై యతిదేశవాక్యస్మృతి కల్గినది. ఇదియే వ్యాపార మనఁబడును. పిమ్మట శకటాకారముగల యీనక్షత్రవ్యక్తి, రోహిణీ పదవాచ్యమనెడు జ్ఞానము కల్గుచున్నది. ఇదియే యుపమితి జ్ఞాన మనఁబడును. అనఁగాఁ దొల్త నతిదేశవాక్యార్థజ్ఞానము కల్గినది. ఇదియే యుపమానము. పిమ్మట నతిదేశవాక్యస్మృతి. ఇదియే వ్యాపారము. పిమ్మట నుపమితి జ్ఞానము. ఇదియే కార్యము. కరణవ్యాపార కార్యములు మూడును జూపఁబడుటచే నిట యనుమానాలంకారము. ఇదంతయు వ్యాపారవదసాధారణకారణము కరణమను ప్రాచీన నైయాయికమతానుసారముగఁ జెప్పఁబడినది.

ఇఁక నవీననైయాయికమతానుసారము ఫలాయోగ వ్యవచ్ఛిన్న కారణము కరణమని సిద్ధాంతము. అనఁగాఁ గారణకార్యములకు నడుమ వేఱొక వ్యాపారము కలుగనక్కఱలేదనియును గారణము వెంటనే కార్యము పుట్టవచ్చుననియు వారి భావము.

తే॥ గీ॥ రతిమనోహరుపగి నతి - రమ్యమూర్తి
దానవాంతకుపోలె ను - ద్దామ తేజు
శైలపతివోలె నతిధైర్య - శాలి నిచటఁ
దలఁతు వేంకటపతి మహీ - ధవునిఁగాను ॥

ఇట యతిదేశవాక్యార్థమగు సాదృశ్యముతోఁగూడ మహీపతి స్వరూప ప్రత్యక్షము గల్గిన వెంటనే యతిదేశవాక్యస్మృతిరూపమగు వ్యాపార మక్కఱలేకయే ఈరాజు వేంకటమహీపతి పదవాచ్యుఁడనెడు నుపమితి రూపఫలము కల్గినది. అనఁగా సాదృశ్యజ్ఞానరూపకారణముతోఁ గలిసియే యుపమితి రూపకార్యము పద్యమునఁ జెప్పఁబడినదని యెఱుఁగ వలెను.

ఇట నవీన నైయాయికమతానుసార ముపమానాలంకార మగుచున్నది. వేంకటమహీపతి యిట్టివాఁడని యొకనివలన వినినట్టి యొక యాచకుఁ డానృపతిని రాజసభలోఁజూచి యీపద్యములోని రీతిగఁ దలఁచినాఁడని పద్యార్థమునకు సంగతి నెఱుంగవలయును.

మొదటి యుదాహరణమున నుపమానభూతమగు నతిదేశ వాక్యము చూపఁబడినది. ఈ రెండవ యుదాహరణమున నతిదేశ వాక్యము చూపఁబడక యట్టివాక్యమునకర్థమగు సాదృశ్యముయొక్క ప్రత్యక్షమే రూపముగాఁగల యుపమానము, ఉపమితి రూపఫలము తోఁగూడఁ జూపఁబడినదని సంగ్రహార్థము.

4 శబ్దప్రమాణమున కుదాహరణ మెట్లన ?

ఆ॥ వె॥ తప్పుఁ జూపఁదలఁచి - యొప్పును విడిచియుఁ
బలికితౌర ! యీశు - పట్లఁ దగవు ।
ఏని నాత్మభవున - కేని కారణమండ్రు
వాఁడదేల ? లక్ష్య - భవుఁడు గాఁగ ॥

పార్వతి కుహనాబ్రహ్మచారినిఁ గూర్చి యిట్లు పల్కినది. ఓయీ ! యీశ్వరుని పుట్టువెవ్వరికినిఁ దెలియదని యాక్షేపించితివి. ఆక్షేపింపఁ

దలఁచియు నిజమునే పల్కితివి. ఏలయన? సృష్టికర్తకుఁగూడ జన్మ హేతువగు శంకరుని జన్మము తెలియకుండుట సత్యమని యామె సమర్థించినది. ఇట వేదములాక్రీతిగఁ బ్రతిపాదించుటచే శబ్దప్రమాణము చూపఁబడినది.

ఇట్లే స్మృతిపురాణవచనములుగూడఁ బ్రమాణముగా గ్రహింపఁబడవచ్చును.

స్మృతిరూపమగు శబ్దప్రమాణ మెట్లన?

కం॥ జనులార! పాపకర్మవు
లను బలిమినిఁ జేయుఁడవి యి – లను జేయనివా।
మనువనఁడే బలిమినిఁ జే
సిన పనులెల్లయును దలఁపఁ – జేయనివంచున్ ॥

మనువు, భక్తిశ్రద్ధలతోఁ జేసిన విధులే ఫలించునుగాని బలాత్కారముగఁ జేసిన విధులు ఫలింపవని చెప్పినాఁడు. నాస్తికుఁ డామనువచనమును దనకనుకూలమగు పాపాచరణమున కనుగూలమగు ప్రమాణముగ గ్రహించినాఁడు.

తొలిపద్యమున "యోబ్రహ్మాణంవిదధాతిపూర్వమ్" నుశ్రుతి యభిమతార్థమునఁ బ్రమాణముగా గ్రహింపఁబడినది. ఈపద్యమున స్మృతిని, సర్వాభిమతార్థమును దూషించు నాస్తికుఁడు, అనభిమతార్థమునఁ బ్రమాణమునుగా గ్రహించినాఁడు. ఇది భేదము.

మీమాంసాశాస్త్రమందలి యాచారము, ఆత్మతుష్టియనెడు ప్రమాణములు వేదవాక్యముల ననుమయింపఁ జేయుటచే వానిని శబ్దప్రమాణములో నంతర్భూతములుగా గ్రహింపఁదగు.

వానిలోని యాచార ప్రమాణ మెట్లన?

తే॥ గీ॥ ఆత్మనామము వాక్ప్రవ్వ – రార్య లిద్ది
వృద్ధజన సమ్మతాచార – మిద్ధరిత్రిఁ।
గానఁ జెప్పంగఁ జాలను – గాంత! జగము
దూరుచుండదె? యాచార – దూరు నరుని ॥

దూతయగు నలుని దమయంతి నీపేరెద్దియని ప్రశ్నింప నతఁడిట్లనియె.
ఇట వృద్ధాచారము ప్రమాణముగా గ్రహింపఁబడినది.

ఆ త్మ తు ష్టి ప్ర మా ణ మె ట్ల న ?

తే॥ గీ॥ పూజ్యమగు నాదు చిత్తమీ - పూవుఁబోఁడి
నభిలషించుట రాజున - కర్హ యీపె ।
సంశయించెడు తావుల - సజ్జనులకు
రాణ మానసవృత్తి తా -ర్కాణ గాదె ? ॥

కాశ్యపసుతయగు శకుంతలపైఁ గోర్కెపుట్ట నదితగని కోర్కెయని శంకించికొని దుష్యంతుఁడాత్మతుష్టిని బ్రమాణమునుగాఁ దీసికొని నాఁడు.

ఇట్లే మీమాంసాశాస్త్రమందలి శ్రుతిలింగాదికములును బ్రమాణములుగా గ్రహింపఁబడవచ్చును.

శ్రు తి ప్ర మా ణ మె ట్ల న ?

తే॥ గీ॥ పేరుచేతనె వరదుఁడ - వై రహింతు
నాథ! వరముద్ర విడిచిత - నాదరముగ ।
శ్రుతిని సిద్ధింప నర్థంబు - చొప్ప రహిని
బుధులు దలఁతురు లింగంబు - నధమమనుచు ॥

వరదరాజస్వామికి వరదానముద్ర లేకుండుటను గవి చమత్కరించు చున్నాఁడు. వరదశబ్ద శ్రవణముచేతనే వరదాతయనెడు నర్థము స్పష్టమగుచుండ వరదానముద్రయనెడు లింగము (చిహ్నము) వ్యర్థమని సమర్థింపఁబడెను.

ఇట వరదుఁడనెడు పదశ్రుతినిఁ బ్రమాణముగా గ్రహించినాఁడు.

లిం గ ప్ర మా ణ మె ట్ల న ?

తే॥ గీ॥ స్వార్థమెంతయు నాచేయు - పనుల లేదు
తెల్లమిది మీకు మునులార! - యెల్ల గతుల ।
ఏడునొక్కటి రూపుల - నిట్టివాఁడ
నంచుఁ దెలియంగరానె ? భా - వించిచూడ ॥

పార్వతీ వివాహవిషయమునఁ దన్నుఁజూపవచ్చిన సప్తర్షులనుగూర్చి శంకరుని వాక్యము. ఇట పరోపకారమును జేయు నీశ్వరుని యష్టమూర్తులచే నీశ్వరుఁడుగూడ స్వార్థతత్పరుఁడు కాఁడనెడునర్థము సూచింపఁ బడుచున్నది. ఇదియే లింగమనఁబడును. లింగమనఁగా సూచకము. ఇదియును దత్ప్రతిపాదకమగు వేదమును స్ఫురింపఁజేయుచున్నది. కాన నిదిగూడ శబ్దప్రమాణములలో నంతర్భూతమనవచ్చును. కాననే.

చం॥ కనుబొమమీటి కాంత పెర - కల్కి నివాసపు వైపు సూప; మో
మును బతియడ్డమూపెఁ; దన - ముంగలవాకిటఁ జూప; వెల్లఁబో
యెను; నునుఁజెక్కు కెంపుపచ - రింప మొగంబునఁ; గాళ్లఁ వ్రేళ్లఁ జూ
పునఁబడె; నిట్టూర్పు తను - పోకచెలాంచిసి రోజ్జపజ్జనున్ ॥

అమరుకకావ్యము. గురువు నుపాసింపఁబోయిన యొక కాంత తన భర్త, తనసవతెయింటినుండి రానతనిని నటనుండి వచ్చితివా? యని సన్నసేసి యడుగనతఁడు కాదనెను. ఈరీతిగ వారి తక్కిన చేష్టలు తెలియఁదగు.

ఇట నాయికా నాయకులయొక్క మనోభావములఁ దెలియుటకు నొండొరుల చేష్టలు సాధనభూతములైనను నట్టి చేష్టలచే శబ్దమూహింపఁ బడుచున్నది. కానఁ జేష్టస్వతఃప్రమాణముగాక లౌకికశబ్దప్రమాణములోనే యంతర్భావమగుచున్నదని తెలియవలయును.

కొండొకచోఁ గల్పితమగు శబ్దప్రమాణముచేఁ జమత్కారము గలుగును. ఎట్లన ?

మ॥ మడియన్ భీమసుతామనంబు రతిసం - భావ్యంబు నీసొత్తుగా
జడచంద్రా! తలపోయుదేమొ ? యడియా-సల్ మానుమింకేల? నా
యొడయుం డానలుఁడయ్యె మన్మథబుధుం-డొక్కింత శ్రుత్యర్థమున్
దడవన్ సుందరనైషధాస్య విధు తా-త్పర్యంబునన్ దెల్పెఁబో ! ॥

ఈపద్యము రూపకాలంకారమున నుదాహరింపఁబడినది. మృతుని మనస్సు చంద్రునిఁబొందు ననెడు నర్థముగల శ్రుతికి నలముఖపరము

గాఁగల్పించుటలో నట్లు వ్యాఖ్యానించు స్మరవాక్యము ప్రమాణముగా నుపన్యసింపఁబడినది.

5 అర్థాపత్తి ప్రమాణ మెట్లన?

తే॥ గీ॥ కాను నీకౌను దీనఁ దా - ర్కాణ మరయఁ
బృథునితంబిని! సందేహ - వృత్తి దొఱఁగె ।
లేకయుండినఁ గరికుంభ - లీలఁ గేరు
రమ్యకుచభార మేలీల - రహినినిల్చు? ॥

తే॥ గీ॥ ఆగమముకన్న హేతువే - యధికమైన
నబ్ధి యమునను నిండెజా - హ్నవినిఁ గాదు ।
కాకయుండిన మున్నీరు - గాంగతోయ
లీనమయి పొందు హారకంఠ - లీల నెటులు? ॥

తొలిపద్యమున నవలంబనములేనిచో గురుతరకుచభారము నిలిచియుండదు కానఁ గాంతకు నడుముకలదని యూహింపఁబడెను. ఇదియే యర్థాపత్తి. అర్థాపత్తియన నొకవిషయము సిద్ధించుటకై మఱియొక విషయస్థితి నూహించుట.

రెండవ పద్యమున శబ్దప్రమాణముకన్న హేతువాద మధికమగు ప్రమాణమన్నచో సముద్రము యమునానదిచే నిండింపఁబడినటులు చెప్పవలసియున్నది. గంగచే సాగరము నిండింపఁబడినదని పురాణప్రసిద్ధము. గంగోదకము తెల్లనిది. సాగరోదకము నల్లనిది. కాన నీలజల యమునాప్రవేశ మూహ్యము.

6. అనుపలబ్ధి ప్రమాణ మెట్లన?

తే॥ గీ॥ ఎంతయరసియుఁ గాంచని - హేతువునను
దన్వి! నీకౌనులేదంధ్రు - తర్కమతులు ।
ఊఁతలేకయుఁ గుచగిరి - యుగ్మముంట
విరులవిలుదారి కన్కట్టు - విద్దెకాదె? ॥

తార్కికులుగూడఁ బరిశీలించి కౌనులేదనిరి. ఇదియే యనుపలబ్ధిప్రమా ణము. అనుపలబ్ధియన నెంత పరిశీలించినను వస్తువు కానఁబడకుండుట.

7. సంభవప్రమాణ మెట్లన ?

తే॥ గీ॥ నిన్నఁగానిది నాకెట్టు - లెన్న నెల్లి ?
సైతునంతయుఁ; దుఃఖంబు - సహజమెంచ ।
నైన నీమోాల శరణార్థు - లైన నరుల
కెగ్గులొాదవిన సర్వేశ ! - సిగ్గుకాదె ? ॥

కష్టములు తీరని శివభక్తుని వచనము. లోఁగడఁగలుగని సుఖము భావియందును నాకుఁగలుగదు. దుఃఖము సహజము. దానిని సహింతును. ఇట దుఃఖము మున్నగువానికి సంభవప్రమాణము చూపఁబడినది. మఱియును :-

ఉ॥ ఎవ్వరు గొందరెంతు రవ - హేళనరీతి మదీయవాణి వా
రవ్విధినుండ నేర్తురె ? ర - సొచితి; నాకృతిగాదు వారికై ।
దవ్వులనుండుఁ బుట్టువును - దగ్రితఁ గాంచును నాసముండు వా
క్రువ్వఁగ నేల ? నేలదరిఁ - గూడమ కాలమనంత మెమ్మయిన్ ॥

భవభూతి వచనము. నాకవితను హేళనముచేయువార లజ్ఞులు. నా కవిత వారలకుఁ గాదు. నాసముఁడు దూర దేశమున నుండుట సంభవము. లేకున్నఁ బుట్టుటయైనను సంభవము. ఇట యతనికి సమానుఁడు లభించుటలో సంభవము ప్రమాణముగా గ్రహింపఁబడినది. మఱియును :-

శా॥ అన్నా ! పాంథుఁడ ! యేడనుండి; నగరం-బందుండి;మేల్ వింతలే
మన్నా ! కల్గునె ?;కల్గుఁ జిత్తడిని జా - యన్ వీడి ప్రాయంబువాఁ ।
డెన్నంగన్ మను; సత్యమానె?; మనునం - చీవార్త వింటిన్ గదే !
యిన్నేలెన్నదు మేర, బుద్ధులును వే-లెయ్యేది గాకుండెడిన్ ? ॥

గ్రామీణునకును వాణిజ్యమునకై పట్టణమునకుఁబోయి వర్షాకాలమున నింటికివచ్చు బాటసారికిని సంవాదము. గ్రామీణుఁడు విశేషము లడుగ బాటసారి యువకుఁడొకఁడు వర్షాకాలమున భార్యనువిడిచియు

జీవించియున్నాఁడట యని వార్తను జెప్పెను. అది నిక్కమగుటలో సంభవమును బ్రమాణముగా నాల్గవపాదమునఁ జూపెను. 'నిన్నఁ గానిది నాకెట్టు' లనెడు మొదటి యుదాహరణమున లోఁగడలేనిది భావినెట్లగు ? నని సంభవప్రమాణసిద్ధమగు నర్థము చూపఁబడినది. రెండవ పద్యమున సంభవింపఁదగు నర్థమునేకాక సంభవమును సాధించునట్టి యనంతకాలము మున్నగునవిగూడఁ జెప్పఁబడినవి. మూడవ పద్యమున సంభవముగూడఁ బద్యమునఁ గవిచే స్వవచనముచేతనే చెప్పఁబడినది. ఇది మూడింటికిని భేదము.

౪. ఐ తి హ్యా మె ట్ల న ?

తే॥ గీ॥ భళిర ! మేలెంచ నీపరి - పాటి మాట
సర్వమానవ సమ్మత - మూర్వియందు ।
ఎంతకాలము తనువుండు - నంతకాల
మొందు మానవు నిలను నా - నందమంచు ॥

పరిపాటిమాట యనుటచే నీమాటకుఁ బ్రవక్త కానరాఁడని స్పష్టమగుచున్నది. పరంపరాగత వాక్యముగూడఁ బ్రమాణమగును. దీనినే యైతిహ్యమందురు.

స ం సృ ష్టి స ం క రా ల ం కా ర ము లు.

అర్థాలంకారములకుఁగాని శబ్దాలంకారములకుగాని లౌకికభూషణములకువలెఁ గలియకచేఁ గొత్తతళుకుఁ గన్పడునుగాన నరసింహన్యాయమునఁ గావ్యాలంకారములకు సంసృష్టియనియు సంకరమనియును నలంకారభేదములు చెప్పఁబడుచున్నవి.

రెండుగాని యంతకునెక్కుడుగాని యలంకారములకు సంభవము ననుసరించి తిలలును దండులములును గలిసినరీతిగ వేఱువేఱుగ భాసించునట్లు సమ్మేళనము సంసృష్టి యనఁబడును.

పాలు నీరును గలియునట్లు వేఱువేఱుగ భాసింపక మేళవించినచో దానిని సంకరాలంకారమందురు.

మొదటిది తిలతండులన్యాయమనియు రెండవది క్షీరనీరన్యాయమనియును వ్యవహారము.

సంసృష్టి యొక్కవిధమేయగును. సంకరము నాల్గువిధములగును. అంగాంగిభావ సంకరము, సమప్రాధాన్య సంకరము, సందేహ సంకరము, ఏకవాచకానుప్రవేశ సంకరమనియు. ఇట్లు నరసింహాకారములుగల యలంకారము లైదువిధములు.

శబ్దాలంకారములకు సంసృష్టి యెట్లన ?

కం॥ కమ్మనితావుల ఝుమ్మని
క్రిమ్మిన తుమ్మెదరొదన్ము – ఘుమ్మన బొమ్మల్ ।
చిమ్ముచుఁ గ్రొమ్ముడివిడ నన
యమ్మొకచెలి రేఁచి చూపు – నడుకున్ నడుఁకున్ ॥

మాఘమున ననవర్ణనము. తుమ్మెద క్రిమ్ముకొన భీతిచేఁ గనుబొమ్మలు చిమ్ముచుఁ గ్రొమ్ముడివిడ నొకచెలి చూపుచాలును జెదరింపఁజేయుచు వణంకెను.

చూపు + అడుకు :– చూపుచాలు. నడుఁకున్ :– వణంకెను.

ఇట 'మ్మ' యను సంయుక్తాక్షరము పలుమాఱావృత్తి యగుటచే వృత్త్యనుప్రాసమనెడు శబ్దాలంకారము.

'నడుకు' ననెడు వర్ణసముదాయమునకు నావృత్తిచే ఛేకానుప్రాసమనెడు శబ్దాలంకారము. ఈ రెంటికినిఁ బరస్పరాపేక్ష లేక కలయిక చూపుటచే నిది సంసృష్టి.

అర్థాలంకారములకు సంసృష్టి యెట్లన ?

కం॥ తమమంగము లలఁదెడు విధ
ము మహిన్ గాటుకను వ్యోమ – ము గురియు నట్టుల్ ।
కుమతినరు సేవవలె సక
ల మనుజ దృష్టియును నిష్ఫ – లత్వము నొందెన్ ॥

అంధకార వర్ణనము. చీకటి, యవయవములను బూయుచున్నదా! యనునట్టులును, వ్యోమము కాటుకను వర్షించుచున్నదా! యను నట్టులును నున్నది. ఇది యుత్ప్రేక్ష.

మనుజులదృష్టి కుమతినరుసేవవలె నిష్ఫలమగుచున్నది. ఇది యుపమాలంకారము. ఈరెంటికిని బరస్పరాపేక్షలేకయే కలియిక చూపఁబడినది. కాన సంసృష్టి.

శబ్దార్థాలంకారములకు సంసృష్టి యెట్లన?

కం॥ సురతరు సుమరుచిరము సుర
చిరనుత మంజీరమంజు – శింజిత మంబా ।
చరణసరోజము మహిమా
సురమస్తక కులిశహేతి – శుభతతి నిడుతన్ ॥

మందారపూలచే మనోహరమైనట్టియును, దేవతలచే నుతింపఁబడిన మంజీరములయొక్క మధురధ్వనికల, యంబాచరణసరోజము శుభము లనిచ్చుఁగాత. ఇట వృత్త్యనుప్రాసమునకును జరణసరోజమనెడు నుప మాలంకారమునకును సంసృష్టి.

సంకరాలంకారప్రకరణము.

ఉ॥ సోఁకుచుఁదెమ్మెరల్ చివురు – జొంపములన్ గదలింపనూఁగు పెన్
మ్రాఁకులక్రింద నీడలుగ – నన్ నెలసింగము నింగిఁబొంగి చే ।
తాఁకుచు వ్రేటువెట్టుగతిఁ – దట్టఁ దునింగినరూపువట్టు నా
చీకటిగారు మేని పెనుఁ – జీరికలట్టు వణంకెనత్తఱిన్ ॥

శిశుపాలవధకావ్యమున రైవతకగిరి వర్ణనము. వెన్నెలలోఁ జెట్లనీడలు వర్ణింపఁబడుచున్నవి. పిల్లగాలిచేఁ గదల్పఁబడిన చెట్లక్రింద నూఁగెడు నీడలు చంద్రుఁడనెడు సింగముచే ఖండింపఁబడిన రూపుగల చీకటి యనెడు నేనుఁగుయొక్క మేనితునుకలా! యనునట్టు వణఁకుచున్నవి.

ఇట నెలసింగము, చీకటిగారు, అనుచోట రూపకము. వణం కుటయనెడు సాధర్మ్యముచే నీడలకు నప్పుడే నఱుకఁబడిన మేనిచీరిక

లతోఁ దాదాత్మ్యసంభావనము చేయఁబడుటచే నిది యుత్ప్రేక్షాలంకారము. మఱియును దునుంగు ధాతువునకు నాకృతిచ్ఛేదము ముఖ్యార్థము. స్వరూపనాశము గౌణార్థము. ఈరెంటికిని నభేదాధ్యవసాయము చేయఁబడుటచే నిది యభేదాతిశయోక్తి. ఆకృతిచ్ఛేదరూపమగు ముఖ్యార్థము గారు (ఏనుఁగు) తోను, స్వరూపనాశరూపమగు గౌణార్థము చీకటితోను నన్వయించునని తెలియఁదగు. ఈయభేదాతిశయోక్తిచే రూపకము సిద్ధించుచున్నది. ఈరూపకముత్ప్రేక్షను సిద్ధింపఁజేయుటచే దీనికంగమగుచున్నది. ఉత్ప్రేక్షాలంకారమంగియని తేలినది.

రూపకము లేనిచో నీడలు తునింగినరూపున్నట్లు మేనిచీఁకల్ట్లు వణంకె ననునంత మాత్రమునే చెప్పినచో నుపమయే యగునుగాని యుత్ప్రేక్ష కానేరదు.

కాన నిట యతిశయోక్తిరూపకోత్ప్రేక్షలకు నంగాంగి భావముచే సంకరమని దెలియనగును.

ఇచ్చట నొకశంక గలుగుచున్నది. నెలసింగము, చీకటిగారు, అనుచోట నెలయనెడు సింగము, చీకటియనెడు గారు, అని విగ్రహవాక్యము చెప్పినచో రూపకసమాసమగునట్లు, సింగమునంటి నెల, గారువంటి చీకటియని విగ్రహవాక్యముచెప్పిన నుపమిత సమాసమగును. ఈయుపమితసమాస మాశ్రయించి నీడలు మేనిచీరికల్ట్లు వణంకెననుచోట నుపమయే చెప్పనచ్చునుగదా ? యని.

దీనికి సమాధానమేమనిన ? తునింగినరూపువట్లు ననెడు చీకటిగారు విశేషణమును బరిశీలింప నచ్చట రూపకసమాసమే కాని యుపమితసమాస మాశ్రయింప వీలుకాదని యంగీకరింప వలసియుంటయే.

అదియెట్లనిన ? రూపకసమాసమున నెలసింగమనుచోట సింగమునకుఁ బ్రాధాన్యముండును. చీకటిగారనుచోట నేనుఁగునకుఁ బ్రాధాన్యముండును. ఉపమితసమాసము నాశ్రయించినచో వరుసగ నెలకును జీకటికినిఁ బ్రాధాన్యముండును.

తునింగిన రూపువట్టు ననువిశేషణ వాచకపదమునకు నాకృతి చ్ఛేదము ముఖ్యార్థమనియు స్వరూపనాశము సాధ్యవసానలక్షణా మూలకమగుటచే నప్రధానార్థమనియును జెప్పియుంటిమికదా ? విశేషణము తానప్రధానమగుటచే మఱియొక ప్రధానమగు నర్థముతో నన్వయించు నే కాని తనతో సమానమగు నప్రధానార్థముతో నన్వయింపదనెడు న్యాయముకలదు. 'గుణానాంచపరార్థత్వా దసంబంధః సమత్వాత్' అనునది న్యాయాకారము.

ఈన్యాయమునుబట్టి యీవిశేషణముయొక్క ముఖ్యార్థమునకు రూపకసమాసములో ముఖ్యమగు నేనుఁగుతో నన్వయము సమంజసముగ నుండునుగదా ? కాన నీవిశేషణముయొక్క ముఖ్యార్థమగు నాకృతిచ్ఛేదమున కన్వయసిద్ధికై చీకటిగారనుచోట రూపకసమాసమాశ్రయింపక తప్పదని చెప్పవలెను. దీనిమూలమున మేని పెనుఁజీరికలట్టు వణంకెననుచోట నుత్ప్రేక్ష యేయని సిద్ధాంతీకరింపవలెను.

ఒకవేళ నుపమిత సమాసార్థములోఁ బ్రధానమగు చీకటితోఁ దునుఁగుధాతువుయొక్క సాధ్యవసానలక్షణామూలకమగుస్వరూపనాశరూపార్థగర్భితమగు నాకృతిచ్ఛేదకర్తృత్వ కర్మత్వ మన్వయించినను ముఖ్యార్థమగు నవయవచ్ఛేదరూపార్థముయొక్కయన్వయముచేవచ్చిన స్వారస్యము సిద్ధింపదుకాన నుపమితసమాసము నంగీకరించి యుపమాలంకారమనుట తగదు.

కాన నుత్ప్రేక్ష సిద్ధింపవలెనన్న రూపకమాశ్రయింపక తప్పదు.

'వలెన్' 'అట్టు' అను పదములు సాదృశ్యబోధకములుగఁ బ్రసిద్ధములగుటచేత సంభావనాబోధకములు కావలెనన్నచోఁ దాత్పర్యగ్రాహక మొకటి కావలసియున్నదికాన నిట రూపకమునే సంభావనాగ్రాహకమునుగా గ్రహించినగాని యుత్ప్రేక్ష సిద్ధింపదని భావము.

ఇట యొకశంక గలదు. సంభావనాగ్రాహకమునుగా రూపకమును జెప్పుచున్నను దునింగిన రూపమువట్టు ననెడు నధికవిశేషణ

మును జెప్పినంతమాత్రముచే నీడలకు మేనిచీరికలతోఁ దాదాత్మ్య సంభావనము సిద్ధించునుగదా ? యని.

దీనికి సమాధానమేమనిన ? అట్లయ్యును నాకృతిచ్ఛేదనాది రూపమగు కార్యమును సమారోపించుటకు నిమిత్తముగఁ జంద్రుని యందును జీకటియందును హంతృహంతవ్యరూపమగు చేతనపదార్థ ములయొక్క వృత్తాంతము నారోపింపక తప్పదు. ఇట్లగుటచే సమా సోక్తి, సంభావనాగ్రాహకమగునుగాన సమాసోక్తికిని నుత్ప్రేక్షకును నంగాంగిభావసాంకర్యమగును.

పైనిఁజెప్పినరీతిగ రూపకము సంభావనాగ్రాహకమన్నచో నతిశ యోక్తిరూపకోత్ప్రేక్షలకు నంగాంగిభావ సాంకర్యమగుచున్నదని.

సమప్రాధాన్యసంకర మెట్లన ?

తే॥ గీ॥ ఒనరదుముకుచు నుచ్చప - యోధరముల
మధ్యమారుణ నాయక - మహిత మగుచు।
అభ్రలక్ష్మికి మరకత - హారమట్ల
పరఁగు భానుతురంగమ - పంక్తిఁ గొలుతు ॥

భానుతురంగమపంక్తినిఁ గొలుతును. అది మేఘపంక్తిపై దుముకుచు, ననూరుఁడు నేతగాఁగలదియై గగనలక్ష్మికి మరకతహారమా ! యను నట్లున్నది.

ఇట పయోధరశబ్దమునకుఁ గుచములును మేఘములును నర్థ ద్వయము. అరుణ నాయకశబ్దమునకు నెఱ్ఱని నాయకమణియును సూర్యసారథియు నర్థద్వయము. పై శ్లిష్టార్థములకు నభేదాధ్యవసా యము. దీనిని నభేదాధ్యవసాయోక్తియందురు. వీనిలో నొకయర్థము గగనలక్ష్మియందు నాయికావ్యవహార సమారోపమునకుఁ బోషక మగుచున్నది, రెండవయర్థము తురంగమపంక్తియందు మరకతహార తాదాత్మ్యము నుత్ప్రేక్షించుటకు సాధనమగుచున్నది. ఇందు మొదటిది సమాసోక్తియు రెండవది యుత్ప్రేక్షయు నగుచున్నవి.

పై యతిశయోక్తి లేకున్న సమాసోక్తియును నుత్ప్రేక్షయును సిద్ధింపవని తెలియవలయును.

పై యుత్ప్రేక్షయును సమాసోక్తితోఁ గలిసియే యేక కాలమునఁ బై యతిశయోక్తిచే నెత్తిచూపఁబడుచున్నది. మఱియు నీసమాసోక్త్యుత్ప్రేక్షలకుఁ బరస్పరోపకారకభావము తుల్యము. అనఁగా రెండును సమప్రాధాన్యము కలవికాన నిట సమప్రాధాన్య సంకరము. మఱియును :-

తే॥ గీ॥ అంగుళులవోలెఁ జికురచ - యంబుఁ దిమిర
సంచయంబును ఘృష్టులఁ - జక్కఁబట్టి।
కుట్మలీకృతి కంజచ - క్షువును విధుఁడు
రజనిముఖమును జుంబించు - రహిని దోచె ॥

చంద్రోదయ వర్ణనము. చంద్రుఁడు, వేళ్లతోఁ గేశసముదాయమును వలెఁ గిరణములచేఁ జీకటినిఁబట్టి కుట్మలీకృత కంజచక్షువగు రజని ముఖమును జుంబించుచున్నాఁడా! యనునట్టు లుదయించుచున్నాఁడు.

ఇట చుంబన ముత్ప్రేక్షింపఁబడినది. ఆ యుత్ప్రేక్షయును నిశాచంద్రులయందు నాయికానాయకవ్యవహార సమారోపము చేయఁబడనిదే సంభవింపదుకాన నట్టి వ్యవహారసమారోపమగు సమాసోక్తి గర్భితముగానే భాసించుచున్నది.

ఈసమాసోక్తిగర్భితయగు నుత్ప్రేక్షకు నంగుళులవోలె ననెడు వాక్యార్థోపమయును గంజచక్షువనెడు సమాసార్థోపమయును సాధకములగుటచే నాయుపమలు పై యుత్ప్రేక్ష కంగములగుచున్నవి.

పై యుపమ లుత్ప్రేక్షాసమాసోక్తులు రెంటికిని సాధకములగుటచేనీ రెంటికిని నంగములగుచున్నవని తాత్పర్యము. మొదటి పద్యమందువలె నీపద్యమందునను నుత్ప్రేక్షా సమాసోక్తులు రెంటికిని నేక కాలముననే స్ఫురణముంటచే సమప్రాధాన్యసంకరము కలదు.

ఆలోచింపఁ బై యుపమలచేఁ బ్రస్తుత పదార్థములగు చంద్రుఁడు, రాత్రియు నీరెంటికి సంబంధింపఁబడిన ధర్మములే చెప్పఁబడుచున్నవి కాని యప్రస్తుతములగు నాయకునకును నాయికకును సంబంధించిన ధర్మములు చెప్పఁబడుటలేదు.

ఎందుచేతనన ? అంగుళులవోలె ఘృష్టులనెడు వాక్యోపమలోను, కంజచక్షువను సమాసోపమలోనుగూడ నుపమేయ పదార్థములగు ఘృష్టులనఁగాఁ గిరణములకును బద్మమునకును బ్రాధాన్యముండుటచేతను నాపదార్థములు ప్రస్తుతములగు చంద్రుని రాత్రిని సంబంధించినవే కానియప్రస్తుతనాయికానాయకులను సంబంధించినవి కాకుండుటచేతనును.

మఱియు నుత్ప్రేక్షాసమాసోక్తులలో రెండింటఁ బ్రకృతాప్రకృతవస్తువులయొక్క సాధారణధర్మసమర్పణ మపేక్షితముకదా ? ఆరెంటను నుత్ప్రేక్షలోఁ బ్రకృతాప్రకృతములకు సాధారణములగు గుణక్రియారూప నిమిత్తాపేక్ష కలదు. సమాసోక్తిలో విశేషణ సామ్యాపేక్షకలదు.

కాన నుపమాలంకార ముత్ప్రేక్షాసమాసోక్తుల కంగమెట్లు కాఁగలదని సంశయము కల్గుచున్నది.

దీనికి సమాధానమెట్లన ?

పద్యమందలి వోలెనెడు పదమును ఘృష్టులతోఁగూడ సంబంధింపఁజేసి యంగుళులవోలె ఘృష్టులఁ దిమిరచయంబును బట్టియనెడు రీతిగ ఘృష్టులవోలె నంగుళులఁ జికురచయంబును బట్టియని వాక్యాంతరమును గల్పించి, యట్లే కంజచక్షువనుచోటఁ జక్షువువంటి కంజమను రీతిగఁ గంజమువంటి చక్షువని సమాసాంతరమును గల్పింపవలెను. ఈరీతిగఁ బ్రకృతములగు నిశాచంద్రులకువలె నప్రకృతములగు నాయికానాయకులకును బ్రత్యేక ధర్మములు సంపాదింపఁబడవచ్చును.

ఇట్లు సంపాదింపఁబడిన ప్రత్యేక ధర్మములకు నభేదాధ్యవసాయముచేసి పై ప్రకృతాప్రకృతములకు సాధారణధర్మము సంపాదించి పై యలంకారములకునంగాంగీభావము సాధింపవచ్చునని సమాధానము.

ఈరీతిగ ధర్మసామ్యము సంపాదించుటకు వాక్యభేదసమాస భేదముల నాశ్రయించుటయును బిమ్మట నభేదాధ్యవసాయము నాశ్రయించుటయును బ్రయత్న గౌరవమన్నచో మఱియొక రీతిగ ధర్మసామ్యము సంపాదింపవచును. ఎట్లన ?

ఉపమాలంకారము భేదాభేదోభయప్రధానమని యాలంకారిక సమ్మతము. అనఁగా భేదాంశమును నట్లే యభేదాంశమును నీరెండును బ్రధానములుగాఁగలది.

ప్రకృతమున సదృశములగునట్టి, ప్రకృతగతములగు ష్ఠృష్టి తిమిరకంజములకును, అప్రకృతగతములగు నంగుళిచికురచయ చక్షువ్రులకును బ్రాతిస్వికరూపముచే ననఁగా వైయక్తికములగు నంగుళిత్వమరీచిత్వాది రూపముచే భేదము కలదు, అట్లే యుభయమును సంబంధించినట్టియు సాదృశ్యమున కుపకరించునట్టి యంగుళిమరీచుల రెంటికిని సంబంధించిన తనుత్వము దీర్ఘత్వము, కేశసంచయము తిమిరముల రెంటికిని సంబంధించిన యావరణత్వము నీలత్వము, లోచనములు కంజముల రెంటికిని సంబంధించిన దీర్ఘత్వము కాంతిమత్వమనెడు రూపముచే నభేదము గూడఁగలదు.

పై యభేదాంశమును మాత్రమునే ప్రయోజనానుసారముగ గ్రహించినచోఁ బ్రకృతాప్రకృతములగు చంద్రనాయకులకును, నిశానాయికలకును సాధర్మ్యము సిద్ధించుచున్నది.

ఈ సూక్ష్మపద్ధతిచే నుపమాలంకార ముత్ప్రేక్షాలంకార సమాసోక్త్యలంకారములకు నంగభావమగునట్లు సాధింపవచ్చును. ఇది మొదటిరీతికన్న లాఘవముకలది. కాన నీరీతిగనైనను నంగాంగిభావము సాధింపవచ్చునని సమాధానము.

కాని యీరెండవపద్ధతిలో నొక శంక కలదు. ఏదియన ? ఉపమాలంకారమునఁ బ్రధానములగు భేదాభేదాంశముల రెండింటను భేదాంశమునువిడిచి యొక యభేదాంశమునే యుపయోగించుకొనుటకు

దీనికి సమాధాన మెట్లన? ఒక వస్తువునందు నవినాభావసంబంధముచేఁ గలిసియున్న రెండు ధర్మములలో నొక ధర్మము ప్రయోజనకారి కాకున్నను రెండవధర్మ మొకటియే ప్రయోజనమును సాధింపవచ్చును. దీని కుదాహరణ మెట్లన? సూర్యకిరణములలోఁ గాంతినిచ్చు శక్తియును వేడిమినిచ్చు శక్తియు నీరెండును గలిసియున్నను శీతబాధను బోఁగొట్టుకొనఁదలఁచు గుర్రిజీవానికి నొక్క యుష్ణశక్తియే యుపకరించుచున్నది.

అట్లే ప్రకృతమునఁగూడ నొక యభేదాంశము మాత్రమే ప్రయోజనమును సాధింపవచ్చునని సమాధానము.

ఇట్లంగీకరింపనిచోఁ గొన్ని ప్రసిద్ధములగు నుదాహరణముల నుపమాలంకారము సిద్ధింపనేరదు. ఎట్లన?

తే॥ గీ॥ కెంపుగందము నలఁది ము - త్తెంపు సరిని
బాహుశిరమునఁ దిగుచునీ - పాండ్య నృపతి।
చఱులఁ దొలిమెండ కెంపును - జాట వాక
వెలికిఁ గ్రిక్కెడు మలరేఁడు - వలెఁ జెలంగు॥

ఇందుమతీ స్వయంవరములోఁ బాండ్యుని వర్ణనము. ఇట నుపమానోపమేయములగు నద్రిరాజ పాండ్యరాజులకు ధర్మసామ్యము గన్పట్టదు. పాండ్యుని పక్షమున రక్తచందనము ముత్యాలసరులును గలవు. అద్రిరాజు పక్షమున లేతయెండయును గొండకాలువయును గలవు. కాన ధర్మసామ్యమునకై తొలియెండ కెంపుగందములకును ముత్తెంపు సరి కొండవాకలకును రక్తిమ ధావళ్యము మున్నగు ననుగత ధర్మములచే నభేదాంశము మాత్రమునే సాధనముగా స్వీకరించి యుపమాలంకారమును సాధింపక తప్పదు. కానఁ బై సమాధానము యుక్తియుక్తముగనే యున్నది.

కాలభేదమున్నను రెండలంకారములకు సమప్రాధాన్య సంకరమును జూపట్టుచున్నది. ఎట్లన?

తే॥ గీ॥ కడలి తనతరంగాగ్రి భా - గముల ఫేన
చందనంబును నూరెడు - చందమమరు।
దానిఁ దొఁగ త్రేఁడు కరములఁ - దాల్చి దెసలు
బోటులకుఁ బూతలలఁదెడు - పోల్కి వఱలు ॥

ఈపద్య ముత్ప్రేక్షాలంకారములో నుదాహరింపఁబడినది పద్యార్థమచ్చటనే చూడనగు. ఇట పరస్పరాపేక్షలేనట్టి వాక్యద్వయముచేఁ జెప్పఁబడుటచే నుత్ప్రేక్షలు రెంటికినిఁ గాలభేదమున్నను సమప్రాధాన్యము కలదు. "దానిఁదొఁగ త్రేఁడు కరములఁదాల్చి" యనుటచే ఫేనచందనమనెడు రూపకముయొక్క యపేక్ష రెండవయుత్ప్రేక్షకుఁ గలదు. కాని మొదటి యుత్ప్రేక్షయొక్క యపేక్ష యెంతమాత్రమును లేదు కదా ?

"అంగకంబులఁ బూతలలఁదుపోలెఁదమంబు" అను మున్నగు చోటునందువలె నిచ్చటఁగూడ నుత్ప్రేక్షాద్వయమునకు సంసృష్టి యనియే యేలచెప్పరాదని శంక కలుగవచ్చును. కాని లోకసిద్ధమగు గంధమురాచుటయును బిమ్మటఁ బూయుటయు ననెడు పౌర్వాపర్యముయొక్క రీతిననుసరించి యుత్ప్రేక్షల రెంటియొక్క పౌర్వాపర్యమును జూపుటలోఁ జమత్కారాతిశయము కన్పట్టుటచేఁ గేవల సంసృష్టి యనుటకన్న సంకరమనుటయే తగును.

కాన స్వర్గమనెడు నొకఫలమునే సాధించునవి యగుటచే దర్శపౌర్ణమాసాది యాగములకువలెఁ గాలభేదమున్నను బైనిఁజెప్పఁబడిన రీతిగఁ జారుత్వాతిశయ రూపమగు నొక ఫలమును గూర్చి సాధనభూతములగుటచేఁ బై యుత్ప్రేక్షలు రెండును గాలభేదమున్నను సమప్రాధానములగుచున్నవి.

సందేహసంకర మెట్లన ?

తే॥ గీ॥ మొగులుదొలఁగిన చందురుఁ - దగులు జ్యోత్స్న
యమరు కడలినిఁ జొచ్చుజా - హ్నవిర యాపె ।

ఇట్టులేడగు నాజంట - నెంచి పౌరు
లోకట నాడిరి నరపతు - లకట వగవ ॥

ఇందుమతీ స్వయంవరానంతరము పౌరవాక్యము. ఇట యీాపె యనెడు సర్వనామమునకు నజునివరించిన యిందుమతి, మేఘనిర్ముక్త యగు జ్యోత్స్న యో యగున నెడురీతిగ వాక్యసమన్వయము చేసినచో సదృశములగు వాక్యార్థములు రెంటికి నైక్యారోపముంటచే నిదర్శనాలంకారమగును.

లేక యీాపెయనుదానికిఁ గేవల మిందుమతియే యర్థమైనచో నాపె యజునివరించినది యనెడు నర్థము పద్యమున వాచ్యముగఁ జెప్పఁబడకున్నను బ్రసంగవశమునను, నిట్టులేడగు జంట నెంచి యను దానిచేతను దెలియఁబడుచున్నది

ఇట్టి యిందుమతీకర్తృకమును నజకర్మకమగు వరణరూపార్థము బింబరూపవాక్యార్థము. దీనికిఁ బ్రతిబింబరూపకమగు కౌముదీశశి సమాగమరూపమగు నప్రస్తుత వృత్తాంతమును బ్రకృత ధర్మిపదార్థమగు నిందుమతియందు లగింపవలెను. ఇట్లారోపించినచో లలితాలంకారమగును.

ఈరీతిగ నిట నిదర్శనమా? లేక లలితమా? యనెడు సందేహముండుటచే సందేహసంకరము. మఱియును :-

మ॥ అగుచో నిందువు తాఁగరంగి హృదయం - బాడించు పీయూషవా
పిగ నాకందును నల్లకల్వగుమిగాఁ - బెంపొందుచో నందు ని ।
మ్మగ నేఁగోర్కెలు దీరునట్టు జలక - మ్మొల్ సేయఁగాఁ బుట్టు శై
త్య గురుత్వంబున మారవహ్ని వెత మాయన్ ద్రోయ శక్యంబగున్ ॥

విరహిణీవాక్యము. చంద్రుఁడు నతనికళంకమును గ్రమముగ నమృత హ్రదముగను గలువలుగ నైనచో నందు స్నానమొనరింపఁ దాపము శమించుననెడు నర్థము. తాత్పర్యవిషయమైనచో నిట సంభావనాలంకారమగును.

లేక యిట్టి హర్షప్రసన్నుఁడును సంభవింపనేరదు కాన నా తాపము శమించుటయు నసంభవము. ఈయర్థము తాత్పర్యవిషయమైనచో నొక యర్థమునకు మిథ్యాత్వసిద్ధికై మఱియొక మిథ్యార్థమును నుపన్యసించుటచే మిథ్యాధ్యవసితి యగును. ఇట్లు రెండువిధములుగ నలంకారము సంభవించుటకు నవకాశముంటచే నిట సందేహ సంకరము.

కం॥ స్ఫటికపుఁ గడవల నుంటన్
స్ఫుటమగు తెల్లంపనంబు - వొందిన నీటన్ ।
పొటమరిలన్ ముత్తెపులత
యటఁబూచెడు పూలనీదు - యశముప మింతున్ ॥

రాజస్తుతి. స్ఫటికపుఁ గడవలనుంటచేఁ దెల్లనిదియగు నీటివోయ ముత్తెపులత పూయు నాపువ్వుతో నీకీర్తి నుపమింతును. దీనిచేఁ గీర్తి ధావళ్యాతిశయము చెప్పఁబడినది. ఇటకూడ సంభావనా మిథ్యాధ్యవసితులకు సందేహసంకరము.

కం॥ విసమును గ్రక్కుచుఁ బొరిబొరి
బుసలన్ గొట్టుచును మొదల - భుజగంబుండన్ ।
రసనను చనిపెడు పండ్లను
బొసఁగెడు మ్రాఁకబ్బియునును - బొసఁగదు చేరన్ ॥

ఫలభరితమగు వృక్షము లభించినను నిట్టిపాము మొదల నున్నచోఁ బ్రయోజనము శూన్యము.

ఇట భుజగవృత్తాంతముచే రాజద్వారమందు నడ్డుకొనుచున్న ఖలవృత్తాంతముగూడ స్ఫురించుచున్నది. భుజగవృత్తాంతము ప్రస్తుతమగుచో నప్రస్తుతమగు ఖలవృత్తాంతము గమ్యమానమగుచో నిట సమాసోక్తి యగును.

లేక ప్రస్తుతమగు ఖలవృత్తాంతమును స్ఫురింపఁజేయుటకై యప్రస్తుతమగు నురగవృత్తాంతము వర్ణింపఁబడుచో నప్రస్తుతప్రశంస యగును. లేక ప్రస్తుతమగు నురగవృత్తాంతముచే సమీపమందున్న

ఖలునివృత్తాంతముగూడ స్ఫురింపఁజేయుఁబడుచో రెండును బ్రస్తుతము లగుటచేఁ బ్రస్తుతాంకురాలంకారమగును. కాన నిది సందేహసంకరము.

ఏ క వా చ కా ను ప్ర వే శ స ం క ర ము.

ఏకవాచకానుప్రవేశ సంకరము శబ్దార్థాలంకారములు రెంటికినిఁ గలసియేయగునని చెప్పి కావ్యప్రకాశకారుఁ డిట్లు లుదాహరించెను.

కం॥ మంజుల కరకింజల్కము
రంజితమును బొద్దుదుద్దు - రహి నష్టదిశా ।
మంజుల దళగత తిమిరా
ళిం జను దివసాంబుజంబు - లీల మొగిడ్చెన్ ॥

కిరణములనెడు కేసరములు కలదియును, సూర్యుఁడనెడు దుద్దుచే విరాజిల్లుచున్నట్టియును, అష్టదిశలనెడు దళములు గలిగినట్టియును జీకటియనెడు తుమ్మెద గల దివసమనెడు పద్మము ముకుళించెను. సూర్యాస్తమయ వర్ణనము.

ఇట యొకపదమునందే రూపకమనెడు నర్థాలంకారమును, అనుప్రాసమనెడు శబ్దాలంకారమును గలసి యేకకాలముననే భాసించుటచే రెంటికిని నేకవాచకానుప్రవేశ సంకరము.

ఒక పద్యమందు భిన్నభిన్నపదములచే వేఱువేఱుగ శబ్దార్థాలంకారములు చూపఁబడుచో సంసృష్టియే యగును. కాని పై పద్యమున సంకరమే యగుచున్నదని.

అలంకారసర్వస్వకారుఁడీరీతిగఁ జెప్పియున్నాఁడు. వాచ్యములగు రెండలంకారము లొక వాచకపదమున సమావేశ పఱుపఁబడుటయే యేకవాచకానుప్రవేశ సంకరమనియును నట్లగుటయే స్వారసిద్ధమని యునునుడివియున్నాఁడు.

మఱియును వాచకపదము వాచ్యప్రతియోగికము (వాచ్యార్థము ప్రతిసంబంధిగాఁగలది) యని తలఁచి యర్థాలంకారములకుఁ గూడ నేకవాచకానుప్రవేశసంకరము నుదాహరించినాఁడు, ఎట్లన?

తే॥ గీ॥ రమ్యపుష్కర భాసిత - రంగ శోభ ;
హృద్యసంచారిత మృదంగ - వాద్యమహిమ ।
నాట్యశాలల నేపట్ట - ణమునఁ జెలఁగి
భామలాడుదు రుద్యాన - వాపి వలెను ॥

నగరవర్ణనము. భామ లుద్యానవాపివలె నాట్యశాలలయందునను నాడు చుందురు. నాట్యశాలలు, రమ్యమగు పుష్కరవాద్యములచే ననఁగా వాద్యభాండములచే భాసితమగు రంగస్థలముయొక్క శోభయును, హృద్యముగఁ బ్రవర్తింపఁజేయఁబడిన మృదంగవాద్యములును గలవి. ఉద్యానవాపి యెట్టిదనిన, రమ్యమగు పద్మములచేఁ బ్రకాశించు తరంగములయొక్క శోభయును, ఈదులచేఁ జేయఁబడిన మృదంగధ్వనివంటి ధ్వనియును గలది.

మొదటిపాదమున శబ్దశ్లేషము కలదు. రెండవపాదమున నర్థసామ్యముంటచే నుపమాలంకారమును గలదు. ఈరెండును. 'వలె' ననెడు నేకవాచక శబ్దముచేఁ జెప్పఁబడుటవలన నిట నేకవాచకానుప్రవేశ సంకరమని యలంకార సర్వస్వకారుని మతము.

కాని యది సరికాదు. ఏలయన ? రమ్య పుష్కర భాసితరంగ శోభ మున్నగు పదములచే శ్లేషవశమున వచ్చు నర్థద్వయమునకు నభేదాధ్యవసాయమును జెప్పి తన్మూలకమగు నతిశయోక్తిచే లభ్యమగు ధర్మసామ్యమే 'వలె' ననెడు వాచకపదముచేఁ బ్రతిపాదింపఁ బడుచున్నదికాని కేవలము శ్లేషరూపకమగు శబ్దసామ్యము ప్రతిపాదింపఁబడుటలేదు.

ఈరీతిగ శ్లేషముచేవచ్చిన యర్థద్వయమునకు నభేదము నధ్యవసించి తన్మూలకమగు ధర్మసామ్య మంగీకరింపఁబడనిచో నీక్రింది పద్యమున సమాసోక్తి సిద్ధింపనేరదు.

తే॥ గీ॥ మాన్యరాగంబు గొన్నట్టి - ధన్య సంధ్య
జార్చుచున్నది యంబర - మేర్చి తానె ॥

నాగమనఁ బ్రేమయనియును నెఱ్ఱఁదనమనియు నర్థద్వయము. అంబర మన వస్త్రమనియు గగనమనియు నర్థద్వయము. సంధ్యాకాలవర్ణనము ప్రస్తుతము. దానిచే నాయికావృత్తాంత మప్రస్తుతము గమ్యమాన మగుటచే నిట సమాసోక్తి యలంకారము. ఇట శ్లేషవశముచే వచ్చిన యర్థద్వయమునకు నభేదము నధ్యవసింపనిచో విశేషణసామ్యము లేదు కాన సమాసోక్తి సిద్ధింపనేరదు కదా ?

మఱియును 'వలె' ననెడు పదముచే శబ్దసామ్యము చెప్పఁబడి నను నాపదమునకు నుపమానవాచకత్వమే కల్గునుగాని శ్లేషవాచకత్వము కలుగనేరదు. కాన శబ్దసామ్యమున్నచోటఁగాని యర్థసామ్యమున్నచోటఁగాని యుపమయే చెప్పవలెను. అట్లంగీకరింపనిచో

కం॥ హ్లాదనమున నెఱు చంద్రుం
డాఁ దాపనవిధినిఁ దపనుఁ - డా నిలనెట్టుల్ ।
ప్రోఁదిన్ జనరంజనమున
సాదుగ రాజాయె నతఁడు - సార్థత నట్టుల్ ॥

ఇట సార్థకనామము కలుగుటయనెడు శబ్దసామ్యమే కాని యర్థసామ్యములేకుంటచే నుపమాలంకారము సిద్ధింపనేరదు. కాన నుపమాసిద్ధికై శబ్దసామ్యముగూడ స్వీకరింపక తప్పదు.

ఈరీతిగఁ గావ్యప్రకాశకారుని మతమును నలంకారసర్వస్వకారుని మతమునుగూడ సమంజసములుగావు.

మఱియేమన ? ఎచ్చటఁ బదములచే నొకయర్థమే చెప్పఁబడఁగా నాయర్థములోనే యలంకార ద్వయలక్షణములు గన్పట్టునో యట నాయలంకారద్వయమునకు నేకవాచకానుప్రవేశ సంకరమని సిద్ధాంతము. ఎట్లన ?

మ॥ అల జాబిల్లి వెలుంగు పైపయిని డా - యన్ జెమ్మలూరంగ నా
నెలరాల్పాదుల నీటివెల్లువలు పూ - న్కిన్ బాఱు నేకక్రియల్ ।

గలుగన్ బోకయె యేపుమీఱి కొనల - ల్లన్ వీచు భీమాత్మజా
లలితోద్యానము చూడ్కిఁ జూఱఁగొన వ్రా - లన్ నిల్చె నాహంస
తాన్ ॥

దమయంతీ ప్రమదవనములోని చెట్లకుఁ జంద్రకాంతశిలలు కుదురులుగఁ గట్టినట్లు వర్ణింపఁబడుటచే నిట వస్తుసమృద్ధి వర్ణనారూపమగు నుదాత్తాలంకారము కలదు. అసంబంధ వస్తుసంబంధరూపమగు నతిశయోక్తియును గలదు. కాన నీరెంటికిని నేకవాచకాను ప్రవేశసంకరమని తెలియవలయును.

ఇట యొక సంశయము కలదు. ఎట్లన ? ఉదాత్తాలంకారముండు చోటులనెల్ల నసంబంధాతిశయోక్తి నియతమగుటచే నీరెంటికి సాంకర్యము చెప్పఁదగదు. విభిన్నములగు నవకాశములుగల యలంకారములకు నట్లు సంకరము చెల్లునుగాని సమనియతములగు నలంకారముల కట్లు చెల్లదని.

దీనికి సమాధానమెట్లన ? ఉదాత్తాతిశయోక్తులు సమనియతములగు నలంకారములు కావు. దివ్యలోకగతమగు సంపత్సమృద్ధిని వర్ణించుతావుల నతిశయోక్తికిఁ జోటులేదు. దివ్యలోకమున నట్టి సంపత్సమృద్ధి సంభవించుటచే. కాన నట్టితావుల నుదాత్తాలంకార మొక్కటియే కలదని చెప్పవలెను.

అట్లే శౌర్యము, ఔదార్యము మున్నగు వానిని నతిశయముగా వర్ణించుతావుల నతిశయోక్తియే కాని యుదాత్తాలంకారము కలుగ నేరదు. ఈరీతిగఁ బ్రత్యేకముగ నవకాశముగల యీరెంటికి నీపద్యమున సంకరము చూపఁబడినది.

ఈరెంటికినిఁ బరస్పరము నుత్థాప్యోత్థాపక భావముగాని స్వాతంత్ర్య పారతంత్ర్యభావముగాని లేకుంటచే నంగాంగిభావము లేదు.

అభిన్న శబ్దములచే నుదాత్తాతిశయోక్తులు రెండును బ్రతిపాదింపఁబడుటచే నీరెంటికిని సమప్రాధాన్యసంకరమును సంభవింపదు.

భిన్నభిన్న ప్రతిపాదకశబ్దములచేఁ బ్రతిపాదింపఁబడిన యర్థద్వయమునకు సంబంధించిన యలంకారములకే సమప్రాధాన్య సంకరము సంభవించును.

సందేహసంకరమును గాదు. సందేహవిషయములగు నలంకారములకు విరుద్ధకోటులఁ బ్రవేశముండవలెను.

కానఁ బై పద్యమున నేకవాచకానుప్రవేశసంకరము నిర్వివాదము.

కొన్నితావుల సంకరములకు సంకరము గూడఁ గన్పట్టుచున్నది. ఎట్లన ?

చం॥ రతుల విసూత్రహారముల - రాలిన ముత్తెములూడ్చ వాకిటన్
గతులఁజెలంగు బాలికల - కాళ్ల యలక్తక మంటి రక్తిమాం।
కితములు గాఁగ దాడిమము - గింజల బమ్మిరిఁ జిల్కలెత్తఁ బం
డితి ధనసంబులందదిరి ! - నిస్తుల భోజుని త్యాగలీలచోనా॥

రతులఁదెగిన ముత్తెపు సరుల రాలిన ముత్తెములను బ్రొద్దుటఁబనికత్తెలు వాకిటనూడ్చ నచ్చట నాటలాడు బాలికల కాళ్లలత్తుకరసమంట నవి యెఱ్ఱవార వానిని నింటిచిల్కలు దాడిమీబీజభ్రాంతిని ముట్టినెత్తుచున్నవి. ఇదంతయును భోజుని త్యాగలీల యగుచున్నది. అతని పండితులకుఁగూడ నమైశ్వర్యము ప్రసాదించుచున్నాఁడని భావము.

ఇట పండితుల సంపత్సమృద్ధి వర్ణన ముదాత్తాలంకారము. దానిలో ముత్తెములకు నలక్తకరసముయొక్క యెఱ్ఱఁదనము సంక్రమించుటచేఁ దద్గుణాలంకారమును గలదు. అట్టి తద్గుణమును దెల్పునట్టి "బాలికల కాళ్లయలక్తకమంటి రక్తిమాంకితములుగాఁగ" ననెడు పదసముదాయరూపమగు పదార్థమే దాడిమీబీజభ్రాన్తికి హేతువగుటచేఁ బదార్థహేతుక కావ్యలింగముగూడఁ గలదు.

దీని ఫలితార్థమేమనినఁ దద్గుణాలంకారమును బదార్థహేతుక కావ్యలింగాలంకారమును గూడ "బాలికల కాళ్లయలక్తకమంటి రక్తిమాంకితములుగాఁగ" ననెడు నేకవాచక పదసముదాయమున నను

ప్రవిష్టములగుటచేఁ దద్గుణ కావ్యలింగముల రెంటికిని నేకవాచకాను ప్రవేశ సంకరము కలదని,

అట్లే భ్రాన్తిమదలంకారమునకుఁ బై తద్గుణ కావ్యలింగముల సంకరము మూలము. తద్గుణకావ్యలింగముల రెంటియొక్క సంకరము చేతను, భ్రాన్తిమదలంకారము చేతను నుదాత్తాలంకారమునకు మిక్కిలి శోభగల్గుటచేఁ బై సంకర భ్రాన్తిమదలంకారములకును నుదాత్తాలంకారమునకును నంగాంగిభావముచే సంకరము.

మఱియు భోజునియొక్క దానలీలకు విద్వద్వైభవము కార్యమగుచుండఁగా హేతు హేతుమత్తులకు నభేదమును వర్ణించుటచే హేత్వలంకారమునుగలదు. ఈ హేత్వలంకారము ప్రభువుయొక్క వితరణాతిశయమును సూచించుచున్నది. ఇంతమాత్రమే కవికభిమతమైనచో నుదాత్తాలంకారముచేఁ బరిష్కృతమగు ననఁగా దానియొక్క యపేక్షగల హేత్వలంకార మొక్కదానియందే కవిసరంభమునకుఁ బర్యవసానము.

లేక భోజుని వితరణమెట్టిదని యొకఁడు ప్రశ్నింప దానికి సమాధానముగా నీపద్యము చెప్పఁబడినచో దానరూపమగు నప్రస్తుత కార్యముచే భోజునియొక్క సంపదుత్కర్షమును బ్రశంసించుటయందే కవికభిప్రాయముండునుగానఁ గార్యనిబంధనాప్రస్తుతప్రశంసయందుఁ బర్యవసానము.

కారణమగు రాజసంపదుత్కర్షమువలెనే కార్యమగు వితరణోత్కర్ష వర్ణనముగూడఁ బ్రస్తుతమే యైనచోఁ బ్రస్తుతాంకురమునందే పర్యవసానమగును.

పై యలంకారముల నెయ్యది కవికభిమతమగునో యని సందేహముగల్గినచో సందేహసంకరమగును.

మఱియును విద్వద్గృహవైభవమున నసంబంధమున, సంబంధవర్ణనరూపమగు నతిశయోక్తికి నుదాత్తాలంకారముతో నేకవాచకానుప్రవేశ సంకరము.

మఱియును నిరతిశయమగు దానోత్కర్షమునఁ బర్యవసించు హేత్వలంకారమునకును నత్యద్భుతమైనట్టియు నసత్యమగు నౌదార్యమును వర్ణించుటయే రూపముగాఁగల యత్యుక్త్యలంకారముతో నేకవాచకానుప్రవేశ సంకరము.

వితరణోత్కర్షమునఁ బర్యవసించు హేత్వలంకారము సూరాలను గాఁగల యప్రస్తుతమునకుఁగాని ప్రస్తుతాంకురమునకుఁగాని రాజసంపత్సమృద్ధి వర్ణనరూపకమగు నుదాత్తాలంకారముతోఁగూడ నేకవాచకానుప్రవేశ సంకరము.

ఓయీ! రాజసంపత్సమృద్ధి వ్యంజనాగమ్యమే కాని వాచ్యము గాకుంటచే నాసంపత్సమృద్ధి వర్ణనమే రూపముగాఁగల నుదాత్తాలంకారముతోఁగూడ నేకవాచకానుప్రవేశ మెట్లు సంభవించునని నాకు సంశయము పుట్టుచున్నది.

దీనికి సమాధాన మెట్లన? ఏకవాచకానుప్రవేశమనెడు పదములోని వాచకపదమును బ్రతిపాదకమని సామాన్యార్థకముగ గ్రహించినచో వ్యంజకమునకుఁగూడ గ్రహణము సంభవించునుగానఁ బై విధముగ నేకవాచకానుప్రవేశము సంభవించునని.

పైఁజెప్పఁబడిన యేకవాచకానుప్రవేశముల మూఁడింటికిని బరస్పరమంగాంగిభావము లేకుంటచే సమప్రాధాన్య ముండుటనుబట్టి సమప్రాధాన్య సంకరము.

ఎట్లన? ఉదాత్తాతిశయోక్తులు రెంటికిని నేకవాచకానుప్రవేశ మొకటి.

హేత్వలంకారమునకును నత్యుక్త్యలంకారమునకును నేకవాచకానుప్రవేశసంకరము. రెండవది.

వ్యంగ్యమగు నుదాత్తాలంకారమునకు నప్రస్తుత ప్రశంసాప్రస్తుతాంకురములలో నొకదానితో నేకవాచకానుప్రవేశ సంకరము. మూఁడవది.

ఈమూడింటికిని బరస్పర సాపేక్షత్వములేకుంటచే నంగాంగీ భావ సాంకర్యములేదు కాన సమప్రాధాన్యసంకరమని నిష్కర్షము.

ఇట యొకశంక పుట్టవచ్చును. ఎట్లన? ఉదాత్తాలంకారము యొక్క యపేక్ష హేత్వలంకారమునకుఁ గలదని చెప్పబడినది. విద్వత్సంపదుత్కర్షమును జెప్పినఁగాని దానికిని దానికిఁ గారణభూతమగు దానలీలకును నభేదమేరూపమగు హేత్వలంకారము సంభవింపదుకాన నారెంటికిని నంగాంగీభావసంకరము తగును.

ఇట్లే రాజసంపదుత్కర్షరూపమగు ప్రస్తుత కారణమును ద్యోతింపఁజేయుటకై యప్రస్తుత దానరూపకార్యము వర్ణింపఁబడెనన్నచో నప్రస్తుతప్రశంసయందే యీపద్యమునకుఁ దాత్పర్యమగునని పైనఁజెప్పఁబడినది కదా?

ఇట్లైనచో దానమును సంపదుత్కర్షము ననెడు కార్యకారణములకు నభేదకథనరూపమగు హేత్వలంకారములేనిదే యప్రస్తుత కార్యముచేఁ బ్రస్తుతకారణమును స్ఫురింపఁజేయుట యనెడు నప్రస్తుత ప్రశంసాలంకారము సిద్ధింపదుకాన హేత్వలంకార మప్రస్తుత ప్రశంసాలంకారమున కంగమగుచున్నది.

అనఁగా హేత్వలంకారమునకును నప్రస్తుత ప్రశంసాలంకారమునకును నంగాంగీభావసంకరము కలదని తేలినది.

కానఁ బైనుదాహరింపఁబడిన యేకవాచకానుప్రవేశముల మూడింట నుదాత్తహేత్వప్రస్తుత ప్రశంసాలంకారము లుండుటచేతను, పైరీతిగ నీమూడింటికిని నంగాంగీభావసాంకర్యముండుటచేతను, పై యేకవాచకానుప్రవేశములకు మూడింటికినిఁగూడ నంగాంగీభావ సాంకర్యమెట్లైనను సంభవించును గాన నట్టి సాంకర్యము లేదనుట యెట్లు పొసఁగునని.

ఈశంకకు సమాధాన మెట్లన?

అప్రస్తుత ప్రశంసాలంకారమునకుఁ గేవల హేత్వలంకారము యొక్క యపేక్ష యున్నను నత్యుక్తి హేత్వలంకారములు రెండింటికిని సంభవించిన యేకవాచకానుప్రవేశ సంకరముయొక్క యపేక్ష పై యప్రస్తుతప్రశంసకు లేకుంటచే నేకవాచకానుప్రవేశ సంకరముల మూడింటికిని నంగాంగీభావసంకరము లేదని చెప్పఁబడినది.

పై పద్యమందలి సంకరములకు సంభవము ననుసరించి సంకర మూహించుకొనవచ్చును. ఎట్లన? ఉదాత్త తద్గుణములయొక్క యంగాంగీభావ సంకరమునకును భ్రాంతిమదుదాత్తముల యంగాంగీభావసంకరము నకును నంగాంగీభావసంకరము చెప్పవచ్చును.

ఈరీతిగ సంకరసంకరముల కుదాహరణాంతరముల నెఱుఁగునది.

కం॥ మానిత వేంకటనాయకు
నానతి నీగతినిఁ గువల - యానందంబున్ ।
ప్రానిక నప్పయదీక్షితుఁ
డానందంబుగ రచించె - నాతని కృపచే ॥

కం॥ శరదాగమ సంభవమగు
వర చంద్రాలోకమద్ది - వఱలుత జగతిన్ ।
ధర నెద్దానిప్రసన్నత
నరయఁగఁ బొడసూపెఁ గువల - యానందమిటుల్ ॥

ఇట్లు,

శ్రీ భారద్వాజసగోత్రుఁడును విశుద్ధాత్ములగు శ్రీ చలమాంబా
వేంకటరామదీక్షితుల తనయుండును విద్వజ్జనవిధేయుండును
సంతతసారస్వతసేవానిరతుండును మహీధరోపాహ్వ
యుండు నగు వేంకటరామశాస్త్రిచే నాంధ్రీకృత
చంద్రాలోక ప్రసాదిత కువలయానంద
మనెడు నర్థాలంకారశాస్త్రము
సంపూర్ణము.

10-9-63

## — తప్పొప్పుల పట్టిక. —

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 3 | 12 | విశిష్టిఁజూసె | విశిష్టిఁజూపె |
| ౪ | 17 | ఆజ్యమున | ఆజ్యమును |
| ౫ | 26 | మాతరపిత | మాతరపితరుల |
| ౫ | 12 | లుందగదుత్రి | లుంద్రుటిదుత్రి |
| 6 | 6 | తాళసమాగమ | తాళఫలసమాగమ |
| 8 | 18 | తారల | తారలఁ |
| 9 | 1 | గిరివలెఁ | కరివలెఁ |
| | | ( గరిరాజంబును | గిరిరాజంబును |
| 9 | 10 | కుథనువు | కుధనువు |
| 11 | 2 | లుండజగతి | లుండసరులు |
| 15 | 6 | తాదాత్మ్యమును | తాదూత్ర్యమును |
| 17 | 14 | ద్యోతిస్ఫూర్తుల | ద్యోతిస్స్ఫుర్తుల |
| 19 | 19 | వెంటటూరా | వెంటరా |
| 21 | 14 | నితంబున | నితంబమున |
| 26 | 8 | పలుకయాపె | పలుకనాపె |
| | 13 | గున్నగౌరు | గున్నగౌరు |
| 28 | 19 | తెలసి | తెలిసి |
| 31 | 3 | సాసామ్రాజ్య | సామ్రాజ్య |
| 35 | 18 | నఖములతోడ | నఖక్షతములతోడ |
| 41 | 10 | మత్తైమనఁగా | ముత్తైమనఁగా |
| | 18 | నెరవున | నెపమున |
| 44 | 17 | నొందుచున్న | నొందుచునున్న |
| 47 | 24 | హిమరుచిలేఖా | హిమరుచిరేఖా |
| 51 | 15 | బకృతత్వముమ. | బ్రికృతత్వమును |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 62 | 16 | వి శేషమునకును | వి శేషణమునకును |
| 64 | 15 | సత్పదార్థమును | అసత్పదార్థమును |
| 67 | 16 | మర్మరాంభాధి | మర్మరాంభోధి |
| 70 | 25 | వత్తాన్తమును | వృత్తాన్తమును |
| 78 | 5 | రాజ | చంద్రి |
| | 11 | నృపతిని | చంద్రుని |
| | 12 | రాజవృత్తాంతమును | చంద్రివృత్తాంతమును |
| 80 | 5 | వినాశమును | వినాశనమును |
| 81 | 24 | శేవిషణములు | వి శేషణములు |
| 86 | 21 | బుట్టుచే | బుట్టుటచే |
| 87 | 22 | నృపతితద్గాత్రిహ్యాధన | చంద్రతిత్కిరణ |
| 89 | 2 | మిక్కి | మిక్కిలి |
| 96 | 14 | రా యెంచెంతో | రాయంచెంతో |
| 100 | 21 | తమివడి యెంత | తమివడి నెంత |
| | 26 | బలిని | బల్మిని |
| 101 | 13 | అభిదా | అభిధా |
| | 14 | గాకుంటచేట | గాకుంటచేత |
| 106 | 23 | నతిక్షే ! | నతిథ ! |
| 108 | 7 | వ్యంగము | వ్యంగ్యము |
| | 17 | నభిమతమగు | నభిహితమగు |
| 110 | 11 | విషణ శే | వి శేషణ |
| 115 | 24 | కాకియొక్క | బ్రిహ్మియొక్క |
| | | బ్రహ్మయొక్క | కాకియొక్క |
| 123 | 3 | వాడలేనట్టి | వాఁడిలేనట్టి |
| | 8 | బోరలఁ | బొరలఁ |
| 127 | 3 | నేహామనఁగా | స్నేహామనఁగా |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 131 | 8 | వస్తువులకుఁ | వస్తువులకుఁ |
| 136 | 26 | సుషమును | సుషమను |
| 137 | 4 | పద్మకుళము | పద్మముకుళము |
| | 14 | భాన్తింబొంది | భ్రాన్తింబొంది |
| 148 | 3 | జనునటులగు | జననటులగు |
| 152 | 17 | గణంబదు | గణంబందు |
| 153 | 10 | దరముందు | దరమందు |
| 155 | 11 | రాశ్రిమము | రాశ్రియము |
| 156 | 4 | న్యక్తమగుచున్నది | వ్యక్తమగుచున్నది |
| 161 | 22 | గ్రుచినచో | గ్రుచ్చినచో |
| 163 | 9 | నడ్డగింపఁజడిన | నడ్డగింపఁబడిన |
| 177 | 5 | శీతకరణు | శీతకిరణు |
| 179 | 2 | సామాన్యాము | సామాన్యార్థము |
| 182 | 1 | వణాఁగుఁగాదె | నణఁగుఁగాదె |
| 187 | 3 | పీటిచే | పీఠిచే |
| | 12 | పతిభా | ప్రతిభా |
| 189 | 8 | మప్రస్తుమునే | మప్రస్తుతమునే |
| 190 | 15 | విషయవాచక | విషయివాచక |
| 226 | 19 | గోష్ఠుగ | గోష్ఠగ |
| 232 | 19 | దుడుకుఁచెంది | దుడుకుఁజెంది |
| 234 | 14 | పర్వమునకు | పర్వతమునకు |
| 253 | 25 | నుదహరింప | నుదాహరింప |
| 256 | 24 | సంమ్మేళనము | సమ్మేళనము |
| 263 | 10 | బ్రికృతాపకృత | బ్రకృతాప్రకృత |
| 264 | 4 | సౌమ్యము | సామ్యము |
| | 10 | వైయక్తిమగు | వైయక్తికమగు |
| 268 | 9 | యటఁవూచెడు | యటఁబూచెడు |

# పరిశిష్టము.

| పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|
| 5 | నిరర్థక | నిరర్థకత |
| 6 | దాత్రశ్రీ | ప్రాశ్యై |
| 12 | పున్నమి | పున్నమ |
| 6 | ధనస్సు | ధనుస్సు |
| 19 | రూపుల | విధముల |
| 9 | మీనమిథున | మీనయుగ్మ |
| 13 | నారీశుగాకులము | దయితా త్రిబహుళీకము |
| 11 | మనుజ | మనుజు |
| 23 | పరార్థ | పదార్థ |
| 9 | కృప | కృపణ |
| 25 | వనె | వలె |
| 13 | చూడము | చూడుము |
| 13 | ధ్వనులు | ధన్వులు |
| 3 | గృహములు | గృహములు |
| 9 | దివ్యౌథి | దివ్యౌషధి |
| 19 | బస్తుతాం | ప్రస్తుతాం |
| 18 | చేతనాచేతములకు | చేతనాచేతనములకు |
| 17 | అభిమతమగు | అభిహితమగు |
| 16 | నాయిక | నాయకు |
| 12 | వికసించెను | ముకుళించెను |
| 7 | మ్చుట | ముచ్చట |
| 21 | విశేషభేదమున | విషమభేదమున |
| 2 | నని ష్టావాప్తి | నిష్టానవాప్తి |
| 12 | పాల | ఫాల |

| | | | |
|---|---|---|---|
| 150 | 26 | | షముపాత్తముక్తరీతి యనఁ<br>గాఁ జెప్పంబడినవస్తువును<br>దిరిగి గ్రహించి విడుచుట |
| 152 | 2 | | నాధారములుగాను గొన్ని<br>గుణాధాయకములుగాను |
| 169 | 15 | పూర్వజన్మానుమానము | పూర్వజన్మమున అనమ<br>నానుమానము |
| | 18 | ఉత్తరజన్మానుమానము | ఉత్తర జన్మమున అనుమ<br>నానుమానము |
| 178 | 1 | సుబోధార్థక | సుబోధక |
| 185 | 23 | ధరించుట వంటిది | ధరించుటయే |
| 188 | 15 | ధర్మిఁగూడ | ధర్మిగూడ |
| 195 | 12 | విరియు | విచ్చు |
| 203 | 9 | | స్తుతిచే నిందయు నిందచే<br>స్తుతియును |
| 206 | 17 | ధృతి | ద్రుతి |
| 211 | 16 | నిర్ణిద్ర | నిర్నిద్ర |
| 212 | 24 | దద్గుణాలం | అతద్గుణాలం |
| 229 | 11 | ఇట్లైనను | ఇట్లైన — లేక యను పక్ష<br>మాశ్రయింప "రాజవీధి<br>వచ్చున"నుచోటయుక్తియు<br>మొదటి పక్షమున వ్యాజో<br>క్తియు నగును. |
| 233 | 2 | | నిగిడించుచుఁ జెవులనటవి-<br>నృపతినిఁ గాంచెన్ |
| 255 | 23 | గాకుండిలన్ | గాకుండెడిన్ |
| 258 | 19 | తాఁకుచు | తాకున |
| 269 | 9 | లీల మొగిడ్చెన్ | లీలగ మొగిడెన్ |